# పర్యావరణ కథలు

మూలం: దివంగత పూర్ణచంద్ర తేజస్వి



అనువాదం

శాఖమూరు రామగోపాల్

# పర్యావరణ కథలు

మూలం

## దివంగత పూర్ణచంద్ర తేజస్వి




తెలుగు అనువాదం

## శాఖమూరు రామగోపాల్


అభిజాత్య కన్నడ-తెలుగు భాషా (అనువాద) సంశోధన కేంద్రం (రిజిష్టర్డ్)

ఇం.నెం. 5-10, రోడ్ నెం. 21, దీప్తిశ్రీనగర్, మియాపూర్ పోస్ట్

హైదరాబాద్ - 500 049. ఫోన్ : 040-65520286

# పర్యావరణ కథలు

మూలం : **దివంగత పూర్ణచంద్ర తేజస్వి**
అనువాదం : **శాఖమూరు రామగోపాల్**
ఇం.నెం. 5-10, రోడ్ నెం. 21,
దీప్తిశ్రీనగర్, మియాపూర్ పోస్ట్
హైదరాబాద్ - 500 049.
ఫోన్ : 040-65520286, మొబైల్: 9052563666

© శ్రీమతి రాజేశ్వరి తేజస్వి/Translator

ధర : రూ. 100/-

ముద్రణ
××××××××

డి.టి.పి.
చేగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి
సెల్: 9989253506

ప్రింటర్స్
**×××××××**
××××××××

ప్రతులకు:
**శాఖమూరు రామగోపాల్**
ఇం.నెం. 5-10, రోడ్ నెం. 21, దీప్తిశ్రీనగర్,
మియాపూర్ పోస్ట్, హైదరాబాద్ - 49.
ఫోన్: 04065520286, మొబైల్:9052563666

ప్రచురణ/పంపిణీదారులు:
**అభిజాత్య కన్నడ - తెలుగు భాషా (అనువాద) సంశోధన కేంద్రం (రిజిష్టర్డ్)**
ఇం.నెం. 5-10, రోడ్ నెం. 21, దీప్తిశ్రీనగర్, మియాపూర్ పోస్ట్

# అంకితం

(నిమ్మన్ను నెనెదరె ఉదయ)  -  మిమ్మల్ని స్మరిస్తేనే ఉదయం

(నిమ్మన్ను మరెతరె అస్తమయ) -  మిమ్మల్ని మరిస్తే అస్తమయం

దివంగత పూర్ణచంద్ర తేజస్విగారికి ఈ పుస్తకం అంకితమిస్తూ...

**శాఖమూరు రామగోపాల్**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | పర్యావరణంలో నా అనుభవాల కథలు | 1 |
| 2. | ఉడుం | 7 |
| 3. | టామితో ఒకరోజు | 20 |
| 4. | మాస్తి మరియు బైరడు | 32 |
| 5. | సుస్మిత మరియు (చిన్న) పక్షిపిల్ల | 49 |
| 6. | వెంకడి నాదస్వరం | 65 |
| 7. | సబ్ కాంట్ర్యాక్ట్ లేదా ఉప గుత్తిగ | 90 |
| 8. | దెయ్యంకోడి | 106 |
| 9. | కాళప్పగారి కోబ్ర | 117 |
| 10. | చెఱువు ఒడ్డున | 129 |
| 11. | గాడ్లి | 140 |
| 12. | ఔషధ తీగ | 154 |
| 13. | సైతాన్ నుంచి ప్యారడైకైన కష్టం | 166 |
| 14. | అవాంతరాల సీనప్ప | 176 |
| 15. | మాయామృగం | 191 |

# కథా సుషమ

ఈనాడు ఏ రచయిత అయినా పర్యావరణ ప్రభావం కానీ, పర్యావరణ స్పర్శగానీ లేకుండా రచనలు చేయలేడు. దివంగత పూర్ణచంద్ర తేజస్వీగారు కన్నడంలో రచించిన ఈ కథల్ని కమనీయంగా తెలుగులోకి అనువదించారు శ్రీ శాఖమూరు రామగోపాల్‌గారు. కథా నవలా సాహిత్యానికి కన్నడం పెట్టింది పేరు. ఒక్కొక్కరి జీవితానుభవం ఒకరకంగా ఉంటుంది. ఈ కథల్లో ఆంతరంగం పర్యావరణం, బహిరంగం కథావస్తువు.

శ్రీరామగోపాల్‌గారు శ్రమించి ఉస్మానియా విశ్వవిద్యాలయ గ్రంథాలయంలో నిద్రాణమైన వీటిని సంపాదించి, అనువదించి తెలుగువారికి అందించారు. ఈ పదిహేను కథలు చదివితే సహజ ప్రకృతి, మానవ ప్రకృతి రెండూ మన మనఃఫలకంపై ప్రతిబింబిస్తాయి. అనువాదం అంత సులభతరమైన ప్రక్రియకాదు. ఒక విధంగా పరకాయ ప్రవేశం లాంటిది. రామగోపాల్‌గారు స్వేద బిందువుల్ని అక్షరాలుగా మలచుకొని, పదేపదే మూలాన్ని మననం చేసుకొని ఈ అనువాదాన్ని తీర్చిదిద్దారు. మంచి కథలను సముచితమైన అనువాదంగా మలచినందుకు వారికి తెలుగువారి అభినందనలు అందుతాయని నా విశ్వాసం.

**ఆచార్య ఎల్లూరి శివారెడ్డి**

ప్రధానకార్యదర్శి

ఆంధ్ర సారస్వత పరిషత్తు

హైదరాబాద్

10-11-2010

హైదరాబాద్

# అనువాదకుడి స్వగతం

స్వర్గీయ పూర్ణచంద్ర తేజస్విగారు రచించిన 'పరిసరద కతెగళు' అనే పుస్తకాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని లైబ్రరీలో చూచి, తెలుగులో 'పర్యావరణ కథలు' అనే పేరుతో అనువాదం చేసాను.

సాధారణంగా అనువాదం చేసే వ్యక్తి మూల రచయిత చేసిన కృతిని స్వీకరిస్తూ "కొట్టావకర్ణ... ఇసుగొండావ వీరభద్ర (ఇచ్చినోడు కర్ణుడు... పుచ్చుకొన్నోడు వీరభద్రుడు) అన్నట్లుగా మాతృకలో ఉన్న విషయంకు తమ పైత్యాన్ని జత చేస్తూ, స్వేచ్ఛానువాదంగా తనెంచుకొన్న లక్ష్యభాషలోకి తర్జుమా చేస్తుంటారు. అందుచేతనే కన్నడ సారస్వత లోకంలో అనువాదకరు కొలె పాతకిగళు (అనువాదకులు హత్య చేసే పాపాత్ములు)'గా కన్పించుకొంటుంటారు. అనువాదం అనే పదంకు సరైన అర్థం ఏమిటంటే మూల భాషలో రచన చేసిన దానికి అనుగుణంగా వాదంను లక్ష్య భాషలో రచన చేయటమే అనువాద రచనకు సార్థకం అవుతది.

మూల భాషలో ఈ పుస్తకం 16 సార్లు పునర్ముద్రణకు నోచుకొంది గమనించిన నేను చకితుడ్నై అనువాదం పూర్తైన పిమ్మట రెండుసార్లు తేజస్విగారు గడిపిన రైతు జీవితం (ఐదున్నర దశాబ్దాలు) మరియు కథలలోని అంశాలు వాస్తవమేనా అని భావించి నా ఇంటి (హైద్రాబాద్) నుంచి వేయి కి.మీల దూరానుండే చిక్కమగళూరులోని తాలూకా కేంద్ర పట్టణం అయిన మూడిగెరెకు వెళ్ళి కథలలో ప్రస్తావించబడిన కుదురెగుండి, భూతనకాడు మరియు తేజస్విగారి ఎస్టేట్లను చూచి ఇవి నిజమైన కథలే అని వాట్ని మీ ముందుకు తెచ్చే ప్రయత్నాన్ని చేస్తున్నాను.

నా సోదరుడి సంతానం కన్నడ భాషలోనే అభ్యసిస్తున్నందున, నేను రాయచూరుకు పలుమార్లు వెళ్ళినప్పుడు కన్నడ భాషా పుస్తకం మీద దృష్టి పెట్టగా ఈ పర్యావరణ కథలు ప్రాథమిక స్థాయినుంచి ఇంటర్‌వరకూ ఆయా తరగతుల విద్యార్థుల భాషానైపుణ్యంకు అనుగుణంగా పాఠ్యాంశాలుగా ఉన్నదాన్ని చూచాను.

జ్ఞానపీఠ పురస్కారం పొందిన కుప్పళ్ళి వెంకటరమణ పుట్టప్ప (కు.వెం.పు) గారి కుమారుడైన పూర్ణచంద్ర తేజస్విగారి రచనలు తండ్రి సాహిత్యాన్ని మీరినట్లుగా ఉంటవి. స్వర్గస్తురాలైన నా మాతృమూర్తి కు.వెం.పు; తేజస్విగారి రచనలకు శ్రోతగా ఉండి, వారిరువురి రచనల్ని తెలుగులోకి తర్జుమా చేయమని పదేపదే కోరుతుండగా, ఈ నా ప్రయత్నంకు బీజంపడింది.

భూమిగె బిద్ద బీజ; ఎదెగె బిద్ద అక్షర (భూమిలో పడిన బీజం; హృదయంలో పడిన అక్షరం) ఇందల్ల... నాళె ఫలిత నీడుత్తదె (ఈరోజు గాకపోయినా... రేపెన్నడైనా ఫలితం ఇస్తది) అని పదే పదే ఉద్బోధిస్తుండేది రైతు మహిళైన మా మాతృమూర్తి.

తండ్రి ప్రభావం తనమీద పడకూడదన్నట్లుగా రామ మనోహర లోహియా, లోక్‌నాయక్ జయప్రకాష్‌నారాయణగార్ల సమాజవాద సిద్ధాంతాల ఆకర్షణకు లోబడి, కులాంతర వివాహం చేసుకొని రైతు పోరాటాలలో సక్రియ పాత్ర నిర్వహిస్తూ ఘోరారణ్యం చెంతన పొలంకొని కాఫి ఎస్టేట్‌గా దాన్ని మలచి ఎక్కువశాతం తనకు హాబీలైన ఫోటోగ్రఫి, పరిసర అధ్యయనం, భూమి పుత్రుల జీవితాలు, సంగీతం, చిత్ర లేఖనం మొదలైన వాటిలో మునిగి వీలు కుదిరినప్పుడు రచనల్ని చేస్తుండేవారు.

సభలకు సన్మానాలకు ఆమడ దూరంలో ఉండే తేజస్విగారు తన జీవితకాలంలో తనను చూచేందుకు వచ్చే పర్యావరణ మిత్రులతోనో, రైతు సంఘ నాయకులతోనో, సాహితి ఉపాసకులతోనే తన ఇంటివద్దే సమయాన్ని గడిపేవారు. కన్నడ భాషలో సాధికారికంగా పర్యావరణం మీద ఘనమైన రచనల్ని చేసినవారు ఇద్దరే ఇద్దరున్నారు. ఒకరేమో కోట శివరామకారంత (జ్ఞానపీఠ ప్రశస్తిని పొందినవారు)గా, మరొకరేమో తేజస్విగారుగా కన్నడనాడులో గుర్తించుకోబడినారు. డిస్కవరి చానెల్; యానిమల్ ప్లానెట్‌చానల్... లేని ఆకాలంలోనే పర్యావరణం మీద వీరిరువురు విశిష్ట రచనల్ని చేసారు. “తనైతే పరిసర వినాశనం గమనించి, దాని రక్షణకని నడుం కట్టి ఏవేవో అధ్యయానాల్ని చేసి రచనల్ని చేసానని... అయితే తేజస్వి దట్టారణ్యం అంచున జీవించి అనుభవించి సంపాదించిన జ్ఞానాన్ని రచనల ద్వారా పాఠకులకు పంచాడని... కనుక తనకన్నా పూర్ణచంద్ర తేజస్వే సర్వశ్రేష్ఠుడని” కన్నడనాడుకు తెలియజేసారు కారంతగారు.

కొన్ని సందర్భాలలో మూలకథలోని కొన్ని పక్షుల పేర్లకు తెలుగు పేర్లు దొరకనందున యథాతథంగా మూలనామాల్నే వాడాను. ఉదాహరణకు ‘ఆకాశబగరె’ పక్షి పేరుకు తెలుగులో ఏ పేరు ఉంటదో నాకైతే తెల్వదు పాఠకులారా....! క్షమించండి; నాలోని అజ్ఞానంను!

తేజస్విగారు శ్రోతను జనమేజయుడిగా; పాఠకుడ్ని మరో యుగంకు ఆహ్వానిస్తుండే వ్యక్తిగా భావించుకొనేవారు. స్వయంగా పుస్తకాల్ని ముద్రించి, సముచితధరకే వాట్ని పంపిణీ చేసేవారు.

మణ్ణు, హెణ్ణు, హొన్ను (మట్టి, మహిళ, బంగారం) ఈ మూడిటి మీదే జీవితకాలం రచనల్ని చేసి అమరుడైనా, జనం హృదయాలలో చిరస్థాయిగా వర్ధిల్లుతున్నారు తేజస్విగారు. భేషజం లేనివారి జీవనం మరియు గ్రామీణ భారతంలోని బడుగు జీవుల స్థితిగతుల్ని మోడ్రన్ ఇండియా జనంకు చెప్పేందుకు వారు చూపిన శ్రద్ధ, అంకితభావం ఎంతో గొప్పగా ఉన్నందున, ఈ కథా మాలికను మీముందు పుస్తకరూపేణా ఉంచుతున్నాను.

కన్నడిగులకు సాహితీపరంగా తెలుగువారిమీద చిన్నచూపు ఒకటుంది. కన్నడంలో రచయితలు వేరే వ్యాపకం లేకుండా రాసి ఘనంగా బతుకుతారని, తెలుగులో రచయితలు రాసి ఆర్థికంగా చితికి పోతారని ఒక అపప్రథ వారిలో ఉంది.

ఇంతకు ముందు నేను అనువాదం చేసిన కన్నడభాషలోని వాల్మీకి అనే గ్రంథం ఎమ్మెస్కోవారినుంచి తెలుగులోకి వచ్చింది. అనువదించిన కొన్ని కన్నడ కథలు అడపాదడపా సాక్షి, ఈవారం, పత్రిక, విపులలో ప్రకటించబడినవి. మున్ముందు పాఠకుల ఆదరణ దొరికితే మరిన్ని అనువాద పుస్తకాలు నానుంచి వచ్చేదుంది.

పుస్తకంకు ముందుమాట రాసిన పరిణిత సాహితి ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారికి, డి.టి.పి. చేసిన చేగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిగారికి, ముఖచిత్రాన్ని అందించిన ఖ్యాత మూల చిత్రకారుడికి.... కృతజ్ఞతలతో

ఈ పుస్తక ముద్రణకు తోడ్పడిన నా కుటుంబ పరివారమైన వనజా రామగోపాల్ M Sc. M Phil., కుమారి దివ్యరాణి B.Tech, Value Lab, కుమారి దీపారాణి B.Tech, Accenture, కుమారి దేవకిరాణి B. Arch 5th Year. K.V.PY. Fellow. ప్రోత్సాహాలనుంచి

ఇంతియే

నమస్కారాలతో

తమ విశ్వాసి

శ్రీమతి శాఖమూరు కమలాదేవి – అంజయ్యగార్ల రెండవ కుమారుడైన

శాఖమూరు రామగోపాల్, M.A.,

సెల్. నెం. 9052563666.

# పర్యావరణంలో నా అనుభవాల కథలు



నేను రచించిన 'కర్వాలో'ని నవలలో ఒక పాత్రధారిగా కనబడే టామి అనే పేరుతో పిలువబడుతుండే కుక్క ఒక కాలంలో నా జతగా అసాధారణమైన బుద్ధితో ఉండే వేటకుక్కగా నావెంట తిరుగుతుండేది. స్పానియల్ జాతికి చెందిన ఆ టామి చెవులు అరఅడుగు బారుగా ఉండి, దాని తల పక్కన చిన్న చేటలన్నట్లుగా వేలాడుతుండేవి. నేను కాఫీ ఎస్టేట్ వేసేందుకు ఆరంభించిన మొదటి సంవత్సరంలో తుపాకిని భుజంమీద వేసుకొని రోజంతా ఆ కుక్కతో అడవిలో షికారు చేస్తుండేది ఒక దినచరిగా ఉండేదప్పుడు. చదివేదానికి (పి.ఎచ్.డి. చేసేదానికి), రాసేదానికి తిలాంజలి ఇచ్చి నిర్జనమైన ఘోరారణ్యంలో గమ్యం, గురి లేనోడిలాగ తిరుగుతుండే నన్ను చూసిన ఎంతోమంది నేను పూర్తిగా పాడైపోయానని ఆడిపోసుకొంటుండేవారు.

"ఎటువంటి తండ్రికి (కువెంపుకు) ఎటువంటి పుత్రుడు" అని మథన పడేవారు అనేకమంది ఉన్నారప్పుడు. "ఈ వేటకుక్క దశనుంచే ఇతను పాడైపోయాడు" అంటూ కొంతమంది టామీని దూషించేవాళ్ళు ఉన్నారు ఆ కాలంలో.

నా చేతికి తుపాకి వచ్చే సమయంకే అడవిప్రాణు(మృగా)లన్నీ అవసాన స్థితిని పొందియున్నా, ఇప్పటి కాలంలోలాగ మరింతగా నామావశేషం అయ్యేస్థితి అప్పట్లో అదంతగా లేదులే! వన్యప్రాణుల్ని జంతు ప్రదర్శనశాలలోనో, పుస్తకాల బొమ్మలలోనో ఎక్కువ ఎక్కువగా చూసియున్న నాకు, మొదటిసారిగా ఆ మృగాలు నేను ఎస్టేట్‌గా చేసుకొన్న పొలంకు సరిహద్దుగా ఉండే అడవిలోని నిశ్చల మౌనంలో నా కాళ్ళదగ్గర ఉండే పొదలనుంచే చటాల్నే మెరుపులాగ దూకి మాయమైనప్పుడు కలిగిన అనుభవం అదెంతగానో అసాధారణంగా ఉంటుండేది. ఆ వన్యప్రాణులలోని ఈ గౌప్యత (వాటిపాటికి అవి) నుంచే నాకు వాటిమీద అసాధారణమైన కుతూహలంను ప్రేరేపించింది.

టామి, నేను చేరి ఎన్నో ప్రాణుల్ని వేటాడి స్వాహా చేసియున్నా, అప్పట్లో ఆ జంతువుల సంఖ్యాబలం నుంచి వాట్ని వేటాడి తిన్నాంకదా అనే అసహనం కల్గేది కాదులే. ఈ వేట షికారునుంచే భారతదేశంలో నశించిపోతున్న వన సంపత్తు మీద నాకున్న అజ్ఞానమూ ఒక కారణంగా అయ్యి ఉండొచ్చు! మొత్తానికి ఈ షికారి(వేట)లోని పాప–పుణ్యాల్ని ఒక ప్రక్కన ఉండనీయండి, ఈ షికారి వేటనుంచే నాకు అడవి గురించి, వన్యప్రాణుల గురించి నిధానంగా ఆత్మీయతను పెంపొందించేందుకు సహాయపడిందని నేను ఘంటాపథంగా చెప్పగలను. ఇప్పుడు నశించిపోయిన అడవుల నుంచి, కనుమరుగైన వన్యప్రాణుల నుంచి విలవిలలాడుతున్న పర్యావరణం (ఎన్విరాన్‌మెంట్)లోని ధరణి నాకళ్ళకు స్మశానం కన్నా భయంకరంగా కనబడుతుంది. అడవుల్ని, వన్యప్రాణుల్ని సంరక్షించుకోవాలని నేను చెప్తే అది నేను తెల్సుకొన్న అనుభవసారంకన్నా ఎక్కువగా, నేను వాటితో (పర్యావరణంతో) పొందియున్న నికట సంబంధం నుంచే నా ఈ ఉద్ఘోష బయటపడుతుందిలే! అడవుల్ని నాశనం చేస్తుంటే, ఆ అడవులలో ఉండే అడవి ప్రాణులు వాటితో మమేకమై ఉన్న పరిసరం ధ్వంసమై, రహస్య, గౌప్య, అద్భుతాలైన నిరంతర నిధి ఒకదాన్ని మన ముందు తరాలోళ్ళకు (వారసులు) లేనట్లుగా

చేస్తున్నామేమో అని నా మనస్సు ఖిన్నపోతుండేది. ఈ ఘోర దురంతంలోని దుఃఖాన్ని అంకెలు సంఖ్యల ఆధారంమీద సిద్ధాంతాల మూలంగా విశ్లేషించి, పర్యావరణ సంరక్షణ గురించి జనంకు హితభోద చేసేందుకు నాకు మనసే రావట్లేదు. ఎందుకంటే, నేను చూసినట్లే అడవుల్ని చూడని, నా అనుభవాలే వాళ్ళ అనుభవాలుగా లేని మనస్సులకు (వారసులకు) నా మనస్సులో గడ్డకట్టుకుపోయిన దుఃఖాన్ని అంకెలు, సంఖ్యల జతగా విశ్లేషించి నేను చెప్తే, ఆ నా బోధన ఎలాగున ముందు తరాలోళ్ళలో ప్రతిస్పందన కలుగుతదో, ఉంటదో నాకైతే గుర్తుకావట్లేదు.

నేను ఎంతో పసోడిగా ఉన్నప్పుడు మా నాయనతో (కువెంపు) కూడి ఉదయం వేళలో వాయువిహారం (వాకింగ్)కు వెళ్తుండేది నాకు బాగానే గుర్తు సుమా! అప్పట్లో మైసూరులో మా ఇంటెదురు కళ్లకు కనబడేవరకూ పొలాలు, చిన్న చిన్న పొదలు, బీళ్ళు ఉండేవి. ఇప్పుడవన్నీ ఇళ్ళ స్థలాలుగా, కాలనీలుగా మారినవిలే! మా పసితనంలో మైసూరులో ఘనమైన అడవిగాని, వన్యప్రాణులుగాని లేవులే. అక్కడుండే వన్యప్రాణులు ఏమిటంటే తొండలు, ఉడతలు, పావురాళ్ళు, పిచ్చుకలు, పాములు, ముంగిసలు, కుందేళ్ళుమాత్రమేనండి! వాట్నే మైసూరు నగరంలోని జనం ఆ బీళ్ళను అడవిగానూ, ఆ చిన్న చిన్న ప్రాణుల్ని వనసంపత్తుగానూ ఘనంగా చెప్పుకొంటుండేవారు. అక్కడుండే సేద్యం భూముల గట్లమీద ఒక వైపునుంచి నాయన చేతిని, మరోవైపునుంచి తమ్ముడి చేతిని పట్టుకొని వాకింగ్‌కు వెళ్తుండేవాడ్ని.

ఒకసారి కాలి త్రోవలో నడుస్తూ, ఆ గట్ల అంచున కొన్ని బిలాల్ని (కంతల్ని) చూసాను. అవి ఎలుకలు తోడిన కంతలని, వాట్లో కుచ్చుతోకతో ఉండే అడవి ఎలుకలు ఉంటవని నాయన మాకు బోధపర్చాడు. ఆ బిలంలలో నిజంగా ఎలుకలు ఉంటవా అనే నమ్మకం నాలో లేదులే. ఎందుకంటే ఆ కంతలన్నీ నిర్జీవంగా నిస్తేజంగా మాకు కనబడినవి. నేను, తమ్ముడైన చైత్ర.... మేమిద్దరం మా నాయన కళ్ళనుంచి తప్పించుకొని అక్కడున్న చిన్న చిన్నరాళ్ళను ఆ కంతలలో నింపాం.

ఆశ్చర్యమైన సంగతి ఏమిటంటే మేము మరుసటి రోజు వాకింగ్‌కు వెళ్ళినప్పుడు ఆ కంతల్ని చూడగా, ఆ కంతలలో మేము నింపిన చిన్నచిన్న రాళ్ళన్నీ మాయమైపోయినవి. ఎలుకలు రాత్రి ఎప్పుడో ఆ కంతల నుంచి బయటకొచ్చి మేము నింపిన

రాళ్ళన్నిట్నీ ఎంతో దూరంగా బయటపడేసి తమతమ కంతల్ని ఎప్పటిలాగ పరిశుభ్రం చేసుకొన్నవి. ఆ పసితనంలో ఈ కంతల పరిణామం నుంచి మాకైన ఆశ్చర్యం, సంతోషం ఎంత మట్టంలో కలిగిందోనని చెప్పేందుకు అది అప్పటి మా వయస్సునుంచి సాధ్యంకాదులే! మా నాయన పరిసరాలమీద చెపుతుండేది నిజమేనని, ఆ రాళ్ళను అటెటో సాగనంపి రుజువు పరిచిన ఆ ప్రాణుల (ఎలుకల) మీద మాకు హద్దులే లేని ఆసక్తి, కుతుహలంను రేగించినవి. ఆ కంతల పక్క పడియున్న ధూళులో అచ్చులు పడిన ఎలుకల అడుగుల గుర్తులను నాయన మాకు చూపించాడు. అంతేకాదు, ఈ ఎలుకల్ని పట్టుకొని మింగేందుకు ఒకొకసారి పాములు ఆ కంతల లోపలికి జొరబడుతవని, ఆ పాములదాడినుంచి మరొక పక్కన చేసుకొన్న ఎగ్జిట్ (Exit) దారులనుంచి ఎలుకలు పరారౌతవని నాయన మాకు వివరంగా తెల్పాడు. నేను, తమ్ముడు ఆ చేల గట్ల వెంబడి, పొదల మాటున ఎలుకలు నిర్మాణం చేసుగొన్న అడ్డదారుల్ని కనుగొన్నాం.

ఈ నా ప్రథమ పర్యావరణంలోని జ్ఞాపకంను మీకెందుకు తెల్పుతున్నానంటే, ఇదేమి కల్పితమైన నరభక్షకుడి (రాక్షసుడి) షికారిలాంటి రోమాంచకరమైన సాహస కథేమి కాదులే! అయితే ఆ కాలంలో మాకు నాయన, అమ్మ, అవ్వ, దోస్తులు, ఇస్కూల్.... వీటిలోనే పరిమితమైన జీవసముదాయంలోని కల్పనల నుంచి మా ప్రజ్ఞకు (తెలివికి) అనూహ్యమైన పాము, ఎలుక, కుందేలు, ముంగిస, కోళ్ళు... ఇటువంటి ప్రాణుల నుంచే విశ్వసమాజం చెంతకు మమ్మల్ని మోసుకెళ్ళేదానికి నాయననుంచి వస్తుండే ప్రాత్యక్షిక పర్యావరణ బోధనలు ఎలాగున మాకు సహాయపడిందో ఊహించేందుకు ఆ పిన్నవయస్సులో సాధ్యపడితే అదే పెద్ద మిఠాయిని తిన్నట్లుగా ఉండేది అప్పట్లో!

మనకు, మన సమాజంకు బయటుండే విశ్వసమాజం (ప్రపంచం)ను పరిచయం చేసేందుకు అభూత కల్పనలైన నరభక్షకుడి కథలు, హ్యారి పాటర్ కథలు కావాలా? ఎలుకలు తమ బిలంలను మూసిన రాళ్ళను ఎత్తి అటెటో పడేసిన ప్రాత్యక్షిక అనుభూతి మన వారసులకు సరిపోదా?

ప్రకృతి మరియు పరిసరాల మీద నాకు బాల్యంనుంచీ ఉండే కుతూహలంకు ముఖ్యప్రేరణ ఎవరంటే మా నాయనే కదా! మాలో కుతూహలంను పుట్టించేందుకు

గంధబేరుండ పక్షి కథల్నో, ఒంటికన్ను రాక్షసుడి కథల్నో నాయన చెప్పలేదండి. నాయన తన జీవితంలో వివిధ మజిలీలలో తనకెదురైన, అనుభవించిన జీవనసారంనే మాకు బోధపరుస్తుండటంతో, ఈ పర్యావరణం మీద నాకు మమకారం పుట్టిందని చెప్పేదాంట్లో అతిశయోక్తి ఏమి లేదులే! నాకైతే ఈ పర్యావరణం మీద ఆసక్తి ఎంత మట్టంలో ఉండేదంటే చదువులో, రాతకోతలలో, ఆటపాటలలో... వీటిలో ఆసక్తి తక్కువైంది. ఫస్ట్‌క్లాస్ కాని, ర్యాంక్‌కాని పొందేదాంట్లో ప్రారంభంనుంచి చివరి వరకూ (ఎం.ఎ) నా నుంచి సాధ్యంకాలేదండి.

నాకు మా ఇంటి కిటికి దగ్గర గూట్లో పిల్లల్ని చేసిన పికలార పక్షి, గరికపోచలతో గూటిని వాస్తుశిల్పి లాగ కట్టిన టువ్వి పక్షి, మా మునగచెట్టుకు ప్రతి సంవత్సరం అదేదో హక్కులాగ వచ్చి చేరుతుండే గొంగళి పురుగులు, మేము ప్రీతిగా వంటిని నిమిరిన ఉడత... ఇవన్నీ కళ్ళకు కట్టినట్లుగా ఇప్పటికీ నా కళ్ళముందు అవి కనబడుతవి. ఇస్కూల్‌కు వెళ్ళే కాలిబాటలో ఒకరోజు (Touch me not) టచ్ మి నాట్ చెట్టును చూచాము. ముట్టుకొన్న తక్షణమే పిడికిళ్ళను బిగించుకొన్న పసిబాలుడి చేతిలాగ ముడుచుకుపోయే ఈ చెట్టును చూసి, అదేదో అద్భుతం చూసినట్లుగా సంబరపడ్డాము కదా! ఆ సంబరంలో నాయన చెంతకు పరిగెత్తుకెళ్ళి, చూసి సంతోష పడిందాన్ని వివరంగా చెప్పాము. ఈ అత్తిపత్తి మా సంతోష సంబరాల మీద నాయన చెపుతుండే వ్యాఖ్యానం, వివరణ ఇప్పటికీ నా మనస్సులో మాసిపోకుండా ఉందిలే! నాయన తరుణ వయస్కుడిగా ఉన్నప్పుడు మలెనాడులోని అడవులలో షికారిలోని రోమాంచకరమైన అనుభవాల్ని విని ప్రభావితుడ్నైన నేను, నాయనెందుకు తన సీమైన మలెనాడును వదిలి మైసూరు విశ్వవిద్యాలయంలో కన్నడ భాషా బోధకుడిగా పాఠాల్ని చెప్పేందుకు వచ్చారో అని వ్యథ (బాధ) పడుతుండేవాడ్ని ఆ పసితనంలో.

నేను మలెనాడులోని మూడిగెరె (తాలూకా కేంద్రం; చిక్‌మగళూరు జిల్లాలో ఉంటది) లో అడవి అంచున భూమిని కొనుగోలు చేసి, కాఫి తోటను వేద్దామని నిర్ణయించుకొంది వాస్తవంగా కాఫి తోటనుంచి లాభాల్ని గడించేందుకుగాని, పల్లెసీమలకు వెళ్దాం అనే ఆదర్శ భావం నుంచిగాని, సేద్యం మీద ప్రీతినుంచి గాని... కచ్చితంగా ఇవేట్నుంచి అయితే కాదులేండి! ఎవరి ప్రభావం (నాయన

పేరు ప్రతిష్టలు), చదువు భయం, పండితుడిగా కాలేదనే తిట్లు... వీటి ఆటుపోట్లు లేని అడవిలో, గుట్టలలో పరిశుద్ధ జీవితంను గడపాలి (మన బమ్మెర పోతనలాగ) అనేది నాలో ఒక ముఖ్య కారణంగా నాకుందిలే! పైపెచ్చు రామ్ మనోహర్ లోహియా; జయప్రకాష్ నారాయణల సిద్ధాంతాల ప్రభావం నన్ను కృతక నాగరికత; నగర జీవనంకు విముఖుడ్ని చేసింది కదా! ఉత్తిగనే తుపాకిని భుజంమీద పెట్టుకొని టామి జతగా అడవిలోపల అడ్డందిడ్డంగా తిరుగుతూ సాయంకాలానికి వంటికి, చేతులకు, కాళ్ళకు ముళ్ళను గుచ్చించుకొని ఇంటికి చేరేది ఇదే తరహాలోని సంతోషమో ఇప్పటికీ నాకైతే అర్థం అయ్యేది లేదులే! బహుశః ఇతరులూ నాలోని ఈ తీటలకు అర్థం చెప్పలేరు కదా! మొత్తానికి గుర్తు, గురి, గమ్యం లేకుండానే టామి ముసల్దై చనిపోయేవరకూ దాన్తో జతగా అడవిని తిరిగిందంటూ శతఃసిద్ధంగా (నూటికి నూరుపాళ్ళు) నిజమే పాఠకులారా!

నేను అడవిలో భూమి (పొలం) కొన్న తదుపరి ఎన్నో నా అనుభవాల్ని స్నేహితులతో చెప్పి ఆనందపడుతుండేవాడ్ని. అయితే ఆ అనుభవాలన్నిట్నీ రాయాలని ఇంతవరకూ నాకు అన్పించలేదు. ఎందుకంటే, అవేవి రాసేందుకు, దఖలు పర్చేందుకు అసాధారణమైన అనుభవాలుగానైతే లేవులే. అయితే పర్యావరణం మీద ఆసక్తి, కుతూహలం కలగటంతో నేనొక పరిసరవాదిగా రూపుదాల్చిన దారి, ఈ నా రాతల నుంచి మీకు తెలియవచ్చేమో కదా! పర్యావరణ సంరక్షణమీద వైజ్ఞానిక పాఠాలన్నట్లుగా, నేను నడుచుకొచ్చిన నా దారిని మీకు తెల్పటం అది ఒకందుకు సమాజంకు మేలే అని నేను భావిస్తున్నానండి.

నేను చెప్పే చిన్న చితకా నా స్వంత అనుభవాలలోని సంఘటనలకు, పర్యావరణంకు ఏదో సంబంధాన్ని నేరుగా చూపించలేనండి! అయితే నా బతుకు బాటలో ఇది (ఈ రాతలు) నేను నడిచి వచ్చిన దారి అని మాత్రం చెప్పగలనండి.

★ ★ ★

కన్నడ భాషలో దివంగత పూర్ణచంద్రతేజస్వి రచించిన 'పరిసరద కతె' అనే కథకు యథాతథ తెలుగు అనువాదం.

అనువాదకుడు: శాఖమూరు రామగోపాల్. 17-05-2010.

ఈ కథను సేకరించింది ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని లైబ్రరి నుంచి.

# ఉడుం



గాడాంధకారంగా ఉన్న ఒక రోజున దూరంగా ఎక్కడ్నుంచో టామి మొరుగుతుంది వినబడసాగింది. సాధారణంగా కుక్కలు మనకు హెచ్చరికల్ని ఇచ్చేందుకో లేకపోతే మన గమనాన్ని వాటి వైపుకు మళ్ళించేందుకో మొరుగుతుంటవి. టామి మొరుగుతుంటే నేనైతే ఎన్నడూ నిర్లక్ష్యం చేసేవాడ్నికాదు. నేను ఇంట్లో లైట్ వెలుతురులో ఏదో పుస్తకం చదువుతున్నాను అప్పుడు. టామి పదే పదే మొరుగుతుంది. చదివేదాన్ని ఆపి, చెవిని నిల్పి దాని మొరుగును వినసాగాను. టామి ఉద్దేశపూరితంగానే నన్ను పిలుస్తున్నట్లుగా దాని అరుపుల

ధ్వని నుంచి నేను స్పష్టంగా గుర్తించాను. ఎక్కడ్నుంచి దాని అరుపులు వస్తున్నవని నేను ఆలోచించసాగాను. అయితే నేను నాలుగు గోడల నడుమ కూర్చున్నందున ఏ దిక్కునుంచి అది మొరుగుతుందని ఊహించేందుకు సాధ్యం కావట్లేదు. చూద్దాం అని ఇంటి బయటకు వచ్చి వినసాగాను. దగ్గరలోనే ఎక్కడైనా గొడవ (లొల్లి) చేస్తుంటే గట్టిగా కేకలేసి, దాన్ని కట్టిపడేద్దామని బయటకొచ్చాను.

మా ఇంటి వెనుకే దట్టమైన ఘోరారణ్యం ఉంది. టామి ఆ అడవిలోపల ఎక్కడ్నుంచో మొరుగుతున్నట్లుగా నాకు తోచింది. ఈ కటిక రాత్రిలో (అమావాస్య పక్షంలోని దినాలలో) ఆ అడవిలోపల ముళ్ళను తగిలించుకొంటూ (గుచ్చించుకొంటూ) వెళ్ళేందుకు ఎవరికి ఇష్టం ఉంటది? ఎలాగైనా చేసి దాన్ని పట్టుకొని కట్టిపడేయాలనే ఆలోచన చేసి అది మొరుగుతున్న దిక్కుకు ముఖంపెట్టుకొని జోరుగా 'టామి' అని పేరుపెట్టి పిల్చాను. నా కేక దానికి వినబడియుండొచ్చు. అది మరింత ఉత్సాహంతో జోరుగా మొరగసాగింది. నా కేకల్ని విన్న అర్ధాంగి రాజేశ్వరి బయటకొచ్చి ఏమిటని అడిగింది. మరిక మేమిద్దరం చేరి ఐదారుసార్లు దాన్ని పిల్చాం. అయితే ఏ ప్రయోజనం కానరాలేదు. టామి రోషావేశంతో ఎందుకో మొరిగే దాన్ని నిల్పనేలేదు.

నాకు టామి మీద పిచ్చికోపం వచ్చింది. ఈ కారు చీకట్లో ఇది అడవిలోపలికి వెళ్ళి మొరుగుతుంటే, నేను తుపాకిని భుజంమీద పెట్టుకొని షికారికి వెళ్ళేందుకు ఈ సమయం అనువుగా ఉంటుందా అనే సంశయం నాలో కల్గింది. నా టార్చ్‌లైట్ కూడా సరిగాలేదు. దాన్లో ఉండే బ్యాటరీల శక్తి దుర్బలంగా ఉంది. అంతేగాకుండా అది ఒకొకసారి దబక్కనే ఆరిపోతుంది. దాని స్విచ్ పాడైందో ఏమో! అది ఆరినప్పుడల్లా దాని వెనుకనుంచి ఐదారుసార్లు తట్టి మొట్టి వెలిగించాల్సి వస్తుంది.

టామి ఎంతగానైనా మొరుగుకోనీయ్.... నేను మాత్రం ఈ కారు చీకట్లో అడవిలోపలికి వెళ్ళేది లేదని గట్టిగా తీర్మానించుకొని ఇంటిలోపలికి వచ్చాను. కొన్ని నిమిషాలు గడిచినవి. టామినుంచి అరుపులు ఇంకా వస్తూనే ఉన్నవి. ఏమైనాగానీ అని ఇంట్లోకి వచ్చినా నాకు సమచిత్తంతో ఉండేందుకు మనసొప్పట్లేదు. ఎందుకంటే, అడవి జంతువుల వెంటబడి ఒకొకసారి వేటకుక్కలు ఎన్నో మైళ్ళ దూరం వరకూ పిచ్చిగా, కసిగా వెళ్తవి. ఎంతదూరంకు పోతవంటే, వెనుదిరిగి

వచ్చేందుకు సైతం వచ్చినదారి మరిచేంతవరకూ వెళ్తవి. టామి ఒకసారి అడవిలో మా ఎస్టేట్‌మీద దాడి చేసిన కోతుల గుంపును వెంటాడి ఎంతో దూరం వెళ్ళింది. ఆ తుంటరి కోతులు టర్రో టుర్రో అంటూ చెట్టునుంచి మరొక చెట్టుకు ఎగురుతూ ముమ్మందుకే దూసుకెళ్తుంటే, టామి ఆ చెట్లకింద అరుస్తూ ఎన్నో మైళ్ళదూరంకు వెళ్ళినప్పుడు దాన్ని వెతికి పట్టుకొచ్చేందుకు నాకు ఒక రోజంతా పట్టింది. పాత సంగతంతా గుర్తుంచుకొన్న నేను చివరికి టార్చ్‌లైట్ తీసుకొని అడవిలోపలికి వెళ్ళి, అది దేన్ని అడ్డగించి మొరుగుతుంది చూసి వద్దామని మనస్సు చేసుకొన్నాను. అయితే ఇప్పుడు తుపాకిని వెంటబెట్టుకోలేదు. ఎందుకంటే నా చేతిలో తుపాకి ఉన్నదాన్ని చూస్తే టామి తెల్లారేవరకూ దొరకకనే ఆ రాత్రంతా అడవిలో అది పసిగట్టిన జంతువు కోసం ఏటేటో తిరగగలదు. అందుకనే తుపాకి బదులుగా టామి మీద నాలుగు వేట్లు వేసి ఇంట్లోకి దాన్ని తరిమేందుకు పేమ్ బెత్తాన్ని పట్టుకొచ్చాను.

అడవి లోపలున్న కాలిబాటలో కొంచం దూరం వెళ్ళాను. టామి మొరుగుతున్న స్థలం దగ్గరపడింది. నా టార్చ్‌లైటు నుంచి వెలుగు క్షీణంగా పడుతుంది. టామిని బెదిరించే ఉద్దేశంతో ఐదారుసార్లు కేకల్ని పెట్టాను.

టామి నా కేకల్నుంచి భయపడి ఆ స్థలంనుంచి బయటకు వచ్చేటట్లుగా నాకు కనబడలేదు. దానికి బదులుగా నా టార్చ్‌లైటు వెలుగునూ, నా కేకల జోరునూ విని అది నా నుంచి ప్రోత్సాహమే అని భావించి మరింత జోరుగా మొరుగుతూ ఒక పొదముందు ఏదో ప్రాణి మీద దూకి అఘాయిత్యం చేసేందుకు రాలిపడిన ఆకుల్ని జరబర అన్నట్లుగా కాళ్ళతో వాటిమీద సప్పుడు చేస్తూ, ఆపి నిల్పిన ప్రాణిని కరిచేందుకు అది సిద్ధమైనదాన్ని నేను చూసాను. ఎందుకంటే, మరుక్షణానే టామి నుంచి ఎదురౌతున్న దాడిని మీరి మరేదో ప్రాణి 'హిస్సెస్స్' అన్నట్లుగా జోరుగా బుసగొట్టుంది విన్పించింది నాకు. ఆ బుసపెట్టిన సప్పుడు ఎంత గట్టిగా ఉందంటే నా చెవులు బ్రద్దలౌతవేమో అన్నట్లుగా ఆ సప్పుడు ఉంది.

నేనిప్పుడు భయపడ్డాను. ఒక చేతిలో మిణుకు మిణుకుమంటున్న టార్చ్‌లైట్, ఇంకొక చేతిలో టామీని బెదిరించాలని పట్టుకొన్న పేమ్ బెత్తం, చుట్టూ దట్టమైన

అడవి. కళ్ళకు ఏమి కనబడనట్లుగా బహుళపక్షంలోని కారుచీకట్లు. ఇటువంటి భీకర పరిస్థితిలో నగారా (భేరీని) మ్రోగించినట్లుగా 'హిస్' అనే శబ్దం మార్మోగుతుంది. ఒక్కసారిగా తక్షణమే అక్కడ్నుంచి పారిపోదాం అనే భావన కలిగింది. అయితే టామి అక్కడే మొరుగుతూ ధైర్యం ఇస్తున్నందున నేను పారిపోలేదు. తుపాకిని తీసుకురాకుండా అడవిలోపలికి జొరపడిందే నానుంచి జరిగిన తప్పు అని నన్ను నేనే మనస్సులో శపించుకొంటూ, నా టార్చ్‌లైట్ వెలుతురు ఏమైనా ఎక్కువగా అవుతదేమోనని దాన్ని ఒకట్రెండుసార్లు మొట్టాను. ఆ టార్చ్‌లైట్ వెలుతురులో ఏ మార్పులు నాకు కనబడలేదు.

టామి మొరిగేదాన్ని ఆపలేదు. దాన్నుంచి ఆపిన ప్రాణి ఇంకా ఒకట్రెండుసార్లు మొదట్లోలాగనే భీకరంగా బుసపెట్టుంది. అది పామే అయ్యుండొచ్చని నేను భావించసాగాను. పాములలో సాధారణంగా కోడెత్రాచులు, కొండ చిలువలు ఈ విధంగా గట్టిగా బుసపెట్టుతవి. అయితే ఇప్పుడు నాకు విన్పిస్తున్న భీకరమైన బుసపెట్టే శబ్దంను ఇంతకు మునుపెన్నడూ నేను వినలేదు ఈ అడవిలో. టామిమీద నాకు ఎంతో కోపం వచ్చింది. ఈ కారుచీకట్లో అడవిలోకి జొరబడి నాకు కనబడని ప్రాణితో అది చెలగాట మాడుతున్నందుకు, దాని వేటతీట (ఉబలాటం)మీద కోపం అధికమైంది.

ఆ ప్రాణి (జంతువు) లక్ష్యం తననిప్పుడు కరిచేందుకే పొంచియున్న టామి మీదే నిమగ్నమైనందున, నేను ఆ జంతువుకు దగ్గరగా వెళ్ళి అదేమి జంతువో అని చూసేందుకు ధైర్యాన్ని పోగు చేసుకున్నాను. ప్రభాతఝాము అయ్యుంటే మరియు తుపాకి చేతిలో ఉండుంటే నేను టామి సహాయంకని అంతగా వెనుకాముందు ఆలోచన చేసేవాడ్ని కాను.

ఎలాగోలా ఆ పొదలోపలికి ఐదారు అడుగులు వేసి టార్చ్‌లైట్‌ను వెలిగించాను. టామి తెల్లటి తెలుపువర్ణంతో ఉన్న కుక్కైనందున అది తేలికగానే కనబడుతుంది. అయితే టామి ఏ జంతువు మీద దాడి చేస్తుందో ఆ ప్రాణైతే నాకు స్పష్టంగా కనబడటంలేదు.

నేను దగ్గరగా వచ్చిందాన్ని చూసి మరింత ఉత్సాహంతో టామి ముందుకే దూకి ఏదోదాన్ని కరిచి లాగసాగింది. మళ్ళా బుసపెట్టే 'హిస్' అనే శబ్దం! నేను

దగ్గర్లోనే ఉన్నందున ఈసారి ఏదో కొండ చిలువ నన్ను చుట్టుకొని బుసపెట్టున్నట్లుగా నాకు అర్థమైంది. ఎంతో భయంగా వణుకుతూ ఒకట్రెండు అడుగులు వెనక్కేవేసి మరలా బుసపెట్టే వైపుకు టార్చ్‌లైట్ వేసి చూసాను.

పెద్ద ఉడుం ఒకటి అస్పష్టంగా టార్చ్‌లైట్ వెలుగులో కనబడింది. నాకు ఇంతకు మునుపే దాని ఉనికి తెల్సి, దానికి 'మానిటర్' అనే పేరు పెట్టి, అదెప్పుడన్నా నాకళ్ళలో పడ్తే ఆ పేరుతో దాన్ని పిలుస్తుండేవాడ్ని. టామి ఎన్నోసార్లు ఈ అడవిలో దాని వెంటపడినప్పుడు, ఆ ఉడుం చాకచక్యంగా తప్పించుకొని పొదలలో చేరుకొనేది. నిరాశగా టామి మళ్ళా నా చెంతకు చేరుతుండేది. మానిటర్ నాకు పరిచయమున్నా, ఆ ఉడుం ఈ విధంగా చెవులు చిల్లులు పడుతున్నట్లుగా బుసపెట్టుది అనేది నాకు తెల్వదు ఇప్పటిదాకా. పాములాగ ఇది విష జంతువు కాదనేది ఒకింతగా నాలో సమాధానమైంది. ఉడుం పారిపోయేందుకు ప్రయత్నించినప్పుడల్లా, టామి దాని తోకను నోట్లో కరుచుకొని వెనక్కి లాగుతుంది. తక్షణమే ఉడుం బుసపెట్టూ వెనక్కి తిరుగుతుంది. అప్పుడు టామి భయపడి వెనక్కి తగ్గి మొరుగుతుంది. ఈ జటాపటం (సిగపట్లు) ఎంతో సేపట్నుంచి జరిగియుండొచ్చు. ఎందుకంటే, బాక్సింగ్ రింగ్‌లో ఇద్దరు బాక్సర్లు పన్నెండో రౌండ్ వరకూ పోరాడి, పోరాడి సుస్తైపోయి ఎదురు రొప్పుల్ని పెట్టినట్లుగా ఇప్పుడు ఈ రెండు ప్రాణులు ఆ విధంగా ఎదురు రొప్పుల్ని పెట్టున్నవిలే!

ఈ మానిటర్ (ఉడుం) మీద నాకు కొంచం కోపమూ ఉంది. ఎందుకంటే, నేను పక్షుల ఫోటోలను తీద్దామని వాటి గూళ్ళ చెంత పొంచి ఉన్నప్పుడు అనేకసార్లు ఈ ఉడుం వాటిగుడ్లను తింటమేగాకుండా, ఆ గూళ్ళను పాడుచేస్తుండేది. ఒకసారి ఫోటో తీసేందుకు నేను వెళ్ళినప్పుడు, ఆ గూళ్ళలో గుడ్లను తింటున్న ఇది, నన్ను చూసి ఆ చెట్టు కొమ్మనుంచి ఇంకొక పెద్ద చెట్టుకి ఎగిరి దూకి పారిపోయిన ఆ ఉడుంను నేను కళ్ళారా చూసాను. నా చేతిలో అప్పుడు తుపాకి ఉండుంటే నా పనికి (ఫోటోలను తీసేందుకు) అడ్డుపడి పాడుచేసిన దాన్ని ఆ సందర్భంలో ఏమి చేసి ఉండేవాడ్నో చెప్పేందుకు కుదరదులే.

పొవుగంటవరకూ టామిని బెదిరించి, నా వద్దకు పిల్చుకొనేందుకు ప్రయత్నించాను. ఫలితం ఏమి కలగలేదు. ఎన్నోసార్లు తననుంచి జారుకొంటున్న

ఈ ఉడుంను ఈసారి మాత్రం వదలకూడదని టామి నిశ్చయించుకొన్నట్లుగా రోషంతో ఉంది. ఆ రెండు ప్రాణులు ఒకదానికొకటి ఎదురెదురుగా చూసుకుంటూ నన్ను అలక్షించే బుసగొట్టూ, మొరుగుతూ తమ పోరాటాన్ని ఉధృతంగా ముందుకే నడుపుకొంటున్నవి. అప్పుడు నా బుర్రలో ఒక ఆలోచన మెరిసింది (తళుక్కుమంది). ఈ ఉడుం అపాయకరమైన ప్రాణైతే కాదని దాన్ని నేనే ఎందుకు పట్టుకోగూడదు? ఎంతైనా టామి నుంచి అది తప్పించుకొని పారిపోలేదు కదా అనేది నాలో తళుక్కున మెరిసిన ఆలోచన నుంచి వచ్చింది.

అయితే నాకు ఏ మూలో చిన్నగా దిగులు పుట్టింది. ఉడుం కరవదు అని అనుకొన్నా, అడవి ప్రాణులు ఎప్పుడు ఏమేమి చేస్తవో చెప్పేందుకు కచ్చితంగా కుదిరేదిలేదు. ఆత్మరక్షణకు దేవుడు ఏఏ ఉపాయాల్ని వాటికి దయపాలించాడో ఎవరికి తెల్సు? ఎంతో నిరపాయకరమైన (సాధు) ప్రాణులవి అని తెల్సుకొన్న మనిషి వాట్ని ముట్టుకొనేందుకు వెళ్ళిన తక్షణమే, అవి (సాధుప్రాణులు) రోషావేశంతో పళ్ళనో, గోళ్ళనో ఆయుధాలుగా చేసుకొని ఆత్మరక్షణ చేసుకొంటూ వచ్చినోళ్ళను 'అయ్యయ్యో' అన్నట్లుగా పెడబొబ్బల్ని, గావుకేకల్ని పెట్టేదాన్ని నేనే ఎన్నోసార్లు అనుభవించాను. ఒకసారి మా ఇంట్లో పొదుగుతున్న కోడిని, దాని గుడ్లను చూసేందుకని ఆ పొదుగు తట్టను (గంపను) లేపగా, ఆ కోడి ఏ ఉద్దేశంతో నన్ను తన పదునైన ముక్కునుంచి, కాలిగోళ్ళనుంచి నా ముఖం చేతులమీద ఎగిరిపడి పొడిచింది నేను మర్చిపోగలనా? పెంపుడు కోళ్ళకే అటువంటి ఎదురు దాడి సాధ్యమైతే మరిక ఈ ఉడుం ఏఏ అపాయాలతో కూడిన తంత్రాన్ని నామీద ప్రయోగిస్తదో ఏ వెటర్నరి డాక్టర్ చెప్పగలడు జ్ఞానిలాగ? ఇదంతా ఆలోచిస్తూ మెల్లగా ఎంతో జాగ్రత్తతో ఉడుం వెనుక నిలిచాను. ఉడుం తన ప్రథమ శత్రువైన టామీనే ఏకాగ్రతతో కోపంగా చూస్తుంది. ఉడుంకు గుర్తుగానట్లుగా మెల్లగా పిల్లి అడుగుల్ని వేసినట్లుగా సప్పుడును చేయకనే వెనకనుంచి పెద్ద చేదతాడులాగ దప్పంగా ఉన్నదాని తోకను పట్టుకోవాలని ఉపాయం చేసాను.

నేను దాని తోకను పట్టుకొన్న తక్షణమే అది బుసగొడ్తూ నామీద తిరగబడొచ్చని ఊహిస్తే, అది నన్నేమి చేయలేదు. ఆ ఉడుం తన తోకను నోటిలో కరుచుకొంది

టామీనే అని తప్పుగా గ్రహించుకొని మళ్ళా బుసపెట్టూ టామి మీదే ఎదురు దాడి చేసేందుకు ప్రయత్నించసాగింది. ఆ సమయంను నాకు అనుకూలంగా ఉపయోగించుకొని దాన్ని గబక్కనే పైకెత్తి గట్టిగా పట్టుకొన్నాను. అప్పటికప్పుడే అకస్మాత్‌గా దానికాళ్ళకు ఆధారం తప్పి అంతరాళంలో వేలాడుతున్న ఆ ఉడుంకు ఇక ఏమి చేసేది తెల్వక బలంగా బుసపెట్టూ తన కోపంను మొత్తం విశ్వంమీదే అన్నట్లుగా ప్రదర్శించసాగింది. షికారి (వేట)లో నేనూ పాలుపంచుకొంది చూసిన టామి సంతోషంతో ఆ ఉడుంమీద ఎగిరి, లయ తప్పి నామీద పడింది. టామిని కాలితో బలంగా ఝాడించి తన్ని, దూరంగా నానుంచి పారద్రోలాను.

ఐదారు కేజీల తూకం (బరువు)తో ఉన్న బలమైన ఉడుంను దేనికీ ఏ చెట్టుకూ తాకనట్లుగా ఒకే చేతితో పట్టుకొని ఇంటివరకూ తీసుకురాగా, నా చేయికున్న సగం ఆయుష్ కుంగిందని నాకు అర్థమైంది. దాన్ని రేపు ఉదయం ఫోటో తీసిన తర్వాత అడవిలో వదిలేద్దామని తీర్మానించుకొని, నా వద్ద పొలం పనుల్ని చేసే ప్యారడ్ని మేల్కొల్పి తాడును తెమ్మని కేకపెట్టాను.

ప్యారడు నిద్రమత్తులో గలిబిలిగా ఇల్లంతా వెతికి చివరికి బావివద్ద ఉండే చేదతాడును తెచ్చాడు. మేమిద్దరం ఉడుం నడుంకు ఆ చేదతాడును బలంగా బిగించికట్టి దాన్ని భద్రంగా ఇంటెదురుగా ఉండే రావిచెట్టుకు ఆ తాడుతో సమేతంగా దాన్ని కట్టి పడేసాము. అక్కడకూ వచ్చి మొరుగుతూ లొల్లి పెట్టున్న టామీని బలంగా ఒక గుద్దు గుద్ది ఇంట్లోకి లాక్కొచ్చి ఒక మూలన గొలుసుతో కట్టిపడేసాడు ప్యారడు.

★ ★ ★

ఈ ఉడుం నాకు మొదటిసారి పరిచయమైంది సుమారుగా రెండు నెలల క్రితంలోనే. అడవిలో వేసవి కాలంలో జరుగుతుండే అగ్ని ప్రమాదాలు ఎస్టేట్‌కు తాకరాదని, ఎస్టేట్‌కు అడవి సరిహద్దుకు నడుమ ఒకలోతైన కందకంను (గుంతను) బలంగా తవ్వాము. ఆ కాలుగుంత దారిలో గడ్డి, కసువు, ఎండిన ఆకులు ఆ గుంత దార్లో లేకుండా ప్రతిరోజూ ఎస్టేట్ బారుకూ ఆ గుంతను శుభ్రం చేస్తుండేవాళ్ళం. ఆ గుంతలో పడిన ఆకులు, అలుముల్ని ఎత్తి వేరే చోట తిప్పగుంతలో పడేసేవాళ్ళం. ఇలాగున జాగ్రత్తలతో చేస్తే, ఉంటే ఒక వేళ అకస్మాత్తుగా అడవికి

నిప్పు అంటుకొన్నా అది సులభంగా తోటకు వ్యాపించకుండా ఉండేందుకు ఈ కందకం ఒక రక్షణగా ఎస్టేట్‌కు తోడ్పడుతుండేది.

వేసవిలో కాఫి ఎస్టేట్లలో నడిచే ముఖ్య వ్యవసాయపనులలో ఇదెంతో ముఖ్యమైన పనిగా ఉంటుండేది. ఎక్కడ పొగ కన్పించినా, ఎక్కడ ఆకులలములు తగలబడిన వాసన వచ్చినా మేము అక్కడికి వెళ్ళి చూసి వచ్చేవాళ్ళం. వేసవిలో అగ్ని ప్రమాదాలనుంచి జాగ్రత్తల్ని చేసుగోకపోతే, ఎన్నో సంవత్సరాల వ్యవసాయ కృషి, కన్న బిడ్డలులాగ పెంచి పోషించిన అమూల్యమైన వృక్షాలన్నీ (గంధం, లవంగ, దాల్చిన చెట్లు, యాలకుల పొదలు) కొన్ని గంటలలోనే కాలి బూడిదైపోతవి కదా!

ఈ కందకం దారిలో ఆ ప్రక్క ఈప్రక్క శుభ్రం చేసి రాశిగా చేసిన ఆకులన్నీ ప్రతిరోజూ వేకువ ఝాములో మళ్ళా ఆ కందకంలోనే పడియుండేవి. ఈ కందకంను ఊడ్చి శుభ్రం చేసే పనిలో నిమగ్నమైన మారడు ఇది ఉడుంనుంచి జరుగుతున్న తుంటరి చేష్టే(పనే)నని ఊడ్చేటప్పుడల్లా ఆ ఉడుంకు శాపనార్థాల్ని పెట్టుండేవాడు. అయితే ఈ తుంటరి ఉడుంను చూడాలని నేనెన్నిసార్లు ఆ కందకం దారిలో నడిచినా దాన్ని చూడనేలేదు! మారడి వివరణనుంచి ఉడుం అంటే అదొక పెద్ద గాత్రం (సైజ్)లో ఉండే తొండలాగ ఉండొచ్చని భావించుకొనేవాడ్ని. ఉడుంను మానవులు తింటారని, దాని మాంసం ప్రపంచంలోనే సర్వశ్రేష్ఠమైందని వెనకటి బ్రిటీషోళ్ళకాలంలో కాఫి ఎస్టేట్లను వేసిన యూరోపియన్ దొరలు ఉడుంలను ప్రీతిగా తిని భారతదేశ మహిళలతో రమించి ఆంగ్లోఇండియన్స్ జాతిని నిర్మాణం చేసారని మారడు లొట్టలేసుకొంటూ, పొగుడుతూ దాని మాంసంలోని గొప్పతనం చెపుతుండేవాడు.

అయితే ఈ ఉడుంను నేనొకసారి ఎంతో దగ్గరగా చూసినప్పుడు, దాన్ని తినే తిండి (మాంసం)లాగా భావించేందుకు నా నుంచి సాధ్యమేకాలేదు. పక్షుల ఫోటోలను తీసేందుకు నేను మాటు వేసుకొని నిశబ్దంగా కూర్చున్నప్పుడు ఆకులమీద గలగల జరబర సప్పుళ్ళను చేస్తూ వచ్చిన ఉడుం, పొదల అంచున దొంగలాగ కూర్చున్న నామీద మెల్లగా చూసింది. తలను మాత్రమే ఆకుల మాటునుంచి బయటకు

చాపినందున, నేను దాన్ని పాము తలేనని భావించుకొన్నాను. దాని గొంతుకున్న చర్మం పాముకుండే పొలుసు చర్మంలాగనే పోలి ఉంది. దాని నాలిక సైతం పాము నాలికలాగ రెండుగా చీలి ఉంది. ఇది ఈ విధంగా ఉన్నదాన్ని చూసిన నేను ఇదేదో పాము కావచ్చని అనుకొన్నాను. కొంచంసేపు నేను దాగిన పొదలమాటున ఉన్న చెట్టును నన్ను భయంగా అనుమానంతో చూసి, ఆ తర్వాత నిధానంగా బయటకు వచ్చింది. మారడి వివరణల నుంచి పెద్ద తొండలాగ ఉడుం ఉండొచ్చని భావించిన నాకు, ఇప్పుడు ఆ ఉడుంకున్న గాత్రం, ఆకారం చూసి భయమేసింది. సుమారుగా ఐదు అడుగుల పొడవుతో ఉన్న ఆ ఉడుం, దాని తోక గొడ్డలి కుండే కావునంతగా దప్పంగా ఉంది. ఆ ఉడుంకు నేను దాగిన వృక్షాన్ని చూసి ఏదో అనుమానం వచ్చియుండొచ్చు. అనుమాన చూపులతో మెడను ఒకపక్కకు వాల్చుకొని కొంచం సేపు నేను దాగిన వృక్షాన్ని చూసి, నన్ను మెంటలోడిగా భావించుకొందో ఏమో... చివరికి వచ్చిన దారి నుంచే మరలా వెనుదిరిగి వెళ్ళింది.

ఎన్నో లక్షల సంవత్సరాల క్రితం మనం ఉండే ప్రస్తుత ఈ భూమండలంలో బృహద్గాత్రంలో ఈ జాతికే (ఉడుం) చెందిన డైనోసరాలు (మహోరాలు) తిరుగుతుండేవని చదివిన నాకు, ఈ రోజు వాటి ప్రతినిధినే చూసినట్లుగా సంబరమైంది. ఇదైన తర్వాత మరోసారి గూళ్ళలో పక్షుల గుడ్లను కబళిస్తున్న (స్వాహా చేస్తున్న) ఈ ఉడుం మళ్ళీ నా కళ్ళలో పడింది. ఏదో తల్లి పక్షి నుంచి వస్తున్న చీరాటం (ఆక్రందన)ను దూరంనుంచే చూసిన నేను ఏదో ఆపద సంభవించిందని అనుకొంటూ అక్కడికి లగెత్తాను. నన్ను చూసిన తక్షణమే ఆ ఉడుం పక్షి గూడు కట్టిన కొమ్మనుంచి దభీల్నే క్రిందకు దూకి సప్పుడ్ను చేస్తూ పారిపోయింది. అప్పుడే నేను దానికి 'మానిటర్' అనే పేరును పెట్టాను.

ఈ మానిటర్ (ఉడుం)కు ఆహారంగా పక్షుల గుడ్లు, పురుగులు, చెదలు, చీమలు ఉంటవని నేను తెల్సుకొన్నాను. వీటికనే ఇది మేము ఊడ్చి రాశిగా పోగుపర్చిన ఆకులలముల్ని చెరిపి అటు ఇటూ చెల్లాచెదురు చేస్తుందని గ్రహించాను. నేను ఉడుంను చూసానని మారడితో అంటే అతనేమి ఎక్కువగా ప్రతిక్రియను చూపకనే "దాన్ని ఈసారి చూస్తే చంపండి. నేనైనా దాని మాంసంను తిని కొన్ని

గంటలు యూరోపియన్ దొరలాగ ఉంటాను. ఒకవేళ మీరు చంపకపోతే దాన్ని కుక్కో నక్కో తిని అన్యాయమైపోతది దాని ఆత్మ" అని అన్నాడు. దాన్ని కుక్కో నక్కో తింటే అన్యాయం, తను తింటే న్యాయం అనేది మారడు ఏ తత్వంనుంచి ఆధారంగా నిర్ణయించుకొన్నాడో అతనైతే నాకు చెప్పలేదు. మారడితో ఒకానొక కాలంలో ఈ భూమండలంమీద కొండగుట్టలంత గాత్రం (సైజ్)లో ఉండి నివసించిన ఈ ఉడుంల గురించి చెప్పాను. "అవన్నీ ఏమైనవి సార్?" అని ప్రశ్నించాడు మారడు. అన్నీ భూకంపంలో మట్టి అడుగున స్థాపితమైపోయినవని చెప్పాను. "ఛి... ఛీ... ఎంత అన్యాయం జరిగింది సార్" అంటూ ఖిన్నపోయాడు మారడు.

★ ★ ★

మరుదినం ఉదయంలో నేను మేల్కొనేముందే ప్యారడు గలిబిలితో వచ్చి "సార్... ఉడుం చేదతాడుతో సహా పరారైంది" అని చెప్పాడు.

నాకు ఆశ్చర్యమైంది. అంతబారుగా, బలంగా ఉండే ఆ చేదతాడును గుంజుకొని ఉడుం ఎక్కడికి పోయేందుకు సాధ్యపడుతది? అదీ (దాన్ని) రావిచెట్టుకు సరిగానే ముడేసి కట్టాముకదా!

ప్యారడి జతగా అటు ఇటు వెతికాను. ప్యారడు కొద్దిగానైనా యోచించేందుకు తనబుర్రకు కసరత్తు చేయకనే గలిబిలిచేస్తూ, "టామిని వదుల్తాను సార్! అది ఒక క్షణంలో ఉడుం ఎక్కడుందో కనుక్కోగలదు" అని అన్నాడు. అయితే రాత్రి అది చేసిన లొల్లి అంతా నాకు గుర్తుకొచ్చింది. ఇక నడుంకు త్రాడు కట్టించుకొన్న కష్టంలో ఉన్న ఉడుంను ఇది కొరికి చంపేస్తదని ఊహించి, దాన్ని ఉసిగొల్పేది వద్దని చెప్పాను.

కొంచంసేపు ఎస్టేట్‌లో వెతికివేసారి, చివరికది ముడిని వదిలించుకొని ఎలాగున వెళ్ళిందోనని పరీక్షించేందుకు రావి చెట్టువద్దకు వచ్చినప్పుడు మాకు జరిగిందేమిటో గుర్తైంది ఇలాగున. ఉడుం చేదతాడును విప్పుకొని పారిపోలేదు. దాని బదులుగా దాన్ని కట్టిపడేసిన రావిచెట్టుకే తాడుతో సహా పైకి ఎగబ్రాకి దాని తుట్టతుదినున్న కొమ్మమీద కూర్చుంది. చేదతాడును లాక్కొని పైకెళ్ళి కూర్చున్నా ఆ బారు తాడుతో

మేము చెట్టుకు కట్టిన ముడి దాని వంటినే వేలాడుతుంది. ఉడుం చెట్టు శిఖరాగ్రాన కూర్చున్న దాని విధం చూసి చిన్నబుచ్చుకొన్న మారడు "ఇక దీన్ని క్రిందకు దించేది ఎవరితరంకాదు. ఏమైనా చేసేదుంటదంటే చెట్టునే నరికి దాన్ని పట్టుకొనేదుంటది" అన్నాడతను.

"పో... పో... మూర్ఖుడా! అదెందుకు కిందకు దిగదో నేను చూస్తానులే! ఎంతైనా దాని నడుంకు చేదతాడును కట్టాం కదా! ఆ తాడును పట్టుకొని బలంగా గుంజితే అదేకాదు దాని జేజెమ్మా క్రిందకే పడ్తదిలే" అనే ధీమాకుతో అన్నాను నేను.

"ఉడుంపట్టు అనే మాటను మీరు వినలేదా? దాని ప్రాణం పోయినా, దాని పట్టు మాత్రం సలిలం (తేలిక) కాదులే" అని మారడు మాతో సవాలు చేసాడు.

ఈ పుక్కిటి పురాణ గాథల్ని నేను ఎంతగానో వినియున్నాను ఇప్పటివరకూ. వెనకటి కాలంలో రాజమహారాజులు, దళవాయిలు, సైన్యాధిపతులు తమ శత్రువుల కోటల్ని వశం చేసుకొనేందుకు, కోట గోడల్ని దొంగమాటుగా ఎగబ్రాకేందుకు (ఎక్కేందుకు) ఉడుం మూతికి తేనెపూసి, దాని నడుంకు బలమైన మోకుల్ని కట్టి కోటగోడల మీదకు దాన్ని ఎగబ్రాకించి, తర్వాత దానికి కట్టిన మోకును పట్టుకొని కోటలోపలికి ప్రవేశిస్తారనే మాటల్ని, గాథల్ని వినియున్నానులే! ఈ ఆధార రహితమైన అవ్వ, తాతలు చెప్పే సాహసగాథల్ని నేను గంభీరంగానైతే పరిగణించలేదు ఇప్పటివరకూ. ఉడుంను మొదలు క్రిందకు లాగి, ఆ తర్వాత మారడి దగ్గర మాట్లాడుదాం అని నిర్ణయించాను.

చెట్టుకు కట్టిన తాడు ముడిని విప్పి, ఆ తాడును చేతిలో పట్టుకొని గుంజాను బలంగా. ఉడుం ఆ శిఖర భాగాన్నుంచి ఒక్కసారిగా రప్పంటూ క్రిందకే పడుతదని ఊహించాను. అయితే నా ఊహ తప్పైంది. తాడు ఎక్కువ తక్కువ గాకుండా కొమ్మకే కట్టినట్లుగా భద్రంగా ఉంది. నేను గుంజే (లాగే) ఆటకు చెట్టు కొమ్మ కదుల్తుంది తప్పితే ఉడుం మాత్రం కొద్దిగానైనా అటు ఇటు కదలట్లేదు.

"చూసారు కదా సార్ ప్రత్యక్షంగా! నేను చెప్పింది అబద్ధమేనా?" అన్నాడు కుహకంగా మారడు.

నాలోని ఆత్మాభిమానం విలవిలలాడింది. ఆ తాడుకు నా బరువంతా చేర్చి వేలాడాను. నా బరువుకు అది (ఉడుం) కొద్దిగానైనా కదలలేదు. అంతలో ప్యారడు వచ్చాడు. మేమిద్దరం ఆ తాడునుంచి వేలాడాము. ఉడుం మహాశయుడు మమ్మల్ని కేరే (Care) చేయట్లేదు.

మారడ్నివచ్చి తాడును పట్టుకొని వేలాడమని ఆజ్ఞాపించాను. పండు ముసలోడైన మారడు తన రెక్కల (భుజాల)లో అంత శక్తిలేదని, తనేమైనా గోగుపుల్లలాంటోడినేనని మావద్దకు వచ్చేందుకు నిరాకరించాడు. అంతలో వేలాడుతున్న మా ఇద్దర్ని చూసి సబ్ రిజిస్టార్ ఆఫీస్‌లో రైటర్ ఉద్యోగం చేస్తున్న కిట్టప్ప కుతుహలంతో మాచెంతకు వచ్చాడు. వారినీ వేలాడమని అడిగాను.

ఆ తుంటరి ఉడుం మా ముగ్గురి బరువుకూ కొద్దిగానైనా కదలలేదు.

ఇక ఇదెంత బరువును ఆపుకోగలదని తోటలో పనుల్ని చేస్తున్న రాగప్పను తాడునుంచి వేలాడమని పిల్చాను.

మారడు ప్రేక్షకుడిలాగ నిల్చి కృష్ణ భగవానుడిలాగ కొంటెగా నవ్వుతూ చూస్తున్నాడు ఈ తతంగాన్నంతా. అతనికి అతని మాటను (లోకోక్తిని) నిలబెట్టిన ఈ తుంటరి మానిటర్ మీద ప్రేమ ఉప్పొంగింది. మా నలుగురి బరువునుంచి ఉడుం పట్టు తేలికబడలేదు. మేము నలుగురం వేలాడుతుంటే ఒక ప్రమాదం జరిగింది. ఉడుం ఆ రావిచెట్టు శిఖరాన కూర్చున్న కొమ్మ మా నలుగురి భారం (బరువు)ను ఆపుకోలేక ధమార్ అంటూ విరిగి పడింది మామీద. మాకెవరికీ పెద్ద గాయాలేమి కాకపోయినా వళ్ళంతా గీరుకుపోయింది. ఆ కొమ్మలో ఉన్న నల్ల చీమలు (గండు చీమలు) మా వంటిమీద పడినందున, ఆ గీరుకుపోయిన దెబ్బలజతగా మా షర్ట్‌లలో ఆ గండు చీమలు చేరి మా దేహాల్నంతా కుట్టసాగినవి. మేమంతా 'అయ్యో అమ్మో' అంటూ పడ్తూ లేస్తూ ఆ చీమల్ని దులుపుకొంటుంటే ఉడుం నడుంకు కట్టిన తాడు ముడి దాని అదృష్టానికి ఎలాగో లూజు అయ్యి, ఈ గలిబిలిలో అది ఆ తాడునుంచి తప్పించుకొని అడవిలోపలికి పరారైంది.

వేమంతా నుదుర్లను కొట్టుకొంటూ బట్టల్ని విప్పుకొని చీమల్ని దులుపుకొంటుంటే "ఎంథ అన్యాయం అయ్యిందండి సారుకు" అన్నాడు మారడు.

మామీద కొమ్మపడినందుకు సానుభూతిని చూపెట్టున్నాడేమోనని ఊహించి "ఎందుకోయ్" అని అడిగాను.

"ఇంతగా భంగపడి ఆ ఉడుంను క్రిందకు పడేసి ఏం ప్రయోజనం పొందారు మీరు? మరలా అది అడవిలోకే పారిపోయింది కదా... ఐదారు కేజీల మాంసంతో ఉండేదాన్ని ఇక కుక్కో నక్కో తిని అన్యాయం అవుతది కదా" అన్నాడు మారడు.

అడవిలోకి పారిపోయిన మానిటర్ (ఉడుం) ఎక్కడో దూర దేశాలకు పారిపోలేదు. అక్కడే మా ఇంటి చెంతే తిరుగుతుండేది. టామికి దానికి ఒక్కొక్కసారి జటాపటం మొదలౌతుండేది. నేను తోటను అమ్మి ఆ ప్రాంతంకు వీడ్కోలు చెప్పేవరకూ దాన్ని అప్పుడప్పుడు చూస్తూనే ఉన్నాను. నేను తోటను అమ్మి ఇంకెక్కడికో చేరిన మీదట అది ఏమైందో, దాని స్థితి ఏమిటో, దాని గురించి వివరాలు నాకు తెల్వవు కదా!.

★ ★ ★

కన్నడ భాషలో దివంగత పూర్ణచంద్రతేజస్వి రచించిన 'మానిటర్' అనే కథకు యథాతథ తెలుగు అనువాదం.

అనువాదకుడు: శాఖమూరు రామగోపాల్. 19-05-2010

ఈ కథను సేకరించింది ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని లైబ్రరి నుంచి.

# టామితో ఒకరోజు



నా పర్యావరణ కథలలో నేను ప్రస్తావించే పాత్రలలో అనేకం ఇప్పుడు శాశ్వతంగా అనంతలోకంలో విలీనమైనవి కదా! బైరడు, మారడు, మాస్తి, టామి... ఇప్పుడు ఎక్కడా లేరులే. నేనిప్పుడు ఆ పాత సంగతులన్నీ చెప్పుకొంటూ ఆనందపడేందుకు దొరికేవాళ్ళలో నా స్నేహితుడైన శ్రీరామ్ ఒకరున్నారులే.

యూనివర్శిటీలో ప్రస్తుతం ఇంగ్లీష్ భాషకు రీడరైన శ్రీరామ్ కొన్ని రోజులు టామికి సహాయకుడై షికారి (వేట)కు తిరిగింది ఒక అద్భుతమైన సంగతేలే! సుమారుగా ఇరవై ఐదు సంవత్సరాల క్రితం శ్రీరామ్ ఇంగ్లీష్ భాషలో ఎమ్.ఎ.

అభ్యసించి, ఉద్యోగంలో చేరాడు. అప్పుడు మొదట్లో కొంతకాలం శృంగేరిలోని కలాశాలలో అధ్యాపకుడిగా ఉండేవారు. ఆ కాలంలో అడవి అంచున నేను పొలంకొన్నా, ఇంకా ఇల్లు కట్టలేదు. అందుచేత దోస్తైన వాసుగారి భూతనకాడు ఎస్టేట్‌లో ఉండే భవ్యమైన భవంతిలో ఉండేవాడ్ని. శృంగేరికి, నేనుండే భూతనకాడు ఎస్టేట్‌కు ఎంతో దూరంలేదు. అందుచేత శ్రీరామ శని ఆదివారాలలో మరలా పండుగ పబ్బాలలో నేరుగా మా ఇంటికొచ్చేవాడు.

శ్రీరామ్ బెంగుళూరుకు ఆనుకొని ఉండే కోలార్ ప్రాంతంలో ఉండే చిన్న పల్లెనుంచి ఎదిగివచ్చినోడు. అతనికి మా మలెనాడులోని అడవి, వన్యప్రాణులు, వేట మొదలైనవన్నీ అపరిచితమనే చెప్పొచ్చు. స్వతహాః అడవిగురించి, అక్కడుండే పశుపక్ష్యాదుల గురించి, వేట గురించి నాకుండే అనుషంగిక (జన్మతః) ఆసక్తి అతనిలో ఉండేందుకు సాధ్యమేలేదు. అయితే మా ఇద్దరి మధ్య ఉండే ఒక ముఖ్యమైన సమాన ఆసక్తి ఏమిటంటే అది మాంసాహార తిండి మీదే కదా! నాలుగు రోజులు పుల్లబచ్చలి ఆకుకూర పప్పును అన్నంతో కలగలుపుకొని తింటేచాలు, జాతి లక్షణాల్ని పోగొట్టుకొన్నోడిలాగ మాట్లాడేవాడు. ఇంకా చెప్పాలంటే శ్రీరామ్ కొన్ని విషయాలలో నాకన్నా ఎంతో ముందు ఉండేవాడు. అతనితో మాంసం విషయం ప్రస్తావిస్తే చాలు, అది ఏ జంతువుకు చెందిన వేట మాంసం అని అడిగేవాడు కాదు. ఆ వేట మాంసం ఏదైనా ఒకటేలే అనేది అతని సిద్ధాంతంగా ఉండేది. కొన్ని కొన్ని కులాలు (జాతులు) కొన్ని కొన్ని ప్రాణుల మాంసంను తినగూడదు అనే కట్టుబాట్లను అతను పూర్తిగా తిరస్కరిస్తూ, ఆ విషయంలో మాత్రం పక్కాగా జాత్యాతీత ధోరణిని చూపెట్టేవాడు. తాత్వికంగా అతని ధోరణిని నేను పూర్తిగా ఒప్పుకొన్నా, కొన్ని జంతువుల (ప్రాణుల) మాంసంను తినేదాంట్లో నాకు అసహ్యాం అవుతుండేది. అయితే శ్రీరామ్ అలాగున కాదు. అతని నిష్ఠకు ప్రశ్నె ఉండేది మాంసంను తినాలో వద్దో అనేది మాత్రమే అతనిలో ఉంటుండేది. తినొచ్చు అనే పలుకుల్ని విన్న తక్షణమే సకల చరాచర ప్రాణులలో, జీవులలో దేన్నైనా తినొచ్చులే (చీనీ దేశపోళ్ళులాగ) అనే అభిప్రాయం అతనిలో ఉంటుండేది. మనిషైన తర్వాత గొడ్డు మాంసం, పందిమాంసం... మొదలైన తర్క విషయాలన్నీ అతనికి అర్థహీనమైనవిగా కనబడుతుండేవి.

మా షికారి గుంపంతా ఇతని ధోరణిని తాత్వికంగా ఒప్పుకొన్నా, అతనిలోని ఈ సర్వభక్షక గుణం మీద అతడ్ని ఆటపట్టిస్తుండేవాళ్ళం. అయితే మా తమాష మాటలకు అతను లొంగేదిలేదు. శ్రీరామ్‌లోని ఈ ధోరణిని ఒప్పుకొని ఇప్పుడు అతనికి అనుయాయులుగా కడిదాళ్ దయానంద, శికారిపుర గాంగేయ... మొదలైన శిష్యులు ఎంతోమంది అతని పటాలం (గుంపు)గా చేరారు. ఆ గుంపునుంచి వచ్చే సిద్ధాంతంను సంక్షిప్తంగా నేను మీకు చెపుతాను పాఠకులారా! రెండు కాళ్ళతో ఉండే మనిషి; నాల్గు కాళ్ళతో ఉండే కుర్చీ, టేబిల్, మంచం... వీట్నివదిలి మిగిలిన వాట్నివేట్నైనా మనిషి తినొచ్చు అనేది వాళ్ళలో ఉంటుండేది. ఈ శ్రీరామ్ బెటాలియన్ (పటాలం), శ్రీరామ్‌కన్నా ఒక అడుగు ముందుకేవేసి పశుపక్ష్యాదులే గాకుండా క్రిమికీటకాలలో ఏవేవి ఎంతెంతగా ఎక్కువ రుచులలో ఉంటవనే సంశోధనంలో మునిగిపోయారు. మాంసాహారి గుంపులో శ్రీరామ్ గణనీయపాత్ర వహించాడని నేను నిస్సంశయంగా చెప్పొచ్చేమో కదా!

ప్రతిసారి శృంగేరినుంచి శ్రీరామ్ వచ్చినప్పుడు, “ఏమిటండి శృంగేరి సమాచారాలు?” అని నేను అడిగిన తక్షణమే శృంగేరిలోని బ్రాహ్మణ సమాజ ప్రభావంను, పెరుగుభోజనం (దద్ధోజనం), పుల్లబచ్చలి ఆకుకూర పప్పులో ఇంగువ వాసనతో ఉండే తిండిని మనసారా దూషిస్తూ “నాలికలోని రుచి (జిహ్వా) అంతా ఎటో వెళ్ళిపోయిందని, ఆ తిండిమీద ప్రస్తుతం ధ్యాసే ఉండట్లేదని, ఆ జనంనుంచి వచ్చే పప్పు భోజనం నుంచి కడుపులో గ్యాస్ నిండుకొని పొట్టంతా బెలూన్‌లాగ మారిందని, మొత్తానికి ఈ శృంగేరిలోని జీవిత విధానం మీద జుగుప్స ఆరంభమైందని” చెప్పేవాడు. ఆ శాకాహార భోజనంనుంచి తను చచ్చేది గ్యారెంటి అని వర్ణించేవాడు. ఈ మాటలన్ని, మేము షికారి (వేటకు)కి వెళ్ళేముందు చెపుతున్న ముందుమాటలుగా ఉంటుండేవి. తక్షణమే అడవి లోపలికి వెళ్ళి షికారి చేసే అత్యవసర పరిస్థితిని మాకు మేమే ప్రారంభించేందుకు అతను ఆడుతున్న నాటకంగా ఆ మాటలు ఉంటుండేవి.

నాకు, శ్రీరామ్‌కు సెలవు దినాలలో దినచరి ఎంత కరెక్ట్‌గా నడుస్తుండేదంటే టామీకి మా దినచరి చక్కగా అర్థమైపోయి, శ్రీరామ్ శృంగేరి నుంచి వచ్చిన తక్షణమే

షికారికి వెళ్ళేందుకు అది గొంతుబొంగురు పోయేటట్లుగా మొరుగుతూ కట్టేసిన గొలుసును గుంజుతూ తోకను అటు ఇటు కుశాలుగా తిప్పుతుండేది.

శ్రీరామ్‌కు అడవిలో తిరగటంకాని, ముళ్ళు నుణుపురాళ్ళతో నిండియున్న మా ప్రాంతంమీద గాని అదంతగా విశేషమైన నాలెడ్జి (Knowledge) ఏమి లేదు. పైపెచ్చు అతనిలో తుపాకిని సరిగా పట్టుకొనేది తెల్వదు.

వాసుగారి భూతనకాడు ఎస్టేట్‌మీద దాడుల్ని చేస్తున్న కోతి మూకను పారదోలేందుకు చిన్న సైజ్ నల్లి పైపులో చివర్న గంధకం, భాస్వరం పొడిని నింపేవారు. దాని మూతిని ఒక చిన్న నుణుపురాయి మీద మొట్టితే చాలు, చెవులు చిల్లులు పడేంతగా పెద్ద మోతతో శబ్దం వస్తుండేది. టామితో వేటకు బయల్దేరినప్పుడు శ్రీరామ్ చేతిలో దీపావళి పండుగలో పిల్లలకు వినోదం కల్గించే ఆయుధంగా ఉండే ఈ చిన్న సైజ్ (మిని) రోలు–రోకలి ఉంటుండేది. అడవిలో మొత్తానికి శ్రీరామ్‌కు ఉండే డ్యూటి ఏమిటంటే టామి వెనుకనే పరిగెడ్తూ దాన్ని ఉసిగొల్పేది, ప్రోత్సహించేది మాత్రమే కదా! దట్టమైన ఆ అడవిలో టామి ఏవేవో ప్రాణుల్ని (జంతువుల్ని) నిల్పి, మొరుగుతున్నప్పుడు శ్రీరామ్ టామి వెనుకనుంచి ఆ రోలు – రోకలిలోని గంధకం గోలిని ఒకరాయిమీద కొట్టి ధమార్ శబ్దాల్ని కల్గిస్తూ, ఛూఛూ, ఇస్కు ఇస్కు అని కుక్కను ప్రేరేపిస్తూ ఉంటుండేవాడు. ఆ గంధకం పొడి సద్దు ఆ చిన్నరోలు – రోకలినుంచే వచ్చినదాన్ని తెల్వని వన్యప్రాణులు, టామినుంచే ఆ సప్పుడు (ధమార్) వచ్చిందని తెల్సుకొని ఎటెటో దిక్కు తప్పి వెర్రి వెర్రిగా దూకిపోతుండేవి. కొన్నైతే నాచెంతకే దూకి వస్తుండేవి. కొన్ని శ్రీరామ్ వైపుకు దూకి వచ్చేదుందిలే! అలాగేమైనా అవి వారి చెంతనుంచి దూకి పారిపోతే అప్పుడు శ్రీరామ్‌లోని కోపంను చూడాలండీ! సరైన దిక్కులో ఆ మృగాల్ని మరల్చలేదని టామిని తిట్తూ, కోపం తగ్గేవరకూ ఒక చెట్టు నీడలో కూర్చుని అలుపును నివారించుకొంటుండేవాడు. సాధారణంగా మాకు అప్పట్లో వేల సంఖ్యలలో ఉండే అడవి కోళ్ళు, ఒకొకసారి అడవి మేక, కుందేళ్ళు మొదలైనవే దొరుకేవిలే! ఎంతో అపురూపంగా అడవిపంది మా వేటలో దొరికేది. మేము ముగ్గురమే (టామితో సహా) అయినందున అడవి పందిని పడగొట్టేది ఎంతో కష్టంగా ఉంటుండేది. టామి, శ్రీరామ్‌లను కొంచమూ లక్ష్యపెట్టని (కేర్ చేయని)

ఆ అడవి పందులు గుర్ గుర్ అంటూ ఎన్నోసార్లు శ్రీరామ్, టామిల ముందే దూకి కనుమరుగైయ్యేవి. ఇరవైఐదు సంవత్సరాల తర్వాత ఇప్పుడు ఆ పాత జ్ఞాపకాల్ని గుర్తుచేస్తే, ఎన్నో కేజీల మాంసం ఆ రోజులలో మానుంచి తప్పిపోయిందని నిట్టూర్పుల్ని వదుల్తూ, సూతకంలో ఉన్న శోక మౌనంను శ్రీరామ్ ఆచరిస్తాడు కదా!

ఒక ఆదివారం ఉదయానే నేను, శ్రీరామ్, టామి, తుపాకి, చిన్నరోలు-రోకలి పట్టుకొని వేటకు వెళ్ళాం. ఏప్రియల్ మాసంలోని ఎండలో కబుర్లు చెప్పుకొంటూ, కొండ గుట్టల్ని ఎక్కుతూ దిగుతూ 'కుదురెగుండి' ఎస్టేట్‌కు దగ్గరున్న అడవికి చేరాం. విప్పచెట్లు పూలతో శోభిల్లేకాలమైనందున మొత్తం ఆ పరిసరమంతా మత్తును పెట్టే తేనెవాసనతో నిండిపోయింది. 'కుదురెగుండి' వద్ద రెండు కొండల నడుమ ఉండే ఆ దట్టడివిలో ఒక చిన్నవాగు ప్రవహిస్తుంది. వాగు జోముకు దాని చుట్టు పక్కల దట్టంగా అడవి పెరిగి ఉంది. వేసవిలో ఈ జాగాలో ఏవైనా అడవి ప్రాణులు తమ దాహం (దప్పిక)ను తీర్చుకొనేందుకు ఇక్కడికే తప్పకుండా వస్తుండేవి.

శ్రీరామ్ ఇక్కడున్న అడవిలో ఒక వైపునుంచి టామిని వదిలి, రోలు-రోకల్నుంచి ఢమార్ శబ్దాల్ని చేస్తూ ఆ ప్రాణుల్ని వెంటాడుతున్నాడు. నేను మరొక వైపున తుపాకి పట్టుకొని ఎటెన్షన్ భంగిమలో నిలబడ్డాను. ఏదైనా ప్రాణి తన గ్రహచారంను పోగొట్టుకొని నేనుండే వైపుకు పారిపోయి వస్తుంటే, అప్పుడు నేను తుపాకి పేల్చేవాడ్ని. మా వ్యూహంకు (ప్లాన్‌కు) వ్యతిరేకంగా ఆ జంతువులు ఎటెటోదూకి పరారైయ్యేదే ఎక్కువకదా! కొన్నిసార్లు టామి అత్యుత్సాహంతో ఆ ప్రాణులున్న జాగవద్దకు మేము చేరే లోపే, వాటి మీద భౌభౌ అంటూ దూకి, ఆ జంతువులకు ఎటెటో దూకి పారిపోయేందుకు అనువుగా తిక్కలతనం చూపెట్టేది. ఆ రోజు మా దురదృష్టానికి ఆ 'కుదురెగుండి' అడవిలో ఏ ప్రాణి కనబడలేదు. శ్రీరామ్ టామి ఎంతెంతగానో గాలించి సుస్తైపోయారు. పొద్దుగడుస్తూ సూర్యుడు మట మటలాడుతుండగా ఆ ఎండ వేడిమి మాలో ఉన్న షికారి ఆసక్తిని కుంగదీసింది. సెగను తాళలేక అల్సిన టామి వాగులోని బురదలో అటు ఇటు పొర్లి వళ్ళంతా బురదను పులుముకొని అడవి పందిలాగ కనబడింది. శ్రీరామ్, నేను ఆ వాగు చెంతకు చేరాం.

"షికారి (వేట) ఎందుకో బికారిలాగ కనబడుతుంది కదా" అన్నాడు శ్రీరామ్ వేదన స్వరంతో.

"ఇక్కడ జంతువులు లేవని ఎలా చెప్పగలరు? మీరు సరిగా టామీని ఉసిగొల్పి పరిగెత్తించలేదు" అన్నాను నేను.

"మీకేంటి సార్! అక్కడ వృక్షం నీడలో చల్లగా నిలబడ్డారు. ఇక్కడ మేము ముళ్ళు, రాళ్ళ నడుమ అడవిలో దూసుకొని అరుస్తూ ప్రాణుల్ని వెంటాడాలంటే మా ప్రాణమే పోతది. దాన్తో పాటుగా ఈ దరిద్ర ఎండ ఒకటి. దాహమైందని నీళ్ళు తాగుదామంటే టామి ఆ వాగులో పొర్లి ఆ నీళ్ళనంతా బురదమయం చేసింది" అంటూ శ్రీరామ్ తన కష్టకార్పణ్యాలలోని చీటీని విప్పాడు.

ఇక చేసేదేమిలేక అక్కడ్నుంచి గుట్టమీద ఉండే అడవివైపుకు బయల్దేరాం. వెదురు పొదలతో దట్టంగా పెరిగిన ఈ అడవిలో నాటుకోళ్ళు, కుందేళ్ళు, జింకలు ఎన్నో ఉన్నవి. అయితే ఆ వేళ మధ్యాహ్నంలోని వేడిసెగలకో ఏమో కోళ్ళను అటుండనీయండి... ఒక తొండ సైతం ఇటు వైపుకు (మావైపుకు) ముఖాన్ని చూపలేదు. గుట్టల్ని ఎక్కిదిగి సుస్తైపోయిన మాలో నాన్‌వెజిటేరియన్ తిండిమీద ఆసక్తి ఇంకిపోసాగింది. ఆ గుట్టలోని రాళ్ళన్నీ ఎండ వేడిమినుంచి నిప్పు కణికెలన్నట్లుగా ఉన్నవి. వెదురుపొదల నీడలో కూర్చుని అలుపును నివారించుకొనేందుకు సరైన జాగ మాకు దొరకనేలేదు.

"ఇక ఉత్తిగనే వెనుదిరిగి ఒక కేజి మటన్‌ను కటికోడినుంచి కొనుక్కొద్దాం. షికారికి నిప్పు పెట్ట" అంటూ శ్రీరామ్ వెనుదిరిగి మా ఇంటికి చేరే నిర్ణయం చేసాడు.

"బడాయిగా వేటకు వెళ్తున్నామని మీ అక్కకు చెప్పి వచ్చిన మనకి, ఇక ఇప్పుడు ఉత్తచేతులతో (రిక్తహస్తాలతో) ఇంటికి వెళ్తే మర్యాదేమైనా ఉంటదయ్యా?" అన్నాను నేను.

"దీంట్లో ఏమి మర్యాద ఉంటది? ప్రస్తుతం ఈ అడవిలో జంతువులేవి లేకుండా ఉన్నందున మనమేమి చేయగలం? మనం షికారి చేసి వధించిన ప్రాణులతో

ఇంటికొస్తామని అక్కకు రాతకోతల నుంచి రాసివ్వలేదుకదా” అంటూ ఎలాగైనా సరే వెనుదిరిగి మా ఇంటికెళ్ళేందుకు వాదం చేయసాగాడు శ్రీరామ్.

శ్రీరామ్ నడవడిక నాకు బాగానే గుర్తు. కొద్దిగా అలిసినా, ఉత్సాహమంతా పోగొట్టుకొన్నోడిలాగ నేలమీద చతికిలపడేవాడు. ఇక ఇతని ధోరణి నుంచి వెనుదిరిగేదే ఉత్తమం. ఇంటికి చేరేవరకూ మాలో శక్తి ఇప్పుడు లేదుకదా! షికారిలోని చమత్కారమే ఇలాగుంటది. వెళ్ళేటప్పుడుండే ఉత్సాహం ఇంటికి చేరేటప్పటికి మాయమౌతది. ఎదురులో ఉన్నదార్లోని ఎగుడుదిగుడులన్నీ జయించటానికి అసాధ్యమైన సవాళ్ళులాగ కనబడుతవి. అడవిలోని ఆ బృహదాకార వృక్షాలుగాని, పూల సుగంధ పరిమళాలు గాని, పక్షుల కిలకిలారావాలుగాని మనసులలో చోటు చేసుకోవు. తగ్గులలో ఉత్తిగనే (చైతన్యం లేకుండానే) అడుగుల్ని వేస్తూ ఎవరికి వారే అన్నట్లుగా ఇంటి వైపుకు నడుస్తున్నాం. శ్రీరామ్ తన దుఃస్థితిని నాకు తెల్పాలనో ఏమో అప్పుడప్పుడు కుంటుతున్నాడు. అడిగితే కాలిలో ముల్లు గుచ్చుకొందని అంటున్నాడు. శ్రీరామ్‌లో వేగంగా నడిచేందుకు ఉత్సాహం నింపాలని, “నడవండి... వేగం వేగం (స్పీడ్ స్పీడ్) గా నడవండి. పొద్దుగడిస్తే మాంసం కొట్టువాడు తలుపుల్ని మూసేస్తాడు. చివరికి గొర్రె కాళ్ళు దొరకవు” అని అన్నాను. శ్రీరామ్ నడకకు ఈ నా మాటల్నుంచి చైతన్యం వచ్చినట్లుగా నాకైతే కనబడలేదు.

సుమారుగా సగందూరం నడిచాం. టామి మాతో వస్తూ, అప్పటికప్పుడే ఏదో గ్రహించిన దానిలాగ వాసన పట్టుకొని అడవిలోకి దూసుకెళ్ళింది. కొద్దిసేపైన పిమ్మట అది ఒక పొదముందు మొరుగుతుంది.

ఎండి, రాలిన ఆకు అన్నట్లుగా సుస్తైపోయిన శ్రీరామ్‌కు అది మొరుగుతుంది ఎంత మాత్రంగానూ ఉత్సాహం నింపలేదు. నిస్తేజంగా నా ముఖం చూసాడు. అంతలో గుర్రుగోర్ అంటూ మూడు పందులు టామిని బెదిరించి ఒక పొదనుంచి ఇంకొక పొదకు దూకినవి.

ఎంతగా అల్సినాసరే, తుపాకిని చేతిలో పట్టుకొన్న వేటగాడికి షికారి జంతువు (ప్రాణి) కళ్ళలో పడ్తే ఊరుకొనేందుకు సాధ్యమా? నాలోని నిరాసక్తి అప్పటికప్పుడే

మాయమై తుపాకిని జాగ్రత్తగా గురి పెట్టుకొని ఒకే ఊపుతో పొదను సవరించి ఆ వైపుకు దూసుకెళ్ళాను. టామి ఏదో పందిని గురి పెట్టుకొని మొరుగుతూ చెట్ల నడుమ లొల్లిపెట్టుంది. కొద్దిసేపు పొద చెంతే మాటేసి ఎదురుచూసాను. అయితే ఏ ఒక్క పంది నేను మాటేసిన వైపుకు రానేలేదు. టామి మొరిగేది మాత్రం వినబడుతుంది. ఇప్పుడు కాకపోతే ఇంకొక ఐదు నిమిషాలకైనా పంది దూసుకొంటూ బయటకు రానే వస్తదని ఊహిస్తూ నిలబడే ఉన్నాను.

అంతలో టామి అరుపుల్ని మీరి శ్రీరామ్ కేకల్ని పెట్టుంది వినబడింది. “రండి రండి శీఘ్రంగా… ఇక్కడే పంది ఉంది!” అని పెద్దగా నన్ను పిలుస్తున్నాడు. పంది శ్రీరామ్ కళ్ళకు కనబడేటట్లుగా నిలిస్తే, అతని పెడబొబ్బలకు అది కచ్చితంగా అక్కడ్నుంచి పారిపోతదని ఊహించిన నేను నిల్చిన చోటునుంచే, “అరవకండి… కదలకుండా, మెదలకుండా నిలబడే ఉండండి” అంటూ అతను నిల్చిన చోటుకు వెళ్ళాను. శ్రీరామ్ వద్దకు వెళ్ళేవరకూ ఆ అడవిపంది అక్కడే నిల్చి ఉంటదని నాకైతే నమ్మకం లేదులే! అల్సిసొల్సిన నేను నిధానంగా నడిచి వెళ్ళాను అతనివద్దకు.

శ్రీరామ్ నా కళ్ళలో పడినప్పుడు శిలావిగ్రహంలాగ నోటిని బిగపట్టుకొని కదలకుండా నిలబడియున్నాడు. నేను సప్పుడ్ను చేయకుండా సంజ్ఞలతో పంది ఎక్కడ అని తలను ఊపాను. ఊపిర్ని బిగపట్టిన శ్రీరామ్ యక్షగానంలోని పాత్రదారి కళ్ళను తిప్పినట్లుగా కళ్ళు తిప్పుతూ, నా ఎడం పక్కకు చూపెట్టున్నాడు. ఎడంవైపు ఎటువంటి పొదలు లేవు. ఎంతగా నిశితంగా చూసినా, ఖాళి జాగ తప్పితే, మరి ఇకేమి కనబడలేదు అక్కడ. మళ్ళీ అడుగుతున్నోడిలాగ శ్రీరామ్ వైపుకు చూసాను. అతను మరలా ఎడం ప్రక్కకే కళ్ళను మరల్చి చూపెట్టున్నాడు. ఎంతగా తీక్షణంగా చూసినా పందిలాంటి ఏ పెద్ద ప్రాణి నా కళ్ళలో పడలేదు. మౌనాన్ని చీల్చి, అనివార్యంగా అడిగా…. “ఎక్కడా పంది కనబడటంలేదు కదా” అన్నాను.

శ్రీరామ్‌లో సహనం నశించి “చూడండి సరిగా… ఇక్కడే ఉంది కదా” అంటూ తన కాళ్ళక్రింద చేతిని నిల్పుతూ అరిచాడు. నేను అడవి జంతువును శ్రీరామ్ చెంత అంత దగ్గరలో ఉంటదని ఇప్పటిదాకా నిరీక్షించనేలేదు. అందుకే అతను కళ్ళతో సూచనల్ని చేస్తుంటే కొంచం దూరానున్న పొదల వైపుకు చూసాను. ఇప్పుడు

శ్రీరామ్ తన కాళ్ళ అడుగునే గురిచేసి చూపిస్తున్నాడు. సరిగా చూడగా సాధారణ గాత్రం (సైజ్)లోనే ఉన్న పంది ఒకటి వారి కాళ్ళ దగ్గర సుమారుగా రెండు అడుగుల దూరంలో కూర్చొని శ్రీరామ్ మీద ఎటాక్ చేసే భంగిమలో సిద్ధమై ఉంది. శ్రీరామ్‌కు అపాయం గాకుండా పందికి బులెట్‌ను పేల్చేది నేను నిలబడిన డైరెక్ట్ పొజిషన్‌కు కష్టంగా ఉంది. అందుకని మెల్లగా రెండు అడుగులు కుడిపక్కకు మళ్ళాను. పంది నన్ను చూసి దూకి పరిగెత్తేందుకు సిద్ధమైంది. ఆ సమయానికే నేను తుపాకి పేల్చాను. గుండు (బుల్లెట్) తగిలిందో లేదో తెల్వలేదు. పంది వాయువేగంగా (యమస్పీడ్‌గా) అడవిలోకి పారిపోయింది. అది శ్రీరామ్ మీద ఆక్రమణ (ఎటాక్) చేద్దామని రాలేదు. హఠాత్తుగా దాని దారిలో శ్రీరామ్ మహాశయుడు ఉన్నందున (ఎదురైనందున) ఇతడ్నేదో వింత మృగం అన్నట్లుగా దానికి తోచి, ముందేమి చేయాలనేది తెల్వక అలాగునే చూస్తూ నిలబడిపోయింది కదా!

“అంత దగ్గరలో దొరికిన పందిని గురి తప్పి కాల్చారు కదా... నా చేతిలో ఈ చిన్న పిల్లల ఆట వస్తువైన రోలు-రోకలి బదులు ఒక కత్తి ఉండుంటే దాన్ని నేనే చంపేవాడ్ని కదా” అంటూ గురి తప్పి కాల్చిన నన్ను విమర్శించసాగాడు శ్రీరామ్.

ఒకట్రెండు క్షణాల తర్వాత తుపాకి మోతను విన్న టామి పరిగెత్తుకొని నా వద్దకు వచ్చింది. వచ్చిందే తడవుగా పంది వాసనను పట్టుకొని క్షణాలలోనే అది అడవి లోపలికి దూసుకెళ్ళింది.

మాకేమి పందివాసనను పట్టుకొనే (ఆఘ్రాణించే) సామర్థ్యం లేదు. అందుచేత పందిని వెంబడించేందుకు, కనుగొనేందుకు టామికున్న ఉత్సాహంలోని స్ఫూర్తి మాలో లేవు. మొదలే మా వేట సరిహద్దుల్ని దాటి ఎంతో దూరం వచ్చి సుస్తైయ్యాము. జతగా దొరికిన షికారి ప్రాణి (పంది) పరారైనందున మాలో మరింతగా నిరాశ, నిస్పృహ ఆవరించింది. అయితే టామి ఆ పందిని వెతికి వచ్చేవరకూ వేచియుండాల్సిందే! అది షికారిలోని నియమ ధర్మం కదా!

పంది ఎదురై అతని ముందే నిలబడింది, అదెక్కడ ఎగిరి వంటిమీద పడి రక్కుతదో అని గడగడా వణికింది... మొదలైన వాట్ని శ్రీరామ్ చెప్పసాగాడు.

మధ్యమధ్యన టామి టామి అంటూ కేకల్ని పెట్టున్నాడు. ఆకలి, దప్పిక, వళ్ళంతా గీరుకుపోయినందున మాలో సహనం నశించి టామికి శాపనార్థాల్ని పెట్టున్నాము.

అటువంటి నిరాశాపూరిత స్థితిలో గుట్ట ఆవైపున కింద భాగంలో 'కుదురేగుండి' కాఫి ఎస్టేట్‌లో ఎక్కడినుంచో టామి మొరుగుతుంది వినబడింది. ఆ మొరుగును వింటే పందిని వెంబడించి అక్కడెక్కడో దాన్ని ఆపియుండొచ్చని మాకు అర్థమైంది.

మాలో ఇంటికి చేరేందుకు శక్తే లేకుండా ఉండగా, మరిక మళ్ళా గుట్టను ఎక్కిదిగి మొరుగుతుండే జాగాకు వెళ్ళేది సాధ్యమేనా? శ్రీరామ్ అయితే, "మీరు కావాలనుకొంటే వెళ్ళండి, నేను వచ్చేది లేదు" అంటూ కూలబడ్డాడు. అయితే వేరే మార్గం లేదు. పంది అక్కడేమైనా ఉంటే, మేమిక్కడ ఎంతసేపు దానికని ఎదురుచూసినా, టామి వెనుదిరిగి మావద్దకు చేరుకొనేది లేదు. చివరిప్రయత్నంగా నిర్ణయం చేసుకొని గుట్టను ఎక్కి దిగుతూ 'కుదురెగుండి' ఎస్టేట్ వైపుకు నడిచాము. కేవలం ఇచ్ఛాబలం నుంచే నడుస్తున్నాము.

టామి మొరుగుతుండే చోటుకు గుట్ట ఎక్కిదిగి దాని చెంతకు చేరేలోపు సగం మనుషులమయ్యాము. టామి ఆ ఎస్టేట్‌లో కాఫి చెట్ల వరుసల నడుమ మొరుగుతుంది. గాయపడిన పంది ఏ క్షణానైనా మామీదకు దూకగలదని భావిస్తూ తుపాకిని సిద్ధంగా పట్టుకొని అడుగులో అడుగేస్తూ ముందుకెళ్ళి చూసాను. పంది అక్కడ చచ్చిపడి ఉంది. ఎంతో కష్టపడిన మాకు పరమానందమైంది. భేష్ భేష్ అంటూ ఎదురు రొపుల్ని పెట్టున్న టామి వెన్ను తట్టూ దూరానున్న శ్రీరామ్‌ను పిల్చాను.

ఇక మళ్ళా వెళ్ళాల్సిన దూరంను జ్ఞాపకం చేసుకొన్న తక్షణమే మా సంతోషం మటుమాయమైంది. శ్రీరామ్ ఎంతగా నలిగాడంటే ఆ పందిని మోసేందుకు అతను తోడ్పడుతాడు అనే నమ్మకం నాకైతే లేదు. ఎలాగోలా అతడ్ని కార్యశీలుడిగా చేసేందుకని "శ్రీరామ్... ఇప్పటికిప్పుడే మనం ఈ పందిని ఇక్కడ్నుంచి మోసుకెళ్ళాలి" అని దడబడగా చెప్పాను. సుస్తైన శ్రీరామ్ హఠాత్తుగా తలమీద కొండచరియ విరిగిపడినట్లుగా బెదిరాడు.

"అదెందుకు ఇప్పటికిప్పుడే దీన్ని మోసుకెళ్ళాలి?" అడిగాడు శ్రీరామ్.

"చూడు మిత్రమా, ఇప్పుడు పంది పడింది 'కుదురెగుండి' ఎస్టేట్‌లో. ఎస్టేట్ వారు ఎవరైనా దీన్ని చూస్తే, ఎస్టేట్‌కు చెందిన హక్కు భాగంను ఇచ్చి మిగిలినదాన్ని తీసుకెళ్ళండి అని అంటారు" అని గుసగుసగా చెప్పాను.

ఇక ఇప్పుడు శ్రీరామ్ ముఖ కవళికలలో హఠాత్తుగా మార్పులు కలిగి మెల్లగా, "ఔనా! తోటకు చెందిన హక్కులో ఎంత భాగం ఇవ్వాలి?" అని అడిగాడు.

"షికారిలో ఉండే కానూను ప్రకారం ఎవరి జాగాలో ప్రాణి పడుతదో, అంతోళ్ళకు సగభాగం ఇవాల్సే ఉంటది. ఇవ్వకపోతే పందిని ముట్టుకొనేది అటుండనీ... చూసేందుకూ అవకాశంనే ఇవ్వరు" అన్నాను నేను.

"సగభాగమా! మొత్తంలో సగం ఇస్తే ఆ తర్వాత మనకి మిగిలేదెంత? అదేగాకుండా పొద్దుట్నుంచి మనం పడుతూ లేస్తూ, చెమటను ధారగా స్రవిస్తూ కొండగుట్టల్ని ఎక్కిదిగి, వీళ్ళకు సగం ఇచ్చేదంటే అదేమి న్యాయమో చెప్పండి? కొంచంసేపు ఈ రోలు-రోకల్ని పట్టుకోండి" అంటూ నా చేతికి ఆ రోలు రోకల్ని ఇచ్చాడు. సగం ఇవ్వాలి అని చెప్పిన తక్షణమే శవంలాగ నిస్తేజంగా ఉన్న శ్రీరామ్‌లో దఢాల్నే జీవ చైతన్యం తొణికిసలాడింది. పంది వెనుకకాళ్ళకు చేతుల్ని వేసి "కొద్దిగా దీన్ని పైకెత్తి నా భుజం మీదకు చేర్చండి" అని అడిగాడు. అతనొక్కడే ఆ పందిని మోస్తాడని నేను ఊహించలేదు. "మీరు ముందు కాళ్ళను పట్టుకోండి. నేను వెనుక కాళ్ళను పట్టుకొంటాను. మీ ఒకరినుంచే మోసేది అసాధ్యం" అని అన్నాను నేను.

"ఛుఛూ... ఏమిటండి మీ మాటలు! నేనేమి అర్భకుడ్ని కాదు! ఇక ఎక్కువగా మాట్లాడకండి! ఎస్టేట్ జనం ఎవరైనా మనల్ని చూడొచ్చు. ఆలశ్యం చేయకండి" అంటూ కోపంగా నన్ను గదిరాడు.

పందిని భుజంమీద పెట్టిందే ఆలశ్యం, శ్రీరామ్ టామి... ఆ ఇద్దరూ మాయమయ్యారు. ఎక్కువతక్కువ గాకుండా చెప్పాలంటే ఆ ఇద్దరూ పారిపోయారో ఏమో! నా కళ్ళకు మళ్ళా కనబడనేలేదు. నేనొకడ్నే గంధకం వాసన పెట్టున్న రోలు రోకల్ని, తుపాకిని మోసుకొంటూ నేనుండే భూతనకాడు ఎస్టేట్‌వద్దకు బయల్దేరాను.

ఆరోజు తననుతనే మోసుకోలేనంతగా సుస్తైన శ్రీరామ్ సగభాగం పందిని ఇవాల్సి ఉంటది అని చెప్పిన తక్షణమే దృఢ నిశ్చయం చేసుకొన్నదాన్ని మరలా గుర్తు చేస్తూ ఇప్పుడూ అతడ్ని ఆట పట్టిస్తూ ఆ కాలంలోని రోజుల్ని గుర్తుకు తెచ్చుకొంటుండేవాడ్ని.

నేను ఇంటికి చేరినప్పుడు టామి, శ్రీరామ్ ఆ ఇద్దరూ ఇంట్లో వంటగదిలో ఆ పందిని భద్రంగా పడేసి రావిచెట్టు నీడన కునుకు తీస్తున్నారు.

ఇక ఎస్టేట్‌లో పనులను చేస్తున్న శ్రామికులకు ఘనమైన (సహపంక్తి) భోజనం పెట్టేందుకు నా శ్రీమతైన రాజేశ్వరి మహిళలతో మసాలా దినుసుల్ని నూరిస్తుంది.

★ ★ ★

కన్నడ భాషలో దివంగత పూర్ణచంద్ర తేజస్విగారు రచించిన 'కివియోడనె ఒందు దిన' అనే కథకు యథాతథ తెలుగు అనువాదం.

అనువాదకుడు: శాఖమూరు రామగోపాల్.

19-05-2010.

# మాస్తి మరియు భైరడు



మొదటిసారి అతడ్ని నేను చూసినప్పుడు నా కళ్ళనే నమ్మేందుకు నాకు వీలుకాలేదు. 'భూతనకాడు' ఎస్టేట్ చెంతనుండే అడవిలో నేను నడచివస్తున్నప్పుడు టామి దగ్గర్లోనే ఏదో పెద్ద పులిని చూసినట్లుగా తారక స్వరంతో మొరుగుతూ గొడవ చేస్తుంది. నేను దానిదగ్గరకు వెళ్ళి దాని మొరుగుకు కారణమేమిటని చూసినప్పుడు ఒకతను శిలలాగ నిలబడియున్నాడు.

టామి మనుషులను చూస్తే అదంతగా ఏమి గొడవ (మొరిగేది) చేసేది లేదు. నాగరికమైన దుస్తులతో (ఇస్త్రీ బట్టలతో) ఎవరైనా మా ఇంటికొస్తే టామి గుర్రుగా ఉంటదే తప్పితే ఏమి రగడ చేసేదికాదు. దానికి దొంగలు, అబద్దాలోళ్ళు, మంచోళ్ళు... ఇలాంటి వ్యత్యాసం గుర్తులు ఉంటవో లేవో అనే సంశయం నాలో కలుగుతుండేది. అయితే బీదోళ్ళ, శ్రీమంతుల నడుమ ఉండే వ్యత్యాసం (తేడాలు) దానికి బాగానే గుర్తుంది. సూట్, బూట్, ప్యాంట్, హ్యాండ్ స్టిక్ (చేతికర్ర) వేసుకొని కారునుంచి దిగిన వాళ్ళను (ప్లాంటర్స్‌ను) చూసి ఉత్తిగనే గుర్రంటూ అసహనం ప్రదర్శిస్తుండేది. అయితే కొద్దిగా మాసిన లేకపోతే చిరిగిన బట్టల్ని కట్టుకొని, తలను దువ్వుకోకనే చెల్లాచెదురైన అస్తవ్యస్త జుట్టుతో, చెప్పుల్ని ఈడ్చుకొంటూ మొత్తానికి బీదోళ్ళుగా, శ్రీసామాన్యులలాగ కనబడుతుండేవాళ్ళను రైతుల్ని చూసిన తక్షణమే రోషావేశంతో వారు మా వద్దకు వచ్చిందే మహాపరాధం అన్నట్లుగా వంటి మీదున్న వెంట్రుకల్ని నిక్కబొడుచుకొని తన భయంకర దంతాల వరసను ప్రదర్శిస్తూ మా ఇంటికొచ్చినోళ్ళు బెదిరిపోయేంతగా మొరుగుతుండేది. జయప్రకాష్‌నారాయణ, రామ్ మనోహర్ లోహియా అనుయాయిగా ఉండే నాలాంటి సోషలిస్ట్ వ్యక్తికి చెందిన కుక్క ఈ రీతిగా బూర్జువా గుణగణాల్ని వంట్లో నిల్పుకొందంటే, ఇక కమ్యూనిస్ట్ దేశాలలో (సోవియట్ రష్యా, తూర్పు జర్మని మొదలైన కమ్యూనిస్ట్ దేశాలలో) బూర్జువా తత్వం ప్రబలమై ప్రతిక్రాంతి (పెట్టుబడిదారి వ్యవస్థ) సంభవించేదేమి పెద్ద విషయం కాదు! గరీబి హఠావో అనే ఇందిరాగాంధి గారి వేదవాక్యంను టామి ఈ విధంగా తప్పుగా అర్థం చేసుకొని, ఆ ఘోషణ (స్లోగన్)ను అనుష్ఠానంకు తెచ్చింది, నిజంగా విషాదనీయమైన సంగతే కదా పాఠకులారా!

టామి ఆ రోజు అడవిలోపల భయంకరంగా లొల్లి చేసింది ఇలాగండి. నేను దాని రగడనుంచి అడవిలోకి దూసుకెళ్ళి చూసినప్పుడు కనబడిన ఆ మనిషి మొట్టమొదటగా నాకతను నరమానవుడిలాగ కనబడలేదు. అంతకు మునుపే మేము (విద్యార్థి బృందం) షిమోగాలోని అనవేరి చెంత శిలాయుగంలోని శిలాయుధాల్ని, చాళుక్యుల కాలంలోని కాల్చిన ఇటుకల్ని సంశోధించాంలే! ఈ సంశోధనంలో నేను శిలాయుగంలోని మానవుల రూపం, ఆకారం, సంస్కృతి మొదలైన విషయాలమీద విపరీతంగా చదివియున్నాను. అదే విచార లహరిలో ఉన్న నాకిప్పుడు

అడవిలో కనబడుతున్న ఈ నరపుంగవుడు (మనిషి) సాక్షాత్ శిలాయుగంనుంచే నేరుగా ఈ అడవిలోకి వచ్చి అవతరించినట్లుగా కనుగొన్నాను (చూసాను).

అతడ్ని హఠాత్తుగా ఈ ఘోరారణ్యంలో చూసినందున, నాకు ఒక అపాయకరమైన ఏదో జంతువును చూసినట్లే భయం, బెదురు, వణుకు కలిగినది. మొరుగుతున్న టామి మీద ఒక పెద్ద రాయిని చేతిలో పెట్టుకొని బలంగా విసురుదాం అని చేతిని ఎత్తిన అతను, నన్ను చూసి స్థాణువై నిలబడ్డాడు. నేను అతడ్ని, అతను నన్ను చూసి నిల్చినదాన్ని టామి గమనించి ఇక తన భాద్యత ముగిసిందన్నట్లుగా నెమ్మదించింది.

ఏదో ప్రాణి (జంతు) చర్మంలాగ కనబడుతూ చిరిగి జీర్ణమైన చెట్టు బెరడు లాంటిదాన్ని అతను వస్త్రంలాగ తన నడుంక్రింద భాగాన్కి చుట్టికట్టుకొన్నాడు. ఎన్నడూ స్నానంనే చేయనట్లున్న అతని దేహమంతా పాచిలాగ దుమ్ము ధూళు మెత్తుకొని ఉంది. తలమీదున్న జుట్టంతా పెనవేసుకుపోయి ఉంది. కాళ్ళ చేతుల గోళ్ళు చిరత పులికుండే గోళ్ళలాగ బారుగా ఉన్నవి. వీటన్నిటికన్నా కర్రిగా ఉన్న ముఖంలోని కళ్ళు, అడవి మృగంకుండే కళ్ళులాగ మిరమిర మెరుస్తున్నవి. ఉత్తిగనే నావైపు చూస్తూ నిల్చిన అతడ్ని ఎలాగున మాట్లాడించాలి అనే దానిమీద చురుకుగా యోచించసాగాను. అతని స్థితిని చూస్తే భాష రూపుదాల్చిన కాలంకన్నా మొదట్లో ఉన్న మనిషిలాగ కనబడుతున్నాడు. నాకు అతనితో కన్నడంలో మాట్లాడేందుకు ధైర్యం వచ్చింది అతని కాళ్ళలో తొడుక్కొన్న (వేసుకొన్న) టైరు చెప్పుల్ని చూసిన తర్వాతేనండి!

"ఎవరు నువ్వు?" అని అడిగాను.

"మేము" అని బదులివ్వగా

ఏందిరో వీడి వాలకం! ఉందే ఇతనొక్కడు! అయినా మఠాధిపతిలాగ బహువచనం ఉపయోగిస్తున్నాడు కదా అని అన్పించింది నాకు. అయితే అతని నోటినుంచి కన్నడ భాషా పలుకులే జాలువారింది నాకు అతనిమీద మరింత ఆశ్చర్యంను పుట్టించింది.

"మేము అంటున్నావ్.... ఎవరు మీరు?"

"మేము, ఎస్టేట్‌లో పనుల్ని చేసేవాళ్ళం".

"ఎవరి ఎస్టేట్‌లో?"

"భూతనకాడు ఎస్టేట్‌లో"

వాసుగౌడగారి ఎస్టేట్‌లోనా?

"హుం"

"నీ పేరేంటి"

"మాస్తి!"

నేను ఇప్పటివరకూ కొండకోనలలో ఎంతోమంది గిరిజనుల్ని చూసి ఉన్నాను ఎంతో దగ్గరగా. వాళ్ళంతా మాకన్నా కొద్దిగా వేరేగా (మొరటుగా) కనబడుతారు తప్పితే, మాస్తి తరహాలో వానరాకృతికి దగ్గరగానైతే కాదులే (లేరులే)! ఈ మాస్తి ముఖం సైతం శిలాయుగం (రాతియుగం)లోని నరుడిలాగ కనబడుతుంది. అయినా అతను కన్నడభాషను మాట్లాడిన మీదట, అందరిలాగనే ఒక పేరునూ కలిగియున్న మీదట అతడ్ని కటిక బీదోడి విశేష రూపమేనని చెప్పకుండా ఉండేది నానుంచైతే కాదులే! కన్నడ భాషను తెల్వని టామి (స్పానియల్ జాతికుక్క) అతనికున్న ఈ విశేష రూపాన్ని చూసే అతని మీద రేగిపడింది కదా!

"ఇప్పుడు ఇక్కడికి ఎందుకు వచ్చావ్?"

"ఏమి లేదండి. ఉత్తిగనే వచ్చాను" అని జవాబిచ్చాడతను.

ఆ ఎస్టేట్ నుంచి ఇంత దూరంలోని అడవికి ఉత్తిగనే వచ్చానని అతను చెపుతుంది అబద్ధమే అనే దాంట్లో నాకేమి లవలేశమంతైనా అనుమానం లేదు. అయితే నాకెందుకో అతడు ఇక్కడికి వచ్చిందాంట్లో ఎక్కువగా తరచి తరచి అడిగేందుకు మనసొప్పలేదు. టామీని పిల్చి నేను నా ఇంటివైపుకు బయల్దేరాను. అతనూ అతనుండే ఎస్టేట్ క్వార్టర్స్ వరకూ నావెనకే వచ్చాడు. నేను మాస్తిని మొదటగా చూసి పరిచయం చేసుకొంది ఇలాగనండి.

మాస్తికొక అన్న ఉన్నాడు. అతని పేరు బైర. వాళ్ళిద్దరు ఏ జాతోళ్ళు, ఎక్కడ్నుంచి ఇక్కడికి వచ్చారు మొదలైనవేవీ వారికి సరిగా తెల్వవు. ఎక్కడోళ్ళు మీరు అని అడిగితే రోజుకొక దిక్కును చూపెట్టున్నారు. ఒకరోజు ఆస్ట్రేలియా వైపుకు, మరొక రోజు ఆఫ్రికా వైపుకు చూపెట్టేవారు. వాళ్ళను ప్రశ్నించి వాళ్ళెక్కడోళ్ళని తెల్సుకొనేందుకు నేను చేస్తున్న ప్రయత్నాల్నుంచి విసుగేసిపోయిన ఆ ఇద్దరూ, నేను అడిగినదానికంతకూ ఔనౌనని తలలను ఊపుతున్నందున, ఇక వారి మూలాన్ని కనుగొనే నా శోధనను విరమించుకొన్నాను.

వాళ్ళతో మాట్లాడుతుంటే, కచ్చితంగా శిలాయుగంలోని జనంలాగ ఉన్న వీళ్ళు, ఈ ఆధునిక యుగంలో ఎలాగున కాలం గడుపుతున్నారో (వెళ్ళబుచ్చుతున్నారో) అని ఆలోచిస్తుండేవాడ్ని. వాళ్ళ సంతానం కథేంటి, వాళ్ళు ఎవర్ని పెళ్ళాడారు, వాళ్ళకు ఇరుగుపొరుగున స్నేహితులు, బంధుబలగం ఉన్నారా.... మొదలైన వాట్నే ఆలోచిస్తుండేవాడ్ని. క్షౌరంను చేయించుకొనేందుకు వెళ్ళని ఆ ఇద్దరూ పెరిగిన బారు జుట్టును మరొకరి చేతినుంచి కొడవలి ద్వారా పరస్పరం కత్తిరించుకొంటుండేవారు. ఉదయానే లేచి, తోట పనులకు హాజరై సాయంకాలాన కూలి డబ్బును పొంది దినసరి సరుకుల్ని కొనుక్కొని వంటను చేసుకొనే ఆధునిక అభ్యాసాలేవి వాళ్ళలో ఉన్నట్లు నాకు కనబడలేదు. ఇష్టపడినప్పుడు (మనస్సు ఒప్పినప్పుడు), చేసేందుకు వేరే ఇతర పనులు ఏవీ లేనప్పుడు మాత్రం వాళ్ళు తోట పనులకు హాజరౌతుండేవారు. ఎస్టేట్‌లో చేరియున్నందున పొట్టకూటికి చింతేమి వాళ్ళలో లేదు. ఎంతెంతో చెట్ల చిగురులు (చింతచిగురులాంటివి), అరటిపిలకల లోపలి భాగం, గెణుసుగడ్డ (చిలగడదుంప), అడవి మందారపూలు, మొగ్గలు, నీళ్ళ పాము, పక్షుల గుడ్లు, ఎలుకలు, పందికొక్కులు, చీమలగుడ్లు, ఉసుళ్ళు, పనసపండ్లు, చేపలు, పీతలు, అల్లోనేరేడు పండ్లు... ఇలాగున కళ్ళకు ఏవి కనబడితే వాటన్నిట్నీ తింటుండేవారు.

నేనొకసారి తోటలో వాకింగ్ (వాయు విహారం) చేస్తున్నప్పుడు, మాస్తి కొడుకు నేలలో ఉన్న బిలంలో చేయి మొత్తం భుజంలో ఉన్న చంకవరకూ దూర్చి ఏదాన్నో బయటకు లాగి గభాల్నే నోట్లో వేసుకొని కరకరా నమిలి మింగాడు. దూరంనుంచి దీన్ని చూసిన నేను అతని వద్దకు (ఆ పోరడి దగ్గరకు) వెళ్ళి “ఏమి తిన్నావ్?” అని

అడిగాను. "ఈచు దొరా" అని అన్నాడు. "ఈచు" అంటే ఏమిటో నాకు తెల్వక ఒకసారి మాస్తినే "ఈచు" అంటే ఏమిటి అని అడిగాను. "ఈచు అంటే తెల్వదా దొరా... ఒకసారి ముమ్మందు మీకు చూపిస్తానులే... ఓపిక పట్టండి" అని అన్నాడు. అయితే తోటలోని అసంఖ్యాకమైన పనులలో మునిగిన నేను, మరలా మాస్తి దగ్గర 'ఈచు' అంటే ఏమిటనేది తెల్సుకొందాములే అన్నదాన్ని మరిచేపోయాను. మేము (నాగరికులం) విషప్రాణులుగా భావించుకొంటుండే పాముల్ని వాళ్ళు వాటి తలలను మాత్రమే కత్తిరించి మిగిలినదాన్నంతా ఆబఆబగా తింటుండేవారు. అడవిలోని వన్యమృగాలకు, వాళ్ళకు తేడా ఏమీలేదు. కుందేళ్ళు మాయమై పారిపోతే, ఇదేదార్లో ఇటువైపుకే అవి వెళ్ళినవని గుర్తించుకొని వాట్ని పట్టి తింటుండేవారు. ఎన్నో రోజులు నా షికారి (వేట)లో జతై, అడవిని తిరిగిన ఆ ఇద్దరి నుంచి నేను తెల్సుకొన్న, నేర్చుకొన్న సంగతులు ఒకట్రెండు కాదులే!

వాళ్ళ వేటకు, నాలాగా తుపాకి అవసరమే లేదు. ఎందుకంటే అడవిలో ప్రాణులు తిరుగుతుండే దారిలో ఉచ్చుల్ని వేసేది, దిక్కుతోచక నిల్చిన ప్రాణుల చుట్టూ చకచకా రాళ్ళను పేర్చి పట్టుకొనేది... వీటన్నిట్లోనూ వాళ్ళు పారంగతులుగా ఉండేవారు.

వాళ్ళకు (ఆ ఇద్దరన్నదమ్ములకు) అత్యంత ఇష్టమైన ప్రాణి అంటే కోతులే కదా! వీట్ని కొట్టేందుకు మాత్రం వాళ్ళకు నా తుపాకి నుంచి సహాయం కావాల్సి ఉంది. చెట్లమీద ఎగిరి పారిపోతుండే వీట్ని పట్టుకొనేందుకు వారివద్ద ఏ ఉపాయమూ లేదు. చివరచివరికి వీళ్ళ కోతుల వేట ఎంతగా ఉండేదంటే అడవిలో ఎక్కడైనా ఎత్తుగా ఉన్న చెట్టుమీద ఒక కోతి 'టుర్' అందంటే చాలు, నాతో వచ్చిన ఉద్దేశంను మర్చి, వాటి వెనకే పడుతుండేవారు. దాన్ని కొట్టి పడేసిన తర్వాతే మళ్ళీ నా చెంతకు వచ్చేవారు. వీళ్ళకు జతగా చేరి, టామి కోతుల్ని వేటాడేది అభ్యాసంగా చేసుకొని నాకు నెత్తి నొప్పి కల్గించసాగింది. చివరికి వీళ్ళ కోతుల వేటకు రోసిపోయిన శ్రీరామ్ వీళ్ళను షికారికి పిలవకూడదని నన్ను ప్రతిభటించసాగాడు.

★ ★ ★

బైరడి దగ్గర ఒక నాటు కుక్క ఉండేది. దాన్ని 'రామా' అని పిలుస్తుండేవాడు. దానిమీద అప్పుడప్పుడు దెయ్యం పూనుతుండేదని బైరడు భావిస్తుండేవాడు. అందుకు

అతను ఆ దెయ్యం పూనినదానికి విరుగుడుగా, అ కుక్క చెవులను వాటి మొదలులోనే కోసి నాటు చికిత్సను చేయించాడు. అదొక అత్యుత్తమ వేటకుక్కని, దాని వేట నైపుణ్యంను చూసిన ఎంతోమంది బోలెడంత డబ్బిస్తాం మాకే ఇవ్వు అని అడిగారని, తను ఆ డబ్బు మాయకు లోబడకుండా కుక్కను ఇవ్వలేదని చెప్పుకొంటుండేవాడు. ఎంతగానో బొమికలు బయటపడి కృశించిన ఆ కుక్క టౌన్‌లలో యజమానులే లేకుండా తిరుగుతుండే సాధారణ వీధికుక్కలాగానే నాకళ్ళకు కనబడేది.

ఒకసారి "కుక్క ఊళ పెట్టుంది (ఏడుస్తుంది), అపశకునం వచ్చేదుంది... ముందు ఆ కుక్కను పారద్రోలండి" అంటూ ఎస్టేట్ క్వార్టర్స్‌లో ఉండే తోట జనమంతా గగ్గోలు పెట్టారు. బైరడు దాన్ని అనవసరంగా చింతచెట్టుకు కట్టిపడేసినందుకే అది ఊళపెట్టుంది. బైరడ్ని ఎందుకు దాన్ని ఆ చెట్టుకు కట్టిపడేసావ్ అని అడిగితే ఆ కుక్క ఇప్పుడు ఎవరి ఆసరా లేకుండానే వేటకు స్వతంత్రంగా వెళ్ళేదాన్ని చేయసాగిందని, ఎస్టేట్‌కు చుట్టుప్రక్కల ఉండే కోళ్ళు, కుందేళ్ళను పట్టుకొనే ప్రయత్నంలో, ఆ ప్రాణుల్ని ఇది శాశ్వతంగా దూరానున్న అడవిలోపలికి వాట్ని పారద్రోలుతున్నందున, దాని చేష్టలకు విసుగేసి దాన్ని కట్టిపడేసానని అతను తన చర్యను సమర్థించుకోసాగాడు. బైరడు దాన్ని తన కుక్క అని చెప్పుకొన్నా, దానికి మాత్రం ఒక ముష్టి రాగిముద్దను వేసి తినబెట్టింది ఎవరూ చూడలేదు ఇంతవరకూ! అంతేకాదు, ఒకసారి చెట్టు నుంచి జారిపడి చచ్చిన కోతి తోకను అది (కుక్క) పీక్కు తిన్నందుకు దాని నోట్లోంచి రక్తం పడేటట్లుగా బైరడు దాన్ని కొట్టాడు. ఇతనూ ముష్టి ముద్దను వేయకనే, దానికీ తన తిండిని తను సంపాదించుకొనేందుకు దాని మానానికి దాన్ని వదలకనే బిగువుగా కట్టిపడేసినందుకే అది ఆకలితో నకనకలాడి, ఆ అడవిలోని నిశ్చలమౌనంను చీల్చినట్లుగా ఊళలు పెట్టుండేది.

అదొక క్షుద్రజీవిలాగ బైరడి చేతిలో చిక్కి విలవిలలాడుతున్నా, ఒకసారి అది బైరడి పొగడ్తలకు తగినట్లుగా తన షికారిలోని నైపుణ్యంను చూపెట్టింది. అడవిలో అది ఒకసారి ముళ్ళపంది వెంటపడింది. ఆ రోజు నేను తుపాకి తీసుకొని వెళ్ళలేదు. జతగా టామి కూడాలేదు. బైరడికుక్కైన రామకు జతగా నాకుక్కైన టామీని ఎన్నడూ షికారికి తీసుకొని వెళ్ళేదిలేదు. ఎందుకంటే అడవిలో మా వేటకు బదులుగా ఈ రెండిటి జగడంను ఆపేదే మాకొక పెద్ద పనిగా ఉండేది.

ముళ్ళపంది నా ఎదురే నిగనిగలాడే నల్లటి బంతిలాగ ఎగిరిదూకి తన వంటికున్న ముళ్ళను 'జల్ జల్' అన్నట్లుగా సప్పుళ్ళను చేస్తూ పరిగెత్తింది. నేను ఈ దట్టడవిలో అదే మొదటిసారి, చివరిసారిగా ముళ్ళపందిని చూసిందుంది. మిలమిల తళతళ మెరుస్తున్న లోహపు కత్తులులాగ కనబడుతున్న, విచ్చుకొన్న ముళ్ళను ఝుళుపిస్తూ నా ఎదురులోనే కొన్ని అడుగుల దూరంలో ముళ్ళపంది గోర్ గోర్ అంటూ పారిపోయింది. దాని వెనకే బైరడి కుక్కైన 'రామ' మొరుగుతూ పరిగెత్తింది. నాకు, మాస్తికి ముందేమి చేయాలనేది తోచక "ఛూ... ఛూ..." అంటూ ఆ కుక్కను ఉసిగొల్పుతూ ముళ్ళపంది వెనకే రాళ్ళను, పొదల్ని లక్ష్యపెట్టకనే పరిగెత్తాము.

వళ్ళంతా ముళ్ళతో ఉండే ఈ భీభత్సప్రాణిని ఏ ఆయుధ తోడ్పాటు లేకుండా పట్టుకొనేది అటుండనీయండి, దాని దగ్గరకు వెళ్ళేది సైతం ఎంతో అపాయంగా (ప్రాణాంతకంగా) ఉంటదని నాకైతే తెల్సులే! నేను పరిగెడ్తూ "దాన్ని ఎలాగున పట్టుకోవాలి" అని మాస్తిని అడిగాను. నా ప్రశ్నకు జవాబుగా బైరడు నా వెనుకనుంచే "అదెంత దూరం పోతది దొరా? ఇంకొక నాల్గు చుట్లు పరిగెత్తితే, దానికి అలుపు వచ్చేది ఖాయం! కత్తితో దాని కాళ్ళను నరుకుతాను" అనే భరోసా మాటల్ని నాకు విన్పించాడు. నేనైతే దాని సమీపంకే పోరాదని నిశ్చయించాను. ఉత్తిగనే ముందు జరగబోయే ఈ వేట నాటకాన్ని చూసేందుకే నేను కుతూహలంగా వాళ్ళతో కల్సి పరిగెత్తుతున్నాను. మా కళ్ళముందే పరిగెత్తుతున్న ఆ ముళ్ళపంది, వేటకుక్క... ఆ రెండు అప్పటికప్పుడే చూస్తుండగానే మాయమైనవి. అలాగున ఆ రెండూ అదృశ్యమైంది చూసిన మేము ముగ్గురం ఆశ్చర్య చకితులమై నిల్చాం స్తబ్ధుగా.

రెండు నిమిషాలు గడవలేదు. ఎక్కడ్నుంచో బైరడి కుక్క మొరుగుతున్న సప్పుడు వినబడింది. అయితే, మా కళ్ళెదురులో కుక్కలేదు. అయినా బైరడి కుక్కలోని అశరీరవాణి మొరుగు వినబడుతూనే ఉంది. కొన్ని నిమిషాలవరకూ జరిగిందేమిటనేది మాకు తెల్వనేలేదు.

ముళ్ళపంది పరిగెడ్తూ పరిగెడ్తూ అక్కడొక బండ చెంత అది తోడిన సొరంగం (బిలం)లోకి దడాల్నే దూకింది. దాన్తో పాటే బైరడి కుక్కా ఆ సొరంగంలోకి దూకింది. ఇప్పుడు బైరడి కుక్కైన 'రామ' మాకాళ్ళకిందే ఎక్కడో భూగర్భం లోపల్నుంచి

మొరుగుతుంది. మేమేమి చేసేది లేదిప్పుడు. ఆ పంది వెంటపడి దానికి అలుపు తెప్పించి, ఆ తర్వాత దాన్ని పట్టుకొందామనే ఉపాయంలో ఉన్న మాస్తికి బైరడికి ఆ ముళ్ళపంది సరిగానే పాఠం నేర్పింది. కుక్క మొరుగుతున్న సప్పుడ్నుంచి, దాని ఉనికిని అందాజుగా తెల్సుకొన్న మాస్తి అటు ఇటు తిరిగి ఒక చోటును (స్థలంను) చూపిస్తూ, "ఇక్కడ రెండు గజాల లోతు తవ్వితే ముళ్ళపంది దొరుకుతది. కుక్క ఇక్కడ్నుంచే మొరుగుతుంది" అన్నాడతను జియాలిజిస్ట్‌లాగ. వాళ్ళిద్దరిలోనూ ముళ్ళపంది వెంటపడి పిచ్చిగా ఆ భూగర్భంలోకి చొచ్చుకుపోయిన ఆ కుక్క చింత పిసరంతా లేదు కదా!.

మేము ముళ్ళపందిని ఎలాగున వశం చేసుకోవాలనేది మాట్లాడుకొంటుంటే, భూగర్భం నుంచి ముళ్ళ పంది గొరగొర సప్పుళ్ళను చేస్తూ కుక్కమీద దాడి చేసింది, ఆ కుక్కేమో కుయ్యాయ్యో అంటూ రోదిస్తుంది విన్పించింది మాకు. "ఓహో... ఆ రెండిటికి జటాపటం (సిగపట్లు) మొదలైంది" అన్నాడు బైరడు. మాస్తి మరింతగా జాగరూకుడై, "బైరణ్ణా... పరిగెత్తి ఆ సొరంగంను చూడు" అంటూ అరిచాడు. బైరడు పరిగెత్తి కత్తిని పట్టుకొని సొరంగం మూతి నుంచి ఇక ఇప్పుడో మరుక్షణమో బయటకు వచ్చే ముళ్ళ పందిని చంపేందుకు సిద్ధమై (రెడీగా) నిల్చాడు.

ముళ్ళపంది తెలివిగా ముఖ్య సొరంగంలోపల కవలదారులుగా ఎన్నో సొరంగాల్ని తవ్వుకొంటదట. బైరడికుక్క వెనుదిరిగి బయటకు వచ్చేటప్పుడు గలిబిలిగా భయంతో అటువంటి అడ్డ సొరంగాలలో చొరబడితే ఇక శాశ్వతంగా అది భూగర్బంలోనే సమాధైయ్యే సాధ్యత ఉంటదని బైరడు చెపుతున్నాడు.

అంతలో ఆ ముఖ్య సొరంగంలోని పాతాళం అంచుల లోపల ఎక్కడ్నుంచో గడబిడ సప్పుడు విన్పించింది. బైరడు కత్తిని పట్టుకొని రెడీగా ఉన్నాడు. బైరడు ఇంకేంటి కత్తిని ఊపి సంహరించొచ్చు. అంతలో ముళ్ళపందికి బదులుగా బైరడి కుక్కే బంతి ఎగిరి మీద పడిందన్నట్లుగా ఆ సొరంగంనుంచి బయటకు దూకింది.

ముళ్ళపందికి బదులుగా కుక్క బయటకు వచ్చిందాన్ని చూసి హతాశుడైన బైరడు "తుత్" అంటూ కుక్కమీద క్యాకరించి ఉమ్మాడు. కుక్కవీపుకు ముళ్ళపందికుండే ముళ్ళు రెండు లోతుగా గుచ్చుకొన్నవి. నేను, మాస్తి కుక్కను పట్టుకొని దానికి గుచ్చుకొన్న ముళ్ళను బలంగా బయటకు గుంజాము (లాగాము). ఆ రెండూ

ముళ్ళూ ఇప్పటికీ నావద్దనే (మా ఇంట్లోనే) ఉన్నవి. కుక్క శరీరంలో ఆ ముళ్ళు గుచ్చుకొన్న విధంను చూసిన నాకు, ఆ ముళ్ళపంది జోలికే వెళ్ళకూడదని నేను చేసుకొన్న తీర్మానం సరైనదే అని ఇప్పుడు నాకు అన్పిస్తుంది.

ముళ్ళను పీకిన మీదట బైరడు, మాస్తి మళ్ళా ఆ కుక్కను సొరంగం లోపలికి జొరబడేందుకు ఎంతగానో దాన్ని ఉసిగొల్పుతున్నారు. ఒకసారి జీవసమేతంగా ఆ కారుచీకట్ల సొరంగంనుంచి బయటపడిన బైరడి కుక్క మాత్రం, వాళ్ళిద్దరూ ఎంతగా ప్రేరేపిస్తున్నా మళ్ళా బిలం (సొరంగం)లోకి దూరే అవివేకంకు వెళ్ళలేదు. బైరడు తన కుక్క భయపడిందానికి రేగిపోయి రెండు గుద్దుల్ని గుద్ది ముళ్ళపంది దూరిన బిలంలోకి దాని తలను ఇరికించి నెట్టాడు. సొరంగం బయటా గుద్దులు, సొరంగం లోపలా ముళ్ళపందినుంచి వేట్లను అనుభవించిన ఆ కుక్కకు ఒక్కసారిగా రోషం వచ్చి కోపంగా గుర్ అంటూ రేగి బైరడిమీద ఎగిరిపడి, ఆ తర్వాత నేరుగా బైరడుండే కొంప దారిని పట్టుకొని యమస్పీడ్‌గా పారిపోయింది.

బైరడు కుక్కను ఇష్టం వచ్చినట్లుగా తిట్టాడు. మాస్తి అయితే “ఇటువంటి అవిశ్వాస కుక్క ఉంటే ఎంత? చస్తే ఎంత? సొరంగం బయటకు అది వచ్చినప్పుడు నువ్వు దాన్ని నరికి ఉండాల్సింది” అని బైరడికి సలహా ఇచ్చాడు.

బైరడు, మాస్తి ఆ కుక్కను సాక్కొనే పద్ధతిని చూస్తే వారెంతగా క్రూరులు, నిర్దయులు అనేది చెప్పొచ్చు. వారి జతగా అదీ అడవిలో తిరిగి ఆ వేటలో సహాయపడినా, దానిమీద కొంచమైనా కనికరం, కరుణ, కృతజ్ఞత చూపెట్టేది లేదని నాకు బాధ కలుగుతుండేది. అయితే ఇప్పుడు నాకు అన్పిస్తుంది ఏమిటంటే వాళ్ళు తమ కుక్కను మాలాగ (నాగరికుల కుక్కల పెంపకంలాగ) మానవీయ వ్యక్తిత్వాన్ని పులమలేదు దానిమీద. కుక్కను కుక్కలాగ, మనుషులను (నాలాంటోళ్ళను) మనుషులులాగ చూస్తుండేవాళ్ళు అంతే! కుక్కకు మనం (నాగరికులం) చేస్తున్నట్లుగా మానవీయ వ్యక్తిత్వాన్ని దానిమీద రుద్ది, మనలాగనే అదికూడా అని చూస్తే, ఆ పద్ధతి నుంచి దానికి సంతోషం గాని ప్రయోజనం గాని ఉంటదా అనేది నాలో అనుమానంగా (ఈ ఇద్దరినుంచి ఆ కుక్క పెంచబడింది చూసిన తర్వాతే) ఉందిలే.

ఆ కుక్కకూడా ఎన్నోసార్లు ఆ షికారి (వేట)లో బలిచేసిన చిన్న చిన్న ప్రాణుల్ని మోసుకొని అడవిలోపలికి జారుకొంటుండేది. దాన్నుంచి, అది నోట కరుచుకొన్న

ఆ ప్రాణుల్ని లాక్కొనేందుకు మాస్తి, బైరడు... దాని వెంటబడితే అది పరిగెత్తుతూనే ఆ ప్రాణుల్ని మింగుతుండేది. అయితే ఇంతైనా, ఆ ఇద్దరికీ వాళ్ళకుక్కకూ నడుమనున్న సంబంధం ఇది ఏ తరహాలోదో నాకైతే తెల్వదు. ఎప్పుడూ, ఆ కుక్క వాళ్ళ బిడారం ఎదురు ముడుచుకొని నిద్రపోతూ, ఎవరైనా కొత్తోళ్ళు వస్తే మాత్రం మొరుగుతూ లొల్లి చేస్తుండేది. వాళ్ళు అడవిలో తిరిగేందుకు బయల్దేరితే, ఇదీ వాళ్ళతో కూడి సంతోషంగా తోకను ఊపుతూ వెళ్తుండేది.

బైరడికి నాగరిక ప్రపంచంలోని పరిచయం మాస్తికన్నా కొద్దిగా ఎక్కువగా ఉన్నట్లుంది. అతను పటాసుల మందును, ఢఘాల్నే ఢమార్ శబ్దాల్ని చేసే గంధకం మందును తెచ్చేది, దీపావళి నాటుబాంబులులాగ ఆ పౌడర్‌నుంచి నాటు బాంబుల ఉండల్ని తయారు చేసేది అతనికి తెల్సు. నుణుపైన చిన్న చిన్న రాళ్ళ తుణుకుల్ని ఆ మందు ఉండలలో నింపి, వాట్ని నేలకేసి కొట్తే చాలు అవి ఢమార్ అని ప్రేలుతుండేవి. అతను పేగులలోనో, లేకపోతే కంపుకొట్టున్న ఏదో జంతు చర్మంలోనో వాటితో ఆ ఉండల్ని చుట్టి పొదలలో పెట్తే అడవి పందులు వాట్ని తమ దవడలలో ఇరికించుకొని నమిలినప్పుడు ఆ ఉండలు ప్రేలి ఆ పందులు చచ్చిపడేవి.

“బైరడు ఎక్కడో పొదల మాటున మందు ఉండను పెట్టాడట. ఈ రోజు అడవిపంది ఆ ఉండకు బలౌతది” అని ఇతర ఎస్టేట్లలో ఉండే పనోళ్ళు మాట్లాడుకొంటుంది విన్నాను నేను. అయితే నేనెన్నడూ బైరడి బాంబ్ ఉండల్నిగాని, వాట్ని కొరికి చచ్చిన పందినిగాని చూడలేదు ఇంతవరకూ. బైరడు, మాస్తి గురించి ఇటువంటి నూరారు వేట కబుర్లు ఉన్నందున, ఆ వేట కబుర్లలో ఏదాన్ని నేను ప్రామాణికంగా విని తెల్సుకొనేదేముంది?

అయితే ఒకసారి నేను మైసూరుకు వెళ్ళినప్పుడు, ఆ రాత్రి భూతనకాడు ఎస్టేట్‌లో డమార్ అంటూ సప్పుడైందట. “పంది దొరికింది” అంటూ బైరడు, మాస్తి టార్చ్‌లైట్‌కని మా ఇంటికి వచ్చారట. ఇక ఆ విషయమంతా (పంది దొరికింది) అందరికీ తెల్సిపోయిందట. జనమంతా గుంపుగా తోటకు వెళ్ళి టార్చ్‌లైట్ వేసి చూడగా బైరడు బాంబ్‌ను ఉంచిన జాగాలో పెద్ద పంది ఒకటి కూర్చుని ఉంది. ఇంకా కంటిరెప్పల్ని ఆడిస్తున్న దాన్ని చూసిన ఎవరిలోనూ, దానిదగ్గరకు వెళ్ళేందుకు

ధైర్యమే లేదు. "రేపు పొద్దు పొడిచేటప్పటికి అది పైసల్ (చనిపోతది) అవుతది... ఇక ఇళ్ళకు తిరిగి వెళ్దాం" అని బైరడు అంటున్నాడు. అతని భరోసా మాటల్నుంచి సంతృప్తులైన ఆ కూలి జనమంతా వెనుదిరిగారు. వెనుదిరిగినోళ్ళు వాళ్ళ ఇళ్ళను చేరనేలేదు (తలుపలేదు). అంతలో ధమార్ అనే ఇంకొక సప్పుడు! ఈసారి వేరేదిక్కునుంచి వచ్చింది ఆ సప్పుడు.

మళ్ళా అటువైపుకు అందరూ వెళ్ళారు. అక్కడా ఇంకొక పంది తనకేమి కాలేదన్నట్లుగా పిలిపిలిగా కంటి రెప్పల్ని కొట్టూ కూర్చుని ఉంది. సరిసరి ఇది కూడా రేపటి ఉదయం పొద్దుకు చస్తదని అనుకొంటూ అందరూ వెనుదిరిగారు. రెండు పెద్ద పందులు! ఆ రాత్రి తోటలో ఎవరికీ సరిగా నిద్రపోయేందుకు అనువుకాలేదు. కొంతమందైతే పంది కూరకని అల్లం, ఎల్లిపాయలు, దనియాలు, గసాలు, మిరియాలు, శొంఠి, దాల్చిన.... వీటితో మసాలాను నూరి సిద్ధం చేసుకొన్నారు.

అయితే ఉదయం వెళ్ళి చూస్తే పంది చచ్చిపడే బదులు, దవడకైన గాయంను ఎలాగో నిభాయించుకొని దేగుతూ, అడుగులో అడుగేసుకొంటూ అడవిలోకి పారిపోయినవట. ఎంతో దూరం వరకూ మాస్తి, బైరడు వాటి అడుగు జాడల్ని చూసుకొంటూ ఆ సాయంకాలంవరకూ వెతికారట. అయితే ఆ రెండు పందులూ చిక్కనే (దొరకనే) లేదు వాళ్ళకు.

నేను మైసూరు నుంచి తిరిగొచ్చిన వేళకు ఇదొక రోమాంచక కథగా రూపుదాల్చింది. "ఎంతో తేలికగా దొరికిన ఆ రెండు పందులూ ఫలితం లేకుండా తప్పిపోయినవి కదా" అంటూ దార్లో ఎదురైనోళ్ళందరూ పొట్టలమీద గోక్కుంటూ విషాదంగా నాకు ఆ కథను చెపుతున్నారు.

"ఎంత పెద్దమాలు (సరుకు) తప్పిపోయింది మానుంచి! మీరు ఉండుంటే, ఆ రెండిటికీ ఒకొక తుపాకి గుండును పేల్చి పడగొట్టేవారు" అంటూ బైరడు నా ముందు చేతుల్ని పిసుక్కొంటూ చెప్పాడు.

అంతేగాకుండా ఆ రెండు పందులు వేరే ఎవరి తోటలోనో చచ్చిపడినవని ఆ మరుసటి రోజు పుండుమీద కారం పూసినట్లుగా ఒక వార్తను మోసుకొచ్చారు.

ఇదంతా అయిన ఒక వారం తర్వాత బైరడు మందు ఉండల్ని పెట్టేందుకు బయల్దేరుతూ ఆ సాయంత్రం వేళలో నాకు ఎదురైయ్యాడు. అతని వద్ద ప్రస్తుతం ఇక ఉంది ఒకే ఉండట. పంది కచ్చితంగా తిరిగే స్థలం చూసి అక్కడ ఉండను పెట్టి వచ్చేందుకు బయల్దేరిన అతని జతగా నేనూ బయల్దేరాను. తుపాకితో ఉన్న నన్ను చూసి వేటకే వెళ్తున్నామని భావించిన బైరడి కుక్క గుండ్రంగా తోకను తిప్పుతూ పొయ్యిలోని బూడిదగుంత నుంచి పైకి లేచివచ్చింది. బైరడు తెగతిట్టూ దాన్ని వెనక్కే పారద్రోలాడు.

బైరడి జతగా కంపెని ఇచ్చేది అసాధ్యమైంది నాకు. ఆ బాంబ్ ఉండకు చుట్టిన కుళ్ళిన ఆ పేగుల దుర్వాసన నా కడుపును దేవినట్లుగా ఉంది. భూతనకాడు గుట్టను ఎక్కి దాని నెత్తి (శిఖరం) మీదున్న సమతలమైదానంకు చేరే వేళకు బైరడి ఉండలోని దుర్వాసన నాకు సహించుకోలేనంతగా ఉంది. నా పంచేంద్రియాలమీద ఆ బాంబ్‌కు చుట్టిన ఆ చర్మం వాసన ఉగ్రదాడిని చేయసాగింది.

నన్ను బండ చెంతే నిల్వమని బైరడు చెప్పాడు. “ఎందుకురో? అకస్మాత్‌గా పంది దొరికితే నేనేమి దాన్ని దొంగిలించుకొని వెళ్తానా?” అని అడిగాను. “అలాకాదులే, అది ముష్ఠ” అని అన్నాడు. అతని డిక్షనరీలో ‘ముష్ఠ’ అంటే ఏమి అర్థమో ఎవరికి తెల్సు? అతడ్నుంచి వెలువడుతున్న దుర్వాసనలోని పరివేషం నుంచి బయటపడ్తే చాలని ఆ పదంకున్న అర్థాన్ని అడగకనే సంతోషంగా ఆ బండవద్దే ఉండేందుకు ఒప్పుకొన్నాను. అతనిప్పుడు నానుంచి ముందుకే వెళ్ళిపోయాడు.

అతను ముందుకే ఎంతో దూరంకు వెళ్ళి ఉండొచ్చు. ఎంతసేపు ఎదురు చూసినా అతని జాడేలేదు. సాయంత్రం అవుతుంది. మునుగుతున్న సూర్యుడికి అడ్డం పడుతున్న కొండకోనలలోని అడవినీడలు (ఛాయలు) ముంచుకొస్తున్న కటిక చీకటికి మున్నుడి అన్నట్లుగా ఆ లోయలోని అడవిలో ఆ ఛాయలు ముసురుకోసాగినవి. కాజాణపక్షులు సమీపంలోనే విస్తారంగా పెరిగిన వృక్షాలమీద కూర్చుని ఛందోబద్ధంగా ఈలలతో మధుర రాగాలాపల్ని చేస్తున్నవి. కుటురపక్షులు సర్వాంతర్యాములన్నట్లుగా అన్ని వృక్షాలమీద కూర్చుని టుర్రో కుర్రో అంటూ లయబద్ధంగా కూస్తున్నవి. దూరానున్న లోయలో దుముకుతున్న జలపాతంలోని

సప్పుడు, హితమైనగాలి నావైపుకు వీసినప్పుడు విన్పించసాగింది. అడవికోళ్ళు, కుందేళ్ళు పొదలమాటుకు, చెట్లలో కట్టుకొన్న గూళ్ళకు ఈ రోజు మా దినచరి (డ్యూటి) ముగిసిందిలే అన్నట్లుగా సంతోషంగా చేరుకొంటున్నవి. ఇప్పటివరకూ బైరడి ఉండ దశనుంచి ఊపిరి కట్టిపడేసిన ఆ దరిద్ర వాసనలో మునిగిన నా పంచేంద్రియాలు ఇప్పుడు నా స్వాధీనంలోకి వచ్చినవి.

బైరడు ఇకనూ రాలేదు. అడవిలోని దోమలు నేనున్నదాన్ని గమనించి సుయ్ అంటూ ఒకటొకటి వచ్చి, నా కాళ్ళు చేతుల్ని కుట్టసాగినవి. కొన్నైతే చొక్కా (షర్ట్) పైనుంచే నా చర్మంకు ఇంజెక్షన్లను ఇవ్వసాగినవి. ఇకనూ రాని బైరడిమీద నాలో కోపం రెట్టింపు గాసాగింది.

బైరడ్ని గట్టిగా కేకపెట్టి పిల్వాలని నేను భావించుకోసాగాను. అంతలోపల గిరి శిఖరాలు, అడవి కంపించినట్లుగా ధమార్ అనే విస్ఫోటనంలోని సౌండ్ మ్రోగి దూరానున్న లోయనుంచి ప్రతిధ్వని మొదలైంది.

నేను నిల్చిన చోటే ఎగిరిపడ్డాను!

ఇక ముందేమి చేయాలనేది నాకు తోచలేదు. ఆ క్షణంలో నూరారు భయంకర కల్పనలు నా తలలోకి చొచ్చుకెళ్ళినవి.

బైరడు పెట్టిన బాంబ్ ఉండను ఇంత తొందరగానే అడవి పంది వచ్చి నమిలేది సాధ్యమేలేదు. అలాగైతే ఒకవేళ ఆ ఉండను దాపు మాటున పెట్టేటప్పుడు అది బైరడి చేతిలోనే ప్రేలిపోయిందా? పెట్టేటప్పుడు ఇతను దాన్ని ఎత్తి పడేసాడేమో? లేకపోతే ఉండను పెట్టిన జాగాను మర్చి వెనుదిరిగి వచ్చేటప్పుడు దాన్ని కాళ్ళతో తొక్కి ఉండొచ్చా! మొత్తానికి భయంకర ప్రమాదం (అనాహుతం) ఒకటి కచ్చితంగా సంభవించింది కదా! వీడికొంప పాడుగాను! నేనెందుకు ఈ అవివేకి జతగా వచ్చానిక్కడికి! ఇప్పుడు ముందేమి చేయాలబ్బా!

అతనికి ప్రాణాంతికమైన గాయాలై కాలో చెయ్యో ఎగిరిపోతే ఏ డాక్టర్ వద్దకు తీసుకెళ్ళేదుంటది? షికారి (వేట)లో సంభవించిన ఆకస్మిక ప్రమాదం అని చెప్పిన తక్షణమే ఏ డాక్టర్ శ్రద్ధతో వైద్యం చేసేందుకు ముందుకొస్తాడు? గవర్నమెంట్

దవాఖానాకు మోసుకెళ్తే మొదలు పోలీస్ కేస్‌ను రిజిస్టర్ చేయించాలి! ఆ తర్వాత సాక్ష్యం చెప్పేందుకు నేను కోర్ట్ చుట్టూ తిరిగేదుంటది!

అస్తమిస్తున్న సూర్యుడి కిరణాలలో ఇదంతట్నీ గాఢంగా యోచించి, విషణ్ణ వదనుడ్నై నేను కూలబడ్డాను. నాశక్తంతా ఇంకిపోయినట్లే అన్పించి బండకున్న మరొకప్రక్కకు మళ్ళేందుకు భయమేసింది. నా వేటలోని తీటనుంచి అడవిలో తిరిగే నా చపలం మీద నన్ను నేనే శపించుకోసాగాను. గాయపడిన బైరడి ఆర్తనాదం ఇక వినబడొచ్చేవోనని నిశబ్దంగా చెవులను రిక్కించాను. అయితే ఆ పాడుముండాకొడుకు నుంచి ఒక పలుకూ (మాటా) వినబడలేదు.

అలాగైతే ఇతను (బైరడు) ఒకే దెబ్బకు (ప్రేలుడుకు) పెదాల్ని కదల్చకనే పరంధామంకు వెళ్ళియుంటాడని తీర్మానించి ముందేమైందో తెల్సుకొనేందుకని పైకి లేచాను. ఇక నా పాడుకు వేరేవిధి ఏమి లేదు. బైరడు వెళ్ళిన దారిలో అతడ్ని పిలుస్తూ ముందుకు నడిచాను. అతను ఏ దిక్కుకు వెళ్ళింది నాకు సరిగా అందాజే లేదు కదా!

కొంచం దూరంలో ఏ మూలనుంచో బైరడు హ్హాగొట్టిన సప్పుడు విన్పించింది. వాడి ధ్వనినుంచి, వాడేమి గాయపడి విలవిలలాడే ఛాయ ఏదీ లేదు. అతనికేమి అవ్వలేదనిపించి, నాకు తలమీదున్న కొండ క్రిందకు దిగినట్లుగా సమాధానమైంది.

అలాగైతే ఆ బాంబ్ ఉండ ప్రేలింది దేనికని? అతను దాన్ని పెట్టున్నప్పుడే అడవి పంది కొరికిందా?

నాలో ఉన్న భయమంతా మాయమై ఏదో కొత్త కుతూహలం ఒకటి పుట్టింది. "ఏమైందిరో... ఉండ ప్రేలింది కదా!" అని అడుగుతూ అతనున్న జాగా వద్దకు వచ్చాను. సూర్యుడి వెలుగు క్షీణమైంది. బైరడు నా ప్రశ్నకు జవాబు చెప్పనిదాన్ని చూసి నాలో సంశయం సుడులు సుడులుగా విజృంభించింది.

అతను నిల్చిన జాగా వద్దకు నేను చేరినప్పుడు బైరడు గట్టిగా నోటిని బిగించుకొంది ఎందుకోనని తెల్సింది. బైరడికి ఏమీ కాలేదు. అయితే అతని కుక్కైన 'రామ' రక్తం మడుగులో పడి విలవిలలాడుతుంది. అది కాళ్ళను నేలమీద కొట్టుకొంటున్న రభసకు దుమ్ము పైకి లేస్తుంది. ఆ బాంబ్ విస్ఫోటనంలో దాని

మూతి కళ్ళవరకూ చీలిపోయి ఛిద్రంగా ముడుచుకుపోయిన మందార పూవులాగ కనబడుతుంది. అది ఇక బతికేందుకు సాధ్యమేలేదు.

బైరడు ఆ బాంబ్ ఉండను పెట్టి కొంచం దూరంకు వచ్చాడట. అంతలోనే ఉండ ప్రేలి ఢమార్ అనే సప్పుడ్ని విని నాలాగనే భయపడి అసలు ఏమైందోనని చూసేందుకు పరిగెత్తాడట. తరచితరచి చూస్తే పందికి బదులుగా అతని కుక్కే ఆహుతైందట!

మా వెనకే వెంబడిస్తున్న కుక్కను బైరడు వెనక్కి పారద్రోలాడు తప్పితే దాన్ని కట్టేయలేదు. బైరడి ఉండకు చుట్టిన మాంసం చర్మంనుంచి వస్తున్న వాసనను పట్టుకొని అది (ఆ కుక్క) పొదల, చెట్ల మాటున మాకు కొద్దిగానైనా జాడను ఇవ్వకనే మమ్మల్ని వెంబడించింది. బైరడు ఉండను తనకిష్టమైన జాగాలో పెట్టి వెనక్కి మళ్ళిన తక్షణమే సులభంగానే తిండి దొరికిందని ఆ బాంబ్ ఉండకు నోటిని తాపించి కిసుక్కున కొరికింది.

“ఛు ఛూ... ఉన్న ఒకే ఒక బాంబ్ ప్రయోజనంకు రాకుండా పాడైంది” అంటూ చావు మడుగులో తన్నుకొంటున్న కుక్కను తిట్టాడు బైరడు. కుక్కకైన దుఃస్థితిని కొంచంగా నైనా పరిగణించకనే ఉండ పాడైనదాన్నే అతను గమనించి చింతిస్తుంది చూసిన నాకు కోపం వచ్చింది.

కుక్క నుంచి కాళ్ళను రపరపా కొట్టుకొనేది ఆగిపోయింది. బైరడు నా వైపుకు తిరిగి “వెళ్దాంపదండి దొరా” అన్నాడు. “అది కాదురా, దాన్ని పాతి పెట్టాలి కదా?” అని అడిగాను. “చచ్చిన మీదట దానికేమి గుర్తు అవుతది... ఏ కుక్కో, నక్కో పీక్కు తింటదిలే... పదండి ముందుకే” అన్నాడతను నిర్భావంగా.

అక్కడినుంచి తిరిగి వస్తున్నప్పుడు, ఆ దార్లో “రేపట్నుంచి మూడు రోజులు పనిలోకి రాను దొరా” అన్నాడతను.

“ఎందుకురో?”

“నాకు సూతకం... దొరా!”

"ఏమైంది నీకు?"

"రామ (కుక్క) పై లోకాలకు వెళ్ళిపోయింది కదా!"

ఆ మసక చీకటిలో అతని కళ్ళనుంచి నీటి బిందువులు పడుతున్నవి. నిజంగా రామ (కుక్క) చచ్చినదానికి సంతాపంగా మూడు రోజులు సూతకంను ఆచరిస్తాడో లేకపోతే తోట పనుల్ని తప్పించుకొనేందుకు నెపంను చెపుతున్నాడో ఏమో! ఉన్న ఒకే ఉండ పాడైందానికి దుఃఖపడుతున్నాడో... ఎవరికి గుర్తు? జరిగిన సంఘటన నుంచి ఆలోచిస్తే, ఎలాగున ఆలోచించినా ఈ ధర్మ సంకటంను సరిచేసేందుకు నాకు అంతుబట్టకుండా ఉంది. బైరడు, మాస్తి... వీళ్ళంతా సజ్జనులో, దుర్జనులో తీర్మానించే జవాబ్దారిని వదిలేసి మొత్తానికి జరిగినదాన్ని చెప్పటం మంచిదేమో కదా...!

★ ★ ★

కన్నడ భాషలో దివంగత పూర్ణచంద్రతేజస్వి రచించిన 'మాస్తి మత్తు బైర' అనే కథకు యథాతథ తెలుగు అనువాదం.

అనువాదకుడు: శాఖమూరు రామగోపాల్.

ఈ కథను సేకరించింది ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని లైబ్రరి నుంచి.

# సుస్మిత మరియు (చిన్న) పక్షిపిల్ల



ఒకరోజు ఏదో ఒక ప్రయోగం చేసేందుకు వెళ్ళి ఉత్తి పుణ్యానికి ఎటువంటి కష్టాలకు ఇరుక్కొన్నానని మీకు చెప్పాలంటే దానికొక పెద్ద పురాణమే ఉందిలే. దాన్లోని పూర్వాపరాల్ని మీకు తెల్పేందుకే ఈ కథను మీముందు ఉంచుతున్నానండి.

పక్షుల ఫోటోలను నేను బాల్యంలో పాఠ్య పుస్తకాలలోనో లేదంటే చందమామ మాస పత్రికలోనో చూసి, ఆ పక్షుల అందచందాల్ని అందరిలాగనే ప్రశంశిస్తుండేవాడ్ని. అయితే ఫోటోగ్రాఫర్ పక్షుల ఫోటోల్ని తీసేటప్పుడు పడే కష్టాల అందాజు అప్పట్లో నాలో లేదులే. మీరు సైతం ఫోటోగ్రాఫర్ కాకుంటే, ఆ చిత్రాల్ని చూసి మెచ్చుకోవచ్చేమోగాని, వాట్ని తీసేటప్పుడు పడే కష్టాలేమిటనేది మీకు గుర్తుకాదులేండి. నేను ఇప్పటిదాకా సుమారుగా ఐదారువేల ఫోటోల్నుంచి పక్షులవి

తీసియుండొచ్చు.  వాట్లో సగం నెగిటివ్‌లలో నేను తీద్దామనుకొన్న పక్షులే లేవు అని నేను చెప్తే, ఎంత మొత్తంలో నా సమయం, ఫిల్మ్, డబ్బు వృథా అయ్యుండొచ్చో మీరే ఊహించుకోండి. ఈ కష్టనష్టాలలోని ముఖ్యకారణం ఏమిటంటే పక్షుల మీద ఫోటోలను తీసేందుకు వెళ్ళిన ఛాయాగ్రాహకుడికి తన కెమేరా ఒకటి తప్పితే ఇక మరేవి అతని కంట్రోల్‌లో ఉండని ప్రతికూల సన్నివేశాలలో అతను తన పనిని చేయాల్సి ఉంటది. వెలుతురు, పక్షులు, వాటి భంగిమలు, వాటి వెనుకున్న పరిసరం... ఇవేవి అతని ఇష్టంకు తగినట్లుగా ఉండేది లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ హఠయోగంలోని భంగిమలో చెట్టు వద్ద కూర్చుని ఫోటోగ్రాఫర్ ఓపికగా ఎదురుచూస్తూ, కాసుకొని ఉండే, ఆ సన్నివేశంను అత్యుత్తమంగా ఉపయోగించుకొనేందుకు ప్రయత్నించాల్సి ఉంటది. పక్షులు ఎంతో చిన్నవిగా మరియు ఎంతో చపల చిత్తంగా ఉండే ప్రాణులైనందున ఒకవేళ అకస్మాత్తుగా వాటి ఫోటోలను తీసే విధానంలో ఆ ఫోటోగ్రాఫర్ విజయుడైనా, పక్షి రెక్కను కొట్టో, మెడను అటో ఇటో కదిలిస్తే, ఆ ఫోటో పాడైపోతది. వీటికన్నా ముఖ్యంగా మనుషుల మీద వాటికుండే భయమే ఫోటోగ్రాఫర్‌కు ఒక పెద్ద సవాల్‌గా ఎదురౌతది కదా! వాటిమీద గురిని నిల్పే కెమేరాను, అవి (పక్షులు) పిస్తోలుగా భావించుకొని అక్కడ్నుంచి తుర్రంటూ జారుకొంటవి (ఎగిరిపోతవి).

ఇదంతట్నీ అనుభవించి అవస్థలు పడిన నేను, ఎలాగైనా చేసి ఈ పక్షులన్నిట్నీ నేనే సాకి (పోషించి) వాటికి మనుషుల భయం లేనట్లుగా అలవాటు చేసి, ఆ తర్వాత వాటి ఫోటోల్ని దగ్గరనుంచి ఎలాగున కావాలనుకొంటే అలాగే (కోరుకొన్నట్లుగా) తీయొచ్చేమో అని ఆలోచించాను. అయితే ఈ నా ఆలోచన నుంచి వాటి సహజ (నాచురల్) ఫోటోలను తీసేదానికన్నా నూరు రెట్లు కష్టం అని నాకు తొందరగానే తెల్సివచ్చింది.

పట్టణాలలో ఎలాగున పిచ్చుకలు అసంఖ్యాకంగా ఉంటవో అలాగే మా ఎస్టేట్ (తోట)లో పికళార లేకపోతే బుల్‌బుల్ (బుర్రు) పిట్టలు ఉంటుండేవి. బుర్రు పిట్టలలో నూరారు రకాల ప్రభేదాలు ఉంటవి. చప్పిడి ముక్కుతో ఉండేవి, ఎరుపు మీసాలతో ఉండేవి, పసుపు పచ్చ నెత్తితో ఉండేవి, బూడిదగుమ్మడి రంగు తలతో ఉండేవి, తెల్ల గొంతుతో ఉండేవి, ఎరుపు గడ్డంతో ఉండేవి... ఎలాగెలాగునో అనేక రకాల

బుర్రు పిట్టలు ఉండేవి. ఈ నానా రకాలన్నీ మా తోటలో వేలలో ఉండేవి. ఇంటి చెంతనుండే లంటాన పొదలలోగాని, చెర్రి చెట్లలోగాని పండ్లు కాసినవంటే, ఈ పక్షులన్నీ అక్కడికి చేరి ఒకటే కలకలారావంతో సందడి చేస్తుండేవి. వాటి సందడి ఎలాగుంటదంటే, మా ఇంటి ప్రక్కనే ప్రైమరి స్కూల్ ఉన్నట్లుగా నాకు అన్పిస్తుండేది. వాటి ఫోటోల్ని తీద్దామని వెళ్తే చాలు, ఆ పక్షులన్నీ బుర్రునే రెక్కల్ని ఆడిస్తూ మిగిలిన వాటికి డేంజర్ సిగ్నల్స్‌ను ఇస్తూ కిలకిలారావంలను చేస్తూ నానాదిక్కులకు పారిపోతుండేవి.

అడవిలోని ఈ చిన్న రకాల పక్షులలో ఇంకొక అభ్యాసంను నేను గమనించాను. వీటి గూళ్ళకు ఎప్పుడూ నీళ్ళపాము, కెంబూతం, అడవి పిల్లి, కోయిలలు, గుడ్లగూబ... వీట్నుంచి దాడి ఎదురౌతుండేవి. ఎన్నో రకాల పక్షులు ఈ సాధు పక్షుల గుడ్లను కబళించి గుటుక్ అంటూ మ్రింగి తమ జీవనాన్ని గడుపుకొంటుండేవి. గుడ్లను మింగేందుకు వెళ్ళినప్పుడు, తల్లి పక్షి ఏమైనా కావు ఇస్తూ (పొదుగుతూ) కూర్చుంటే, దాన్ని మింగుతుండేవి గుడ్లజతగా. ఈ దుష్టపక్షుల ఉపద్రవం నుంచి తమ గూళ్ళను రక్షించుకొనేందుకు చేతగాని ఆ చిన్నా చితకా సాధు పక్షులు మనుషులు తిరిగే చోట అంటే ఇళ్ళ పై కప్పుల మాటునో, సూరుల చెంతో, పశువుల మేతకని కట్టుకొన్న అటక మీదో... మొదలైన చోట్లలో తమ గూళ్ళను కట్టుకొనేవి. ఈ ఉపాయంలోని ముఖ్య ఉద్దేశమేమిటంటే క్రూరపక్షులు మనుషులు తిరిగే జాగాలు వద్దకు వచ్చేందుకు భయపడుతవనే కారణమే ఆ సాధుపక్షులలో ఉండేది.

ఒకసారి మా ఇంట్లో కాఫి నారు మొక్కల్ని పెంచుకొనేందుకు ఏర్పాటు చేసిన గదివద్ద నీడకని నిల్పిన వెదురు తడికెమీద ఒక బుర్రు పిట్ట గూడును కట్టుకొంది. నేను కాఫి నారు మొక్కల్ని చూసేందుకు వెళ్ళినప్పుడల్లా నా పుత్రికైన సుస్మితాను వెంటబెట్టుకొని చుక్కలు చుక్కలుగా ఎరుపురంగులో ఉన్న ఆ పక్షి గుడ్లను, ఆ పక్షి గూడును చూపిస్తుండేవాడ్ని. ఇంకా స్కూల్‌లో చేరని నాలుగైదు సంవత్సరాల సుస్మితకు నానుంచి ఇవే మొదటి పాఠాలుగా ఉండేవి. పొదుగుతున్న తల్లిపక్షి మేము ఆ గది చెంతకు వెళ్తే మాకు తెల్వనట్లుగా అ తడికెకు ఉన్న ఇంకొక మూల నుంచి ఎగిరి బయటకు పోతుండేది. మేము వెనుదిరిగిన తక్షణమే అది మళ్ళా వచ్చి ఆ గుడ్లకు కావు ఇస్తుండేది. ఇలాగున కొన్ని రోజులు గడిచినవి. అయితే ఒకరోజు మాత్రం

మేము వెళ్ళినప్పుడు తల్లి పక్షి అక్కడలేదు. గుడ్లు మాత్రమే ఉన్నవి. తల్లి పక్షి మేము రాకమునుపే ఎక్కడికో ఎగిరిపోయి ఉండొచ్చని భావించుకొంటూ మాపాటికి మేము వెనుదిరిగాము. అయితే ఆ సాయంత్రంలో చూసినా ఆ గూడు తల్లిపక్షి లేకనే ఖాళీగా ఉంది. గుడ్లు మాత్రం ఉన్నవి. తల్లి పక్షికి ఏదో కష్టం కలిగి ఉండొచ్చని అనుమానించాను. అయితే ఆ విషయం మీద ఎక్కువగా ఆలోచించకనే ఇంటికి చేరాను.

మరుసటిరోజు మళ్ళా వెళ్ళినప్పుడు సుస్మిత నాతో ఉంది. అప్పుడు ఆ గూట్లో గుడ్లు మాత్రమే ఉన్నవి. తల్లి పక్షి జాడే లేదు. గుడ్లను ముట్టి చూసాను. సాధారణంగా కావు నుంచి వేడిగా ఉండాల్సిన గుడ్లు చల్లగా ఉన్నవి. అంటే ఎన్నో రోజుల్నుంచి తల్లిపక్షి కావు (పొదుగు)కు కూర్చుండేది నిల్చినట్లుంది.

ఏమై ఉండొచ్చని ఆ గదిలో అటు ఇటు పరీక్షగా చూసాను. అక్కడ ఒకచోట తల్లిపక్షి రెక్కల ఈకలు చెల్లాచెదురై పడియున్నవి. గుడ్లగూబో లేకపోతే మరేదో క్రూరపక్షో రాత్రివేళ వచ్చి పొదుగుతూ కూర్చున్న ఆ తల్లిపక్షిని పట్టుకొని దానిరెక్కల్ని పీకి తిన్నట్లుంది. అందుకే రెండు రోజులనుంచి ఆ తల్లి పక్షి ఆ గుడ్లకు కావు ఇవ్వటంలేదు. ఇక గుడ్లనుంచి పిల్లలు వచ్చేది అనుమానమే కదా...!

సుస్మితకు జరిగినదాన్ని వివరించి అక్కడ పడిన ఈకలన్నిట్నీ చూపించాను. చిన్నబాలికైన సుస్మితకు జరిగిందేమిటో ఎక్కువగా అర్థంకాలేదు. అయినా, "ఇప్పుడు ఈ గుడ్లనుంచి పిల్లలు బయటకు రావా... నాయనా?" అంటూ అడిగింది. సుస్మితతో ఆ తల్లిపక్షి గుడ్ల వద్దకు వచ్చి కావు (వేడి) ఇవ్వటం ద్వారానే ఆ గుడ్లనుంచి పిల్లలు బయటకు వస్తవని, దానికని ఆ తల్లి సహకారం ఎంతో అవసరమని చెప్పాను. నేను చెప్పిన మాటల్నుంచి ఏ విధంగా అర్థం చేసుకొందో "అలాగైతే నేనే తల్లి పక్షిలాగ ఆ గుడ్లకు వేడి ఇస్తాను" అని సుస్మిత అంది. వేడి (కావు) ఇవ్వాలంటే అది నిప్పు నుంచి వచ్చే వేడి అని అనుకొందో ఏమో!

గుడ్లకు కృతకంగా కావు ఇచ్చి పిల్లల్ని చేసే ఇన్క్యుబేటర్లను నేను బెంగుళూరులో ఇదివరకెన్నడో చూసియున్నాను. అయితే నా వద్ద ఆ రీతిలో నియంత్రిత వేడి ఇచ్చి గుడ్లనుంచి పిల్లల్ని చేసే సాధనాలేవీ లేవు. అయితే సుస్మిత నుంచి "మనమే వేడిని

ఇద్దాం... నాయనా" అని చెప్పినందున "ఎలాగూ ఈ గుడ్లు పాడైపోతవి కదా తల్లి లేనందున... నేనే ఎందుకొక ప్రయోగంకు వీట్ని ఉపయోగించుకోకూడదు?" అని అన్పించింది.

మెల్లగా గూడుతో పాటుగా ఆ మూడు గుడ్లను ఎత్తుకొని ఇంట్లోకి వచ్చాము. ఇంట్లోకైతే తెచ్చాం సరే, అయితే ఆ తల్లి పక్షి పొదిగినట్లుగా, ఆ గుడ్లకు ఒకేవిధంగా ఎలాగున సెగను ఇచ్చేది నాకైతే తోచలేదు. జతగా బుర్రుపిట్ట వంటి ఉష్ణోగ్రత ఎన్నిడిగ్రీలుగా ఉంటదో నాకు తెల్వదు. చివరికి గుడ్లను డైనింగ్ టేబిల్‌లోని నలబైక్యాండిల్ బల్బు అడుగున దారం కట్టి, ఆ గూడును వేలాడదీసాను. గుడ్లు పగిలి పక్షి పిల్లలు బయటకు వస్తవనే ఆశ నాకు లేదు. ఎందుకంటే తల్లి పక్షి చనిపోయిన రెండు రోజుల్నుంచి ఆ గుడ్లు చల్లగా పడియున్నవి. జతగా బల్బులోని సెగ బుర్రుపిట్టలోని సెగలాగ నాకు కనబడలేదు. ఇదంతా చేసింది సుస్మితనుంచి వచ్చిన కుతూహలమైన ప్రశ్నునుంచే కదా!

ఆ గూడును డైనింగ్ హాల్‌లో వేలాడదీసిన పిమ్మట ప్రతిరోజు సుస్మిత అప్పుడప్పుడు ఆ గూటిలో వంగి చూస్తుండేది. ఏవేవో ప్రశ్నల్ని అడుగుతుండేది. సుస్మితకు జలచరాల్నుంచి మొదలుకొని సస్తనీల వరకూ వంశాభివృద్ధి ఎలాగెలాగున వికాసమౌతూ వచ్చిందోనని నిధానంగా వివరించాను. కళ్ళెదురుగా గుడ్లు ఉన్నందుకో ఏమో నేను చెప్పిందాట్లో పుత్రికకు బాగానే అర్థమైనట్లుగా నాకు అన్పించింది.

జీవ వికాసంలో తక్కువ స్థాయిలో ఉండే జీవులైన జలచరాలు పక్షులులాగ గుడ్లను భద్రంగా ఉంచుకోవు! అవి వదిలే గుడ్లు వాతావరణంలోని సెగనుంచి పగిలి పిల్లలు బయటకు రావాలి. అంతే కాదు, ఆ పిల్లలే స్వశక్తినుంచి ఆహార సంపాదనను వెతుక్కొని బతకాలి. ఇందుచేత ఆ జలచరాలు వదిలే గుడ్లలో చివరికి బతికి పెరిగేవి సగటున ఒకటో రెండో! ఈ కారణం నుంచే జలచరాలు వదిలేగుడ్లు అసంఖ్యాకంగా ఉంటవి. చేపలు ఒక్కొక్కసారి డెబ్బై, ఎనభైవేల గుడ్లను పెట్టవి (వదుల్తవి). కప్పలు లక్షల సంఖ్యలో గుడ్లను వదుల్తవి. ఇంత భారీగా అవి తమ సంతాన ఉత్పత్తికని సహస్రసంఖ్యలో గుడ్లను వదిలినా, ఆ గుడ్లనుంచి కొన్ని మాత్రమే బతికి పెరిగేదుంటది.

పాములు, బల్లులు, తొండలు, తాబేళ్ళు మొదలైన సరీసృపాలు వందో రెండొందలో గుడ్లను పెట్టవి. ముట్టుకొంటే మెత్తగా రబ్బర్ బంతిలాగ ఉండే ఆ గుడ్లను ఇవి ఇసుకలో గుంతల్ని తోడి లోపలెక్కడో వాట్ని దాచిపెట్టవి. ఇసుకలోని వేడిసెగకు వాటిలోని భ్రూణంలు పెరిగి ఆ గుడ్లకున్న పెంకును పగలగొట్టుకొని ఆ పిల్లలు బయటకు వస్తవి. జలచరాలకన్నా ఇవి (సరీసృపాలు) ఎక్కువ శ్రద్ధను తమ సంతానోత్పత్తికని చూపిస్తున్నా ఈ గుడ్లు సైతం వాతావరణంలోని ఎక్కువతక్కువల నుంచే ఆధారపడాల్సి ఉంటది.

అయితే పక్షుల మట్టంలో (లెవల్‌లో) చెప్పుకొనే వేళకు మనం ఇంకా సూక్ష్మ నడవడికల్ని చూడొచ్చు. పక్షులు సాధారణంగా తమ శరీరం వెడల్పుకు సమానమైనట్లుగా అంటే రెండో మూడో గుడ్లను మాత్రం పెట్టవి. అంతే కొలతతో గూడును కట్టి తమ వంటి సెగను తాకేటట్లుగా చుట్టూ రెక్కల్ని పరుచుకొని సెగను (కాపు) ఇస్తవి. వాతావరణంలోని సెగను కొంచమూ అవలంభించుకోకుండా తమవంటి సెగనుంచే భ్రూణాలను పెంచి అవి ఆ పిల్ల పక్షులు బయటకు వచ్చేటట్లుగా ఆ గుడ్లమీద కూర్చుని పొదుగుతవి. అవి పిల్లలై బయటకు వచ్చినమీదట వాట్ని తమ నోటినుంచి గుటురు (నమిలినదాన్ని) ఇచ్చి పోషిస్తూ, ఆహార సంపాదనను పొందేది ఎలాగోనని నేర్పి బయట ప్రపంచంలోకి వదుల్తవి.

సస్తని జీవులలో ఇంకాస్త బాధ్యతగా సంతానంను కనేదాన్ని మనం చూడొచ్చు. ఇక్కడ భ్రూణం బయట ప్రపంచంకు ఏ సంబంధమూ లేనట్లుగా తల్లి గర్భంలోనే పెరిగి బయటకు వస్తది.

రోజుకొక ప్రశ్నను అడుగుతూ గుడ్లను నిశితంగా గమనిస్తున్న సుస్మిత ఒకరోజు ఉద్వేగంతో పడ్తూ లేస్తూ పరిగెత్తి నావద్దకు వచ్చింది.

"నాయనోయ్... గుడ్లు చిట్లి పిల్లలు బయటకు వచ్చినవి!" అంటూ గావు కేక పెట్టింది.

నాకు నమ్మేదే కుదర్లేదు. నిర్జీవమైన గోలీలుగా పడియున్న చుక్కలతో కూడిన ఆ ఎరుపుగుడ్లనుంచి పిల్ల పక్షులు ఎలాగైనా బయటకు మా ప్రయత్నం నుంచి రాగలవా అని నేను ఊహించలేదు. అయితే ఆ గుడ్లనుంచి జీవాలు ఒక అద్భుత

దృశ్యంలాగ బయటకు వచ్చిందాన్ని సాక్షాత్తుగా చూసిన సుస్మిత ఆనంద, ఆశ్చర్యాలతో కేకలు పెట్టూ నావద్దకు పరిగెత్తికొని వచ్చింది.

వేలాడదీసిన ఆ గూట్లోని గుడ్లలో రెండు చిట్లి (పగిలి) పిల్లలైనవి. దగ్గరకు వెళ్ళి చూస్తే చాలు మొత్తం బ్రహ్మాండాన్నే మింగేటట్లుగా నోళ్ళను తెరిచి తలలను ఊపుతున్నవి. అప్పుడే గుడ్లు చిట్లి బయటకు వచ్చిన ఆ నవజాత పిల్లలు పచ్చి మాంసం ముద్దలన్నట్లుగా కనబడుతున్నవి తప్పితే అవి పక్షి పిల్లలన్నట్లుగా కనబడేది లేదులే. ముక్కును బయటకు చాపి తిండికని నోటిని తెరిచేదే అక్కడ మాకు కనబడుతున్న సజీవ లక్షణంగా ఉంది.

అవి నోళ్ళను తెరుస్తున్న విధంను చూసిన సుస్మిత, "వాటికి తిండి కావాలి నాయనా..." అని అంది. సుస్మిత ఇదొక తోలుబొమ్మలాటలాగ అనుకొందో ఏమో! సుస్మిత నుంచి ఆ మాటను విన్న తక్షణమే నాకు మాత్రం నెత్తిమీద పిడుగు పడినట్లుగా అన్పించింది. ఆ పిల్ల పక్షులకు ఏ రకమైన తిండిని పెట్టాలి? ఎలాగున సాకాలి? ఉత్తిగనే ఉండకుండా ఆ గుడ్లను ఇంట్లోకి తెచ్చి తలమీద భయంకరమైన బాధ్యతను పెట్టుకొన్నాను కదా!

పక్షులలో అనేక రకాలైనవి అనేక రకాల ఆహార పద్ధతులకు లోబడి ఉంటవి. కొన్ని పండ్లను మాత్రమే తింటవి. కొన్ని కీటకాల్ని మాత్రమే తింటవి. మరికొన్నైతే వ్యవసాయ ఉత్పత్తులైన ధాన్యం, గోధుమలు, జొన్నలు, సజ్జలు మొదలైన గట్టి గింజల్నే తింటవి. కొన్ని పక్షులు పూల మకరందాన్నే తాగి బతుకుతవి. ఈ పక్షులన్నీ మిలియన్ మిలియన్ సంవత్సరాల్నించి ఆ యా రీతులలోని విశిష్ట ఆహారంకు లోబడినవని చెప్పితే, వాటి నాలుకనుంచి మొదలు వాటి ప్రేగుల వరకూ వాటి అంగాంగాలన్నీ ఆయా విశిష్ట తిండికొరకే నిర్మాణమౌతవి. ఒక జాతి పక్షుల ఆహారంను మరొక జాతి పక్షులు తినేదే లేదు. ఒకవేళ తింటే జీర్ణంగాక చనిపోతవి.

సుస్మితకు చెప్పసాగాను ఇలాగున... "మన భోజనం వాటికి పెట్తే అవి చనిపోతవి. ఇప్పుడు నల్ల పిచ్చుక మన ఇంటి పెంకుల సందులో సాలె పురుగును పట్టుకొని గుటకాయ స్వాహా చేసింది, నువ్వు చూసావు కదా! దాని తిండిని నువ్వు తింటే బతుకగలవా? అలాగే నీ తిండిని అవి (పక్షులు) తింటే చనిపోతవి" అని అన్నాను. పాపకు నా బోధన అర్థమైనట్లుగా కనబడింది.

అయితే దీన్నుంచి నా సమస్య పరిష్కారం కాలేదు. నోళ్ళను తెరుస్తున్న ఆ పిల్ల పక్షులకు ఏమైనా తినబెట్టాలి. ఏమి తినబెట్టాలి? ఇటువంటి జటిల విషయాలలో మారడే నాకు సరైన సలహాదారుడు. ఇంటి వెనకన నేరేడు చెట్టు నీడలో నిద్రపోతున్న మారడ్ని లేపాను.

“నేనెందుకు ఈ దరిద్ర పిట్టల్ని సాకాలి? కోడినో, గొర్రెనో, నెమిలి పిల్లనో సాకితే అది ఒక రీతిగా ఉంటది. మూడు కాసుల (దమ్మిడీల) విలువ చేయని ఈ పక్షి పిల్లల్ని నేనెందుకు సాకుతాను? వీటికి బదులుగా కోడి పిల్లల్ని ఇవ్వండి సాకుతాను. బంధువులు, దోస్తులు నా భవ్యమైన కొంపకు వస్తే కోడి పులుసు చేసి పెట్టొచ్చు” అంటూ ఆ పిల్ల పక్షుల్ని సాకే నా యోచనను తిరస్కరించాడు మారడు. నాలో ఈ పక్షి పిల్లల నుంచి వచ్చిన నైతిక ఉభయ సంకటం మారడి తలలోకి (బుర్రలోకి) జొరబడలేదు.

ఆ తర్వాత నా వద్ద ఉన్న సలీం ఆలి మరియు ఇతర పక్షి శాస్త్రజ్ఞుల పుస్తకాల్ని తెరిచి చూడసాగాను. వాళ్ళెవరూ నవజాత పక్షి పిల్లల్ని మానవులు పోషించేదానిమీద ఏమి రాయలేదు. బుర్రు పిట్టలు ఫలాల్ని, కీటకాల్ని తింటవని ఒకే వాక్యంలో వాటి జీవన విధానాల్ని రాసి ముగించారు. మారడి సలహాలాగ, వీళ్ళ పుస్తకాలూ నాకు ఇప్పుడు నిరుపయుక్తమైనవి.

కీటకాలు అంటే ఏమిటవి? నూరారు రకాల కీటకాలు ఉన్నవి కదా! వాట్లో వేట్ని పట్టుకొని ఆ పిల్ల పక్షుల నోళ్ళలో ఇరికించేందుకు మనస్సు కలగటం లేదు. వాటి మీసాలు, కొరికే దవడ, కాళ్ళ గోళ్ళు... వీటన్నిట్నీ చూస్తే ఆ పిల్ల పక్షుల నోళ్ళలో వేసేదటుండనీయండి..., నా చేతినుంచి ఆ కీటకాల్ని ముట్టేందుకూ మనసొప్పట్లేదు కదా!

బుర్రు పిట్టలు ‘లంటాన’ జాతి చెట్ల ఫలాల్ని తినేదాన్ని చూసి ఉన్నాను. అయితే ‘లంటాన’ ఫలాల్ని వెతికేందుకు ప్రయత్నిస్తే ఫలాలతో ఉన్న ఒక చెట్టూ కనబడలేదు. చివరికి ఇకేమి చేసేదిలేక ఇంట్లో ఉన్న అరటిపళ్ళనే తినబెట్టాలని భావించాను. అయితే దంతాలే లేని వాటి నోళ్ళకు అరటి పండులోని తుంపు భాగంను ఇస్తే ఉపయోగం ఉండదని అరటి పండును పిసికి లేహ్యం (గుజ్జు)గా చెంచానుంచి కొంచమే తీసుకొని ఆ రెండు పిల్లపక్షుల నోళ్ళలో కుక్కాను.

పెద్ద ప్రమాదమే అయ్యింది నానుంచి. అరటిపండు గుజ్జును సైతం మింగేందుకు కుదరని ఆ పిల్ల పక్షుల గొంతులో ఆ గుజ్జు ఇరుక్కుపోయి, ఆ పిల్ల పక్షుల ముక్కులనుంచి ఆ అరటి గుజ్జు బయటికొచ్చి, నేను వాటి ఊపిరి ఆటకు ప్రాథమిక చికిత్స చేయాలని యోచించే లోపే అవి చనిపోయినవి. నేనే వాట్ని చంపానని కోపంగా సుస్మిత ఏడుస్తూ తన చిట్టి పొట్టి చేతుల్నుంచి నా కాళ్ళమీద రపరప కొట్టింది.

తక్షణమే నేను చేసిన మొదటి పని ఏమిటంటే ఇంకా పిల్లగాకుండా ఉన్న ఆ మిగిలిన గుడ్డును, నోళ్ళలో అరటిపండు గుజ్జును నా నుంచి కుక్కించుకొని చచ్చిన ఆ పిల్ల పక్షుల జతగా మొత్తం ఆ గూడును ఇకనూ మిగిలియున్న ఆ అరటి పండు గుజ్జును మోసుకొని అడవిలోపల ఎక్కడో విసిరేసి వచ్చాను. ఆలశ్యం చేస్తే, 'ఆ మిగిలిన గుడ్డు చిట్లి పిల్ల పక్షి బయటకు వస్తదనే దిగులు నాలో ఉంది. పిల్లపక్షుల్ని నేనే సాకి, అందచందాలతో అలరారే వాటి ఫోటోల్ని తీయాలనే నా ప్లాన్ ప్రాథమిక దశలోనే బెడిసికొట్టింది.

పక్షి పిల్లల్ని సాకి ఫోటోలను తీయాలనే నా ప్లాన్‌ను వదులుకొన్నాను. అయితే మాకెందుకు ఈ పక్షి పిల్లల్ని సాకేందుకు కుదరట్లేదు? విజ్ఞానం ఎంతగానో ముందుకే పరిఢవిల్లుతూ (దూసుకుపోతూ) ఉంటే ఈ పక్షి పిల్లల్ని సాకేది కష్టమా? అని యోచించసాగాను. వాట్ని పెంచే విధంమీద ఎంతోమంది పశువైద్యుల్ని, పక్షి తజ్ఞుల్ని కలిసాను. అందరూ మారడిలాగనే కోళ్ళు, ఈము పక్షులు, పావురాళ్ళు... మొదలైన వాట్ని సాకే విధంమీద సలహాల్ని ఇస్తున్నారు తప్పితే అడవిలోని చిన్న చిన్న పక్షుల పెంపకమని చెప్పిన తక్షణమే వాటి సాహసంకు మాత్రం వెళ్ళకండి అని హెచ్చరిక మాటల్ని చెపుతున్నారు. ఆ పక్షి పిల్లల్ని వాటి తల్లిపక్షి తప్పితే వేరేవాళ్ళు సాకేది కష్టం అనేది వాళ్ళ అభిప్రాయంగా ఉంది.

ఈ పురాణం అయిపోయిన పిమ్మట మరొకసారి నేను పక్షి పిల్లల్ని సాకే కష్టంలో ఇరుక్కొన్నాను.

మా ఇంటెదురులో ఉండే పనస చెట్టు కొమ్మ ఒకటి జోరుగాలి, వాన రభసకు రాత్రి వేళ విరిగిపడింది. దాన్ని తోట్లో ఉన్న తిప్పగుంతలో పడేసేందుకు వెళ్ళగా,

ఆ కొమ్మ ఆకుల నడుమ గడ్డిపోచలతో గూడును కట్టుకొన్న టువ్విపక్షి గూడు ఒకటి నా కళ్ళకు కనబడింది. పరీక్షగా ఆ గూట్లో ఏముందోనని చూసాను. నాకు మళ్ళా దిగులేసినట్లుగా మూడు పక్షి పిల్లలు నోట్ని తెరిచి కూర్చుని ఉన్నవి. క్రితంసారి జరిగిందంతా జ్ఞాపకంకు వచ్చి ఈసారి సుస్మితకు ఈ విషయం చెప్పేందుకు సాహసించలేదు నేను. ఆ కొమ్మ ఎక్కడ్నుంచి విరిగిపడిందోనని వెతికి సరిగా ఈ విరిగిన కొమ్మను అదే చోట భద్రంగా ఇరికించాను (నిల్పాను). కొమ్మ విరిగి పడిపోయినందున దాన్లోని ఆకులన్నీ అప్పటికే వాడిపోయి ఉన్నవి. వాటి తల్లి వచ్చి ఆ పక్షి పిల్లల యోగక్షేమంను చూడనీ అనేది నాలో ఆపేక్షగా ఉంది.

తల్లి పక్షి వచ్చింది. అయితే అటు ఇటు టువ్వి టువ్వి అనే శబ్దం చేసి ఎగిరిందే తప్పితే గూడు వద్దకు మాత్రం రానేలేదు. కొమ్మకున్న ఆకులు వాడినందుకో లేకపోతే జీవకళను పోగొట్టుకొన్న కొమ్మ అయినందుకో, తన ప్రాణంకు అపాయం ఎదురవ్వచ్చని ఆలోచించిందో ఏమో... మొత్తానికి అది అడవిలోకి వెళ్ళిపోయి మరలా వెనుదిరిగిరాలేదు. ఆ గూట్లోని పక్షి పిల్లల వంటిమీదంతా చిన్నచిన్న ఈకలు వచ్చేటంతగా అవి అప్పటికే పెరిగి ఉన్నవి. ఆ తల్లిపక్షి ఆ పిల్లల్ని తిరస్కరిస్తే, ఎలాగైనా తల్లి రక్షణ లేక చనిపోయే ఈ పక్షి పిల్లల్ని ఈసారైనా సాకేందుకు సాధ్యపడేది ఉంటదేమో అని నాకు అన్పించి ఒక ప్రయత్నం చేద్దామని ఆలోచించాను. అయితే ఆ తల్లి పక్షి, ఆ పిల్లల్ని కచ్చితంగా వదిలేసిందని తెల్సేవరకూ ఆ గూటి జోలికి వెళ్ళలేదు. రెండురోజులు గడచినా, ఆ తల్లి పక్షి జాడేలేదు. అంతేగాకుండా ఆ మూడు పిల్లలలో ఒకటి ఆకలి బాధను తాళలేక చనిపోయింది. మిగిలిన ఆ రెండూ బక్కచిక్కి చచ్చేస్థితిలో ఉన్నవి. తల్లిపక్షి రావొచ్చేమోనని ఆగితే, అవి చనిపోయేదాంట్లో సంశయం ఏమి మిగలదు. ఆ పిల్లపక్షుల్ని అనాథలుగా చేసి నా తలమీద వాటి పోషణ భారాన్ని మోపిన ఆ తల్లిపక్షిని శపిస్తూ చచ్చిన ఆ పిల్ల కళేబరంను తీసుకొని అటెటో దూరంగా విసిరేసి, ఆ మిగిలిన రెండు పిల్లల్ని గూటితో సహా ఇంట్లోకి తెచ్చాను.

బుర్రుపిట్ట పిల్లలు అరటి పండు గుజ్జు తిని చచ్చినమీదట, నేనెంతగానో ఆలోచించి ఈ పిల్లపక్షులకు ఒక రకమైన ఆహారంతో ఉన్న ఫార్ములాను కల్పించాను. కోడిగుడ్లలో ఉన్న తెల్ల సొనను వీటికి ఆహారంగా ఇస్తే మంచిదని

తీర్మానించుకొన్నాను. ఎందుకంటే కోడిగుడ్డులో ఉండే తెల్లసొన వాస్తవంగా గుడ్డులోపల పెరిగే పచ్చసొన (భ్రూణం)కు ఆహారంగా ఉపయోగపడుతది. ఇకనూ పెరగని భ్రూణమే తన ఆహారంగా ఈ తెల్లసొనను తీసుకొంటుంటే మరిక నా వద్ద గుడ్లను చిట్లించుకొని బయటకొచ్చిన ఈ పక్షి పిల్లలకు అది (ఆ తెల్లసొనను) తినేది చేతగాదా?

ఈసారి మునుపు చేసినట్లుగా చెంచానుంచి ఆహారం ఇవ్వలేదు. తల్లికుండే ముక్కులాగనే పోలికతో ఉండే ఒక చిమ్మటం తెచ్చి దాన్నుంచి సగంసగంగా ఉడికించిన ఆ కోడిగుడ్డు తెల్లసొనను కొద్దికొద్దిగా (తుంపులు తుంపులుగా) తీసుకొని ఆ పిల్లల నోళ్ళలో వేసాను. ఆ పిల్లలు కొద్దిగా పెరిగి ఉన్నందుకో ఏమో నేను ఇరికిస్తున్న (తినబెట్టున్న) ఆహారం ఏమి కష్టంగాకనే వాటి గొంతుల నుంచి లోనికి జారింది. అలాగున నానుంచి తిండి తింటూ ఆ పక్షి పిల్లలు ఈకల్ని వృద్ధి చేసుకొంటూ రెక్కల్ని కొట్టుకొంటూ రోజురోజుకూ పెరిగి పెద్దవిగా రూపుదాల్చసాగినవి. ఆహారంను నియమిత కాలంలో తినబెట్టేందుకు వెళ్తుంటే ఒకొకసారి గూటినుంచి ఎగిరి నా భుజం మీదో తలమీదో కూర్చుండేవి. సుస్మితకైతే ఇదొక అద్భుత కార్యంగా కనబడింది.

అయితే ఈ పక్షి పిల్లలలో ఉన్న పెద్ద అచాతుర్యం ఏమిటంటే తల్లి నుంచి దొరికే జీవన శిక్షణ నానుంచి వాటికైతే లభించేది లేదుకదా! అవి ఎంతగా మంద బుద్ధితో ఉండేవంటే, నేను తినబెట్టుతుండే ఆహారంను తమ ముక్కుల నుంచే స్వయంగా తీసుకొని తినేందుకు సైతం వాటిలో లేదు కదా! అవి పెరుగుతూ పెద్దవైన మీదటా నేను చిమ్మటంనుంచే వాటినోళ్ళలో ఆహారంను ఇరికించాల్సి వస్తుంది కదా! అలా చేయకుండా, వాటంతటవే ఆహారంను తీసుకొంటవని నేను వాటి కళ్ళెదురే ఆహారంను పట్టుకొని ఉంటే, అవి ఉత్తిగనే చూస్తూ కూర్చుని ఉండేవి.

ఇదంతట్ని వివరంగా తరిచి చూస్తే ఈ ప్రకృతి మన ఊహలకు దొరకని, నిలవని జటిలమైన జాలంను అల్లిందో అనే ఆశ్చర్యం నాకు కలుగుతుంది. ఆ పక్షి పిల్లలు పుట్టినప్పటినుంచి పెద్దవిగా అయ్యేవరకూ రోజునుంచి రోజుకు ఆహారంను మార్పు చేసుకొంటూ వస్తవి. రెక్కలు బలపడిన తర్వాత ఆ గూటిని వదిలి బయటకు

వచ్చేటట్లుగా ఆ తల్లిపక్షి ఆ పిల్లల్ని ప్రేరేపిస్తది. వాటెదురు కూర్చుని రెక్కల్ని కొట్టూ ఎలాగున ఎగిరేది చూపెట్టుతది. ఎలాగెలాగున కీటకాల్ని, పురుగుల్ని పట్టుకోవాలి, వేట్ని తినొచ్చు, తినకూడదు... ప్రతి విషయాన్ని ప్రాక్టికల్ (ప్రత్యక్షంగా)గా చేసి చూపించి నేర్పుతది. ఈ విద్యలలో ఏ ఒక్కదాన్ని తెల్సుగోకుండా ఆ పక్షిపిల్లలు ఉండుంటే, అవి తమ ముందిన జీవన సంగ్రామంలో బతికేది అసాధ్యంగా ఉంటది. మన పైచూపులకు అంతా తేలికగానే తనకు తానుగానే జరిగిపోతూ వెళ్తున్నట్లుగా కనబడినా, మానవ సమాజంను మీరిన జటిల క్రియావళి అక్కడ ఆ పరిసరాల లోకంలో నడుస్తుంటది.

ఇప్పుడు ఈ రెండు పిట్టల జీవంను కాపాడి, పూర్తిగా అవి నన్నే ఆలంబనం చేసుకొని బతికే పరతంత్ర జీవుల నిర్మాణం నానుంచి అయ్యింది కదా! నేను వాటి తల్లిలోని నిర్దయనుంచి వాటికి శిక్షణే లేనిదాన్ని గమనించి, ఆ తల్లినుంచి వచ్చే (లభించే) శిక్షణలాగనే శిక్షణను ఇచ్చేందుకు నిశ్చయించాను. చిమ్మటంనుంచి వాటికి తిండిని ఇచ్చేది క్రమేణ తగ్గించాను. ఆకలేస్తే ఎలాగైనా అవే ఆహారం తినేది నేర్చుకొంటవిలే అని భావించాను. ఒకరోజు ఉపవాసం అయిన మీదట వాటికి జ్ఞానోదయం వచ్చినట్లుగా నాకు కనబడింది. ఉడికించిన గుడ్డులోని తెల్లసొన భాగంను అవి తమ ముక్కుల నుంచి కుక్కసాగినవి. అయితే ఆ గుడ్డు తెల్లసొన వాటి ముక్కులనుంచి నోట్లోకి జారకనే క్రిందకే జారిపడుతుంది. అందుచేత అన్నం మెతుకుల్ని తింటవేమోనని అన్నం మెతుకుల్ని వాటిముందు పెట్టాను. అవి ఆ అన్నం మెతుకుల్ని పురుగులుగా భావించుకొన్నవో ఏమో, ఆ మెతుకుల్ని ముక్కుతో పొడుస్తూ కుక్కుతూ తినసాగినవి. అవి తమకు తామే ఆహారంను తినేది చేయసాగిన తక్షణమే వాటి ప్రవర్తనలోనూ మార్పులు కలగసాగినవి. ఇప్పుడు అవి ధైర్యంగా అటుఇటు ఎగురుతున్నవి. ఎదురుగా కనబడుతున్న ఆకుల్ని, చిన్న చిన్న పొదల్ని కుతూహలంగా కుక్కి చూస్తున్నవి. ఆ పక్షి పిల్లలలోని ఆత్మ విశ్వాసం చూసిన నేను అవి ఇలాగే ముమ్ముందు ప్రవర్తిస్తే ఇక కొన్నిరోజుల తర్వాత వీట్ని అడవిలో స్వతంత్రంగా జీవించేందుకు సాధ్యమౌతదని నేను యోచించసాగాను.

అయితే ఒకరోజు సాయంకాలం అవి మంకుపట్టి కూర్చున్నచోటునుంచి కదలక మెదలక ఉన్నవి. అదే రోజు రాత్రి అవి చనిపోయినవి. ఏమేమి తిన్నవో లేకపోతే

అన్నం మెతుకులు వాటికి సరిపడలేదో? మొత్తానికి అవి చనిపోయినందుకు కారణం తెల్వలేదు. సుస్మిత మాత్రం ఆ పక్షిపిల్లలు చనిపోయినందుకు దిగాలుగా ముఖం పెట్టుకొని ఒకరోజంతా అన్నం తినలేదు.

ఇక నేను మరెన్నడూ ఆ అడవి పక్షుల జోలికి (జీవన విధానశైలికి) వెళ్ళగూడదని నిర్ణయించుకొన్నాను. అడవిలోని జీవ సంకులంకు నేను చేతిని వేస్తే చాలు, అది సహాయ హస్తంగా ఉన్నా వాటి నాశనం నానుంచే అవుతుందేమో అనేది నన్ను తొలచసాగింది. కష్టాలబారిన పడినవాట్ని, దిక్కులేకుండా అనాథపక్షులుగా ఉన్నవాట్ని రక్షించేది మనలోని నైతిక జవాబ్దారి అని నేను భావిస్తే, అడవిలో లభించే దాన్నంతా తను తినేందుకే భగవంతుడు సృష్టించాడని భావిస్తుండే మారడి దృక్పథంలోని మూర్ఖత్వంకన్నా నాదే పెద్ద మూర్ఖత్వమేమో అని అన్పించింది నాకు.

ఇంత గట్టిగా నిశ్చయం చేసుకొన్నా, మరొకసారి నేను ఒక పక్షి పిల్ల దశనుంచి నైతిక బాధ్యత చిక్కులలో చిక్కుకుపోయాను. హూవణ్ణ కొడుకైన చంద్ర మాకు వారానికొకసారి కూరగాయల్ని సప్లై చేస్తుండేవాడు. అతనికున్న కూరగాయల తోట చెంత ఒక పక్షి గూడు కట్టుకొంది అని నాకు చెప్పాడు. అదొక 'మడివాళ' పక్షికి చెందిన గూడు. అక్కడికి వెళ్ళి మాటు వేసి ఆ పక్షికి చెందిన ఎన్నో భంగిమలతో ఉన్న ఫోటోలను తీసినమీదట, ఆ పక్షిగూడును చూపించి నా ఫోటోగ్రఫి వృత్తికి సహాయపడినందుకని చంద్రంకు ఒక రూపాయి ఇనాంగా ఇచ్చాను. ఈ విషయం ఏదేదో రూపంగా రూపుదాల్చి చివరికి పక్షుల్ని పట్టుకొని నాచెంతకు వస్తే, వాటి ఫోటోలను తీసి ఒక రూపాయి బహుమానం (ఇనామ్)గా ఇస్తాననే వార్త మా ప్రాంతంలో వ్యాపించి పశువుల్ని కాసే పోరలనుంచి ఇస్కూల్ విద్యార్థులవరకూ అందరూ రకరకాల పక్షి పిల్లల్ని వాటి గూళ్ళనుంచి దొంగిలించి వాట్ని ఫోటోగా తీసి రూపాయను ఇవ్వండని వేడుకోసాగారు. వారందర్నీ తిట్టి బెదిరించి ఈ పని నుంచి, వాళ్ళను విముఖులుగా చేయాలంటే నా తల వేయివ్రక్కలైంది.

ఈ సమయంలో పశువుల్ని కాసే రాముడు ఒక 'ఆకాశ బగరె' పక్షి పిల్లను తెచ్చి మారడి చేతిలో ఉంచాడట నాకోసమని. సార్ చూస్తే తిట్టుతాడని మారడు చెప్పినందున నేను బయట్నుంచి ఇంటికి వచ్చేలోపే ఆ పోరడు మా ఇంటి నుంచి

వెళ్ళిపోయాడు భయం భయంగా. ఆ పక్షి పిల్లను ఇక్కడెందుకు ఉంచావని నేను మారడ్ని తిట్టి, దాన్ని మరలా దాని గూటికే చేర్చేందుకు రాముడి కోసం వెతికాను. నేను అతడ్ని కొట్టేందుకే వెతుకుతున్నానని భావించిన రాముడు తన జాడను తెల్పనీయనట్లుగా నానుంచి తప్పించుకొని తిరుగుతున్నాడు. అయితే నేను మాత్రం ఈ సారి ఈ పక్షి పిల్లను సాకే బాధ్యతను మీదేసుకోగూడదని నిశ్చయించుకొన్నాను.

రాముడి కోసమని నా వెతుకులాట నడుస్తున్నప్పుడు రెండు 'ఆకాశ బగరె' పక్షులు కూస్తూ మా ఇంటిపైన ఎంతో ఎత్తులో ఎగరడం కనబడింది. నాకు అవి ఈ పక్షిపిల్లకు తల్లి–తండ్రి కావచ్చనే అనుమానం నాలో జనించింది. సరే, చూద్దామని ఆ పెద్ద పక్షులకు కనబడేటట్లుగా ఈ పక్షిపిల్లను మా ఇంటి కిటికి వద్ద నిలబెట్టాను. అవి ఒకవేళ ఈ పిల్లకు తల్లిదండ్రులైనా, గూట్లో లేని ఈ పక్షిపిల్లకు ఇక్కడే ఆహారం ఇచ్చి దాని పెంపకం చూసుకొంటవని నేను అనుకోలేదు. ఎందుకంటే ఆకులు వడిలినందున టువ్వి పక్షి తన పిల్లల్ని గాలికొదిలి అడవిలోపలికి వెళ్ళిపోయింది ఇంతకు ముందు నేను చూసియున్నాను కదా!

అయితే కొద్దిసేపైన తర్వాత కిటికిమీద కూర్చున్న ఆ పక్షిపిల్ల వద్దకు ఆకాశంలో కూస్తూ ఎగురుతున్న ఆ తల్లిపక్షి మెల్లగా క్రిందకు దిగి ఇంటిముందున్న చెట్టుమీద వచ్చి కూర్చుంది. మధ్యాహ్నంవేళకు ఆ తల్లిపక్షి ధైర్యం చేసి కిటికి వద్దకు వచ్చి ఆ పిల్లకు తననోటినుంచి నమిలిన ఆహారం ఇవ్వసాగింది. రాముడు ఆ పక్షిపిల్లను దొంగిలించి తీసుకువస్తుంటే, ఆ తల్లిపక్షి అతడ్ని వెంబడించి మా ఇంటి వరకూ వచ్చింది కదా!

రాత్రి అయిందంటే కిటికిమీద కూర్చున్న ఆ పిల్లను గదిలోపల విడిచేవాడ్ని. మరలా తెల్లవారితే దాన్ని బయటకు తెచ్చి కిటికి వద్ద కూర్చోబెట్టేవాడ్ని. తల్లిపక్షి వచ్చి ఎన్నోసార్లు ఆ పిల్లకు తిండిని తినబెట్టి ఎక్కడికో ఎగిరి వెళ్ళిపోతుండేది. కొన్ని గంటలైన తర్వాత మళ్ళీ వస్తుండేది. బహుశః తన పొట్టను నింపుకొనేందుకు మిగిలిన సమయంను వినియోగించుతుందని నేను అనుకొనేవాడ్ని.

అది తిండిని తినబెట్టిన తర్వాత ఎంతో సమయంవరకు ఎందుకు కనబడకుండా ఎక్కడికి పోతుందనేది ఐదారు రోజుల తర్వాతే నాకు తెల్సివచ్చింది. ఒకరోజు

ఉదయంలో ఆ తల్లిపక్షి తనకు చెందిన మరో రెండు పిల్లల్ని తీసుకొచ్చి మా ఇంటి ఎదురులో ఉన్న అశ్వత్థ (రావి) వృక్షం మీద కూర్చోబెట్టింది. రాముడు ఆ పక్షి పిల్లను దొంగిలించి తెచ్చినప్పుడు ఏ కారణంకో మిగిలిన ఆ రెండు పిల్లల్ని ఆ గూట్లోనే వదిలేసాడు. ఆ పిల్లపక్షి కూతను అనుసరించే ఆ తల్లిపక్షి మా ఇంటివరకూ వచ్చినా తన గూట్లోని మిగిలిన తన రెండు పిల్లల్ని మరవలేదు. ఈ పిల్లకు మా కిటికి చెంత తిండిని పెట్టి ఆ తర్వాత తన గూట్లో ఉన్న పిల్లలకు ఆహారం ఇచ్చేందుకు వెళ్తున్నందువలనే అది ఎంతో సమయం వరకూ కనుమరుగౌతుండేది.

రెండుచోట్ల సంసారబాధ్యతల బరువును తప్పించాలనే, గూట్లోని పిల్లలకు ఎగిరేందుకు రెక్కలు బలపడిన మీదట వాట్ని ఎగిరించుకొని వచ్చి మా ఇంటి ముందున్న రావి చెట్టులో వాట్ని కూర్చోబెట్టింది. ఆ తల్లి–తండ్రి ఇద్దరూ చేరి ఆ మూడు బకాసుర (తిండిపోతు) పిల్లలకి విరామం లేనట్లుగా ఆహారంను సమకూర్చసాగినవి.

అప్పటి వరకూ ఉత్తిగనే తిక్కలుదానిలాగ కిటికీలోని రాడ్ మీదకూర్చుని ఆహారం తింటున్న ఆ పిల్ల మిగిలిన తన ఇద్దరు సోదర పిల్లల్ని చూసిందో లేదో తక్షణమే కూర్చున్న చోటునుంచే గట్టిగా కూస్తూ రెక్కల్ని కొట్టుకొంటూ (ఆడిస్తూ) ఉద్వేగాన్ని ప్రకటించింది. ఒకొకసారి తల్లిపక్షి చెట్టుమీదున్న తన సోదరులకు తిండిని పెట్టుంటే, ఈ పక్షి పిల్ల సహనంతో కూర్చోకుండా గట్టిగా కూస్తూ, రెక్కల్ని కొట్టుకొంటూ కిటికి పైనుంచి దూకనేదూకింది. కొన్ని క్షణాల వరకూ పిచ్చిపిచ్చిగా గంజాయి దమ్మును పీల్చి అడ్డదిడ్డంగా నడుచుకొంటూ వస్తున్నోడిలాగ ఎటెటో దిక్కుల వైపుకు రెక్కల్ని కొట్టుతూ గాలిలో తేలాడుతూ ఆ తర్వాత యమసాహసంగా నిధానంగా పైపైకే సాగి చివరికి ఆ చెట్టుమీదున్న తన సోదరుల చెంతకు చేరింది.

ఐదారు రోజులు మాతో గదిలోపల, కిటికి వద్ద కాలం గడిపిన ఆ పక్షి పిల్ల అంతలోనే సుస్మితకు 'మా ముద్దుపక్షి" లాగ అయ్యింది. తల్లిపక్షి దాన్ని ఎగిరించుకొని వెళ్ళి చెట్టుమీద కూర్చోబెట్టుకొన్న విధంను చూసి "అయ్యో... మా ముద్దుపక్షి చెట్టుమీదకు ఎగిరి వెళ్ళిపోయింది కదా" అంటూ ఆ తల్లిపక్షిమీద కోపం చెందింది.

రెండు రోజుల వరకూ ఆ పక్షిపిల్ల మిగిలిన తన ఇద్దరు సోదరుల (పిల్లపక్షుల) జతగా కొమ్మ మీదే ఉంది. అనంతరం ఆకాశంలోని మేఘమాలికల పిలుపుల్ని ఆపుకోలేక (విస్మరించలేక) అవి ఎగిరి విశాల విశ్వంలో లీనమైనవి.

ఆ తర్వాత మా ఇంటిపైన ఏ 'ఆకాశ బగరె' పక్షి ఎగిరినా సుస్మిత "ఓహో! మా ముద్దు పక్షిపిల్ల మమ్మల్ని గుర్తు చేసుకొని వచ్చింది" అంటూ దాని వైపుకు ఆపేక్షగా చేతుల్ని ఊపుతుండేది. పక్షులకు అదెంతగా జ్ఞాపకం, ఆత్మీయత ఉంటవో లేవో చెప్పేటోళ్ళెవరు? మొత్తానికి సుస్మితకు ఆ పక్షిపిల్ల మధుర జ్ఞాపకాల్ని, ఆత్మీయతల్ని ఈ పర్యావరణంలో బాగానే నింపి పెట్టింది.

★ ★ ★

కన్నడ భాషలో దివంగత పూర్ణచంద్ర తేజస్విగారు రచించిన 'సుస్మిత మత్తు హక్కిమరి' కథకు యథాతథ తెలుగు అనువాదం.

అనువాదకుడు: శాఖమూరు రామగోపాల్.

28-05-2010.

# వెంకడి నాదస్వరం



కొన్ని రోజుల క్రితం పాములోడొకడు నా వద్దకు వచ్చాడు. తను వెంకడి బావనని, వెంకడు పామును పట్టుకొంటూ ప్రమాదవశాత్ పాము కాటునుంచి చనిపోయాడని చెప్పాడు. కొన్ని రోజులుగా జ్వరంతో నలుగుతున్న వెంకడిలో హుషారు లేకపోయినా, నాగుపాము పట్టుకొనేందుకు వెళ్ళి దాని తలను పట్టుకొనే బదులుగా దాని మెడను పట్టుకొన్నాడట. పాము మెడను వెనక్కి తిప్పి కాటేసినందున కొన్ని గంటలలోనే వెంకడు చనిపోయాడట.

“ఔనోయ్, పాము విషంకు ఔషధమని వేర్లను, తాయెత్తులను, మణి.... మొదలైనవాట్ని మాకు అమ్ముతుంటారు కదా! మరి మీకు పాము కరిస్తే ఔషధి వేసుకొనేందుకు కుదర్లేదా? అలాగైతే మీ దరిద్రపు వేర్లను కొనుక్కొని మేము ఔషధిగా ఉపయోగించుకొనేందుకు సిద్ధమైతే మా కథేంటి?” అని అడిగాను.

"మావద్ద ఉన్నవంతా నికార్సైన ఔషధాలే దొరా! దాన్లో మోసం ఏమిలేదు. ఆ ఔషధాల్నుంచే ఎంతో మంది ప్రాణాల్ని కాపాడాము కదా! అయితే పాము రెండు వేళ్ళ సందులో కరిస్తే మాత్రం ఎవరి హస్తవాసి, మంత్రం నుంచి ప్రాణంను నిల్పేది కుదరదు స్వామి. వెంకడికి సరిగా అక్కడే ఆ నాగుపాము కాటేసింది" అని బదులిచ్చాడతను.

"అయ్యో పాపం..., ఇక్కడికి వచ్చినప్పుడల్లా మా ఎస్టేట్‌కు వచ్చి పాముల్ని పట్టుండేవాడు. ఎంత ఘోరం జరిగింది!" అంటూ దుఃఖాన్ని చూపించాను.

"అతను బేలూరులో చనిపోయాడు దొరా! పాపం, అతను చనిపోతూ మిమ్మల్ని గుర్తు చేసుకొన్నాడు దొరా" అంటూ నాలోని కరుణను ఉద్రేకించేందుకు పచ్చి అబద్ధం ఒకదాన్ని నాముందు ఉంచాడు. చస్తూ నన్ను జ్ఞాపకం చేసుకొనేందుకు నేనేమి వెంకడికి ఏకమాత్ర ఆప్తుడ్నేమి అయ్యుండలేదు. మరలా నాచెంతకు వచ్చిన ఈ పాములోడికి వెంకడు జ్ఞాపకం చేసుకొంది నన్నే అని గుర్తైయ్యేది ఎలాగున సాధ్యపడుతది. ఎందుకంటే నేను వీడ్ని చూస్తుంది ఇదే మొదటిసారి. "మీ జాతోడైన వెంకడు గుర్తేనా" అని నేను ఇతడ్ని అడిగినందునే, నాకు వెంకడికి పరిచయం ఉందనే సూచన దొరికి, దాన్నే తన అనుకూలంకు ఉపయోగించుకొనేందుకని ఇతను ప్రయత్నిస్తున్నట్లుగా నాకు కనబడింది. ఇతను కొద్దిగా ఖదీమ్‌డే (దొంగోడే) అని తీర్మానించుకొన్నాను. అయితే సంభాషణల్ని ప్రారంభించిన మీదట ఎలాగైనా ముగించాలి కదా! అందుకని "అయ్యోపాపం... అయ్యిందేదో అయ్యింది. జరగరానిది జరిగిపోయింది కదా! పాముల్ని పట్టుకొనే వృత్తికి వెళ్తే అపాయం తప్పలేదుకదా... గజ ఈతగాడికి నీళ్ళనుంచే మరణం ప్రాప్తి అవుతది అన్నట్లుగా వెంకడి సావు పామునుంచే సంభవించింది కదా!" అన్నాను నేను.

"ఏంటి దొరా... పోతే పోనీ అన్నట్లుగా ఉదాశీనంగా ఉన్నారు. పోయినోడేమో పోయాడు పైకి. చల్లగా కళ్ళను మూసుకొని స్వామి పాదం చేరాడు. ఇప్పుడు ఇక్కడున్నోళ్ళ పాడేంటి? ఉన్న ఒక్క కూతుర్ని దిక్కులేనిదానిగా అనాథగా చేసి వెళ్ళిపోయాడు పై లోకాలకు. మేమిప్పుడు ఆ పిల్లను చూసుకోవాలి కదా!" అని అంటున్నాడు విషాదంగా.

వెంకడికి కూతురుంది నాకు గుర్తే లేదు. ఆ పిల్లను చూసిందీ లేదు. ఒకామెను ధర్మపత్నిగా చేసుకొని ఊరూరు తిరిగే దాన్ని మాత్రం చూసియున్నాను. అప్పుడెప్పుడో ఒక పసిపాప వాళ్ళజతగా ఉండేది. పుట్టిన కొన్ని నెలలలోపే ఆ పసిపాప చనిపోయిందని వెంకడు నాతో ఒకసారి అన్నాడు. వెంకడు నిజంగా చనిపోయాడో లేకపోతే వేరెవడో ఆ పేరున ఉన్నోడ్ని గురించి ఇతను చెపుతున్నాడో అనే అనుమానం నాలో పుట్టింది. వెంకడు చనిపోయినందుకు నేను బహిరంగంగా సంతాపంను సూచించనందుకే ఇతను నాలో దాగిన దయాగుణంను పెట్టుబడిగా చేసుకొని, నా వద్దనుంచి ఏమైనా గిట్టించుకొనేందుకు తయారై ఉన్నాడనేది మాత్రం కచ్చితమైంది నాకు.

"వెంకడి ధర్మపత్ని చనిపోయింది మీకు గుర్తేకదా" అంటూ మళ్ళీ ఇంకొక కరుణాపూరితమైన కట్టుకథను విప్పేందుకు (చెప్పేందుకు) నా ఎదురు పీఠికను వేసాడు. వెంకడు ఉన్నప్పుడే ఎన్నో సంవత్సరాల క్రితమే అతని అర్ధాంగి చనిపోయింది. ఆమె చనిపోయింది ఎన్నో రహస్యమైన ఊహాపోహలకు బలం చేకూర్చినవి. ఇక ఈ వచ్చినోడు మరొక గంట నన్ను తినేస్తాడు అనే దిగులు పుట్టి, "ఆ... ఆ... గుర్తే, గుర్తే, వదిలేయ్ ఆ కథను. నేను వెంకడ్ని మొదట చూసిందే అతని భార్య శవం పక్కన" అని అన్నాను. ఆమె చనిపోయిన పిమ్మట, వెంకడు మరొకామెను వివాహమాడేందుకు ప్రయత్నిస్తుంది తెల్సులే నాకు.

ఈ మాటలన్నీ చెప్పిన మీదటా ఆ ఆసామి నిల్చే ఉన్నాడు. "పాముల్నేమైనా పట్టుకొంటావా?" అని అడిగితే, "నాకు పుంగి (నాదస్వరం) ఊదేందుకు రాదు స్వామి" అని అన్నాడు. అయితే మా ఇంటిని వదిలి వెళ్ళకుండా నిల్చిన చోటే నిలిచాడతను. వీడి సాన్నిధ్యంనుంచి ఎలాగైనా చేసి బయటపడాలని నిర్ణయించుకొన్న నాకు తక్షణమే వేరే ఉపాయం తోచక "ఇప్పుడేమి కావాలి నీకు? స్థాణువుగా నిలబడే ఉన్నావు కదా?" అని పెద్దగా నోటిని విప్పి అడిగాను.

"ఏమి లేదండి దొరా... మీలాంటోళ్ళ దగ్గర మూడు కాసుల్ని ఆరుకాసుల్ని ఇప్పించుకొని ఆ వెంకడి కూతురుకు ఒక రవికె (జాకెట్)ను కొందామని అనుకొంటున్నానండి" అన్నాడు అతను.

అది పచ్చి అబద్ధమే! సాయంత్రంకు సరిగా రెండు గ్లాసుల విప్పసారా తాగేందుకే అతను డబ్బును నానుంచి అడుగుతున్నాడు. అయితే వాడి మాటలన్నీ అబద్ధమే అని అతనిమీద జోరుచేసి తనిఖీ ప్రారంభిస్తే, ఇంకా ఎన్నో గంటలుగా అతడ్నుంచి వచ్చే సంజాయిషిలోని కపటనాటకంను చూస్తూ ఉండాల్సి ఉంటది. అందుకని అతను తొలిగిపోతే బాగుండునని తక్షణమే ఒక రూపాయి ఇచ్చాను. అతను పరమానందంతో వెంకడి ఆత్మకు శాంతి కోరుతూ నానుంచి వెళ్ళిపోయాడు.

పాములోడైన వెంకడు పాముకాటునుంచి చనిపోయిందాంట్లో నిజం ఉండొచ్చు. ఎందుకంటే నేను అతడ్ని చివరి సారిగా చూసింది ఇప్పటికి మూడు సంవత్సరాల క్రితం కదా! కరియప్ప, వెంకడు ఎనిమిది మైళ్ళ దూరానుండే 'ఆలదూరు' నుంచి సైకిల్ పైన డబుల్స్‌గా తొక్కుకొంటూ వచ్చి నాతో తగాదపడ్డారు. నేను వారిమీద కావాల్సినంతగా రోచకంగా ఏమేమో రాసినందుకు వాళ్ళలో కోపం పుట్టింది. ఆ ఇద్దరూ చదువుల్ని చదివినోళ్ళు కారు. కరియప్ప బస్‌కని ఎదురుచూస్తూ నిల్చినప్పుడు అతనితోపాటుగా నిలబడ్డ హైస్కూల్ విద్యార్థులు నాచే రచించబడిన 'కర్వాలో' నవలలో కరియప్ప వెంకడి దర్మపత్నినే ఉంచుకొన్నాడని రాసినదాన్ని అతనితో చెప్పి పకపకా నవ్వారట. ఆ మాటల్నుంచి రేగిపోయిన కరియప్ప వెంకడ్ని వెంటేసుకొని 'ఇచారణ (విచారణ)' చేసేందుకు ఉదయానే మా ఇంటిముందు ప్రత్యక్షమయ్యారు.

"ఏమండోయ్ నేను కామాంధుడ్నే కావొచ్చు! నేను మన్మథ పీడితుడ్నే అని అనుకోండి. మొగోడన్న తర్వాత అడుసు (బురద)లో కాలేస్తాను. నీళ్ళు కనబడ్తే కడుక్కొంటాను. అయితే నేనే జాతోడ్ని? వెంకడు ఏ జాతోడు. నన్ను మీరు (ఇంతగా) దిగజారినోడ్నని అనుకొన్నారు కదా" అంటూ కరియప్ప నామీద పెడబొబ్బల్ని పెట్టాడు.

బహుశః ఇంతకు మునుపెన్నడూ ఏ రచయితకు, అతను సృష్టించిన పాత్రలు ఇలాగున ఏకథమ్ కథల్నుంచి బయటకు వచ్చి ఇచారణ (విచారణ) చేసియుండలేదని నాకు అనిపిస్తుంది. నేను కర్వాలో నవలను రచించిన పదిహేను సంవత్సరాల తర్వాత, దాన్ని స్కూల్ విద్యార్థులకు పాఠ్యపుస్తకంగా చేయగా ఆ విద్యార్థుల

నోళ్ళనుంచి ఇతని (కరియప్ప) చెవులలో రాసింది, రాయనిది అంతా పూర్తిగా నిండిపోయి, ఆ పాత్రదారులే నా వద్దకు వచ్చి పోట్లాటకు దిగుతారనేది నాకు కలలోనైనా, మనస్సులోనైనా మెరవలేదు. వారి మీద ఏ దురభిప్రాయం లేని నేను, ఇష్టం వచ్చినట్లుగా రాసి వారి మాన మర్యాదల్ని బజారుకు ఈడ్చేందుకు కారణమే లేదు నాలో. నేను చెడుగా ఏమి రాయలేదని, ఒక వేళ ఏమైనా చెడురాతలు రాసి ఉంటే ముమ్మందు 'కర్వాలో' పునఃముద్రణ పొందేటప్పుడు (జరిగేటప్పుడు) సరిగానే రాసి సరిజేస్తానని చెప్పాను. వాళ్ళలో నామీద కోపం ఎంత క్షణికంగా ఉందంటే, నేను చెప్పిన ఈ రెండు వాక్యాలకే వాళ్ళలో సమాధానం, సంతృప్తి కలిగి, అదేమి రాసారు మా గురించి అనేది సైతం వాళ్ళు నానుంచి 'ఇచారణ (విచారణ)ను' చేయలేదుకదా!.

వెంకడు నిర్గమిస్తూ (వెళ్ళిపోతూ) "మీకంతా గుర్తే కదా దొరా... నా జీవితం. దాన్నంతా వివరంగా రాయండి. ఉత్తిగనే ఏమేమో కల్పించుకొని రాయకండి" అని చెప్పి వెళ్ళిపోయాడు. వెంకడ్ని నేను చూసింది అదే చివరిసారి.

★ ★ ★

వెంకడ్ని నేను మొదటిసారిగా చూసినప్పుడు చుట్టూ పోగైనోళ్ళ దృష్టిలో అతనొక హంతకుడిగా ఉన్నాడు. అతని అర్థాంగి మైదానంలో వేసుకొన్న అతని గుడారం చెంత చచ్చిపడి ఉంది. దార్లో పోయేవాళ్ళంతా అతని గుడారం వద్ద గుంపుగా చేరియున్నారు. వెంకడు తన భార్య శవం వద్ద కూర్చుని హో అంటూ బోరున విలపిస్తున్నాడు. వెంకడు అప్పట్లో నాకు తెల్వదు. అందుచేత గుంపులోని గోవిందయ్యను ఏమిటి విషయం అని అడిగాను. నా ప్రశ్నకు "వెంకడు తన భార్యను ఎవరో ఖూని చేసారని అంటున్నాడు! దరిద్రంతో తులతూగుతుండే ఈ ఘనందారి మహిళను పట్టపగలు అదీ ఈ సార్వత్రిక మైదానంలో ఎవరు ఎందుకని ఖూని చేస్తారో చెప్పండి. ఆమె వద్ద నగలు, నాణాలేమైనా ఉన్నవా?" అంటూ అతను వాపోయాడు.

"ఖూని కాదు ఏమి కాదు! ఇది ఖూని అయితే ఆ శవం వంటిమీద ఒక గుర్తుకైనా గాయం ఉండాలి కదా! నిద్ర పోతున్నదానిలాగ పడుకొని ఉంది శవం!

ఈ లంజాకొడుకే (సూళెమగనే) ఆమె గొంతు పిసికి, చంపి, ఇప్పుడు పెడబొబ్బల్ని పెట్టుత్నాడు" అంటూ పక్కన నించొన్న ఇంకొక వ్యక్తి చెప్పుకుపోసాగాడు.

"అటు చూడండి! వాడి గుడారం లోపలంతా ఆ పాముబుట్టలలో, ఆ జోలి మూటలలో ఎన్నోరకాల పాములున్నవి కదా! వాటిలో నుంచి ఏదైనా పాము బయటకు వచ్చి ఆమెను కరిచిందో ఏమో... దాన్నుంచే ఆమె చనిపోయి ఉండొచ్చు" అంటూ మరొకతను (ఎల్లయ్య) మాటల్ని పొడిగించసాగాడు.

నేను నిల్చిన ఈ చోటునుంచే అతని గుడారంవైపుకు దీక్షగా చూసాను. పెద్ద పాము (ఉరగం) ఒకటి ఆ గుడారంకు ఆధారంగా పాతిన గూటంకు పెనవేసుకొని పడి ఉంది నాకు కనబడింది. దాని సైజ్ చూసి ఇది కొండచిలువగా ఉండొచ్చని భావించాను. అయితే అది కొండచిలువ కాదట. దాసరపాము అని పక్కనున్నోడు తెల్పాడు. ఆ గుడారం లోపలంతా ఈ రకమైన యమదూతలులాంటి నూరారు పాముల్ని నింపుకొని ఇప్పటివరకూ అతని భార్య బతికిందే ఒక ఆశ్చర్యంగా నాకు తోచింది. అయితే అతని భార్య చనిపోయింది ఏ విధంగా అని ఎవరిలోనూ సరైన అభిప్రాయం లేదు. మొత్తానికి మంచి సౌష్టవ దేహంతో ఉన్న ఆమె చనిపోయింది మాత్రం నిజం. అక్కడున్న అందరి అభిప్రాయాలలో ఆమె పాము కాటు నుంచో లేకపోతే వెంకడి ఖూని నుంచో చనిపోయి ఉండొచ్చు అనేది ఉంది.

"నేను ఇప్పుడే కదా పట్టణం నుంచి ఇక్కడికి వచ్చాను. వచ్చిచూస్తే నా భార్య చనిపోయి ఉంది! నేనెందుకు ఖూని చేస్తాను నా అర్ధాంగిని?" అంటూ పేట (పట్టణం) నుంచి తనకు జతగా వచ్చినోడొకడ్ని చూపెట్టాడు. పాము కాటునుంచి చనిపోతే వళ్ళంతా నీలంగా మారిపోతదని, ఈమె చావు పాముకాటు నుంచి కానేకాదని వెంకడు ఘంటాపథంగా చెపుతున్నాడు.

వెంకడు తన అర్ధాంగి ఎలాగున చచ్చిందనేందుకు ఎక్కువగా దృష్టిని నిల్పకనే, ఆమె చనిపోయిందని పెద్ద గొంతుతో ఏడుపు రాగాల్ని, తీగరాగాల్ని ఆలపిస్తున్న దానిమీదే గమనం పెట్టాడని, అక్కడ గుంపుగా ఉన్నోళ్ళందరికీ ఈ ఖూనీ కోరే ఆమెను చంపియుండొచ్చునే అనుమానం అతని ప్రవర్తననుంచి కారణమై ఉంది. "వీడే చంపియుండొచ్చు! బాగా కొట్టి యుండొచ్చు. ఎక్కడో నవరంధ్రాలలో ఆ వేట్లు (దెబ్బలు) తగిలి ఆమె చనిపోయి ఉండొచ్చు. అలాగే పడుకోబెట్టి పట్టణంకు

వెళ్ళివచ్చి ఇప్పుడు శోకరాగాల్ని పెట్టున్నాడు. ఆ భాడకోవ్ కళ్ళలో ఒక నీటి బొట్టైనా ఉందటండి! ఉత్తిగనే తన పిపీ (నాదస్వరం)ని తనే ఊదుకొన్నట్లుగా శోకం పెట్టున్నాడు" అంటూ అతని కళ్ళలో నీరు తొణికిసలాడని దాన్నుంచే అతనే ఖూని చేసాడనే దాన్కి ప్రథాన సాక్ష్యంగా చేసి ఎవరో నా పక్కన నిలబడినోడితో అంటున్నాడు.

వెంకడి ఏడుపు రాగాలకు కరిగిన అక్కడ గుంపులో ఉన్నోళ్ళంతా తమ జేబుల్నుంచి కొంచం కొంచం చిల్లర నాణాల్ని తీసి, "పోనీయండి, ఎంతైనా ఆడకూతురు కదా... ఎలాగో చనిపోయింది. అది దుర్మరణమో, హఠాత్ మరణమో, సత్ మరణమో ఎవరికి తెల్సు? సరిగా కర్మకాండ (దపన్)ను నెరవేర్చు. డబ్బులు జనంనుంచి దొరికినవని వెళ్ళి తాగకు" అని చెప్తూ తలా కొద్దిగా ఆ డబ్బుల్ని ఇచ్చారు. నేనూ జేబులో ఉన్న చిల్లర ఇచ్చి వెళ్ళిపోయాను.

ఈ వెనకటి ఇతివృత్తం నుంచి వెంకడు మొదటిసారిగా నా తోటకు నాదస్వరం ఊది పాముల్ని పట్టుకొంటానని వచ్చి అడిగినప్పుడు అతడ్ని తీవ్ర అనుమానంతో చూసాను. పాములోళ్ళు నాదస్వరం ఊది పాముల్ని ఆడించేది నేను చూసి ఉన్నా, నాదస్వరం ఊది పాముల్ని పిల్చి వాట్ని మైమరపించి పట్టుకొనేదాన్ని నేను చూసింది, నమ్మింది లేదు ఇప్పటిదాకా. నాదస్వరం ఊది పాముల్ని పిల్చి పట్టుకొంటానని అతను చెప్పినప్పుడు, మొదలు ఇక్కడ్నుంచి వెళ్ళిపో అని గదిరాను. చెవులే లేని పాములు ఇతడి నాదస్వరంలోని పాటలకు వస్తవనేది పక్కాగా అబద్ధమే అనేది నా తర్కంగా ఉంది.

నా ప్రతిక్రియ (గదిరింపు) నుంచి వెంకడు కొద్దిగానైనా నిరుత్సాహ పడలేదు. బహుశః ఎంతోమంది ఎన్నోసార్లు అతడ్ని నాలాగే తిట్టూ గదిరించి ఉండొచ్చు. పైపెచ్చు ఇదే అతని పొట్టను నింపే వృత్తి అయినందున అతను సహనం కోల్పోకుండా ఉండేదుంది. మురికిపట్టి చిరుగులు పడిన తన కోటు జేబునుంచి ఎవరెవరో రాసిన సిపారస్‌తో ఉన్న సర్టిఫికేట్లను బయటకు తీసి ఎటువంటెటువంటో ఘట సర్పాల్ని పట్టుకొని తను ఆ పెద్దోళ్ళనుంచి ఎంతెంతగా ఇనాము పొందింది వివరించాడు. అనేకసార్లు ముట్టి మడిచిపెట్టిన ఆ సర్టిఫికేట్లు చీలిక పీలికలై ఉన్నవి. వాట్ని ఏ పెద్దోళ్ళు రాసారు, ఏమి రాసారు అనేది పరిశీలించేందుకు సాధ్యమే కాదు కదా!.

ఆ రోజు వెంకడు నాదస్వరం ఊది ఎన్నో పాముల్ని మా ఇంటిప్రక్కనే పట్టుకొన్నాడు. కట్లపాములు, నాగుపాములు, జర్రిపోతులు, మన్నుపాములు... మొదలైన ఐదారు రకాల పాముల్ని పట్టుకొని, వాటి కోరల్ని పీకి, తన బుట్టలో జోలిలో వేసుకొన్నాడు. ఇంటి పక్కనే ఆకులలముల రాశి అడుగున, పూలకుండీల మాటున దాగియున్న పాముల తోకల్ని బయటకు గుంజుతూ తన విద్యను ప్రదర్శిస్తున్న దాన్ని చూసి నేను కంగారైయ్యాను. ఎంత అపాయకరమైన సన్నివేశాలలో నేను కాపురం చేస్తున్నదాన్ని ఆలోచించి అతడ్ని (వెంకడ్ని) అప్పుడప్పుడూ వచ్చి ఇక్కడుండే పాముల్ని పట్టుకొని వెళ్ళు మహాశయా అని చెప్పాను. నా కళ్ళకు ఒకే ఒక రోజు కనబడని ఈ భయంకర విష నాగులు అక్కడ ఎలాగున దాగియున్నవోనని ఆశ్చర్యపడ్డాను.

ఖూనీకోరుగా మొదట్లో కనబడిన వెంకడు, ఇప్పుడు నా జీవరక్షకుడిగా కనబడుతున్నాడు.

నాదస్వరం ఊది పాముల్ని పట్టిన వెంకడి చమత్కారంను ఒక అద్భుతం చూసినోడిలాగ నేను ఇతరులకు తెల్పినప్పుడు విన్న నా మిత్రులు ఒకరొకరిగా ఒకొకరీతిలో అనుమానాల్ని నా తలలోనాటి, ఆ నా నమ్మకాల మాటల్ని తేలికగా కొట్టిపారేసారు.

“థు... థూ... దొంగ ముండాకొడుకు! మీ వద్ద డబ్బు గుంజేందుకు ఇదంతా కనికట్టు చేసాడు. మా వద్దకు వచ్చి ఊదమనండి ఆ నాదస్వరంను” అంటూ మల్లయ్య పటేల్ వెంకడి చమత్కారంను తిట్టాడు.

“కనికట్టు అంటే ఏమిటి మల్లయ్య పటేలా..? అతను పాముల్ని పట్టుకొంది నేను నా కంటితోనే చూసాను కదా” అన్నాను నేను.

“కనికట్టు అంటే మరేమి లేదు. నాదస్వరం ఊదుతూ మాయచేస్తాడు. మీ కంటికి అతని చేతిలో ఉన్న అతని తలపంచె, చెట్టు, లతలు, పగ్గం (తాడు) అన్నీ పాములాగనే కనబడుతవి. అంతే మరి” అన్నాడతను.

మల్లయ్య పటేల్ చెపుతున్న మాటలలోని అర్థం ఏమిటంటే వెంకడు నాలో తాత్కాలికంగా (టెంపరరీగా) మతిభ్రమణ చేసినట్లుగా ఆ మాటలలోని అర్థం అదిగా

ఉంది. ఏదో ఊర్లో ఇలాగే పాముల్ని పట్టేందుకు వెళ్ళి, కనికట్టు చేసి ఆ మీదట యజమాని డబ్బు ఇవ్వనందున ఆ పాములోడు ఆ కనికట్టును ఉపసంహరించు కోలేదట. ఆ యజమానికి కళ్ళలో పడిన లతలు, తీగలు, త్రాళ్ళు.... అన్నీ పాము తరహాగా కనబడినవట. చివరికి ఆ పాములోడ్ని మరలా ఎలాగో బ్రతిమాలుకొని, న్యాయంగా అతనికి ఇవ్వాల్సిన రొక్కంను ఇచ్చిన మీదటే ఆ కనికట్టు తనకితానే అదృశ్యమై పోయిందట.

"సాకిన పాముల్ని అతను (పాములోడు) తెచ్చి మొదటే మీ ఇంటి దగ్గర ఎవరికీ గుర్తుగాకుండా వదుల్తాడు. ఆ తర్వాత నాదస్వరం ఊది వాట్ని పట్టుకొంటాడు. అడవిలోని పాములు మనుషులు పిలిస్తే, నాదస్వరం ఊదితే ఎక్కడ్నుంచైనా వచ్చి తమ కోరల్ని పీకించుకొంటవా? కడుపు నింపుకొనేందుకే వీటన్నిట్నీ ఒక మాయదారి ఆటలాగ అతను ప్రదర్శిస్తాడు" అన్నాడు ఒకతను.

"అతను నడుంకు పాముల్ని బెల్ట్‌లాగ చుట్టుకొంటాడట. నాదస్వరం ఊదుతూ మీరు అటు ఇటు చూస్తున్నప్పుడు మెల్లగా వాట్ని వదిలి ఆ తర్వాత పట్టుకొంటాడట. మీరేమైనా అతని వంటిని, చేతుల్ని, నడుంను ముట్టి చూసి పరీక్షించారా?" అన్నాడు మరొకతను.

"ఏమిటి సార్.... మీలాంటి ఎడ్యుకేటెడ్ పర్సన్, విచారవాది, సైంటిఫిక్‌గా ఆలోచిస్తుండేవారు, ధర్మస్థళకు వెళ్ళి తల గొరిగించుకొనేవాళ్ళను అపహాస్యం చేస్తుండే మీరే ఇలాగున మోసపోతే ఇక మాలాంటి పల్లెటూరోళ్ళు మంత్రం, తంత్రం, దెయ్యం, దేవుడు.... మొదలైనవాట్ని నమ్మే దాంట్లో ఆశ్చర్యపడేదేమి ఉండదులేండి. పాము సంగీతంను విని దగ్గరకు వస్తది అని అతను చెప్తే మీరు నమ్మారు కదా! పాముకు వినేందుకు చెవులు ఉండవు అనే సింపుల్ ఫ్యాక్ట్ మీకు తెల్వదా?" అని కేంద్ర ప్రభుత్వ సుగంధద్రవ్యాల (స్పైసెస్ బోర్డ్) సంశోధన కేంద్రంలో ఉద్యోగాల్ని చేస్తున్న సైంటిస్ట్ మిత్రులందరూ సామూహికంగా నన్ను గేలి చేయసాగారు.

మొత్తానికి నేను వెంకడి విచారం ఎత్తినప్పుడల్లా, నా మిత్రులు నేను మతాంతరంకు వశమైనోడిలాగ పరిగణించి నన్ను విమర్శించసాగారు. నన్ను పరివర్తన చేసిన వెంకడు మూఢ నమ్మకాలకు అధినాయకుడిగా నా మిత్రులకు కనబడుతున్నాడు ఇప్పుడు.

నాలో అప్పటిదాకా మా ఇంటివద్ద ఆ భీకర విష సర్పాల్ని పట్టుకొని మా కుటుంబంను దుర్మరణం నుంచి రక్షించాడు కదా అని వెంకడిమీద ఉన్న కృతజ్ఞత అంతా వీళ్ళు (మిత్రులు) నాటుతున్న, విత్తుతున్న సంశయాలనుంచి నిధానంగా కరిగిపోవసాగింది. వెంకడి చురుకుమాటలు, నడవడిక, చలాకితనం గమనించిన నాకు ఇప్పుడతను మోసగాడిగా అయ్యుండొచ్చని అన్పించసాగింది. నాగుపామును పట్టే ఒక రూపాయి, ఇతర పాముల్ని పట్టే ఎనిమిది అణాలని బేరం కుదుర్చుకొని నానుంచి ఐదారు రూపాయల్ని గుంజాడు అతను. డబ్బు పోయినందుకు నాకేమి దిగులు లేదు. అయితే నాకు మంకుబూదిని పులిమి మోసం చేసాడు కదా అనేది నా మనస్సులో వేదించసాగింది.

వెంకడు తన ఉదర పోషణ నిమిత్తం నావద్దకు వచ్చి పాముల్ని పట్టి వెళ్ళింది నిధానంగా నాలో అనేక రకాల తాత్విక సమస్యల్ని రేగించింది.

మరొకసారి అతను ఇటువైపుకు ముఖం చూపెత్తే, అతని కనికట్టు విద్యను బయట పడేసి, అతనిమీద ఊసి ఒకపైసా సైతం ఇవ్వకుండా పారద్రోలాలని నిర్ణయించాను. అతడ్ని ఏఏ విధాలలో పరీక్షకు గురిచేయాలని కీటకాలమీద శాస్త్రజ్ఞుడైన నా స్నేహితుడు సిద్దప్ప వద్ద సమాలోచన చేసాను. నాకు ముఖ్యంగా కనికట్టు చేసి మతి భ్రాంతిని కలగజేస్తే ఎలాగున కనుగొనేదుంటదనే చింత నాలో ఉంది. అతను పామును పట్టుకొనేటప్పుడు ఫోటో తీయాలని, మనుషుల కళ్ళకు వశీకరణ మాయను చేసినా, కెమేరా లెన్స్‌లకు మోసం చేసేందుకు సాధ్యంకాదని తీర్మానించాను.

అయితే వెంకడు ఎన్నోరోజుల (నెలల) వరకూ మా వద్దకు రానేలేదు. 'మూడిగెరె' (చిక్కమగళూరు జిల్లాలోని తాలూకా కేంద్రం)లోని చిన్న మైదానంలో అతను వేసుకొన్న గుడారం మాయమైంది. అతను వేరెక్కడో తిరిగేందుకు వెళ్ళియుండొచ్చని ఊహించాను. ఈ పాములోళ్ళే అంత! ఒక చోట స్థిరంగా ఉండకనే కర్నాటక మొత్తం ఎక్కడెక్కడో సంచార జీవులుగా తిరుగుతుంటారు. నాకు ఈ పదిహేను సంవత్సరాల అవధిలో అతను ధారవాడ, హరిహర, రాయచూరు, హుణసూరు, హొళెనరసీపుర మొదలైన చోట్ల తిరుగుతుండేది కనబడింది. ఇప్పుడు మరొకామెను

పెళ్ళి చేసుకొనేందుకు ఆలోచిస్తున్న అతనికి ఎవరైనా అతని కులంకు చెందినవాళ్ళను వెతుక్కొని పోయేదుంది కదా! సరైన అడ్రెస్‌లు లేని తన జాతోళ్ళను ఎలాగున వెతుకుతాడో ఏమో!.

నేను అతని మోసంను బయట పెట్టేందుకు ఎదురు చూస్తున్నప్పుడు ఒకసారి అతను నాకు సకలేశపురంలో కనబడ్డాడు. రోడ్ ప్రక్క ఏవేవో చెట్ల మూలికల్ని రాశిగా పోసుకొని గజ్జి, తామర, చెమటగుల్లలు, తేలు, పాము కాట్లుకు ఇవే ప్రధాన వనమూలికలు అనే మాటల్ని ఒత్తి పలుకుతూ అమ్ముతున్న అతని చెంత శుభ్రపరిచిన పాము చర్మాలు బారుగా వేలాడదీసియున్నవి. విదేశి యాత్రికులు ఎవరైనా అతని వద్దకు చేరితేనే మాత్రం ఆ చర్మాలకు గిరాకి ఉంటది.

అతని పక్కనే దాసరపాము పెద్ద మూటలాగ చుట్టుకొని పడి ఉంది. అదైతే ఏమి కదలకనే నిర్జీవ జంతువు లాగ కనబడుతుంది. దాని చుట్ల లోలోపలినుంచి బయటకు త్రొంగిచూస్తున్న దాని తల చివర్న అప్పుడప్పుడు మెరుపులాగ బయటకు చాపుతున్న దాని చీలిక నాలిక నుంచే అది సజీవంగా ఉందనే సంకేతం తెల్సివస్తుంది నాకు. నాదస్వరం ఊదితే అదేమి తలను ఆడించే పాములాగ కనబడలేదు. ఈ మొద్దు ప్రాణిని కేవలం జనంను ఆకర్షించేందుకు మాత్రమే వెంకడు తన వద్ద అట్టిపెట్టుకొన్నట్లుగా కనబడుతుంది. దాన్ని చూసేందుకని వచ్చినోళ్ళందరికీ అతను ఏవేవో మాటల్ని చెప్పి వాళ్ళకు ఆ గిడ మూలికల్ని అమ్మేందుకు ప్రయత్నిస్తున్నాడు.

నేను అతనున్న గుంపు వద్దకు వెళ్ళలేదు. సమీపంకు వెళ్తే ఏదో ఒకదాన్ని చెప్పి, అమ్మి, డబ్బులు గుంజేందుకు సిద్ధమౌతాడు. అందరి ముందు చౌకాశి, వాగ్వాదం మొదలైనవి చేసేది నాకు ఇష్టం లేదు. అతను పాముల్ని పట్టే మోసం గురించి అందరిముందు తిట్దామని నాలుకు ఆతురపడుతున్నా, దాన్ని ఆపుకొని నిధానించాను యోగిలాగ.

వెంకడ్ని దూరంనుంచి చూసినప్పుడు అయ్యో పాపం అని అన్పించింది. నాగరికత విజృంభిస్తూ వెంకడి కులవృత్తిని, చేతిపనుల్ని నిధానంగా నిరుపయోగం చేసింది. గవర్నమెంట్ పాము చర్మాల్ని ఎగుమతి చేసేది నిషేధించిన మీదట వెంకడి పాము చర్మాలకు డబ్బు దొరకట్లేదు. అతనివద్ద దొరికే అపురూపమైన చక్రాణివేర్లు,

చిత్రమూల వేర్లు, సర్పగంధి, అళలేకాయలు... ఇంగ్లీష్  (అలోపతి) ఔషధాల ఎదురు గిరాకిని పోగొట్టుకొన్నవి. మొదట్లోలాగ కుందేళ్ళను, కౌజుపిట్టల్ని, అడవి బాతుల్ని, ముళ్ళ పందుల్ని వేటాడేందుకు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అతనికి అవకాశం ఇవ్వట్లేదు.

వెంకడి మనస్సులోపల తను ఈ నాగరిక (ఇండియా) ప్రపంచంకు పరాయి వ్యక్తిగా, ఏకాకిగా ఉంటున్న భావం అతనిలో ఉండొచ్చు. అతను తనలోని చాకచక్యం, చలాకితనం ఉపయోగించి జనాన్ని రంజింపజేసి, నమ్మించి, నిద్రపోతున్న దాసరిపాము ఎదురు నాదస్వరం ఊది, తిండి సంపాదన పొందేందుకు హైరాణా పడుతుంటే, "కనికట్టును ప్రయోగించే లంజాకొడుకు" అంటూ జనం దూషిస్తున్నా సహనంతో ఆ మాటల్ని సహించుకొంటూ జవాబుల్ని చెపుతున్నదాన్ని చూసాను నేను ఖుద్దుగా. ఇండియా (భారతదేశం)లోని అడవులు, వన్యమృగాలు, పక్షుల సంకులం, నదులు, ఝురులు ఓరిమితో తమ అవసానం(అంత్యం)ను ఎదురుచూస్తున్నట్లుగానే వెంకడూ ఎదురుచూస్తున్నాడు నవ నాగరికతను. చరిత్ర (ఇతిహాసం) ఎన్నడో అతని భవిష్యత్‌ను తీర్మానం చేసుకొంది. ఓడిపోయే యుద్ధం ఒక దాంట్లో వీరుడిగా, పరాక్రముడిగా పోరాడుతూ వీధి అంచుకు అతను నెట్టబడియున్నాడు.

★ ★ ★

వెంకడు మరోమారు నాకు కల్సేందుకు మొదలు సుగంధ ద్రవ్యాల మండలికి చెందిన సైంటిస్ట్ ఒకరు హడావుడిగా నా వద్దకు వచ్చి వెంకడు ఎక్కడ దొరుకుతాడని అడిగారు. కారణం ఇదండి! వాళ్ళ ఆఫీస్‌లో పాము ఒకటి వచ్చి తిష్ట వేసిందట. సిమెంట్ గరుకు గచ్చుమీద సరిగా ప్రాకేందుకు వీలుకాని ఆ పాము ముందుకే పోయేందుకు కష్టపడుతుంటే, అక్కడుండే సిబ్బంది (స్టాఫ్) అంతా ఇది ఎవడ్నో కాటేసే ఉద్దేశం నుంచే ఇలాగున ప్రాకుతుంది అనే అనుమానం పెట్టుకొని ఆఫీస్ నుంచి పారిపోయారు. పాముకూ మృత్యువుకు అవినాభావ సంబంధం ఉన్నందున దాన్ని చూస్తే అందరికీ భయమేకదా!

"ఔనండి, ఆఫీస్‌లోకి వచ్చిన పామును పట్టుకొని చంపేందుకు వెంకడు ఎందుకండి? అడవిలోని పొదలలోనో, పుట్టలోనో దాగియున్న పామైతే నాదస్వరం

ఊది దాన్ని బయటకు రప్పించమని వెంకడికి చెప్పొచ్చు. దీన్ని ఇప్పుడు మీరే ఎవరైనా కొట్టిపడేయ్యొచ్చుకదా” అన్నాను వారితో.

“నా అర్థాంగి గర్భిణి అండి! నేనిప్పుడు మాత్రం పామును కొట్టేదిలేదు” అన్నాడు ఒకతను.

“అయ్యయ్యో, నేను లింగాయత్ కులపోడ్నండి. పాము మాకు దేవుడితో సమానం. అందర్నీ వదిలి, దాన్ని చంపేందుకు నాకు మాత్రమే చెపుతున్నారేంటి? భలే భలేగా ఉందండి మన ఆఫీస్‌లోని పై అధికారులు ధోరిణి'' అంటూ నిరాకరించాడట ఇంకొక నౌకరు.

మరొకతనైతే ‘‘అది ఎండేంజర్డ్ స్పీషి షెడ్యూల్ పట్టికలో ఉందండి (కనుమరుగౌతున్న ప్రాణుల జాబితాలో ఉందండి). దాన్ని కొట్టి చంపేది యాక్ట్‌కు విరుద్ధంగా ఉంటదండి” అని ఘోషించాడట.

మొత్తానికి ఆ సిబ్బంది అంతా యాక్ట్‌కో, మనఃసాక్షికో బెదిరి ఆఫీస్ వదిలి పారిపోయారు. ఆ సమయంలో ఎవరో నేను పాముల్ని పట్టే వెంకడి గురించి చెప్పిందాన్ని గుర్తుకు తెచ్చుకొన్నారట. అందుకనే వెంకడు ఎక్కడున్నాడో తెల్సుకొనేందుకు నా వద్దకు ఆ సిబ్బంది (స్టాఫ్) అంతా వచ్చారు.

నేను ఆ సంశోధన కేంద్రం వద్దకు వెళ్ళినప్పుడు ఆరుబయట తేనె పురుగుల పెట్టెలు, పట్టు పురుగులు పట్టుగూళ్ళను కట్టుకొనే చంద్రికలు, పురాతన కాలంలోని ఫైళ్ళు, పుస్తకాలు.... ఇవన్నీ ఒక పెద్ద గుట్టలాగ ఆఫీసు ముందు పడియున్నవి. పాము ఆఫీస్‌లోకి చేరిన తక్షణమే ఆ సిబ్బందంతా ఆ జాగాను ఖాళి చేసారు. అందుచేత పాము బయటకు వచ్చిందాన్ని ఎవరూ చూడలేదు. కొద్దిసేపైన తర్వాత ఆఫీస్ లోపలికి వెళ్ళినోళ్ళకు నిరంతరంగా ప్రాణభీతి ఉంది. ఏ క్షణాన ఏ ఫైల్ నుంచో, ఏ టేబిల్ సొరుగు నుంచో పాము బుసగొట్టూ తమ మీదకు ఎగిరి కాటేస్తదేమో అనే భీతి వాళ్ళలో ఉంది. చివరికి ఈ దిగులునుంచి వర్క్ చేసేది కుదరక ఆఫీస్‌లోని సామానులన్నిట్నీ, ఫైళ్ళను బయటకు తెచ్చి ‘థరో చెక్ ఆఫ్’ చేస్తున్నారు. కొంతమందైతే స్టోర్‌లో ఉంచిన యాలకుల సువాసనకు అది వచ్చిందని,

మరికొందరేమో ఆఫీస్‌లో తిరుగుతుండే ఎలుకల్ని తినేందుకు వచ్చిందని వాదనలను చేసుకొంటున్నారు.

ఈ సంఘటన నుంచి నాకైన ఒక అనుకూలం ఏమిటంటే నా సైంటిస్ట్ మిత్రులు పాములోడైన వెంకడి విషయంను ప్రస్తాపించి నన్ను గేలిచేసేదాన్ని తగ్గించుకొన్నారు.

వెంకడు నాకు మరలా రెండోసారి దొరికినప్పుడు ఈ సంఘటన గడిచిపోయి ఎన్నో రోజులు అయ్యింది. వెంకడికి నా ధోరణిలోని మార్పులు నా మాటల దూకుడు నుంచే గుర్తైంది.

"నువ్వు మొదలే వేరెక్కడో పట్టుకొన్న పాముల్ని తెచ్చి, వాట్ని మా ఇంటి చెంతే వదిలి మళ్ళా పట్టుకొంటున్నావు అని నేనంటే ఆ నా మాటలలో అసత్యమేది లేదు. నా కళ్ళకు ఒకే ఒకరోజైనా కనబడని అన్ని పాముల్ని నువ్వు పట్టుకొంది ఎలాగో నాకు చెప్పు?" అంటూ దభాయించాను.

"ఎప్పుడు ఎలాగున దొరా... నేను మీ ఇంటి చెంత ఆ పాముల్ని దాబెట్టేందుకు వచ్చింది? రాత్రే తీసుకొని వచ్చి వాట్ని మీ ఇంటిముందే వదిలి వెళ్తే, అవి సూర్యుడు ఉదయించేవరకూ నా కోసం కాచుకొని ఉంటవా? ఇప్పుడు నా బుట్టలోపల రెండు నాగుపాములున్నవి. రామలక్ష్మమ్మగారితోటలో నిన్న పట్టుకొన్నాను. వాట్ని ఇప్పుడు వదిలి నాదస్వరం ఊదుతాను. మీరే చూడండి! నాదస్వర శబ్దంను వినకుంటే అవి అడవిలోకి పారిపోతవి తప్పితే నా చెంతకు వచ్చేది లేదు" అని చెప్తూ బుట్టలోపల దాచిన పాముల్ని వదిలేసి నాదస్వరం ఊదాడు. అవి అటు ఇటు బుసగొట్తూ పరారైయ్యేందుకు ప్రయత్నిస్తున్నవి. అవి ఎక్కడైనా తప్పించుకొనిపోతే ముమ్మందు నాకే కష్టం కలిగించొచ్చని, వాట్ని పట్టుకొని బుట్టలో భద్రంగా దాబెట్టమని అరిచాను.

"నువ్వు మా మల్లయ్య పటేల్ చెప్పినట్లుగా కనికట్టు చేసి మమ్మల్ని మైమరపిస్తావ్.... అంతేకదా!" అన్నాను నేను.

"మల్లయ్య పటేల్ చెప్పిండా? వారికేమి దొరా మాట్లాడేందుకు ఏ అడ్డు అదుపు ఉంటది? మీ ఒక్కరి వద్దేకాదు... అందరివద్దా అలాగే చెపుతున్నారు వారు. కనికట్టు, మాయలు గుర్తైతే పాముల్ని పట్టి మీవద్ద బికారోడిగా చేతిని చాపేదుంటదా నాకు?

మాయల్ని, కనికట్టును చేసి బోలెడంత డబ్బుమూట కూడగట్టుకొని నా జోలి మూటలో వేసుకొన్నాను అన్నట్లుగా మాట్లాడుతున్నారు కదా మీరు! ఆ మల్లయ్య పటేల్ మాటల్ని విని ఉత్తిగ ఉత్తిగనే నామీద ఎగిరిపడకండి" అన్నాడతను విషాదంగా.

"మరైతే పాముకు చెవులు ఎక్కడుంటవో చూపించు. చెవులే లేకుండా ఉన్న ప్రాణి, నీ సంగీత సుధాంబుదిని విని నీ చెంతకు వస్తదా?" అన్నాను మళ్ళీ.

"అది కాదు దొరా... మనలాగే చెవులు లేకున్నా శబ్దాల్ని వినలేవా పాములు? అలాగైతే మనలాగే కాళ్ళు లేవు కదా పాముకు! అలాగని అవి తిరిగేందుకు కుదరట్లేదా దొరా....? ఇదంతట్నీ ఆ పైనున్నోడు (భగవంతుడు) చేసే విచిత్రం దొరా. ఎంతో చదివిన, జ్ఞానం పొందిన మీరే పల్లెజనంలాగ మాట్లాడితే ఎలా దొరా....!"

నా సైంటిస్ట్ మిత్రులందరూ నా వద్ద ఎత్తిన సందేహాలన్నిటికి చటపటగా కచ్చితంగా తనదే అయిన విజ్ఞాన రీతిలో వెంకడు జవాబుల్ని చెపుతున్నాడు. మొత్తానికి నా సైంటిస్ట్ మిత్రులు మరియు వెంకడి నడుమ అడకత్తెరలో చిక్కుకున్న వక్కలాగ మూడుడ్డైనోడ్ని నేనేకదా! ఈ రెండు వర్గాల మనుషులూ నన్ను పల్లెటూరోడిలాగ మాట్లాడుతున్నారని గేలిచేసారు కదా! వెంకడివద్ద నాదం చేసి తర్కంతో అతడ్ని ఓడించేది సాధ్యంకాదని అన్పించింది. అతను పామును పట్టుకొంటున్నప్పుడే అతని మోసంను బహిరంగ పర్చాలి తప్పితే నా మాటల వాదంలోని విధానం నుంచి సరికాదని (కుదర్దని) తీర్మానించుకొన్నాను. మాయలు, మంత్రాలు, తంత్రాలు ఇతనికేమైనా గుర్తున్నవా? మాటలతో నన్ను మైమరపిస్తున్నాడు. ఏమైనా కానీ... ఇతని మాటల చలాకితనంనుంచి నేను మోహవిహశుడ్ని కారాదని తీర్మానం చేసుకొని మొదటే నేను రూపొందించుకొన్న ముందస్తు పరీక్షలన్నిట్నీ అతని మీద ప్రయోగించాను. అతని నడుంలో పాముల్ని చుట్టి దాబెట్టుకొన్నాడేమోనని పరీక్షించాను. ఎంతెంతవో అయిన వేర్లను మూటగా కట్టుకొని నడుంవద్ద దాబెట్టుకొన్నాడు తప్పితే మరిక ఏ పాము కనబడలేదు అతని నడుంలో. "మీకంతగా అనుమానం ఉంటే పంచె (దోవతి)ను విప్పి కావాలంటే ఉత్తిగా గోచినుంచే పాముల్ని పట్టుకొంటాను" అన్నాడతను.

నాదస్వర వాద్యంను వెంకడు బయటకు తీసి, నోటివద్ద ఊదేందుకు పెట్టుకొన్నప్పుడు, "దీన్ని ఎవరు ఊదినా పాములు వస్తవా? లేకపోతే నువ్వు ఊదితేనే మాత్రం అవి వస్తవా?" అని అడిగాను.

"దీన్ని ఎవరు ఊదినా పాములు వస్తవి దొరా... అయితే దాన్ని కనుగొని పట్టుకొనేందుకు మాత్రం భలే చురుకు బుద్ధి, కళ్ళు ఉండాలి ఊదినోడిలో. ఆవెక్కడో కసువులోనో, సందుల మాటునో తలను బయటపెట్టి చూసి అలాగే వాపస్సై పారిపోతవి. హాసన్ (జిల్లా కేంద్ర పట్టణం)లోని సినిమా టాకీస్‌లో 'నాగిన్' సినిమా ప్రదర్శిస్తున్నప్పుడు, ఆ సినిమాలో పాటలు వచ్చినప్పుడు ఒక నాగుపాము ఆ సినిమా టాకీసులోపలికే వచ్చిందనే వార్తను మీరు వినలేదా దొరా? మేము నాదస్వరం ఊదుతూ, ఆ వాద్యంనుంచే 'రా... రా... నాగరాజ' అని దాన్ని పిలుస్తాము. ఇక్కడ పిల్లాజెల్లా ఉన్నారు, మహిళలున్నారు, రైతు బాంధవులు ఉన్నారు, ఎంతో మంది సందడిసందడిగా తిరుగుతున్నారు. నువ్విక్కడ ఎల్లప్పుడూ తిష్టవేస్తే (మకాం చేస్తే) ఎన్నో కష్టాలు జనానికి కలుగుతవి. ఇక్కడ ఉండేది వద్దు. రా... రా... నావద్దకు. నీకు అడవి బాతుల గుడ్లను మింగిస్తాను. మేకపాలు పోస్తాను. చిన్న చిన్న కోడిపిల్లల్ని నీకని వదుల్తాను. నువ్విక్కడుండేది నీ క్షేమంకు మంచిది కాదు. రా... రా... శీఘ్రంగా... అని ఎన్నో బూటకపు మాటల్ని పలికి, దాన్ని నమ్మించి నా వద్దకు పిలిపించుకొంటాను నాదస్వరం నుంచి. నా చెంతకు చేరిన తక్షణమే దాన్ని పట్టుకొని దాని కోరల్ని పీకి నా బుట్టలో పడేస్తాను" అంటూ రాగబద్ధంగా, సుశ్రావ్యంగా నాదస్వర నాదంలోని శైలి నుంచే పాముల్ని పిలుస్తున్నదాన్ని అతను ప్రత్యక్షంగా నాకు చూపించాడు.

నేను ఎత్తుతున్న ఆక్షేపణలకు వెంకడు నిరర్గళంగా (తడుముకోకుండా) జవాబుల్ని చెప్తుంది చూస్తే ఇవన్నీ అతనికి తేలికగా ఉన్న మామూలు ప్రశ్నలన్నట్లుగా రావచ్చు. నేను అడుగుతున్న వాటన్నిటికి సరైన జవాబుల్నే ఇస్తున్నాడు. అదెలాగో మా మిత్రులు... మూఢ నమ్మకాలకి, వెంకడికి సంబంధం కల్పించినందున నేను అతడ్ని మోసగాడే (మాయలోడే) అని రుజువు చేయాల్సిన అనివార్యతకు లోబడినాను. అతని జవాబుల్ని వింటుంటే ఇతనెంతో ఘటికుడిగా అన్పిస్తుంది తప్పితే, ఇతను నాదస్వరం ఊది నిజంగా పాముల్ని పట్టగలడా అనేది నాలో మెరవనే లేదు.

వెంకడు నాదస్వరం ఊదుతుంటే మారడ్ని, ప్యారడ్ని పిల్చి చెరోవైపు వెంకడికి కాపలా లాగ నిలబెట్టి, అతని నాదస్వర సంగీతంకు నిజంగా పాము వస్తదో, లేకపోతే ఏమైనా మోసం జరుగతదేమో అనేవాట్ని ఏకాగ్రదృష్టితో చూడండని నా వాళ్ళకు ఆజ్ఞల్ని జారిచేసాను. నేను ఇంతే మట్టంలో ముందస్తు జాగ్రత్తల్ని చేసుకొన్నందున పోయినసారిలాగ సులభంగా ఈసారి వెంకడు మోసం చేసేది సాధ్యంకాదని, వీడి దొంగాట బయట పడుతదని, ఒకవేళ కుదరకపోతే ఇతను పామును పట్టకనే వెనుదిరిగి పోయేదుంటదని నేను ఊహించాను.

వెంకడు అటు ఇటు దిక్కులకు, ఉపదిక్కుల వైపుకు నాదస్వర వాద్యంను ఊదుతూ కొద్దిసేపైన పిమ్మట ఒకే దిక్కువైపుకు ఊదసాగాడు.

“ఏమోయ్....! ఎక్కడ్నుంచి ఒక పామైనా రావట్లేదు కదా?” అని ఏడిపించాను.

“ఇక్కడెక్కడో ఒక పాము ఉంది దొరా! నాదస్వర వాద్యం ఉద్రేకం చెందుతుంది. అయినా నాగరాజు ఎందుకో బయటకు వస్తనేలేదు'' అన్నాడు వెంకడు ఆయాసపడుతూ.

“ఎలా గుర్తొతుంది నీకు?”

“పాము ఉండుంటే నాదస్వర వాద్యంలోని ఒక కన్ను కట్టుతది దొరా. ఊదుతుంటే ఆ వాద్యంలోని విశేషత (గొప్పదనం) మాకు గుర్తొతదిలే” అన్నాడతను.

నాదస్వర వాద్యంను ఊదేందుకు రాని నాకు దాన్లోని (వాద్యంలోని) ఒక కన్ను కట్టుతది అంటే ఏమిటనేది గుర్తుకాలేదు. వెంకడు మరలా అదే దిక్కుకు నాదస్వరం ఊదాడు. మేము ముగ్గురం ఒక ఆకు కదిలినా గమనం పెట్టుకొని పరీక్షిస్తూ అతని చుట్టూ జాగ్రత్తగా కాపలా కాస్తున్నాము. ఈసారి వెంకడి మోసమంతా బట్టబయలౌతదని మేము ఖుషీగా ఉన్నాం.

అంతలో, “అయ్యయ్యో దొరా... ఇటువైపుకు రండి! చూడండి జాగ్రత్తగా... మీ కాళ్ళచెంతే పాము. నాగుపాము!” అంటూ వెంకడు గావుకేక పెట్టాడు. నేను విస్తుపోయి వెంకడివైపుకు దూకాను. “అయ్యయ్యయ్యో” అంటూ అరుస్తూ ప్యారడు ఎంతో దూరంకు పరిగెత్తాడు. నేను నిల్చిన చోటునుంచి ఒకే ఒక గజం దూరంలో

ఆరు అడుగుల పొడవుతో ఉన్న గోధుమ వర్ణం నాగుపాము ఒకటి, నేను ఎగిరి దూకినందున అది బుస్ అంటూ పడగ విప్పింది.

"శివశివా... ఎంతపని జరిగింది దొరా! ఎక్కడైనా మీ శరీరం మీద కాటేస్తే ఏంటి ముందు కథ? కనికట్టు అని అన్నారు కదా.... ఆ మాటల్నే విని నిజమో అబద్ధమో చూపెట్టానని మీ కాళ్ళచెంతకే వచ్చాడు కదా నాగరాజు! అయ్యిందేదో అయ్యిందిలే... నేనుండగా మీరు భయపడేదిలేదు" అంటూ మా భయంలోని గలిబిలిని చూసి వ్యంగ్యంగా మాట్లాడుతున్నట్లుగా నాటకీయంగా మాట్లాడాడు. నాకు జరిగిందేమిటో అర్థంకావట్లేదు. మేము ముగ్గురం కళ్ళలో వత్తులు వేసుకొని చూస్తుంటే ఎలాగున ఆ నాగుపాము నా కాళ్ళచెంత పడియున్న ఆకులలములలో ఎట్లా అవతరించిందోనని యోచించసాగాను.

"జాగ్రత్తగా చూడండిరో అని నిలబెత్తే.... ఇదేనా మీరు చూసింది" అని మారడ్ని ప్యారడ్ని తిట్టాను.

"మేము పాము రావొచ్చేమోనని అడవి వైపుకు చూస్తున్నాం దొరా... మీ కాళ్ళచెంతకే ఎందుకు చూసేందుకు చూపుల్ని నిల్పుతాం" అని మారడు అన్నాడు.

నాగుపాము భయంకర రోషావేశంతో ఉన్నట్లుగా కనబడుతుంది. అటు ఇటు మెడను తిప్పుతూ సురు సురుమంటూ కాలుతున్న వత్తిలాగ బుస్ అంటూ దగ్గరకు వచ్చినోళ్ళమీద పడగ విప్పి కాటేసేందుకు కాసుకొని ఉంది.

మారడు దాన్లోని కోపావేశంను చూసి, "ఎంతగా బుసగొట్టుందోకదా! దాని ఉచ్ఛ్వాశ నిశ్వాశలు సైతం మనుషులకు తగలకూడదట. దాన్ని శీఘ్రంగా పట్టుకొని బుట్టలో వేసుకో మహాశయా" అంటూ వెంకడివైపుకు చూసి మనవి చేసుకొన్నాడు.

"తాతా... ఒక పని చేస్తావా? పెద్దసారు నాగుపామును పట్టుకొంటే ఒక రూపాయి ఇస్తారట. నేను మరొక రూపాయి కలిపి రెండు రూపాయలు నీకు ఇస్తాను. పట్టుకోదాన్ని! భయపడకు... నేనున్నానులే నీ చెంత" అని వెంకడు మారడితో అన్నాడు.

"అయ్యయ్యో మహానుభావా... నీకు శతకోటి దండాలయ్యో దండాలు. ప్రస్తుతం దాన్నొకసారి పట్టి బుట్టలో వేసుకో. నేను మరికొన్ని దినాలు (రోజులు) బతికి

ఉండాలని భావించుకొంటున్నా" అంటూ మారడు మరణదండనకు లోబడినోడిలాగ బెదిరి వెంకడి వద్ద మొరబెట్టుకొంటున్నాడు.

నాగుపాము ఎత్తిన (విప్పిన) పడగను దించకనే అటు ఇటు చూస్తూ "కస్ హిస్" అంటుంది.

"ఏంటి దొరా... ఇది సాధారణమైన పామైతే కాదు. అసలు సిసలు నాగుపాము. పడగ మీదున్న గీరలను చూడండి. ఒకే ఒక గీత ఉంది. అందుచేత దీన్ని ఇక్కడి వరకూ పిల్చేందుకు నా హృదయంలో ఉన్న ఊపిరంతా ఆవిరైపోయింది. ఒక గంట ఆపకుండా నాదస్వరం ఊది కష్టపడ్డాను దొరా! పట్టుకొన్నమీదట మీరు చౌకాసి (గీసిగీసి) బేరం చెయ్యొద్దు. ఐదు రూపాయల ఇనామ్ ఇవ్వాలి" అంటూ వెంకడు నావైపు తిరిగి అంటున్నాడు.

అతనిప్పుడు బ్లాక్ మేల్ చేస్తున్నోడిలాగ మాట్లాడినదాన్ని చూసిన నాకు అతని మీద పిచ్చి కోపం వచ్చింది. "అదంతా కాదు. ఒక రూపాయి అని చెప్పిన మీదట ఒక రూపాయే" అన్నాను.

"అలాగైతే ఒక పని చేయండి దొరా... నా నడుంకు నాగమణి ఉంది. అదుంటే పాము నెమ్మదిస్తది. మీరే పట్టుకోండి దాన్ని. నాకు ఒక నయాపైసా ఇవ్వకండి. ఏమైనా ఎక్కువతక్కువ అయితే నేను ఉన్నాను కదా" అన్నాడు వెంకడు. అతనిమీద అనుమానం పెట్టుకొని రేగిందానికి దెబ్బకు దెబ్బ తీర్చుకొనేందుకు ఈ రీతిగా వేదిస్తున్నాడనేది నాకు స్పష్టమైంది.

"అడవిలో ఉన్న పాముకు నాదస్వరం ఊది, ఇంటి చెంతకు పిల్చి, ఇప్పుడు దాన్ని ఐదురూపాయలు ఇస్తేనే పట్టుకొంటానని బేరం (డిమ్యాండ్) చేస్తున్నావా? పాముల్ని పట్టుకొంటానని బేరం చేసినోడివి నువ్వా నేనా? మంచిగా దాన్ని పట్టుకో..." అన్నాను నేను.

"ఏంటి దొరా..., దాన్ని పట్టుకొనేందుకు వెళ్తే మీరు బతికేది సరే... మరి నా ప్రాణమో... మనుషుల ప్రాణంకు ఐదు రూపాయల విలువ లేదా? మీ ప్యాంట్‌ను తడిమితే ఇటువంటి ఐదు రూపాయల నోట్లు నూరు రాలిపడవా" అంటూ కొద్దిగా 'ఎ' సర్టిఫికేట్ సినిమాను చూపుతాను అన్నోడిలాగ మాట్లాడాడు వెంకడు.

పాము పడగఎత్తే మెల్లమెల్లగా వెనక్కి వెళ్ళసాగింది. అక్కడ్నుంచి కొద్ది దూరానే మా కట్టెలరాశి ఉంది. ఈ పాము ఆ కట్టెల రాశిలోకి జొరబడ్తే, మారడు ప్యారడు మరిక కట్టెల్ని వంటకని తెచ్చేందుకు దాని (ఆ రాశి) దగ్గరకు వెళ్ళేది లేదు. వెంకడు పాము పడగ నీడలోనే కూర్చుని బేరమాడుతున్నాడు. నేను ఇతడ్ని పరీక్షించేందుకు వెళ్ళిందే తప్పైందని భావించసాగాను. సత్యాన్వేషణ కొద్దిగా దుబారి అయినట్లుగా ఉందని అన్పించింది.

"చూడండి దొరా...., పాము వెనుదిరిగి వెళ్తుంది. పిల్చిన పాము భయపడి మరిక వెనుదిరిగి వెళ్ళిన మీదట మీరు నాకు నూరు (వంద రూపాయల్ని) ఇచ్చినా అది నాచెంతకు వచ్చేది, దొరికేది లేదు. నేను సాయంత్రవరకూ నాదస్వరం ఊదినా వచ్చేది లేదు. ఐదు రూపాయల నోటు ముఖంను చూడకండి" అన్నాడతను. అతని మాట చివరి ఎచ్చరికగా ఫైనల్ బెల్లులాగ నాకు విన్పించింది.

"ఏంటి... మొత్తానికి డబ్బునుంచే బతికేవాడిలాగ ప్రవర్తిస్తున్నావు. సరేసరే... ఇస్తానులే... పట్టుకోదాన్ని" అన్నాను. వెంకడు దాని మెడను కొంకి కర్రనుంచి నొక్కి దాని తలను పట్టుకొన్నాడు. ఆ పామును పట్టుకొనేందుకు వెంకడు ప్రయత్నిస్తుంటే అది పడగను మరింతగా రోషంతో ఎత్తుతూ, బుస పెట్టున్న విధం చూసిన నాకు చెమటలు పట్టినవి. బుట్టలో కోరల్ని పీకి పడేసిన పాములకు, ఈ పాము నడవడికకు అజగజాంతర వ్యత్యాసం ఉంది నాకు కనబడింది.

ఆ పామును పట్టుకొన్న మీదట దాని వంటిమీద ఇష్టం వచ్చినట్లుగా కచ్చిన అడవి చీమల్ని చూపిస్తూ, "చూడండి దొరా.., కనికట్టు, సాకిన పాము, అలాగు ఇలాగు నోటికొచ్చినట్లుగా అంటూ ఎవరెవరో అన్న మాటల్ని విని, నమ్మి నామీద అరిచారు కదా నిర్దయగా! దీని వంటిమీద అడవి చీమలు కచ్చింది ప్రత్యక్షంగా మీకు కనబడట్లేదా?" అంటూ వెంకడు తన నడుంకు వేలాడుతున్న చాకును బయటకు తీసి, ఆ పాము నోట్లో దాగియున్న విషం కోరల్ని లాగేసి (పీకి) మాకు చూపిస్తూ అటెటో విసిరేసాడు.

ఆ వేళే మళ్ళీ ఇంటినుంచి కొంచం దూరంలో పెద్ద కట్లపామును పట్టాడు. కట్లపాములు స్థబ్దుగా ఉంటవి. మిగిలిన పాములులాగ మనుషుల అడుగుల సవ్వడికి

అవి పారిపోయేది లేదు. దాన్ని తొక్కేవరకూ అది పడుకొనే ఉంటది. అవి కరిస్తే (కాటేస్తే) ప్రాణుల కాళ్ళు తొందరగా కుళ్ళిపోతవి.

వెంకడు ఆ కట్లపామును పట్టుకొని, దాని కోరల్ని పీకుతుంటే అది పటపట తోకను కొట్టుకొంటూ విలవిలలాడుతుంది. అప్పుడు దానికడుపునుంచి చిన్న చిన్న పాము పిల్లలు నోటినుంచి బయటకు రాలిపడుతున్నవి. పాములన్ని గుడ్లను మాత్రమే పెట్టవని తెలిసియున్న నాకు ఈ దృశ్యంను చూసిన మీదట ఆశ్చర్యమైంది. వెంకడు, "ఆ కట్లపాము పిల్లల్ని తన కడుపునుంచే కంటదని, అది కన్నప్పుడు ఆ పాము పిల్లలు ఒక రకమైన సప్పుళ్ళను చేస్తవని, ఆ సప్పుళ్ళను విని కెంబూత పక్షి వచ్చి రెండు పిల్లల్ని మాత్రమే వదిలి మిగిలిన పాము పిల్లలన్నిట్ని తింటదని చెప్పాడు మాకు".

కెంబూత పక్షి పాము పిల్లల్ని వేటాడి తినేదాన్ని ఇంతకు మునుపు నేను చూసాను. అయితే తింటూ రెండు పాముల్ని మాత్రమే వదిలిపెట్టేది మొదలైన విషయాలు వెంకడిలోని కల్పనగా ఉండొచ్చు. మారడైతే ఆ కట్లపాము కడుపు నుంచి రాలిపడిన ఆ పాముపిల్లల్ని చూసి "అయ్యయ్యో! ఇంత సంఖ్యలో ఉన్న ఈ పాము పిల్లలు క్షేమంగా బతికితే ఒక ఊరు మొత్తం పాడుచేసేందుకు వాటికి ఒకరోజు తక్కువగానే పట్టుతది. థు... థూ... దీని సంతానం పాడుగాను...." అని తిట్టూ ఒక కఱ్ఱను పట్టుకొని ప్యారడితో కల్సి వాట్ని చంపాడు.

"నువ్వు పట్టుకొన్న పాముల్ని ఏమి చేస్తావు?" అని వెంకడ్ని అడిగాను. ఎందుకంటే పాముల్ని పట్టేదే అతని వృత్తి అయినందున, ఆ పట్టిన పాములన్నిట్నీ అతను ఎక్కడో వదిలేస్తాడనే అనుమానం నాలో ఉంది. ఆ పాముల్ని అతను కొన్నిరోజులు తన చెంతే ఉంచుకొని, వాటి నోట్నించి విషం అంతా తీసి భద్రపరుచుకొంటాడట. అలా సేకరించిన విషాన్ని కోయంబత్తూరు చెంత ఎవరో సాధువుకు అమ్ముకొంటానని అతను చెప్పాడు. ఆ తర్వాత వాట్ని చంపి, చర్మాన్ని వలిచి మిగిలిన మాంసంను దాసరపాముకు ఆహారంగా ఇస్తాడట.

వెంకడు ఐదు రూపాయల ఇనాం సమేతంగా డబ్బును నానుంచి వసూలు చేసుకొని వెళ్ళిపోయాడు. అతనికి అంత పెద్ద మొత్తంలో డబ్బు దొరికింది చూసిన

మారడి కడుపులో డుకుడుకు మొదలైంది. వెంకడు వెళ్ళేవరకూ చకారం (ఆక్షేపణ) ఎత్తకనే స్తబ్ధుగా ఉన్న మారడు, అతను వెళ్ళిపోయిన తక్షణమే "ఆ దొంగ భాడకోవ్ చేసిందంతా మొత్తానికి కనికట్టే. మీ అంతోళ్ళ (శ్రీమంతుల) వద్ద డబ్బు పీక్కొనేందుకే ఇదంతా" అన్నాడు వ్యంగ్యంగా.

"మరైతే డబ్బు ఇస్తాను, పామును పట్టుకో అని చెప్పాడు కదా వెంకడు నీతో! నువ్వెందుకు పట్టుకోలేదు వాట్ని?"

"థు... థూ...; వేయి రూపాయలు ఇస్తానన్నా నేను మాత్రం పామును ముట్టుకొనేది (పట్టుకొనేది) లేదు" అన్నాడు మారడు. అతనిలో వెంకడిమీద అసహనం ఎందుకనేది అతనికి తెల్వదు కదా!.

ఇదంతట్నీ పరీక్షగా చూసి, వెంకడు పట్టుకొన్నవి అడివిలోని కొత్త కొత్త పాములే అని దృఢం చేసుకొన్న మీదటా ఏదో రహస్యమైంది వెంకడిలో దాగియున్నది నాకు కనబడసాగింది. మేము ముగ్గురం కళ్ళలో కళ్ళు పెట్టి చూస్తున్నా, ఆ గోధుమ రంగు నాగుపాము నా కాళ్ళదగ్గరుంది మా కళ్ళకే కనబడలేదు కదా! అదికూడా నా కాళ్ళముందే ఏ అలికిడి చేయకనే వచ్చింది ఎలాగున? అతను (వెంకడు), పాము కనబడినప్పుడు చేసిందంతా ముందస్తు ప్రణాళికతో ఉన్న నాటకం లాగా ఉందా? ఇదంతా కేవలం ఆకస్మికమా లేక కాకతాళీయమా?.

వెంకడు వెళ్ళిపోయిన మీదట, అతను పామును పట్టుకొనే విధంమీద ఫోటోలను తీయాలని అనుకొంది జ్ఞాపకంకు వచ్చింది. వెంకడితో నడిచిన రంపరాద్ధాంతంలో ఫోటోల్ని తీసేదాన్నే మర్చిపోయాను మూర్ఖుడిలాగ.

★ ★ ★

మూడు నెలల తర్వాత ఇంకేంటి వానలు మొదలౌతవి అనే సమయంలో ఏదో దార్లో వెంకడు మళ్ళీ నాకు కన్పించాడు. అతనితో పామును పట్టేటప్పుడు ఫోటో తీయాలని, అందుకని మరలా మరోసారి మా ఎస్టేట్‌కు రమ్మని చెప్పాను. ఫోటోల్ని తీసే విధానంలోని కళ, శ్రమ, ఉద్దేశం అతనికేమి తెల్వదు. అలాగున అడిగిన తక్షణమే అతను దిగులుపడుతూ "అదొకటి మాత్రం వద్దు దొరా" అని అన్నాడు.

అలాగున నిరాకరించేందుకు అతనిలో ఏదో ఉండొచ్చు! నానుంచి అన్ని పరీక్షలకు సంతోషంగా ఒప్పుకొంటుండే ఇతను, ఇప్పుడెందుకు ఈ ఫోటో తీసేదాన్ని వద్దంటున్నాడు. దొరికాడులే దొంగ అని అనుకోసాగాను.

"ఒసోస్ వెంకా..., నీలో ఏదో మోసం ఉంది. లేకపోతే అదెందుకు ఫోటో తీసేది మాత్రం వద్దంటావు?" అని గదిరాను.

"మోసం లేదు ఏమిలేదు దొరా... ఫోటో తీస్తే మాత్రం అది (పాము) చనిపోతది. అందుకే వద్దంటున్నాను."

నాకిప్పుడు అతని సమాధానం మరింత ఆశ్చర్యంను కల్గించింది. "ఏంటి విషయం" అని అడుగగా "అదొక పెద్ద కథ సార్" అంటూ ఆ దార్లోనే ఒక గంట సవిస్తారంగా చెప్పాడు నాకు.

వెంకడు 'కుదురేముఖ' సంతలో యథాప్రకారం దాసరపామును పక్కన పెట్టుకొని వేర్లను, తాటలను (చెట్ల బెరడ్లను) అమ్ముతున్నాడు. అన్ని సాధారణ రోజులన్నట్లే ఆ రోజూ వెంకడి దినచర్య నడుస్తుంది. ఎవరో హళెబీడు, బేలూరులకు బయల్దేరిన యాత్రికులు (టూరిస్ట్లు) అదే దార్లో వచ్చారు. వెంకడు వేలాడదీసిన పాము చర్మాల్ని చూసి వాట్ని కొందామనో లేకపోతే బాగా దగ్గరగా చూద్దామనో అతనివద్దకు చేరారు. ఆ వచ్చినోళ్ళలో ఒకరి మెడలో కెమేరా వేలాడుతుంది. వెంకడు పామును ఆడిస్తుంటే ఫోటో తీస్తానని అందుకు డబ్బు ఇస్తానని అతను తెల్పాడు. వెంకడు బుట్టకున్న మూతను తీసి దాన్లోపల చుట్లు చుట్లుగా చుట్టుకొని పడి ఉన్న నాగుపామును గుచ్చి, మీటి అది పడగను ఎత్తేటట్లుగా చేసి దానెదురు నాదస్వరం ఊదాడు. ఫోటోగ్రాఫర్ వివిధ భంగిమలలో (కోణాలలో) ఎన్నో ఫోటోల్ని తీసినమీదట, చుట్టుకొని పడుకొన్న దాసరపామును కొద్దిగా ఆడించమని అడిగాడు. వెంకడు అది మొద్దుపాము అని, నాదస్వర సంగీతంకు అది తలను ఆడించేది లేదని చెప్పాడు.

ఫోటోగ్రాఫర్లో ఎలాగైనా ఆ దాసరపాము జతగా వెంకడి ఫోటోను తీసే ఆపేక్ష ఉంది. అందుకని వెంకడితో దాన్ని (దాసరపామును) టవెల్ భుజాలమీద వేసుకొనే రీతిగా భుజాలమీద వేసుకొని ఠీవిగా నిలబడు. ఆ భంగిమను ఫోటోగా తీస్తానని చెప్పాడు. వెంకడు దాన్ని భుజాలమీద వేసుకొని నిలబడ్డాడు. ఫోటోగ్రాఫర్

దగ్గరలో, దూరాన నిలబడి ఏవైపు (యాంగిల్) నుంచి తీసేదుందని పరీక్షిస్తుంటే, భుజాలమీదున్న పాము అక్కడ్నుంచి జారుతూ వెంకడి చంకలనుంచి వీపు వెనక్కి పాకింది. నడుం చుట్టూ పెనవేసుకొంది. ఎన్నోసార్లు భుజాలమీద దాన్ని వేసుకొన్న వెంకడు ఫోటోగ్రాఫర్ రెడి అయినప్పుడు, దాన్ని మరలా సరిగా భుజాలమీద కూర్చోబెట్టుకొంటానులే అని మిన్నకుండి పోయాడట.

ఆ దాసరపాము చక్కగా మెల్లగా పాకుతూ వెంకడి ముందున్న రొమ్ము భాగంకు వచ్చింది. వెంకడి వంటి చుట్టూ ఒక రౌండ్ పూర్తైందో లేదో దబక్కనే ఉక్కుబలంతో అతని కుడిచేతిని చేర్చి భయంకరంగా బిగిసి పట్టుకొంది ధృతరాష్ట్రుడి కౌగిలిలాగ. ఇదంతా క్షణాలలోనే జరిగిపోయింది. దాని బిగిపట్టులోని ఒకే ఒక పట్టుకు (కౌగిలికి) వెంకడిలోని శ్వాసకోశంలో ఉండే ఊపిరంతా బయట కొచ్చి, కేకల్ని, అరుపుల్ని పెట్టి రక్షించమంటూ అనేందుకు సైతం వెంకడి రొమ్ములో ఊపిరి లేదు. చుట్టూ గుంపైనోళ్ళంతా వెంకడికి మూర్ఛరోగం ఉండొచ్చని అనుమానిస్తున్నారు తప్పితే అతని వంటిమీద ముగ్ధంగా పెనేసుకొని పాకుతున్న పాములోని మృత్యుబంధంలో అతను చిక్కుకుపోయాడని ఊహించేందుకు ఆ జనంలో సాధ్యంకాలేదు. ఆ జనంకు గుర్తైనా, కబంధ రాక్షసుడిలాగ బిగిపట్టుతో బిగించి పట్టుకొన్న ఆ పాము కౌగిలి నుంచి అతడ్ని విడిపించేందుకు వాళ్ళకు సాధ్యపడుతదో లేదో చెప్పేందుకు కుదిరేదిలేదు.

వెంకడు మూర్ఛరోగి అన్నట్లుగా దభాల్నే క్రిందపడి కాళ్ళను కొట్టుకొంటున్నాడు. అతని నోటి నుంచి నురుగు బయటకొస్తుంది. అతని దొర్లు ఆటకు పాము బుట్టలమీద కప్పియుంచిన మూతలు బయటపడి ఆ బుట్టల లోపలున్న ఐదారు నాగుపాములు బయటకు వచ్చినవి. చుట్టూ నిలిచినోళ్ళందరూ బయటపడిన ఆ పాముల్ని చూసి ప్రాణ భయంతో ఆ స్థలాన్ని ఖాళిచేసారు. వెంకడు ఒంటరోడైయ్యాడు. దాసరిపాము అతని ప్రాణంను పిండుతుంది. వెంకడిలో కళ్ళు శాశ్వతంగా మూసుకుపోయే ముందు ఎడంచేతినుంచి నడుంలో దాబెట్టుకున్న చాకును తీసి చివరిప్రయత్నంలోని ఆత్మరక్షణ అన్నట్లుగా దాని కడుపును చీరిందొకటే అతనిలో జ్ఞాపకంగా ఉంది. వెంకడు పాము తలను గాని, దాని గొంతునుగాని వెతికి గుర్తించే స్థితిలో లేడు ఇప్పుడు. వెంకడు కత్తితో దాని కడుపును చీరినా (చీల్చినా) ఆ దాసరిపాము తన

బిగిపట్టును తక్షణమే సడలించలేదు. అయితే దాని పేగులన్నీ బయటకు వచ్చేటట్లుగా చాకుతో వెంకడు చీల్చినందున ఆ పాము కౌగిలి నిధానంగా తేలికపడింది.

వెంకడిలో మరలా ప్రజ్ఞ వచ్చినప్పుడు, దాసరపాము తన కడుపులో గుచ్చుకున్న చాకు సమేతంగా దారి పక్కనున్న తోట కంచెనుంచి లోపలికి జొరబడేందుకు వెళ్ళి, ఆ చాకు ఆ కంచెకున్న మొద్దుకు అడ్డుగా తగిలి ఆపేసినందున అది (ఆపాము) ఇక ముందుకే పోలేక క్షతగాత్రుడిలాగ నిల్చి ఊపిర్ని వదిలింది.

నాతో తన ఈ కథనంతా వెంకడు చెపుతుంటే హఠాత్తుగా ఎన్నో సంవత్సరాల క్రితం వెంకడి ధర్మపత్నికి సంభవించిన నిగూఢమైన సావు (మరణం) గుర్తుకొచ్చింది. ఆమె గుడారం లోపల చనిపోయి పడి ఉంది. గూటంకు చుట్టుకొని స్తబ్ధుగా పడియున్న దాసరపాము, వెంకడిమీదే అనుమానం పడుతున్న జనం... ఈ చిత్రాలన్నీ ఒకటొకటిగా నా మనః పటలం (మైండ్)మీద సుడులు సుడులుగా తిరుగుతున్నవి.

నిగూఢమైన ఆమె చావుకూ ఈ దాసర పామే కారణమై ఉండొచ్చని యోచించగా, నా సందేహం మరింతగా బలపడింది.

గొప్పోళ్ళ చంకలో సెగ (వేడి)గడ్డ జనించినా జనం చంకలు కొట్టుకొంటూ గొప్పగా చెప్పుకొంటారు కదా! అదే కటిక దరిద్రంతో పర్యావరణంకు అనుగుణంగా జీవించే ఎన్నో జాతుల (సంచార జీవుల) జన జీవనంను గుర్తించి, తెల్సుకొన్నోళ్ళు ఎంతమంది ఈ నవనాగరిక సమాజంలో ఉన్నారో విజ్ఞులైన పాఠకులారా... మీరే చెప్పండి!.

★ ★ ★

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉండే గ్రంథాలయంనుంచి కన్నడ భాషలో దివంగతులైన పూర్ణచంద్ర తేజస్విగారు రచించిన "ఎంగ్టన పుంగి" అనే ఈ కథను తెలుగు అనువాదంకు స్వీకరించాను.

శాఖమూరు రామగోపాల్.

# సబ్ కాంట్ర్యాక్ట్ లేదా ఉప గుత్తిగ



"మారా! మారా!"

"ఏంటయ్యా?"

"ఎక్కడున్నావు?"

"ఇక్కడే ఉన్నానయ్యా"

"థూ థూ... ఎక్కడ? కళ్ళకు కనబడట్లేవు కదా"

మారడు పనస చెట్టుక్రింద రాలిపడిన ఆకుల మీద 'వటపత్రశాయి'లాగ పడుకొని నిద్రపోతుండగా, నా కేకల్నుంచి మేల్కొని, నా కళ్ళలో పడేందుకు లేచి కూర్చున్నాడు. ఎంతో వయస్సైన అతని శరీరం ఎంతగా బక్కచిక్కి ఉందంటే ఆ ఆకుల రాశి

నడుమ మునిగిపోయాడన్నట్లుగా నేలమట్టంకే ఉన్నందున, అతని శరీరం నుంచి ఆ అశరీర వాణి వినబడుతుంది తప్పితే మారడి శరీరం కనబడట్లేదు. రెండుమూడుసార్లు గట్టిగా కేకల్ని పెట్టిన మీదటే లేచాడు మారడు.

“మార!”

“ఏంటయ్యా”

“నా చెప్పులు ఎక్కడ?”

“మీ చెప్పుల్ని నేనెందుకు కదిలించాను?”

“మరి అవి ఎక్కడికి వెళ్ళినవి?”

“వాట్ని ఎక్కడ విడిచారో చూడండి. మీ కాళ్ళ సైజ్ చెప్పులు నాకు సరిపోతవా?”

“అలాగైతే నీ కాళ్ళ కొలతకు సరిపోతే వాట్ని దొంగిలించేవాడివా?”

“అలా అనకండయ్యా, దొంగిలిస్తే ఏమి ఉపయోగం నాకు?”

“చూడు మారా... నీతో నా చెప్పుల్ని దొంగిలించావని అడిగానా నేను? నువ్వు ఇంటిముందు ఊడుస్తూ శుభ్రం చేస్తూ, నేను విడిచిన చెప్పుల్ని అక్కడెక్కడైనా చూసావా అని నేనడిగితే, నువ్వు నేనెందుకు వాట్ని దొంగిలించాలి అని జగడంను ప్రారంభించావు కదా! గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకొన్నట్లుగా ఉంది నీ మనస్సు. నీ మాటల్ని ధోరణిని చూస్తుంటే నువ్వే దొంగిలించి ఉండొచ్చని అన్పిస్తుంది!”

“ఔనౌను, దొంగిలించాను. దొంగను ఇంట్లో పెట్టుకొని మంచిగా అన్నం తినబెట్టి సాక్కొని, ఇప్పుడు నామీదే అనుమానం పెట్టుకొంటున్నారు కదా! ఓసోస్... ఇటు చూడండి, ఒక చెప్పు ఇక్కడుంది. దొంగ ఒక చెప్పును వదిలి మరొక చెప్పును దొంగిలిస్తాడా? ఆ పాడు పెంపుడు కుక్క టామి దశనుంచే నాతలమీద దొంగతనం మోపబడింది కదా!” అంటూ చెప్పును దొంగిలించిన టామిని తిట్టూ మరొక చెప్పును వెతకసాగాడు. చెట్టు నీడలో సుఖనిద్రలో మునిగిన అతనికిప్పుడు మేల్కొని చెప్పును వెతికేది సుతరాం ఇష్టంలేదు. మారడు మనసుపడ్తే, మా ఇంట్లో ఉన్న ఏ వస్తువునైనా దొంగిలించొచ్చు. అయితే ఎప్పుడూ ఏదాన్ని అతను దొంగిలించలేదు. దొంగిలించే

ప్రలోభంలోని ప్రయోజనం పొందే వయస్సు అతనిది కాదు. అతనికి, నా చెప్పు మాయమైనదానికి ఏ సంబంధమూ లేదనేది నాకు బాగానే గుర్తున్నా అతను ఆ మాయమైన దానికి ఏదో రీతిలో జవాబ్దారి అని ఆపాదనను మోపకుంటే అతను పడుకొన్న చోటునుంచి లేచేది లేదు. అంత రీతిలో ఉండే విరామజీవి అతను.

కుక్కలు ఏదో ఒక వయస్సులో చపలంతో ఈ రీతిగా దొంగతనంకు దిగే దాన్ని నేను గమనించి ఉన్నాను. కృష్ణారావుగారి కుక్కలాగనే మా టామి సైతం ఇంటివద్ద దొరికే చెప్పుల్ని, పొరక (చీపురు) కట్ట... మొదలైన చిన్నా చితకా వస్తువుల్ని దొంగిలించి (నోటికి కరుచుకొని) తోట్లోకి తీసుకెళ్ళి అక్కడున్న ఏదో చెట్టు నీడన కూర్చుని వాట్ని కొరికి, కచ్చి తుంపులు తుంపులుగా చేసి ఎటెటో విసిరేస్తుండేది. సాధారణంగా చెప్పులే టామికి దొంగిలించేందుకు దొరుకుతుండేవి. మా ఇంటికొచ్చే అతిథుల (ప్లాంటర్స్) సుగంధపూరిత కాళ్ళ చెప్పులంటూ దానికి అత్యంత ప్రియమైన వస్తువన్నట్లుగా (మనకు చాక్‌లెట్లు, బ్రెడ్‌లలాగ) ఉంటుండేది. దాన్ని (చెప్పుల్ని) పాడైపోతున్న ఏదో జంతు చర్మం అని తెలుసుకొంటదో ఏమో!.

మా ఇంటికొచ్చినోళ్ళు మాటల్ని ముగించి నమస్కారం చెప్పి ఇక వెళ్ళిపోవాలనుకొన్నోళ్ళు ఎంత సమయం గడిచినా వెళ్ళకనే మా ప్రాంగణంలోనే అటు ఇటు తిరుగుతుంటే, నాకు తక్షణమే వాళ్ళ కాళ్ళ చెప్పులు అదృశ్యమైనవనేది తెలుస్తుండేది. సరి, సరి... ఇక ఇప్పుడు నేను, ప్యారడు, మారడు... అందరం చేరి ప్రాంగణంలోనో, తోట్లోనో వెతికే ఆటను చేసేవాళ్ళం. మా వెతికే ఆటలోని శ్రద్ధను చూసేందుకు మనస్సొప్పని ఆ అతిథులు, "పోనీయండి సార్... పర్వాలేదులే" అని అంటూ వెళ్ళిపోయేవారు. టామిలోని ఈ తుంటరి చేష్ట దశనుంచి అతిథులెవరైనా వస్తే మొదటగా వాళ్ళ క్షేమ సమాచారం అడిగే బదులు, వారి పాదరక్షల (చెప్పుల) మీదే ఎక్కువగా ధ్యాసను నిల్పి, జాగ్రత్తగా వారి చెప్పుల్ని చూసేది మాకు అలవాటైంది. ఇంతగా జాగ్రత్తతో ఉన్నా, ఒకొకసారి నా చెప్పుల్నే నేను మరిచిపోయిన ఏదో శుభ గడియలో అదృశ్యమైపోతుండేవి.

విరామ (విశ్రాంత) జీవైన మారడి నిద్రాసమాధికి మాత్రం టామి దొంగపని నుంచి భంగం వాటిల్లి, పోయిన చెప్పుల్ని వెతికే పని మొదలౌతుండేది అతనికి. అప్పుడతను టామిని మనసారా శపిస్తుండేవాడు. ఒకసారి నా కొత్త చెప్పుల్ని

కాజేసినప్పుడు, చెప్పులు తనవి గాకపోయినా మారడిలో కోపం కట్టలు తెంచుకొని బయట పడింది. అతనికి, టామి తీసుకెళ్ళిన చెప్పుకన్నా, ఇంకొక దాన్ని (రెండో చెప్పును) దొంగిలించకనే వదిలినందున ఆ మిగిలిన చెప్పు ఒకటి శాశ్వతంగా నిరుపయోగం అయ్యేటట్లుగా చేసిందికదా అనేదే ఎంతో కోపంగా అతనిలో కుతకుతలాడుతూ ఆ సంగతి నిల్చింది. “దొంగిలిస్తే, నోటికి కరుచుకొని వెళ్తే రెండిట్ని తీసుకొని వెళ్ళకూడదా? ఏదో తింటానికి, మింగటానికి దొరికిందిలే అని నోటిని చాపిందంటే అది ఒక పద్ధతిగా ఉంటది. దీనికేమి (టామి) వచ్చింది తిండి కరువు? చెప్పును, పొరక (చీపురు) కట్టను మోసుకొని వెళ్ళేందుకు సిగ్గు, శరం లేదా? పోయిన జన్మలో ఇది దొంగోడైయుండొచ్చు! అందుకే దేవుడు ఈ జన్మలో కుక్కలాగ ఇంటిని కాయమని శాపం ఇచ్చాడులే! అందుకే ఇంకా పోయిన జన్మలోని బుద్ధిని (చపలంను) పూర్తిగా పోగొట్టుకోలేదు” అని అంటూ పేమ్ బెత్తం పట్టుకొని టామిని బెదిరిస్తుండేవాడు. ఎంతో ఒడుపు, లాఘవం ఉన్న టామి ఎన్నడూ అతని బెత్తం దెబ్బలకు దొరకలేదు. అది తప్పించుకొని పారిపోతుంటే ఇతనిలో కోపం ఎక్కువై మరింతగా తిట్టుండేవాడు. తన పూర్వ జన్మ కర్మలలో దేన్నుంచి తనకు ఈ స్థితి (కుక్కను అజమాయిషి చేసేది), ఈ పాడు ఎదురైందోనని అతను తన ఆత్మ విశ్లేషణకు లోబడిపోయేవాడు తత్త్వవేత్తలాగ.

మారడు ఒక పల్లెటూరి రైతు అని, తిక్క శిఖామణి అని మొదట్లో భావించుకొనేవాడ్ని. అయితే అతనిలో అసాధారణమైన జ్ఞానమొకటి మూర్ఖత్వంలోని ముసుగులోపల దైనందిక పనుల్ని జయప్రథంగా చేస్తుండేది. దీన్నే మనం సూపర్ ఇంటిలిజెన్స్‌గా ఆ ఇంగ్లీష్ పదాల్నుంచి చెప్పుకోవచ్చు.

“పోయిన జన్మలో టామి (కుక్క) దొంగోడిగా ఉండుంటే, నువ్వు (అప్పుడు) ఆ జన్మలో ఏవిధంగా ఉండేవాడివి?” అని అడిగాను.

“మరేంటి... నేను పోలీసోడిగా అయ్యుండొచ్చు. అందుకే ఈ జన్మలో మీ ఎస్టేట్‌కు కాపలాదారుడిగా పనుల్ని నిభాయిస్తున్నాను” అని జవాబిచ్చాడు తడబడకుండానే!

“ఒకసారి ఏదో మాటల సందర్భంలో అతడ్ని “నీకు దేముడిమీద నమ్మకం ఉందా?” అని అడిగాను.

మారడిలో కళ్ళకు కనబడేది, కనబడనిది, మూర్త, అమూర్తాలలో ఎక్కువ తేడాలేమి అతనిలో లేవు. అమూర్తమైన (కనబడని) గాలే మూర్తంగా మారి మేఘాల్ని; మూర్తమైన మేఘాలనుంచే అమూర్తమైన నీరు ఉద్భవిస్తవని ఎంతో ప్రజ్ఞాపాటవంగా చెప్పాడు నాకు. నా ప్రశ్నకు జవాబిచ్చేందుకు అతను ఒక క్షణం ఆలోచించే కష్టాన్ని తీసుకోలేదు. "భలే చక్కగా అడిగారు మీరు. అమ్మ, అయ్య లేకుండానే శిశువులు పుట్టవా?" అంటూ నన్నే ప్రశ్నిస్తూ, నేనేసిన (నేను అడిగిన) ప్రశ్నను మౌఢ్యంలోని పరమావధిగా కొట్టిపారేసాడు.

మారడిలోని విచిత్ర తర్కాలు, బుద్ధిశక్తి (మేధోశక్తి) టామి దొంగ పనులనుంచి బయటపడుతుండేవి. నా కొత్త చెప్పును టామి నోట కరుచుకొని తుంపులు తుంపులుగా చేసిన మీదట, నేను మరొక జత కొత్త చెప్పుల్ని కొనాల్సి వచ్చింది. వాట్ని ఖరీదించి తెచ్చిన మరుసటి రోజునుంచి నాలో ఒక చిన్న మానసిక సంఘర్షణ ప్రారంభమైంది. ఒకసారి ఆ చెప్పుల్ని వేసుకొనేందుకు (తొడుక్కొనేందుకు) వెళ్ళగా కుడికాలుది ఎడంకాలుకూ, ఎడంకాలుది కుడికాలులో ఉంది. కాళ్ళను వాటిలో జొనిపిన నేను, మళ్ళా కాళ్ళను బయటకు తీసి బదలాయింపు చేసుకొన్నాను. ఇదేమి తలను చెడుపుగా చేసుకొనేంత పెద్ద విషయం ఏమి కాదు. నేనే గలిబిలిగా అటుది ఇటు, ఇటుది అటుగా వేసుకొని తొడుక్కొని ఉండొచ్చని అనుకొంటూ బయటకు బయల్దేరాను. అయితే మరుసటి రోజూ అంతే! మరొక రోజూ అంతే! ప్రతిరోజూ ఇదే గోల. నేను ప్రజ్ఞా పూర్వకంగా సరిగానే చెప్పుల్ని విడ్చి ఇంట్లోకి వెళ్ళినా మరలా ఇదే గోల. ఏదో మాయలో నా చెప్పులు అదలుబదలు (అటువి ఇటుగా, ఇటువి అటుగా) అవుతున్నవి. ఇదే తరహాలోని భూత చేష్ట? ప్యారడు వరండాలో కసువు ఊడ్చుతున్నప్పుడు ఇలాగున ఉల్టా పుల్టాగా పెట్తున్నాడా? అయితే ప్రతి రోజూ ఎందుకు ఇలా పెట్తున్నాడు? అలాగైతే ఉద్దేశపూరితంగానే ఈ విధంగా చెప్పుల్ని ఉంచుతున్నాడా? ఇతనికి కుడికాలు ఏది? ఎడం కాలు ఏదనేది సరిగా గుర్తులేదా? అతను కేవలం పనుల హడావుడిలో చేతినుంచి తప్పిపోయి ఇలాగున చేస్తుంటే నాలో అసహనం ఉండేది లేదు. అయితే ప్రతిరోజూ ఇలాగునే ఉంచేదాన్ని చూస్తే, దీని వెనుక ఏదో పిచ్చితనం ఉండాల్సే ఉంటది! ఇలాగున యోచిస్తుండగా, ప్యారడిలోని ఇతిమితిలేని (అర్థం పర్థంలేని) చేష్టలు, బాధలు నా తల లోపలికి

దూసుకొచ్చినవి. ఇతని దశనుంచి ఇంటిలోపల ఏ సామానూ తక్షణమే చేతికి దొరకట్లేదు. నిష్కారణంగా ఆయా వస్తువుల్ని స్థలాంతరం చేసి (అటు ఇటు చేసి) నన్నే వెతికేందుకు శ్రమను కల్గిస్తుండేవాడు. కోపం వచ్చి ప్యారడ్ని పిల్చాను.

"ఒరేయ్ ప్యారా..., ఎందుకు రోజూ చెప్పుల్ని అద్లి బద్లీ చేసి ఉంచుతున్నావ్? ప్రతిరోజు నేను రెండ్రెండు సార్లు కాళ్ళను వాట్లో దూర్చి వేసుకోవాల్సి వస్తుంది కదా! నీకు ఎడంకాలులో ఏ చెప్పు, కుడికాలులో ఏ చెప్పు ఉంటుందనేది తెల్వదా? రోజుకొక కొత్త తరహాలోని చేష్టల్ని చేస్తున్నావు కదా?" అని తిట్టాను చెడామడా.

"గుర్తుందిలే దొరా... అవి నాకు మంచిగానే గుర్తు. అందుకే అలాగున ఉంచుతున్నాను ఆ చెప్పుల్ని. మారడు చెప్పినట్లుగానే 'అలాగునే ఇకముందు పెట్టు' అన్నందుకే వాట్ని అదలుబదలుగా ఉంచుతున్నాను" అన్నాడు ప్యారడు.

ఓహో! నాకు కిరికిరి (నెత్తినొప్పి) కల్గించేందుకు వీళ్ళిద్దరూ జంటగా చేరి కుట్రను నడుపుతున్నారులే! ప్యారడు, మారడు, టామి... అందరూ కూడబలుక్కొని నా ఊహకు సైతం నిల్వని రకరకాల హింసల్ని సంశోధించి నా మీద వాట్ని ప్రయోగిస్తున్నారు కదా! కేవలం చెప్పుల్ని సతతంగా అదలుబదలు చేస్తే చాలు, ఒకరికి మెంటల్ రావచ్చని భావించారు కదా! వీళ్ళ బుద్ధిసూక్తంను మెచ్చుకోవాలి! నాకు పిచ్చి కోపం వచ్చింది.

"ఒరేయ్ ప్యారా... ఈ పిచ్చి పనులన్నీ నా దగ్గర నడవవు! ఈ ఇంట్లో ఏ సామాను పెట్టినచోట పెట్టినట్లుగా ఉండట్లేదు. పెన్, పుస్తకం, రాసిన కాగితాలు.... ఇవేవి అరగంట వెతకకనే చేతికి దొరకేది లేదు. ఇదంతట్ని కలిపి మొత్తంగా లెక్కకట్టితే నా జీవమానం (ఆయుష్)లోని పదిహేనో, ఇరవయ్యో సంవత్సరాలు వస్తువుల్ని వెతికేదాంట్లోనే పోగొట్టుకొంటది. ప్రతి ఒక సామానుకూ ఇప్పుడు నిన్ను పిల్చి అడగాలా? నీకు జతగా ఆ పాడుకుక్క టామి ఒకటి. మీ అందర్నీ ఇక్కడ్నుంచి వెళ్ళగొట్టుతాను ముమ్ముందు... మీరే చూడండి" అంటూ అరిచాను. మారడు పోయిన జన్మలో పోలీసోడ్నని చెపుతుంది కరెక్టేనని అన్పించింది. స్టేషన్‌లో అపరాధులకు ఏరోప్లేన్ వేసేది, గోళ్ళ సంధులలో గుండుసూదుల్ని గుచ్చేది... ఇలాంటి చిత్రహింసలలో పారంగతుడైన మారడిలో ఇకనూ పోయిన జన్మలోని

సంస్కారభావం (వృత్తిభావం) తొలగలేదనుకొంటూ, “ఒరేయ్ మారా, ఎక్కడున్నావో” అంటూ అతడ్ని పిలిచాను.

ఇంత చిన్న విషయం వికోపంకు వెళ్తుంది చూసిన ప్యారడు, “ఔను దొరా... పోయినసారి మీ కొత్త చెప్పును టామి పాడుచేసింది కదా... అందుకే మారడు ఇప్పుడున్న ఈ కొత్త చెప్పుల్ని అదలి బదిలిగా పెట్టు అని చెప్పాడు. ఆ విధానం నుంచే టామి చెప్పును దొంగిలించేది వదిలేసిందండి... మీరే చూడండి” అంటూ వివరణ ఇచ్చాడు.

టామి చెప్పును దొంగిలించే పనిని నిల్పేసింది నిజమే. అయితే కుక్కలు పెరుగుతూ పెద్దవిగా అవుతుంటే, ఆ చేష్టల్ని తమంత తాముగానే నిల్పేస్తవి. టామి నుంచి మాయమయ్యే చేష్టను నేను సైంటిఫిక్ దృక్కోణం నుంచి చూస్తే, మారడేమో టామినుంచి ఆ చేష్టలు నిల్చిపోయింది ఆ చెప్పుల్ని అద్లి బద్లిగా చేసినందునే అని అంటున్నాడు కదా!

మారడు నా చెంతకు వచ్చిన తక్షణమే “నీకేంటి తలసరిగా లేదా? అదెందుకు చెప్పుల్ని అద్లిబద్లిగా చేయమని ప్యారడికి చెప్పావు? అతను ఇప్పటికే ఇంటిలోపల సరైనంతగా కష్టాల్ని ఇస్తున్నాడు. వాడికి ఇప్పుడు నువ్వు కొత్తగా వేరే రకరకాల దుర్విద్యల్ని బోధిస్తున్నావా?” అంటూ విరుచుకుపడ్డాను.

“ఒక చెప్పు అటు ఇటు అయ్యిందానికి ఎందుకంతగా ఆకాశం విరిగి తలమీద పడినట్లుగా రేగి పడుతున్నారు కదయ్యా! రోజుకొక చెప్పును టామి అడవి లోపలికి తీసుకెళ్ళి పాడుచేస్తుండేది కదా! అది, ఆ కార్యం (పని)ను తప్పించాను కదా... దాన్నే గుర్తు చేసుకోండి” అన్నాడతను సౌమ్యంగా.

“పోరా... పో పో అటు...! ఎవరు చెప్పారు నీకు చెప్పుల్ని అద్లి బద్లి చేస్తే కుక్క ముట్టదని” అన్నాను కోపంగా.

“ఎవరు ఎందుకు చెప్పేదుంటది నాకు? మీ కళ్ళకు ఫలితం కనబడట్లేదా? అలాగున అటు ఇటు పెట్టేది ప్రారంభించిన మీదటే మీ చెప్పులు ఒకటైనా పోయినవా?”

చెప్పులు అద్దిబద్దిగా ఉన్నదానికి, టామి వాట్ని దొంగిలించే దాన్ని నిల్పినందుకూ ఏ సైంటిఫిక్ సంబంధమూ లేదన్నది నాకు బాగానే గుర్తుంది. అయినా, ఈ ముసలోడి తలలో మెదడు ఎలాగున పనిని చేస్తుందో చూడాలి నేను అతని నుంచి వచ్చే జవాబుల మూలంగా!

“మార, దొంగిలించేందుకు కుక్కకు చెప్పుల్ని ఎలాగున అట్టిపెత్తే ఏమిటి? అటు ఇటు ఉన్నా ఒకటే, వాటి తల భాగం క్రింద ఉన్నా ఒకటే కదా! ఇంతకీ కుక్కకు కుడి కాలు చెప్పు ఏది? ఎడంకాలు చెప్పు ఏదనేది ఎట్లా గుర్తు అవుతది? ఉత్తుత్తిగానే నాకు కష్టాల్ని ఇచ్చేందుకే ఇదంతా మీ అందరినుంచి” అంటూ మళ్ళా రేగిపడుతున్నట్లుగా నటించాను.

“ఎందుకు గుర్తుకాదు టామికి? అంతా గుర్తే అవుతది దానికి! చెప్పుల్ని అద్దీబద్దీగా పెత్తే దెయ్యం చెప్పులని తెల్సుకొని వాట్ని ముట్టేందుకు జంకుతది (భయపడుతది). దెయ్యంకు కాళ్ళు ఎలాగుంటవో మీకు తెల్సుకదా... విఠలాచార్య సినిమాలను చూసారు కదా! ఆ దెయ్యాలలో ఎడంకాలు కుడికి, కుడికాలు ఎడంకు అద్దిబద్దిగా ఉంటవని మీకు తెల్వదా?” అంటూ తన తంత్రంలో దాగిన మూల సిద్ధాంతంను వివరించాడు.

టామి ఇప్పుడు దొంగిలించేది ఆపేసినందున మారడిలోని స్వతఃసిద్ధ ప్రామాణికత్వం ఎదురు నేను వాదం చేసేందుకు వెళ్ళేది అపాయకరంగా ఉంటది ఇప్పుడు. అద్దిబద్దిగా మార్చిన చెప్పుల్ని చూసి, “ఓహో, దెయ్యం ఇక్కడ చెప్పుల్ని విడిచి ఇంట్లోకి వెళ్ళినట్లుంది” అని భావించుకొన్న టామీకి వెనుకంజె వేసేందుకు దానికి (కుక్కకు) ఎంత మట్టంలో జ్ఞానంలోని విషయం తెల్వాల్సి ఉంది. అదేగనుక యోచిస్తే దానికి (టామికి) మొదటగా మనుషుల ఎడంకాలు, కుడికాలుల నిర్మాణం మీద తెలివి ఉండాలి. రెండోది దెయ్యంకు కాళ్ళు వ్యతిరేకంగా (ఉల్టా పుల్టాగా) ఉంటవనే తెలివి దానికి తెల్వాల్సి ఉంది. వీటన్నిటికన్నా ముఖ్యంగా దానికి (టామికి) మారడిలో ఉన్నట్లుగానే దెయ్యాలుంటవనేది నిజమేనని తెల్వాల్సి ఉంది.

మారడితో వాదంకు దిగి అతనితో సైంటిఫిక్ కోణం నుంచి తర్కం చేసేందుకు నాకు మనసొప్పట్లేదు. అతని యోచన, తర్కం, బుద్ధివంతతనం, హృదయంలోని

ప్రేమానురాగాలు, రక్తప్రసరణ.... వీటి లోపలంతా కలగలిసిపోయిన అతని నమ్మకాలమీద నాస్తికభావంతో దాడి చేసేబదులు ఎలాగోలా అతనితో సహనంగా సహజీవనం నడుపుకొనేదే క్షేమమని నాకు అన్పించింది.

టామి తన తుంటరి చేష్టల్ని సంపూర్ణంగా నిల్పేసినందున మారడ్ని మహామేధావిగా భావించుకోసాగాడు ప్యారడు.

★ ★ ★

మా ఊర్లోని దలితవాడకు చెందిన వ్యక్తి మారడు. మా ఎస్టేట్‌లో కాపలాకు చేరుకొనే మొదలు (ముందు) అదెక్కడో ఆ వాడలోనే గుడిసెను వేసుకొని ఉండేవాడట. అతనికి భార్యా బిడ్డలెవరూ లేరు. ఒకామె అతనికి దూరపు బంధుత్వం నుంచి కూతురు వరసతో ఉండి ఏదో ఊర్లో ఉంటదని చెప్పి, ఆమెను చూసి వచ్చేందుకు సెలవుపెట్టి వెళ్ళి చూసి వస్తుండేవాడు. కాపలా కాసేందుకు కుదిరిన మీదట దళితవాడను వదిలి, మా ఎస్టేట్‌లో ఉండే క్వార్టర్స్‌కు మారాడు.

మారడు పనికని నా వద్ద అడిగేందుకు వచ్చినప్పుడు, ఇంతగా వయోభారంతో ఉన్న ఇతనికి వరిమడుల్ని, తోటను కాపలా కాసేది సాధ్యమేనా అనే ప్రశ్న నన్ను తొలిచింది. రాత్రులలో అడవి పందులు మందగా వస్తుంటవి. ప్రభాత కాలంలో దొంగలు తోటలో ఎండు కట్టెలకు, అరటి గెలలకు, యాలకులు, పనసఫలాలకు... ఇలా మొదలైన వాటికని చిల్లరపల్లర దొంగతనాలకు వస్తుంటారు. ఇదంతా కాపలా కాసేది నీనుంచి సాధ్యమేనా అని అనుమానంగా ప్రశ్నించాను. ఆ నా డౌట్స్‌కు అతను కొద్దిగానైనా వెనుకడుగు వేయకనే, “మీరేమి యోచించకండి. ఏడు పడగల నాగుపాము ఏవిధంగా ఆ రత్నకిరీటాన్ని కావలిగా కాస్తదో అలాగే నేనూ మీ తోటను సురక్షితంగా కాస్తాను” అని చెప్పాడు. ఏడుపడగల నాగుపాము ఏవిధంగా ఆరత్న కిరీటాన్ని కాస్తదనేది గుర్తేలేని నాకు, అతని భరోసా మాటల్నుంచి కొంచమూ సమాధానం కాలేదు. అయితే ఈ రీతిగా ఉండే (సంక్లిష్టంగా ఉండే) కాపలాపనులకు దొరికే వాళ్ళే ఇటువంటోళ్ళు కదా! దృఢకాయంతో ఉన్నోళ్ళెప్పుడూ ఎక్కువ ఎక్కువగా డబ్బు దొరికే ఎస్టేట్లలోని గుత్తపనులకో, వరి మాగాణి పనులకో వెళ్తుండేవారు. మారడు ఎంతగా ముసలోడైనా, ఎస్టేట్‌లో కాపలాకు మనుషులున్నారంటే చాలు

దొంగతనాలు వాటికవే తగ్గిపోతవని నేను భావించి, అతడ్ని కాపలా కాయమని నియమించుకొన్నాను.

వరి మడులలో మారడు చేసిన మొదటి పని ఏమిటంటే ఎత్తుగా ఉన్న ప్రశస్తమైన (మంచిదైన) జాగాలో ఒక గుడిసెను ఆర్కిటెక్ట్‌లాగ నిర్మించాడు. నేను వెళ్ళినప్పుడల్లా అతను అక్కడే కూలబడి ఉండేవాడు. ఒక రోజూ అతను తోటంతా కలివిడిగా తిరిగిందాన్ని నేను చూడలేదు. తోటలో దొంగతనాలు జరగనీ, అప్పుడు అతని మీద రేగిపడ్దామని నెమ్మదించాను.

ఒకరోజు మారడి కార్య వైఖర్ని చూద్దామని ఉదయానే మేల్కొని వరి మడుల వైపుకు వెళ్ళాను. మారడు గుడిసెలోపల గడ్డి, ఆకులతో పరచుకొన్న పక్కమీద పడుకొని కుంభకర్ణుడిలాగ గురక పెట్టున్నాడు. ఉదయం వేళలోనే ఈ రీతిగా నిద్రపోతుంటే, ఇక రోజంతా ఎలాగున తోటను కాపలా కాయగలడని నాలో దిగులు ప్రారంభమైంది.

“ఓయ్, మారా... ఇదేనా నువ్వు కాపలా కాసేరీతి? ఉదయంవేళే నిద్రపోతున్నావు కదా!” అని ప్రశ్నించాను.

“రాత్రి ఒక క్షణం కళ్ళను మూయలేదయ్యా! అందుచేత ఈ వేళ ఎందుకో ఇక్కడ కూలబడగా కళ్ళు నిద్రకని మూసుకొన్నవి. వెనకెప్పుడో ఈ ఎస్టేట్ పాడుపడిన ప్రదేశమో ఏమో! ఇక్కడ కూలబడితే నిద్రకు జారి మేల్కొనేందుకు మనసే ఒప్పుకోట్లేదయ్యా” అని నవ్వుతూ తన నిద్రకు ఈ స్థలంలోని మహిమే కారణం అని వ్యాఖ్యానించాడు.

“చూడు మారా... పని పట్టుకొన్న మీదట తమాషా చేయకూడదు. నువ్వు కాపలా కాస్తున్నానని కొద్దిగా నోరు విప్పి కేకల్ని పెట్టుంటే దొంగలకు ఇక్కడ కాపలావాళ్ళు ఉన్నారనే బెదురు పుట్టుతది. నువ్వు గురక పెట్టే ఏమి కాపలా కాసినట్లు ఉంటది” అన్నాను కారంగా.

“కాపలా కాసేవాడు కేకల్ని పెట్టకూడదయ్యా. నేను కేకల్ని వేస్తే ఓహో ఇటువంటిచోటే కాపలాదారుడు ఉన్నాడని తెల్సుకొని (గ్రహించుకొని) మరొక

వైపునుంచి దొంగిలిస్తారు పైరును. అందుకే నేను సప్పుడు చేయకనే పహరా కాస్తున్నాను” అన్నాడతను విజ్ఞానిలాగ.

ఏదోలే, మొత్తానికి ఎస్టేట్‌లో దొంగతనాలు ఆగిపోతే చాలు. ఇతను ఏ రీతిలోనైనా కాపలాకాయనీ అనుకొంటూ నేను ఆ మాగాణి మడులకు అవతల ఉండే తోటవైపుకు బయల్దేరాను. మా తోటకు పక్కనే దళితవాడకు వెళ్ళే కాలిబాట ఒకటుంది. ఆ దారికి మా తోటకు నడుమ ఉండే సరిహద్దు కంచె వద్ద అశ్వత్థ (రావి) వృక్షం ఒకటుంది. సంవత్సరంలో ఎప్పుడో ఒకసారి దళితులు డప్పు కొట్టూ గంతులు చిందులేస్తూ ఆ చెట్టు చెంత పూజల్ని చేస్తుంటారు. వాళ్ళు తమ డప్పులలోఉన్న చర్మంను వేడి చేసుకొనేందుకు మంట వేసుకొంటే, ఆ నిప్పురవ్వలనుంచి తోట్లో ఎక్కడైనా ఆ మంట వ్యాపిస్తదేమోననే ముందస్తు బెదురు ఎచ్చరికల్ని చెప్పేందుకు ఇరుగుపొరుగున ఉన్న ప్లాంటర్స్ నావద్దకు వస్తున్నందునే ఆ రావిచెట్టు ఉదంతం గురించి నాకు అప్పుడు మాత్రమే తెలుస్తుండేది. ఆ రోజు తోటకు వేసిన కంచెకు దగ్గరలో ఉన్న రావి చెట్టు వైపుకు వెళ్ళి చూసినప్పుడు కుంకుమ చల్లిన దేవతా విగ్రహం (శక్తిమాత విగ్రహం), దానిముందు కుంకుమతో పులిమిన ఐదు పైసలు, పది పైసలు నాణాలు  కనబడినవి. దళితులు ఆ రాతి విగ్రహంకు మొక్కుల్ని మొక్కుకొనేది, కోళ్ళను కోసేది చేస్తుండేవాళ్ళు అంతే! డబ్బును ఇంతకు మునుపు కానుకగా వేసిందాన్ని నేనిప్పటివరకూ చూడనేలేదు. ఏ అర్చకుడు లేని ఈ గుడిలో కానుకల్ని ఎందుకు వేస్తారు? ఆ డబ్బుల్ని (నాణాల్ని) ఎవరు తీసుకెళ్తారనేది నాకు తెల్వట్లేదు ఇప్పుడు.

అయితే కొన్నిరోజులలో ఇదంతా మారడినుంచే అనేది గుర్తైంది. దళితవాడలో మరొక వ్యక్తి అయిన మారడు ఉన్నాడు. అతడ్నందరూ చిన్న మారడని పిలుస్తుండేవారు. గాత్రంలో (సైజ్‌లో) మా మారడి కన్నా నాలుగు రెట్లు బలంగా ఉన్నా, వయస్సులో చిన్నోడైనందున అతడ్ని చిన్న మారడని పిలుస్తుండేవారు. అతను, మరొక దళితుడైన రుద్రడూ ఒకరోజు “పెద్ద మారడు ఎక్కడ?” అని అడిగేందుకు నా దగ్గరకు వచ్చారు. కొద్దిగా కోపంగా ఉన్నట్లు వారు రుసరుసలాడుతున్నారు. ఏమిటని వాళ్ళను నేను అడగగా, మా మారడు చౌడమ్మ విగ్రహంతో మాట్లాడుతున్నాడని, ఇలాగున చెయ్యొచ్చా అని కేకల్ని పెట్టారు.

మా మారడు దళితవాడకు వెళ్ళి, "షావుకారు నన్ను నమ్మి కావలిదారుడిగా నియమించుకొన్నాడు. మీరు ఎవరైనా అక్కడికి చిల్లరపల్లర దొంగతనాలకు వస్తే పారాహుషారు. చౌడమ్మదేవి (తల్లి)కి చెప్పుకొన్నాను. కట్టెల్ని, పనసకాయల్ని దొంగిలించేందుకు వచ్చి ఏమైనా కష్టాలు దేవినుంచి ఎదురైతే, ఆ మీదట నన్ను ఆడిపోసుగోకండి" అని బెదిరించాడట.

మారడ్ని పిలిచి, వాళ్ళ రగడ ఏందని అడగగా "నాకు షావుకారు (ప్లాంటర్) జీతం ఇచ్చి కాపలాగ తోటను కాయి అని చెప్పిన మీదట నేను బందోబస్తు చేయాలా వద్దా?" అని దబాయించాడు నన్ను.

మారడు ఉత్తిగనే చౌడమ్మ తల్లితో చెప్పుకొంటానని అంటే ఆ వాడలోని జనం అంత లోతుగా దిగులు పడిపోతారో లేదో! ఎందుకంటే ఈ తంత్రం అన్ని ఎస్టేట్లలోనూ సర్వసాధారణంగా అయి, ఇప్పుడు ఆ దొంగ జనం ఎక్కువగా ఆ మాటలకు బెదరట్లేదు. అయితే మా మారడు ఆ బెదరని దానికి విరుగుడుగా పసుపు కుంకమల్ని పులిమిన నాణాల్ని దేవి విగ్రహం ముందు వేసింది, ఆ దొంగలకు ఒక విచిత్రమైన భయభీతిని పుట్టించింది. మారడు చౌడమ్మ తల్లి ముందు నాణాల్ని విసిరింది, అతనిలోని శ్రద్ధకు సూక్ష్మమైన గాంభీర్యంను తెచ్చిపెట్టింది. చౌడమ్మ ముందే డబ్బును వెదజల్లిన మారడు, ఆ చిల్లరపల్లర దొంగలలో కల్గించిన అత్యంత జటిల మనఃప్రేరణను విశ్లేషించేందుకు నాకెంతో కష్టమైంది.

"ఔను దొరా, ఇతను చౌడమ్మ తల్లికి ఏమైనా చెప్పుకోనీయండి. మాకేమి కాదు. అయితే ఆ చెప్పుకొనే దాన్నుంచి మంచి చెడు అంతా ఆ దొంగిలించినోళ్ళమీదే పడుతది. మేమెందుకు మీ ఎస్టేట్‌లో దొంగిలించేది ఉంటది. ఈ ముసలోడు నాణాల్ని అక్కడ పడేసింది తప్పు. ఇతనికి మా వాడ జనంను చూస్తే అదొక తిరస్కార భావం అతనిలో ఉంటది. అందుకే ఈ రకంగా చేసాడు" అన్నాడు రుద్రడు.

"నేను డబ్బును వెదజల్లుతాను. వెండి, బంగారం సమర్పించుకొంటాను తల్లికి. అదంతా నా విశ్వాసం. నువ్వు ఎవడివి నాకు చెప్పేందుకు భోసుడీ" అని మారడు గట్టిగానే బదులిచ్చాడు.

"ఓయ్, ముసలోడా, నువ్వేంటి తమాషాగా మాట్లాడుతున్నావా? పిల్లాపాపలు తిరిగే జాగ అది. పశువుల్ని కాసే పోరలు, ఇస్కూల్ పిల్లలు ఆ దారి వెంబడే తిరుగుతారు కదా! బీడీకి, అగ్గిపెట్టెకని నువ్వు సమర్పించిన డబ్బులకు చేతిని వేస్తే వాళ్ళకేమౌతదో తెల్సా? ఎవరి ఇల్లును పాడుచేయాలని చేసావ్ ఈ పనిని? మొదట అక్కడ్నుంచి నీ డబ్బును తీసేయ్" అంటూ చిన్న మారదు తిట్టాడు.

"చూడండి దొరా, మొన్న మా అందర్నీ తోలుకొని వెళ్ళి పిల్లలు కాకుండా ఉండేటట్లుగా కాంగ్రెస్సోళ్ళు (ఈ మూల కథాకథనం ఎమర్జెన్సి కాలంలో రాయబడింది) కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను చేసారు. ఆ జాగాలో ఇతను డబ్బును ఉంచి, ఇప్పుడున్న మా పిల్లాపాపల్ని చంపి మా అందరికి నిర్వంశం చేసేందుకు బయల్దేరాడు కదా! వాడెవడో లంజాకొడుకు దొంగతనం చేస్తే, వాడ్ని పట్టుకొని ఏమైనా చేయండి. మొత్తానికి మొత్తం దళితవాడకే కష్టాల్ని ఇస్తే ఎలాగండి?" అంటూ రుద్రదు పెడబొబ్బల్ని పెట్టినట్లుగా అరిచాడు.

"నువ్వెందుకు నీ డబ్బుల్ని (నాణాల్ని) తీసుకోకూడదు మారా? వాళ్ళంతగా చెపుతున్నారు కదా!" అని మారదు వైపుకు తిరిగి అడిగాను.

"శివశివా! ఏమి అడుగుతున్నారయ్యా మీరు? చౌడమ్మ తల్లికి పుచ్చుకో అని ఇచ్చిన నాణాల్ని వాపస్‌గా తీసుకొనేది ఎక్కడైనా ఉంటదయ్యా? పొద్దు పొడిస్తే చాలు, ఇక్కడుండే వంట చెరకును మోసుకెళ్ళేది, పనస కాయల్ని తెంపేది, యాలకుల్ని కాజేసేది... ఒకటా అరా, నేనైతే వయస్సులో పండుముదుసలిని. ఎక్కడని (ఏ దిక్కులోనని) కాపలా కాసేది మీరే చెప్పండి? అందుకే చౌడమ్మ తల్లి దగ్గరకు వెళ్ళి, నా జీతం నుంచే నీకింత పర్సంటేజ్ అని తల్లితో ఒప్పందం చేసుకొని జేబులో ఉన్న చిల్లర నాణాల్ని తీసి అక్కడ వేసి వచ్చాను. ఇక ఇప్పుడు ఎస్టేట్‌లో దొంగిలించమనండి ఎంతోడ్నైనా?" అంటూ మారదు సవాలు చేస్తూ వాళ్ళిద్దరిలోనూ మరింత దిగులును పుట్టించాడు.

"సరేలే నీ వాదన! నువ్వు చౌడమ్మ తల్లికి ఇలాగే నెలనెలా జీతంలో భాగం ఇస్తూ ఉంటే ఎంతో డబ్బు పోగుపడ్డది కదా! చివరికి దాని కథేంటి?" అని మారడ్ని అడిగాను.

“ఆ డబ్బును ఏమి చేసేందుకు వీలేలేదు. మీరు అప్పుడప్పుడు మైసూరుకు వెళ్తుంటారు కదా! అప్పుడు చెప్పండి నాకు. ఆ కానుక నాణాల్ని తీసుకొచ్చి మీకు ఇస్తాను. చాముండి కొండమీద చాముండేశ్వరి తల్లి ఉంటది కదా! ఆమే ఈ గ్రామ దేవతలందరికీ యజమానురాలు. నేనిచ్చిన ఈ కానుక డబ్బును పట్టుకెళ్ళి అక్కడ ఆ దేవి హుండీలో వేసిరండి” అన్నాడతను.

అక్కడుండే పూజారయ్య తినేందుకు, నేనెందుకు మారడి చిల్లర నాణాల్ని తీసుకొని వెళ్ళి సమర్పించేది సమంజసమేనా అనే భావం నాలో కలిగింది. అయితే నేను ఇప్పుడు నా భౌతిక వాదం నాస్తికవాదంతో కలగల్పి వాదించితే, మారడి తంత్రమంతా విఫలమై మళ్ళా నా తోటలో చిల్లర పల్లర దొంగతనాలు మొదలౌతవని ఊహించి మిన్నకుండి పోయాను. చౌడమ్మ విగ్రహం ముందు వేసిన డబ్బును తను తీసేది వీలుకాదని, యజమాని వద్ద కాపలా కాస్తున్నందుకు తనకు నెలనెలా రొక్కం పద్ధతి ప్రకారంగా వస్తున్నట్లుగానే, తనూ చౌడమ్మదేవికి తన జీతంలో కొంత శాతం తప్పనిసరిగా సమర్పించేది ఉంటదని కట్టెవిరిచినట్లుగా పెడసరంగా చిన్న మారడికి, రుద్రడికి ప్రత్యుత్తరం చెప్పి వాళ్ళను మరింతగా దిగులులోని ఊబిలో మునిగించాడు.

నేను మైసూరుకు వెళ్ళినప్పుడు ఆ కానుక డబ్బును తీసుకొని వెళ్తానని, అప్పటి వరకూ మీమీ ఇళ్ళలోని వారసుల్ని, ఆ కానుక నాణాలమీద చేతిని వేయకుండా జాగ్రత్తలతో చూసుకోండని చెప్పాను.

రుద్రుడు, చిన్న మారడు తిరిగి తమ వాడకు వెళ్ళిపోయిన మీదట, “ఈ దొంగ భాడుకోవ్‌లే సార్... వీళ్ళిద్దరూ పెద్ద తోడు దొంగలు సార్. అదేమి పీకుతాడు ఈ ముసలోడు అని అన్నారట వాడలో. నాణాల్ని ముట్టుకొన్న ఎవరికో ఏదో అయ్యుండొచ్చు ఇప్పుడు. అందుకే బెదిరిపోయి పరిగెత్తుకొని వచ్చారు ఇక్కడికి. వీళ్ళిద్దరూ మనతోటలో దొంగతనాల్ని చేస్తుంది నేను కళ్ళారా చూసాను. మా వాడంతా రుద్రుడ్ని దొంగ రుద్రుడనే పిలుస్తుంటారు” అంటూ ఆ ఇద్దర్నీ తిట్టాడు మారడు.

మా వరిమడుల పక్కనుండే చౌడమ్మదేవి ఎంతో పురాతన కాలంనుంచి అక్కడే ఉంది. మారడు నా వద్ద పనిలో చేరేవరకూ దొంగలు ఎవరూ బెదిరి తోక ముడిచింది లేదు. మారడు వచ్చి చౌడమ్మ ఎదురు డబ్బును పెట్టి చేసిన మాయ ఏమిటనేది ఈ రోజుకూ నాకు సరిగా అర్థం చేసుకొనేందుకు అవ్వటంలేదు. మారడు కాపలా కాసేందుకు ప్రారంభించిన మీదట దొంగతనాలు ఆగిపోయింది అటుండనీయండి, ఇతని కానుక డబ్బులు ఎక్కువైపోతుంటే భయపడిన దళితులు శాశ్వతంగా ఆ దారినే మానుకొని వరి మడుల పక్కన వేరొక కాలిబాటలో తిరగసాగారు. ఆ దార్లో వెళ్తుండేవాళ్ళంతా ఆ జాగాలో కొన్ని క్షణాలైనా డబ్బు ప్రలోభంకు మరియు, చౌడమ్మ తల్లి నుంచి ఎదురయ్యే భీతి... ఈ రెండిటి నడుమ ఇరుక్కొని మానసిక క్షోభను అనుభవిస్తున్నారన్నట్లుగా నాకు కనబడేది. ఉదయం వేళ అక్కడ ఆ రావి చెట్టుమీద రణగద్ద కూర్చుని చావు కూతల్ని పెట్టుంది అని అనుకొంటూ అటువైపు తిరిగేదాన్నే మానుకొన్నారు పూర్తిగా.

అదే సమయంలో 'ముద్రమనె మన్నాజంగిల్' వైపు నుంచి అడవి పందులు మా వరిమడుల వైపుకు రాసాగినవి. మా వరిమడుల గట్లమీద పంది అడుగుల గుర్తులు ఉన్నవి. అయితే ఆశ్చర్యమేమిటంటే, అవి ఎక్కడా మడులలో దిగి వరికంకుల మీద నోటిని చాపలేదు. నేను పండించింది తైవాన్ దేశంకు చెందిన ఐ.ఆర్. 8 వరి వంగడం. అది నేలనుంచి కేవలం ఒకటిన్నర అడుగుల పొట్టి రకంతో ఉన్న వరి అయినందున మడుల గట్లు కన్నా ఆ పైరంతా పొట్టిగా ఉన్నందున అదంతా బోసిగా ఉన్న మడులే అని భావించిన ఆ పందులు మిగిలిన రైతుల నుంచి ఏపుగా, ఎత్తుగా పెరిగిన రత్నచూడి, కిరువాణి మొదలైన సాంప్రదాయ వరి రకాలే వాటికి (పందులకు) ఆకర్షణీయంగా ఉండి, ఆయా మడులలోని వరిపైర్లను లూటీ చేసేందుకు వెళ్తుండేవి.

నేను కావాలనే ఈ పందుల ఉదాశీనంకు మారడు మరింకేమి వ్యాఖ్యానం చేస్తాడోనని, "ఏమి కాపలా కాస్తున్నావు మారా? నీ నుంచి భయమే లేకుండా ఎన్నో పందులు మన గట్లమీద తిరుగుతున్నవి కదా" అని అడిగాను.

"తిరగనీయండి! అంతేకదా! వరికంకుల్ని తింటేనే కదా మనకు నష్టం?"

“మందలు మందలుగా ఎన్నో తిరుగుతున్నవి. అవెందుకు మన వరి కంకులమీద నోళ్ళను తెరవట్లేదు?”

“అవి ఎట్లా తింటవి? వాటికి వాటి నోళ్ళను పెగిల్చేందుకు (తెరిచేందుకు) అవ్వాలి కదా!”

“ఏమి చేసావు వాట్కి?”

“వాటి నోళ్ళకు తాళాలు వేసియున్నవి. చౌడమ్మ తల్లి వాటి నోళ్ళకు తాళాలు వేసి వాట్ని మన పొలం వద్ద తిరగనిస్తది. అవి మన పొలం నుంచి దాటిన మీదట, ఆ నోళ్ళకేసిన తాళాల్ని తీసేసి, వాట్ని స్వేచ్ఛగా తిరిగేందుకు వదుల్తది, అంతేమరి!”

మారడి దగ్గర ఎక్కువగా మాట్లాడితే నేను అతడ్ని పరివర్తించే బదులు (మార్చేబదులు), అతనే నన్ను పరివర్తించొచ్చనే భయం పుట్టింది నాలో.

తోటకు కాపలా కాసేందుకు బాధ్యతను మోస్తున్న ఈ గట్టి ముసలి పిండం చౌడమ్మదేవికి సబ్ కాంట్ర్యాక్ట్ ఇచ్చి వరిమడుల చెంత అప్పుడో ఇప్పుడో అన్నట్లుగా కూలిపోయే గుడిసెలో అరామంగా నిద్రపోతుండేవాడు. ఇతని నుంచి మూడు కాసుల జీతం తీసుకొన్న విధంకు చౌడమ్మ తల్లి బేడీలను, గొలుసుల్ని పట్టుకొని పగలు రాత్రి కాపలా కాస్తుండేది చేయాల్సి వచ్చింది.

★ ★ ★

కన్నడ భాషలో కీ.శే. పూర్ణచంద్ర తేజస్విగారు రచించిన “సంబళక్కె సిక్కికొండ దెవ్వ” అనే కథకు యథాతథ తెలుగు అనువాదం.

అనువాదకుడు: శాఖమూరు రామగోపాల్.

# దెయ్యంకోడి



అడవి జంతువులు విపత్కర సన్నివేశాలలో అసాధారణంగా మసలుకొంటవని ఎన్నో కథల్ని వినియున్నాను. అక్క, బుక్క... ఆ సోదరుల మీద కుందేలొకటి తిరగబడిందాన్ని చూసిన విద్యారణ్యస్వామి ఇదొక పరాక్రమమైన నేలగా భావించి అక్కడే ఆ సోదరులనుంచి విజయనగర సామ్రాజ్య స్థాపనకు భద్రమైన పునాది వేసాడనే కథను విన్నాను నేను. అయితే కొన్ని సందర్భాలలో ఆయా జంతువుల నడవడికకు ఒక నిర్ధిష్ట కారణం ఉంటదని నాకు ఈ అడవిలో వ్యవసాయం చేస్తున్నందున ఎంతో తెల్సివచ్చిందిలే! ఇప్పుడు నేను మీతో చెప్పే ఈ కుక్కుట పురాణం అటువంటిదే అయిన విచిత్ర మరియు రోచకం ప్రసంగం నుంచే సుమా!

ఒక రోజు మారడు పడ్తూ లేస్తూ వళ్ళంతా గాయాల్ని చేసుకొని ప్రభాత కాలంకే ఇంటిముందు హాజరైయ్యాడు. ముఖంమీదా, కాళ్ళు చేతుల మీదా ఎంతగానో గీసుకుపోయిన గాయాలున్నవి. “ఎక్కడ పడ్డావు?” అని అడిగితే జన్నాపురం నుంచి వస్తుండగా ఈత పొదల చెంత ఒక దెయ్యం పట్టి పీడించిందని, తనని పిల్చికెళ్ళి ఒక కొరుకు బండమీద పడదొబ్బి గాయాల్ని చేసిందని చెప్పాడు. అతడ్నుంచి అప్పుడప్పుడు వచ్చే ఈ రీతిలోని విచిత్ర కథల్ని వినియున్న నేను మొదలు ఆ కథను గంభీరంగా పరిగణించలేదు. అయితే ఈసారి అతనికి దెయ్యం అడవి కోడి రూపంలో కనబడి గాయపర్చిందని చెప్పినప్పుడు మాత్రం నాలో కుతూహలం ఇబ్బడిముబ్బడైంది.

నా పెద్ద కుమార్తె సుస్మిత మైసూరులో నా మిత్రుడైన హా. మా. నాయక (సుప్రసిద్ధ కన్నడ సాహితీవేత్త) గారి ఇంట్లో ఉండి చదువుకొంటుంది. నా రెండో పుత్రికైన ఈశాన్య ఒక్కతే ఇంట్లో ఉండేది. ఈశాన్యకు మాట్లాడేందుకు, ఆటపాటలకు మారడే జత కట్టేవాడు. అతను ఈశాన్యతో “తల్లీ... ఒక రూపాయి ఇప్పించమ్మా... వళ్ళంతా తిమ్మిరి తిమ్మిరిగా ఏదో తరహాలో ఉంది. కల్లు తాగి వస్తాను తల్లీ” అని బతిమాలుతుండేవాడు. ఈశాన్యలో అతనికి కల్లు తాగేందుకు డబ్బు ఇచ్చేది తన కర్తవ్యం అన్నట్లుగా ఇంట్లోకి వచ్చి ఆమె తల్లి (రాజేశ్వరి)ని పీడించి డబ్బును ఇప్పించుకొని మారడి చేతిలో పెట్టేది. వళ్ళంతా గీసుకుపోయి నా వద్దకు వచ్చిన మారడికి నిన్న ఈశాన్యనుంచే ఒక రూపాయి బట్వాడా అయ్యింది. కల్లు తాగిన మీదట ఆ నిషానుంచే మా(ఈ)ముసలోడు గుంతలో పడి, ఇప్పుడు ఆ గాయాలకు దెయ్యమే కారణమని చెపుతున్నాడో ఏమో! ఆ భావంతో “మస్తుగా (పూటుగా) తాగి, గుంతలో పడి ఇప్పుడు దెయ్యంనుంచే పీడించబడ్డానని చెపుతున్నావు కదా?” అంటూ మారడిమీద కసురుకొన్నాను.

మారడు నెత్తి నోరు కొట్టుకొంటూ దెయ్యం పట్టిన అడవికోడి ఆ అడవిదార్లో ఒకటుందని అది మనుషులు ఎదురుపడ్తే నర్తన చేస్తదని, దాన్ని పట్టేందుకు ఎవరైనా ముందుకొస్తే వాళ్ళను మరులుగొల్పి ఎక్కడికో తీసుకెళ్ళి గుంతలో పడేస్తదని చెప్పాడు. ఈ కథను అతను ఈశాన్యకూ చెపుతుంది నాకు కనబడింది. పిల్లలకు నీ దరిద్ర దెయ్యాల కథల్ని చెప్పి వాళ్ళలో భయభ్రాంతుల్ని కలగజేయకు అని గదిరాను.

"నాకెందుకయ్యా విచిత్ర కథల్ని చెప్పేది ఉంటది? కావాలంటే మీరే ఆ ఈత వనాలలో తిరగండి. ఆ కోడి ఏమైనా ఇక అక్కడుంటే కచ్చితంగా మీ ఎదురుకు వచ్చి ఎగురుతదో లేదో చూడండి" అంటూ మారడు బదులిచ్చాడు.

మారడి మాటల వెనుక ఏవో విచిత్రంగా ఉండే ఘటనలు ఉంటున్నా, అతను ఆ ఘటనల్ని తన జ్ఞానంకు తగినట్లుగా అర్థం చేసుకొని చెపుతుండే కథల దశ నుంచి అతను చెప్పేవాట్ని ఎవరూ నమ్మట్లేదు.

మా ఇంటి ముందే తోట. ఇంటెనుక దట్టమైన అడవి. ఇంటిముందున్న తోటను దాటితే విస్తారమైన ఈత వనాలు ఎన్నోమైళ్ళ దూరానుండే జన్నాపురం వరకూ విస్తరించి ఉండేవి. అక్కడో ఇక్కడో ఒకటో రెండో వృక్షాలు తప్పితే మొత్తం ఆ ప్రాంతమంతా చిన్న చిన్న ఈత పొదల్నుంచి కిక్కిరిసి ఉంది. ఇక్కడుండే ఈతచెట్లు మెట్ట (దుర్భిక్ష) ప్రాంతాలలోని ఈతచెట్లలాగా ఎత్తుగా పెరిగేది లేదు. వాటి మొదళ్ళు ఎత్తుగా ఉండకనే నేలమీద ఒకట్రెండు అడుగుల ఎత్తులో ఉండి వాటి మట్టలు మాత్రం ఐదారు అడుగుల ఎత్తుకు పెరిగి ఉండేవి. ఇవి మెరక సీమలోని ఈతచెట్లలాగనే వేసవి ఆరంభంలో పూతను, ఈత గెలల్ని వేసినా, వీట్నుంచి కల్లును దించేది లేదు. చీపుర్లు, చాపలు మొదలైన వాట్ని నేసేందుకని (అల్లేందుకు) మేదర్లు ఈ చెట్ల ఊచల్ని, మట్టల్ని ఉపయోగిస్తుండేవారు. ఇంటి పనిముట్లకు తప్పితే ఇవి మరి ఇక ఏ పనులకూ నిరుపయుక్తంగా ఉండేవి. ఈ ఈత వనాలలో ఉండే నేల, వానలనుంచి పైనుండే మట్టి అంతా కొట్టుకుపోయి (కోసుకుపోయి) కఠిణ శిలలు, నుణుపు రాళ్ళు బయటపడి బంజరు భూమి లాగ ఉండేది.

ఎన్నో చదరపు మైళ్ళ విస్తీర్ణంతో ఉండే ఈ ఈత వనాలలో అడవి కోళ్ళు, కుందేళ్ళు, కౌజుపిట్టలు తప్పితే మరిక ఏ అడవి ప్రాణి అక్కడ తిరుగుతుండేది లేదు. ప్రతి సంవత్సరం రోహిణి కార్తెలో ఈ ఈత వనాలు తగలబడుతుండేవి. మంటను పెట్టి తగలబెడ్తే మళ్ళా ఎంతో తొందరగానే ఆ కాలిపోయిన బూడిద పరిసర ప్రాంతాలలోకి చేరి పచ్చటి గడ్డి చిగురించి పెరుగుతది అనే నమ్మకంతో చుట్టుప్రక్కల ఉండే పల్లెల జనం ఆ ఈత వనాలకు నిప్పును పెట్టుండొచ్చు. ఈత మట్టలు, ఊచలు కాలుతుంటే దట్టమైన పొగ వెలువడి మొత్తం మూడిగెరె తాలూకాకే

నిప్పు అంటుకొంది అన్నట్లుగా ఆ పొగ వ్యాపించేది. ఈత వనాల మాటున స్థావరంలను చేసుకొన్న కౌజుపిట్టలు, కుందేళ్ళు, అడవి కోళ్ళు అప్పుడు ఆ విపత్కర స్థితిలో కాఫి ఎస్టేట్లకో, దూరానుండే ఘోరారణ్యంకో పారిపోతుండేవి. నిప్పు సెగలకో, ఘాటువాసనకో భయపడి అవి బెదురుతూ పారిపోతుంటే, వాట్ని పట్టుకొనేందుకు వేటగాళ్ళు గుంతల మాటున కాసుకొని ఉండేవారు. మంటలలోని చటపట సప్పుళ్ళ నడుమ అప్పుడప్పుడు మాకు వేటగాళ్ళ తుపాకి గుళ్ళ సప్పుడు ఢమార్ అని వినబడుతుండేవి. ఎంతగా దావాలనం అని అనుకొన్నా, ఎంతగా తగలపడింది అని చెప్పుకొన్నా, ఈత చెట్లకుండే కుదురు సమేతంగా పూర్తిగా దహింపబడినా, ఆ ఈత మొదళ్ళన్నీ మసిపట్టి, బొగ్గులకు చెందిన తుంపులులాగ కనబడినా, ఆ యా ఈత కుదుళ్ళ నుంచి తొలకరి వానలు ఒకట్రొండు పడిన తక్షణమే చటాల్నే వాటి మొదళ్ళ నుంచి చిగురు బయటకు తొలుచుకొని వస్తుండేది. వానలు పడిన రెండు వారాలలోనే ఈ ఈత చిగుళ్ళు కంటి చూపు పారేవరకూ ఆ ఈత వనాల ప్రదేశం అలలు అలలుగా ఎగిసెగిసి పడుతుండే ఆకుపచ్చ సముద్రంగా కనబడుతుండేది.

మా తోట నుంచి కల్లు తాగేందుకని జన్నాపురంకు వెళ్తున్న మారడు రహదారిలో వెళ్ళకనే ఆ ఈత వనాల నడుమ ఉండే దగ్గరి దారైన కాలిబాట నుంచే వెళ్ళాడట.

పూటుగా కల్లు తాగి, తిరిగి ఎస్టేట్‌కు వస్తున్న మారడి ఎదురుగా ఒక అడవికోడి వచ్చి గిరగిరా తిరుగుతూ రెక్కల్ని విప్పి కొట్టుకొంటూ నర్తకిలాగ నర్తించిందట. ఎవరో వేటగాడు గాయంచేసిన కోడి ఇదేనేమో అని భావించిన మా ముసలోడు ఆ నిషాలో దాన్ని పట్టుకొనేందుకు ఆత్రం ఆత్రంగా పరిగెత్తాడు. ఇంకేంటి కోడి మారడి చేతికి చిక్కింది అన్నట్లుగా అది ఇతడ్ని ఊరిస్తూ ఊరిస్తూ పరిగెత్తింది. కల్లులోని నిషాలేకుంటే దాన్ని కచ్చితంగా పట్టుకొని గొంతు నులిమి కోడిపులుసును అక్కడే చేసుకొనేవాడ్నని మారడు నాతో వివరించుతున్నాడు. మారడు తూలుతుంటే అతనెదురు తకథిమిథై అన్నట్లుగా చిందులేస్తున్న ఆ కోడి వెన్నుమీద చేతిని నిల్పినప్పుడు రొట్టెజారి నేతిలో పడిందన్నట్లుగా దాన్ని గమనిస్తున్నాడు తప్పితే కాళ్ళక్రిందున్న నుణుపురాళ్ళను మారడు గమనించనే లేదు. మారడి అడుగులు ఆ రాళ్ళకు కొట్టుకోగా దభీల్‌మంటూ పడి దొర్లాడు గుంతలోకి. కోడి తన పాటికి

తను అన్నట్లుగా పరారైంది. కోడి తనను పడేసేందుకే మాయోపాయంతో ఆ నుణుపైన బండరాళ్ళవద్దకు లాక్కెళ్ళిందనేది మారడిలో దృఢ నమ్మకంగా ఉంది.

మారడి మాటల్ని వింటే అక్కడ ఆ ఈత వనాల నడుమ ఏదో విచిత్రమైంది జరిగినట్లుగా అన్పిస్తది. బహుశః కాళ్ళు వంకరటింకరగా (ఫ్లోరైడ్ పీడిత జనంకు ఉండే కాళ్ళలాగ) ఉన్న అడవిపుంజో లేకపోతే వేటగాడ్నుంచి వేటుపడి తప్పించుకొని తిరుగుతున్న పుంజో ఇవేవి గాకుంటే పారుడురోగంకు లోనైన పుంజో అతనెదురు విచిత్రంగా ప్రవర్తించి అతని నాలుకలోని దురాశెను కెలికి ఉండొచ్చు. లేకపోతే కల్లు మత్తులో మునిగిన మారడికి దాని నడక ఎగిరెగిరి పడుతున్న జయమాలిని లాగ కనబడిందో ఏమో! దెయ్యం, కోడి రూపంలో నన్ను నరబలిగా పీక్కుతినేందుకు వచ్చిందని మారడు పొద్దుట్నుంచి కనబడిన వాళ్ళందరికీ చెప్పుతున్నాడు. జరిగిన సంఘటనను మారడు తనదే అయిన విశిష్టరీతిలో అర్థం చేసుకొని రోచకంగా కథను అల్లాడు. దెయ్యం ఈ రీతిగా కోడిరూపం దాల్చి కష్టాల్ని కల్గించిందనే తీర్మానంలోని దశనుంచే, అతను చూసిన అనుభవించిన సత్యంను జనం నమ్మేందుకు వీలు కాదన్నట్లుగా మారడే చేసుకొన్నాడు.

ఇదైన కొన్ని రోజుల తర్వాత నేను, ప్యారడు, మారడు ఆ ఈత వనాల వద్దకు వెళ్ళాల్సి వచ్చింది. ఆ ఈత పొదల బయలులో ఉండే జమ్మిచెట్టు క్రింద ఒక పెద్ద పుట్ట ఉంది. పశువుల్ని కాసే పోరడు ప్యారడితో ఆ పుట్టలో తేనెటీగలు వచ్చి తేనె పట్టును పెట్టినవని మాకు తెల్పాడు. ప్యారడితో ఇంట్లో ఉన్న తేనెపెట్టెలలోకి ఆ రాణి ఈగను ఉపాయంగా జేర్చి, మిగిలిన ఈగల్ని వాట్లో కూర్చోబెడ్దామని చెప్పాను.

ఖాళీ పెట్టెల్ని బయటకు తెచ్చి వాటిలోపలుండే సాలెపురుగుల్ని బయటపడేసి, దుమ్ము ధూళిని ఊడ్చి, ఆ పెట్టెల్ని, చాకు, పొగ పెట్టేందుకు జనపనారగోతం, పొగాకు ఆకుల్ని, వేపమండల్ని పట్టుకొని బయల్దేరేటప్పటికి తొమ్మిదిగంటలైంది. ఈ సామానులన్నిట్నీ మోసుకొంటూ టామీని వెంటేసుకొని బయల్దేరాం.

ఈత వనాల నడుమ ఒక స్మశానం ఉంది. దాన్ని దాటి సుమారు ఒక అరమైలు వెళ్తే జమ్మిచెట్టు కనబడుతది.

ప్యారడిలో మేము అప్పగించిన పనిని వదిలి వేరే ఏవైనా అడ్డపనుల్ని చేయటంలో భలే కుశాలు ఉంటది అతనిలో. తోడుగా టామి ఉంటే ఇక చెప్పేది ఏమి లేదు. అరగంట లోపల అయ్యేపనిని ఒకరోజుకు పొడిగిస్తాడు. టామీని ఇంట్లోనే కట్టిపడేద్దామనుకొంటే అది గొంతు చించుకొని మొరుగుతూ మెడకు కట్టిన గొలుసును గుంజుతూ ఇంట్లో ఉన్నోళ్ళందరికీ కిరికిరి అయ్యేటట్లుగా చేస్తుంది.

ఆ రోజు నేను చూసి, అనుభవించినదాన్ని చెపుతాను ఇలాగున. ఒక అడవికోడి దబక్కనే మా ఎదురే ఎగిరి క్రిందపడి ఇంకేంటి ప్రాణం విడుస్తదన్నట్లుగా మా వద్దే పోర్లాడి రపరప రెక్కల్ని కొట్టుకొంటూ, తల్లడిల్లుతూ, తూలుతూ ముందుకే దూసుకెళ్ళింది. ప్యారడు తన తలమీద పెట్టుకొన్న తేనె పెట్టెల్ని దఢాల్నే కిందపడేసి, "టామి, టామి! పట్టుకో! చూచూ! పట్కో" అంటూ టామిని ఉత్సాహపరుస్తూ, క్షణంలోనే కోడి వెనుకే ఆ ఈత పొదలలో మాయమయ్యాడు.

"నేను చెప్పలేదా? అదేనయ్యా దెయ్యం కోడి గురించి! చూసారా ఎలాగున సురసుందరిలాగ నర్తించింది మీ కళ్ళ ఎదురులోనే! నేను చెప్తే తాగి నిషాలో ఉన్నోడ్నని రేగిపోయారుకదా!" అంటూ చెప్తున్న మారడు తన మెడను చాపుకొని ప్యారడు, టామి వెళ్ళిన దిక్కునే చూడసాగాడు.

మారడు చెప్పిన దెయ్యం కోడికథను మర్చేపోయాను. ఇప్పుడు చూస్తే మారడు చెప్పిన కథంతా నిజమే అన్నట్లుగా కోడి నర్తించింది. దెయ్యం పట్టినదానిలాగ నేలమీద పడి క్యాబెరా డ్యాన్స్ చేసినట్లుగా తకథిమిథై నాట్యం చేసింది చూడగా మారడు చెప్పిందాంట్లో ఎటువంటి ఉత్ప్రేక్ష లేనేలేదు కదా! అయితే ఈసారి ప్యారడికి తోడుగా టామి ఉన్నందున పోయినసారి మారడు నుంచి తప్పించుకొన్నట్లుగా అదిప్పుడు దానికి సాధ్యంకాదు. ఎదురుగా ఉన్న దిబ్బలోని ఈత పొదల నడుమ ప్యారడు, టామి కోడికని వెతుకుతుంది ప్యారడి అరుపులనుంచి మాకు గుర్తు అవుతుంది. టామి, ప్యారడి అరుపుల్ని మొరుగుల్ని వింటే ఆ కోడి వాళ్ళ చేతికో, నోటికో దొరికిందిలే అనే భావం నాకు, మారడికి కల్గుతుంది.

అంతలో అక్కడ్నుంచి కోడి తుర్రుమంటూ నేలనుంచి ఎగిరింది దూరంలో ఉన్న మాకు కన్పించింది. కొంచం దూరం వరకూ రెక్కల్ని ఆడిస్తూ ఎగిరిన ఆ

కోడి, ఆ తర్వాత సుయ్‌్ంటూ గాలిలో తేలాడుతూ దూరానున్న వరి మడుల గట్టుమీద దిగి సర్వసాధారణమైన పెంపుడు కోడిలాగ సావకాశంగా నడుచుకొంటూ ప్రక్కనున్న పొదలలోకి దూసుకొని మాయమైంది. అది నడిచి వెళ్ళిన రీతిని చూస్తే దానికేమి ప్యారడు, టామి నుంచి అపాయం అయినట్లు కనబడట్లేదు.

కొంచం సేపైన మీదట ప్యారడొచ్చి ఎగిరెళ్ళిన కోడి ఏ దిక్కుకు వెళ్ళిందని అడిగాడు. టామి ఇంకా ఈత పొదలలోనే వెతుకుతుంది. నేను ప్యారడితో కోడి వరి మడుల వైపుకు వెళ్ళిందని, దానికేమి కాలేదని చెప్పాను. నా మాటల్ని నమ్మేందుకు ప్యారడికి వీలుకావటంలేదు. అది మరింకేంటి, తన చేతికి దొరికేది కచ్చితమని చెప్తూ, దాన్ని ఇక వదిలేది లేదని ఒట్టు వేసుకొంటూ టామిని పిల్చి దూరానున్న వరిమడులవైపుకు లగెత్తాడు. ఆ కోడికి వీసమెత్తు గాయమేది కాలేదని, ఇకదాని వెనక వెంటపడేది వ్యర్థమేనని నేనెంతగా చెపుతున్నా నా మాటల్ని చెవిలో వేసుగోకనే నేను చెప్పి ముగించే లోపే వెళ్ళిపోయాడు. ఇప్పుడిక 'మేము చేయాల్సిన పని ఈ రోజు జరిగేది లేదని నాకు కచ్చితమైంది. ప్యారడి చేతికి దొరికినట్లుగా ఎన్నోసార్లు ఆ కోడి తప్పించుకొన్నందున అతని తల చెడిపోయింది. ఎవరి మాటల్ని వినే స్థితిలో లేడు ఇప్పుడు.

"అది దెయ్యం పట్టిన కోడి! వీడు దాని వెనుక పరిగెత్తి ఏదైనా పాడుబడిన దిగుడు బావిలో పడకుంటే అడగండి నన్ను" అంటూ వరి మడి వైపుకు పరుగులు పెట్తున్న ప్యారడి వైపు చూస్తూ గొణిగాడు మారడు.

ప్యారడు, టామి ఆ కోడిని వెతికి వేసారి తమ శక్తి అంతా ఉడిగిపోయిన పిమ్మట మా వద్దకు చేరారు మళ్ళా. వాళ్ళు వచ్చి చేరిన వేళకు అప్పటికే ఒంటిగంట దాటింది. "చేయాల్సిన పనిని మర్చిపోయి కోడిని పట్టేందుకు వెళ్ళావు కదా" అంటూ ప్యారడ్ని తిట్టాను. ఎంత తిట్టినా కోడి ఇంకేంటి నా చేతికి చిక్కేది ఖాయమేనని పొట్టను గోక్కుంటూ చెప్పేదాన్ని అతను మానట్లేదు.

తేనెపట్టులో సుఖంగా మహారాణి వైభోగంతో ఉన్న రాణి ఈగను ఒడుపుగా తేనెపెట్టలోకి చేర్చి ఆ తేనెపెట్టెను ఆ పుట్టచెంతే ఉంచాము. మకరందంకని

బయటకెళ్ళిన తేనెటీగలన్ని వెనుదిరిగి వచ్చిన సాయంత్రంలో ఆ పెట్టెను ఎస్టేట్‌లోకి తీసుకెళ్దామని తీర్మానించుకొని వెనుదిరిగాము.

సాయంత్రంలో పెట్టెను తీసుకొచ్చేందుకు మారడు ప్యారడు వెళ్ళగా మళ్ళీ అదే జాగాలో కోడి అదే రీతిగా ప్రవర్తించిందని ప్యారడు నాతో అన్నాడు. అయితే ఈ సారి మాత్రం మారడు దాన్ని దెయ్యంకోడి అని వివరించినందున ప్యారడు పొద్దున చేసినట్లుగా దాని వెంటబడలేదు.

మారడు చెప్పింది నిజమే. కోడి పిచ్చిపట్టిన దానిలాగ మా ఎదురు సినిమాలో వ్యాంప్ నర్తించినట్లుగా ప్రవర్తించింది. అయితే అడవి ప్రాణులలో మనోవికలత, పిచ్చి చేష్టలు అరుదుగా (దాదాపు లేనట్లుగానే) ఉంటది. ఎందుకంటే ఆ రీతిలో చిత్త వికారాలతో ఉండే ఏ ప్రాణి, అడవిలో తమతోటి జంతువుల నుంచే సంహరింపబడేది కచ్చితంగా ఉంటదిలే!

కోడిలోని ఈ తరహా ప్రవర్తనకు వేరేదో కారణం ఉంటదేమోనని ఎంతో లోతుగా ఆలోచించసాగాను. నాకు తక్షణమే కరెక్ట్‌గా ఏమి తెల్వలేదు. అయినా దాన్లోని ఈ ప్రవర్తన (స్వభావం)కు, దాని గుడ్లకు, పిల్లలకు ఏదో రీతినుంచి సంబంధం ఉండొచ్చేమోనని అస్పష్టంగా అన్పించింది నాకు.

కాజాణ పక్షుల గూళ్ళచెంతకు మనం వెళ్తే, అవి రోషావేశంతో మనమీద ఎగిరిపడి తమగోళ్ళనుంచి ముక్కుల నుంచి పొడుస్తవి విపరీతంగా. ఆ పక్షులు ఎంతగా ఆక్రమణశీలవంటే, వేరే జాతుల పక్షులు వీటి పోరాట పటిమను గుర్తించి వాటి గూళ్ళ పక్కనే తమ గూళ్ళను కట్టుకొంటవి. అక్కడ చుట్టుప్రక్కల ఏవైనా అపాయకర పక్షులు వస్తే, తిరిగితే ఈ కాజాణ పక్షులు వాట వెంటపడి తరిమేస్తవి. ఆ కాజాణ పక్షులు తమగూళ్ళ చెంత తిరిగే కాకుల్ని, గద్దల్ని మైళ్ళదూరం వరకూ పారదోలేదాన్ని నేను చూసియున్నాను. గుడ్లుగాని, పిల్లలుగాని ఉంటే అనేక రకాల పక్షులు ప్రాణభయం లేకుండా తమ శత్రువులమీద పోరాడుతవి.

నేను మరసటిరోజు పొద్దున్నే లేచి ఈత వనాల నడుమ ఉన్న స్మశానం దగ్గరకు ఒకడ్నే వెళ్ళాను. కోడి మళ్ళా నిన్న చూసిన స్థలంలోనే కనబడేది మరియు నిన్నటి

లాగే ప్రవర్తించేది నాలో తీవ్రమైన అనుమానంకు, కుతూహలంకు తోడ్పాటు ఇచ్చింది. ఆ కోడి ఇప్పుడు అదే చోట మళ్ళా నాకు కనబడ్తది అనే దాంట్లో ఆవగింజంతా పరిమాణంలోనైనా నాకు నమ్మేందుకు వీలులేదు.

స్మశానం వద్ద కొన్ని అడుగుల్ని ముందుకే వేస్తూ నడిచాను. చిత్రంగా నా ఎదురులో ఉన్న చిన్న ఖాళిస్థలంకు నిన్న మేము చూసిన అడవికోడే దూసుకొొచ్చి పడ్తూ లేస్తూ దొర్లుతూ ఇంకేంటి ప్రాణం విడుస్తదన్నట్లుగా అభినయిస్తూ నా దృష్టిని తనవైపుకు ఆకర్షించుకొనేందుకు ప్రయత్నించింది. అయితే నేను నిల్చినచోటే నిల్చినందున దాన్ని పట్టేందుకు దాని వెంట పడుతాననే భ్రమలో ఉన్న ఆ కోడికి ఇకముందేమి చేయాలనేది తోచక అటు ఇటు చూడసాగింది. తర్వాత తాగి తూలిపడుతున్నోడిలాగ తూలుతూ పొదలోపలికి పరిగెత్తింది. అప్పుడూ నేను కదలక మెదలకనే ఉన్నదాన్ని చూసి మరలా నా చెంతకొచ్చి ఒకట్రెండు క్షణాలు దొర్లి పొర్లి నర్తించసాగింది. ఈసారైతే ఈ కోడిది ఉద్దేశపూరితంగా ఉన్న నటనే అన్నట్లుగా స్పష్టంగా గుర్తైంది నాకు. దాని మోహక అభినయంకు నానుంచి ఏ ప్రతిక్రియ రానిదాన్ని చూసి దిగ్భ్రమంతో నన్నొక మెంటలోడిగా భావించి ఆ కోడి ఎగిరి వరిమడుల వైపుకు వెళ్ళిపోయింది.

అది నా చెంతకు వచ్చిన దిక్కులో ఉన్న పొదలన్నిట్నీ వివరంగా వెతకసాగాను (గాలించాను). వణిగిన ఈతమట్టల్ని, ఊచల్ని తెచ్చి భద్రంగా గూడు కట్టుకొని దాంట్లో పదమూడు గుడ్లను పొదిగేందుకని దాబెట్టింది ఈ కోడి. అక్కడికి వచ్చినోళ్ళు ఈ గుడ్లను చూసి తస్కరిస్తారేమోనని (దొంగిలిస్తారేమోనని) ఆ వచ్చినోళ్ళను దిక్కు తప్పించేందుకే ఆ కోడి ఈ విధంగా నాటకం ఆడుతుంది. ప్యారడు, టామి దాని వెంటపడినప్పుడు ఇంకేంటి దొరికిపోతది అన్నట్లుగా నటన చేస్తూ వాళ్ళను సరైనంత దూరంకే తీసుకెళ్ళింది, ఆ తర్వాత ఎగిరి పరారైంది గుర్తుకొచ్చింది మళ్ళా నాకు.

పక్షుల, మృగాలలోని ఈ జీవన తంత్రం, వంశాభివృద్ధికి అవి పడేపాట్లు నాకు తెల్సి ఉన్నందున ఆ పక్షుల, మృగాల ప్రవర్తననుంచి చుట్టుప్రక్కల ఉండే పరిసరాలమీద గమనం నిల్పి వాటి గుడ్లనో, పొదల మాటున కూర్చోబెట్టిన వాటి

పిల్లల్నీ కనుగొనేవాడ్ని. నేను యాలకుల కుదుళ్ళ చెంత కనుగొన్న అపురూప పక్షైన స్పైడర్ హంటర్ పక్షి గూడును ఆ రీతిగానే కనుగొన్నాను.

స్పైడర్ హంటర్ జాతి జోడి పక్షులు ఒకసారి నా ఎదురులో చెట్టు పై కొమ్మనుంచి గాయపడిన పక్షులులాగ నేలమీదపడి గిలగిలా కొట్టుకొంటున్నవి మూర్ఛరోగిలాగ. అవి అలాగున కొట్టుమిట్టాడుతున్న ఆ విధంను చూసాను తప్పితే మొత్తం ఒక రోజంతా వెతికినా వాటి గూడు మాత్రం నాకు కనుక్కొనేందుకు వీలు కాలేదు. చివరికి సాయంత్రాన ఇంటికి చేరి సలీం ఆలి గారి పుస్తకం పట్టుకొని పేజీలను తిరగేసాను. అందులో స్పైడర్ హంటర్ జాతికి చెందిన పక్షులు అరటి చెట్టు ఆకుల మాటున, ఆ ఆకులకు అతికించినట్లుగా సాలెపురుగుల దారాలనుంచి గూడును కట్టుకొంటవని వివరించారు. ఇదొక చిన్న సూచన నుంచి నాకు ఆ మరుసటిరోజు వాటి గూడును కనుగొనేదాంట్లో ఎంతో సహాయమైంది.

మా యాలకుల పొదళ్ళ చెంత అరటి చెట్లు ఏమి లేవు. అయితే అరటి జాతికి చెందిన పర్వత అరటిజాతి చిన్న మొలకొకటి వాగు అంచున పెరిగింది. దూరంనుంచి చూసేది అటుండనీయండి దగ్గరకు వెళ్ళి పరీక్షగా చూసినా ఆ మొలక వద్ద పక్షి గూడు ఒకటి ఉందనే జాడ ఏమి నాకు కనబడలేదు. అయితే నేను ఆ చెట్టు అంచుకు చేరుతుంటే, పైనుంచి పక్షుల కూతలు, తర్వాత అవి నేలమీద పడి విలవిలలాడేది అతిగా నాకు అన్పించింది.

సలీం ఆలి గారి పుస్తకం నుంచి నాకు సూచన దొరక్కుంటే, నాకు వాటి గూడును కనుగొనేది కుదిరేదే లేదు కదా! పర్వతజాతి అరటి ఆకుల క్రింద భాగంలో ఆకులకు అంటించినట్లుగా సాలెపురుగుల దారాల నుంచి నేసిన, అల్లిన గూడు ఒకటుంది. తలమీద అరుస్తున్న పక్షులకు సమాధానం (నెమ్మది) అయితే చాలని అనుకొంటూ అక్కడ్నుంచి వడివడిగా ఎంతో దూరంకు వెళ్ళాను.

కోడి నర్తించినదాన్ని చూసిన మారడు, కోడికి దెయ్యం పట్టిందని తీర్మానం చేసుకొన్నట్లుగానే కుందేలు తిరగబడిందాన్ని చూసిన విద్యారణ్యస్వామి ఇది పరాక్రమమైన నేలగా తీర్మానించుకొన్నాడో ఏమో! కొద్దిగా సూక్ష్మంగా, ఓర్పుతో వైజ్ఞానిక దృష్టి కోణం నుంచి శోధించి చూస్తే కుందేలు అక్క – బుక్క సోదరుల

మీద తిరగబడిందానికి వేరే ఏదైనా శాస్త్రీయ కారణం కనబడుతదని నాకు అన్పిస్తుంది దృఢంగా ఇప్పుడు.

★ ★ ★

కన్నడ భాషలో దివంగత పూర్ణచంద్ర తేజస్వి రచించిన “కుక్కుట పిశాచ” అనే కథకు యథాతథ తెలుగు అనువాదం.

అనువాదకుడు: శాఖమూరు రామగోపాల్.

16-05-2010.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉండే గొప్ప గ్రంథాలయంనుంచి ఈ కథను కనుగొని అనువాదం చేసాను.

# కాళప్పగారి కోబ్ర



ప్రతి వేసవిలోనూ మా ఇంటివద్ద పాములనుంచి మాకు కష్టాలు ఎదురౌతుండేవి. ఆ పాములు ఇంట్లో ఉన్న ఎలుకల్ని పట్టుకొనేందుకు వస్తుండేవో, కప్పల్ని మింగేందుకు వస్తుండేవో లేకపోతే నాటుకోళ్ళ గుడ్లను మింగేందుకు వస్తుండేవో నిఖరంగా చెప్పేందుకు నాకైతే కుదిరేది లేదు. మొత్తానికి అప్పటివరకూ మాకళ్ళకు కనబడనవి, వేసవిలోని మటమట మధ్యాహ్నంలో ఆ పాములు మాకు కనబడుతుండేవి. మిలమిల మెరుస్తుండే ఆ పాము వళ్ళును, వాటి పడగలను ప్రశంసించి అవి అందమైనవని పొగిడేవాళ్ళు ఎందరో ఉన్నారులే స్నేక్ లవర్స్‌గా మా సీమలో! అయితే పాకుతుండేటప్పుడు బారుగా ఒక తాడులాగ ఉండే ఈ

అపాయమైన ప్రాణిని చూస్తే చాలు, నాకు వళ్ళంతా 'జుం' అంటది. ఎక్కడో దాగి, అమాయకుల్ని కాటేసి చంపే ఈ పాముల్ని సుందరమైనవని పొగిడేది నానుంచి అసాధ్యమండి! మా ఇంటి దగ్గర తిరిగే ఏ పామునైనా, కట్టె చేతబట్టుకొని కొట్టి చంపుతుండేవాడ్ని నేను

ఒక వేసవిలో పామొకటి మా ఎస్టేట్‌లో ఉన్న జనమంతా దిగులైపోయేటట్లుగా చేసింది. పాముల్ని పారద్రోలో, చంపో నిశ్చింతతో ఉండే నేను సైతం చింతాక్రాంతుడయ్యేటట్లుగా ఒక సంఘటన పాము నుంచి జరిగింది. మా అందరిలోనూ భయభీతిని కలుగజేసి తల్లడిల్లిపోయేటట్లుగా చేసినదానికి, ఈ పాము వెనుక సంభవించిన కొన్ని ఘటనలు కారణంగా ఉన్నవి. ఒక పాముకు ఎందుకింతగా భయపడాల్సి వచ్చింది అనేది ప్రత్యక్షంగా తెల్సుకొంటే తప్పితే మీకు (పాఠకులకు) అర్థమయ్యేది అదంత సులభంకాదండి.

★ ★ ★

"కాళప్పగారి ఇంట్లో కోబ్ర (Cobra) వచ్చిందట. ఈ రోజు వారు (కాళ్ళప్పగారు) కోబ్ర పూజ చేస్తారట. మేము అక్కడకు వెళ్ళివస్తాము" అని మా ఎస్టేట్ మేస్త్రి అతని పరివారంను వెంటేసుకొని మధ్యాహ్నం తర్వాత సెలవు పెట్టి వెళ్ళాడు.

కాళప్ప కొన్ని రోజుల క్రితం బొంబాయి నుంచి మా సీమకు తిరిగి వచ్చాడు. మలెనాడులోని ఏదో పాడుబడిన ఊర్నుంచి బొంబాయికి వెళ్ళి ఏదో పనిలో చేరుకొని ఉంది ఒక పెద్ద సంగతైంది మాసీమలో. కాళప్పకు తండ్రైన బైరప్ప ఎవరెవరితో మాట్లాడినా, అతనికొడుకు బొంబాయిలో నౌకరి చేస్తున్నాడనే సంగతి ప్రస్తావించకుండా వదిలేది లేదు. అందుచేత కాళప్ప మా ఊరికి వచ్చేముందే అతని విషయం నాకు గుర్తైపోయింది. అయితే అతడ్ని ఎప్పుడూ చూసింది లేదు నాకు.

ఒకసారి నేను జన్నాపురంకు నడుచుకొంటూ వెళ్తుండగా ఎవరో ఒకతను విచిత్రంగా ట్యాక్సీడ్రైవర్లు వేసుకొనే హ్యాట్, తోలు చర్మంతో తయారు చేసిన జర్కిన్ కోటు, జీన్స్ ప్యాంట్, కూలింగ్ గ్లాసెస్... వీట్ని ధరించి ఎద్దుల బండిని తోలుకొంటూ వస్తున్నాడు. సహించుకోలేని వేసవి సెగలలో, తోలుతో ఉన్న దుస్తుల్ని ధరించి

బండిని తోలుకొంటూ వస్తున్న ఇతడ్ని చూసిన నాకు ఆశ్చర్యమేసింది. బండి నా దగ్గరకు వచ్చిందే ఆలశ్యం, ముగుతాళ్ళను బలంగా గుంజి ఎద్దుల నడకను ఆపి, బండిని నిల్పేసి, చెంగునే అతను ఆ బండి నుంచి కిందకు దూకి ఒక మిలిటరి సెల్యూట్ చేసాడు. సన్నగా, రివటగా, బారుగా ఉండి కీచుధ్వనితో మాట్లాడుతున్న ఇతను ఎవరనేది నాకు మొదట గుర్తుకాలేదు. బండిని తోలుతున్న ఈ ఆసామే తను బొంబాయిలో బొంబాట్‌గా ఉద్యోగం చేస్తున్న కాళప్పనని చెప్పాడు. బొంబాయిలోని గొప్ప సంస్కృతిని ఈ పాడుబడిన పల్లె జనం (మోటు జనం)కు సరిగా తెలియజెప్పాలనే ఈ మండు వేసవిలోనూ ఆ గొప్ప నగరం నుంచి తెచ్చిన తోలు దుస్తుల్ని, కూలింగ్ గ్లాసెస్ (నల్లటి చలువ కళ్ళజోడు)ను వేసుకొని బండిని తోలుతున్నానని నాకు చెప్పాడు.

కాళప్ప తన పరిచయాన్నంతా చెప్పుకొన్న మీదట, నేను కుతూహలంనుంచి బొంబాట్ అయిన బొంబాయిలో ఏ ఉద్యోగం చేస్తున్నావని అడిగాను. బొంబాయిలో ఉండే ఒక ప్రతిష్ఠిత క్లబ్‌లో తను బాల్ బాయ్ (Ball Boy)గా నౌకరి చేస్తున్నానని చెప్పాడు. బాల్ బాయ్ అంటే ఏమిటి, అదెంతటి నౌకరి అని నేను అడగగా, టెన్నిస్ క్రీడ ఆడేటప్పుడు కోర్ట్ లైన్ నుంచి బయటకు దాటిపోయే బంతుల్ని పట్టుకొచ్చి ఆటాడే క్రీడాకారులకు (ప్లేయర్స్‌కు) తిరిగి బంతిని అప్పగించే నౌకరి అని చెప్పాడు. అతని ఠీవి చూసి ఏదో సుమారైన కొలువు చేస్తుండొచ్చని ఊహించిన నాకు ఈ వివరణ నుంచి కొంచం నిరాశైంది. ఇక్కడ మీ నాయనకు చేదోడు వాదోడుగా ఉండి వారసత్వ భూమిని చూసుకొనేదాన్ని వదిలి, అదెంత గొప్ప ఉద్యోగంగా ఆ బాల్ బాయ్ నౌకరీలో ఎందుకు చేరావు అని ప్రశ్నించాను. అతను చేస్తుండే నౌకరి మీద నాకు అంతగా సదభిప్రాయం లేనిదాన్ని కనుగొన్న కాళప్పకు కొంచం అవమానమైనట్లైంది. ఇంగ్లీష్ భాషలోని ఏవేవో అసంబద్ధ పదాల్ని ఉచ్చరించి పల్లెజనంమీద బడాయి మాటల్ని గొప్పలు చెప్పుకొన్నట్లుగా నామీద ఆ ప్రభావం పడేందుకు సాధ్యమేలేదని అతనిలో దాగిన సుషుప్త మనస్సుకు తెల్సివచ్చింది. అందుచేత కొంచం సేపు స్థిరంగా నిలబడి, మరలా తన బొంబాయిలోని బొంబాట్ ఉద్యోగంలోని గొప్పదనాన్ని వివరించసాగాడు ఇలాగున.

"క్లబ్‌లో బాల్ బాయ్ అని నన్ను మీరు తేలికగా చూడకండి సార్! ఎంతెంతో గొప్ప గొప్ప వ్యక్తులు అక్కడ టెన్నిస్ ఆడేందుకు వస్తారు సార్! పరిచయం అవుతారు సార్! ఛీఫ్ మినిష్టర్, ఐ.జి.సాబ్, డిప్యూటి కమీషనర్, సినిమా నటులు... మొదలైనోళ్ళంతా వచ్చి ఆట ఆడ్తారు సార్. బాల్ పట్టుకొని శీఘ్రంగా అందిస్తున్నానని ఎన్నోసార్లు ఇనాము (టిప్స్) ఇచ్చారు సార్! ఇక్కడ వరి మడులలో వళ్ళంతా బురద చేసుకోవటం మాత్రమే ఉంటది. బొంబాయిలో పాన్ బీడా అమ్మేవాడు ఎంతో వెడల్పుగా ఉండే తళతళలాడే ఇత్తడి పళ్ళెంలో ఆ పాన్ బీడాల్ని పెట్టుకొని అమ్మే వ్యాపారంలో వచ్చే లాభం మా నాయనకు ఉన్న నాలుగెకరాల వరి మాగాణి ఉత్పత్తిలో అంత సంపద రాదు సార్! ఇక్కడ ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని రైతుతనం చేసినా అక్కడ (బొంబాట్ బొంబాయిలో) నాకు ఒక నెలలో లభించే డబ్బు ఇక్కడ దొరికేది లేదు సార్" అని అన్నాడతను.

పట్టణం (మైసూరు)నుంచి పల్లెసీమకు వచ్చి వ్యవస్థను సావనీయకుండా చేసే వ్యవసాయ వృత్తిని మొదలుపెట్టిన నాకు, అతను ఈ విధంగా వ్యవసాయంను బాల్ బాయ్ ఉద్యోగం కన్నా తక్కువ స్థాయిలో ఉంటుందని చెపుతుంది సహించలేదు నా మనస్సుకు. అయితే నా ముందు జీవితం దిగులైయ్యేటట్లుగా అతను భవ్యభారత దేశంలో అందరిచే తిరస్కరించబడిన ఏదో వర్గం (రైతువర్గం)లోని దారుణ స్థితిగతుల సత్యంను తెలుపుతున్నోడిలాగ నాకు అన్పించింది.

"ఫ్రూట్స్ తిందామంటే ఫ్రూట్స్ ఉండవు. మిల్క్ తాగుదామంటే మిల్క్ అంతా పాల సేకరణ కేంద్రాలకు ఐదు గంటలకే చేరుకొంటవి. బ్రెడ్ ముక్కలైతే జిల్లా కేంద్రమైన చిక్‌మగళూరులో దొరకొచ్చేమో! ఎందుకు నేనిక్కడ (గ్రామంలో) ఉండాలో చెప్పండి సార్? నేను నాలుగు రోజులు సెలవు పెట్టి వచ్చాను సార్... ఆ తర్వాత మరలా బొంబాయికే వెళ్తాను సార్" అని అంటున్నాడతను. తను నేర్చిన హిందీ భాషను చూపించాలనుకొన్నాడో ఏమో... నేను ఏ దాన్ని మాట్లాడినా తారతమ్యం చూపకనే "అచ్ఛా.... బహుత్ అచ్ఛా" అంటూ తన మాటల వరసను ప్రదర్శిస్తున్నాడు. "మా నాయన వరి మాగాణిలో శ్రమించి మా అమ్మకు ఎన్ని చీరల్ని కొనిపెట్టాడో మీరు తెల్సుకోండి సార్! నేను నాకొచ్చే భక్షీస్ డబ్బుతో చీరల్ని కొనిస్తేనే అమ్మకు కాలం గడుస్తది. నేను సహాయపడకపోతే కట్టుకొనేందుకూ అమ్మకు చీరలు ఉండేది

లేదు సార్! ఎందుకు పండించాలి సార్ ఈ బ్లడీ (Bloody) వరిని?" అంటూ వరిపైరు మీద ఉమ్ము ఊసాడు. పీలగా, గొట్టంలాగ ఉన్న ఇతను పల్లెలోని వ్యవసాయపనుల కష్ట జీవనంకు సరిపోడని నాకు అన్పించింది. అయితే బొంబాట్ బొంబాయిలో ఫ్రూట్స్, మిల్క్ తిని త్రాగిన ఇతనెందుకు బ్లడి వరి అన్నం తిన్న పల్లెజనం కన్నా దుర్బలుడిగా ఉన్నాడని నేను యోచించసాగాను. ఇక ఇప్పుడు కాళప్ప నాతో మాట్లాడేదాన్ని ముగించేసి మరోమారు నాకు సెల్యూట్ కొట్టి తన బండి మీదకు చేరుకొని, ఎద్దుల తోకల్ని మెలిబెడ్తూ బండిని ముందుకే తోలుకొంటూ వెళ్ళిపోయాడు.

మా సీమలోని జనంకు కొత్తవైన విలక్షణ నూతన పదాలను వాడుక భాషలోకి వాడుకొనేందుకు ఉపయోగంలోకి తెస్తుండే విచిత్ర వ్యామోహం ఒకటుండేది. పాము, సర్పం, ఉరగం, పన్నగం... అలాగున పామును వాడుక రూపంలో ఉచ్చరిస్తున్నా, ఎంతోమంది పల్లెజనం ఇప్పుడు కాళప్పగారి దశనుంచి పామును కోబ్ర (ఇంగ్లీష్ పదరూపం)గా పిల్చేది చేయసాగారు. నాగుపాము పూజ కాస్తా కోబ్ర పూజగా మారింది. నాగదేవత విగ్రహం కోబ్ర విగ్రహంగా అయ్యింది.

కొన్ని రోజులలోనే బొంబాయికి వెళ్తానని చెప్పిన కాళప్ప మరలా అక్కడకు వెళ్ళేందుకు కుదరలేదు. కోబ్ర పూజ చేసిన కొన్ని రోజులలోనే కాళప్పకు తండ్రైన బైరప్ప నాగుపాము కాటునుంచి చనిపోయాడు. ఇంట్లో తిరుగుతున్న ఈ విష సర్పంను బ్రాహ్మణ సర్పంలాగ దాన్ని కొట్టకూడదని పూజ చేయించిన పురోహితుడు చెప్పినందున దాన్ని అలాగే సాధుజీవిగా భావించి వదిలేసారట. కట్టె సంధులలో చేరుకొన్న ఆ పాము బైరప్పను కాటేసినందున అతను చనిపోయాడు. కాళ్ళప్పకు ఇప్పుడు వారసత్వ ఇల్లు, పొలంను చూసుకొనేందుకు ఎవరూ లేనందున బొంబాయికి తిరిగి వెళ్ళేందుకు సాధ్యంకాలేదు.

బైరప్ప చచ్చే చివరి గడియలలో వరి మళ్ళలో వరి పైరును కోస్తున్నప్పుడు కొడవలి నుంచి నాగుపాముకు పొరపాటున తననుంచి దెబ్బతగిలి గాయపడిందని, అది తన పగను సాధించుకొనేందుకు ఇంట్లోకి వచ్చి సాధు జీవి రూపేణా కాటేసిందని అందరితోనూ చెప్పాడట. అంతేగాకుండా అది తన పనిని సాధించుకొని అంతర్ధానమైందట.

“బైరప్పుడి చివరి క్షణాలలోని అంత్యపలుకుల్ని చెవిలో వేసుకొన్న తక్షణమే మా మేస్త్రీ మా ఎస్టేట్‌లో ఒక విధమైన భయగ్రస్త వాతావరణం ఏర్పడేందుకు మూల పురుషుడయ్యాడు.

★ ★ ★

తోటలో తేనెటీగలు తమకు తాముగా వచ్చి తేనె పట్టుల్ని పెట్టుకొంటవని ఖాళి తేనె పెట్టెల్ని చెట్ల కుదుళ్ళలో చల్లటి నీడలో అక్కడక్కడ పెట్టుంటాము తేనె సంపాదనకని. వాట్ని టైమ్ ప్రకారం బయటకు తీసి, ఆ పెట్టెల లోపల చేరుకొన్న పురుగు పుట్రా, ఎలుకలు, తొండలు... మొదలైన వాట్ని పారద్రోలి పరిశుభ్రం చేసి మరలా ఆ పెట్టెల్ని వాటి వాటి జాగాలలో పెట్టుండేవాళ్ళం.

ఒకరోజు నేను, రీకప్ప పెట్టెల్ని దులిపేందుకని వెళ్ళాము. నేను తేనెటీగల పెట్టె మూతను పైకి లేపిన తక్షణమే లోపలి నుంచి పెద్ద నాగుపాము ఒకటి నిద్రబోతున్నందున దాని సుఖ నిద్రకు భంగమై కోపంగా బుస్ అని బుసగొట్టూ ఒక పెద్ద పైప్‌లాగ పడగ ఎత్తింది. నేను రెండు చేతుల్నుంచి ఆ తేనెటీగల పెట్టె మూతను ఎత్తి పట్టుకొన్నందున తక్షణమే ఆ నాగు పామును ఏమి చేసేందుకు నాకు కుదరలేదు. “రీకప్పా... పాము పాము” అని అరుస్తూ కట్టెకోసమని నేను అటు ఇటు వెతుకుతుంది చూసిన మా మేస్త్రీ తక్షణమే కట్టె పట్టుకొని పరిగెత్తుకొంటూ నా చెంతకు వచ్చాడు. రీకప్ప మరియు మేస్త్రి... ఆ ఇద్దరూ భయం, గడబిడ, ఆందోళన నుంచి పిచ్చిపిచ్చిగా చేతిలో పట్టుకొన్న కట్టెను అటు ఇటు గురి లేకుండా ఊపుతూ నాగుపాము పారిపోయేందుకు అవకాశం సృష్టించారు. వాళ్ళనుంచి పడుతున్న ఆ కట్టెదెబ్బల వరసలోని వైఖరినుంచి అటు ఇటు ఉన్న కాఫి పొదల రెమ్మలు విరిగినవి తప్పితే పాము మీద మాత్రం వేటుపడలేదు. అయితే చివరికి ఆ ఇద్దరిలో ఎవర్నుంచో ఒకరి కట్టె వేటు ఆ నాగుపాముకు ఒకసారి త్రాకియుండొచ్చు. ఎందుకంటే గడ్డి, కసువు మధ్య దాగియున్న అది కోపంగా ఒకసారి బుస్ అని వెనక్కి తిరిగి పడగెత్తి భయపెట్టింది. నేను తేనె పెట్టె మూతను క్రిందపడేసి కట్టె వెతికి ఆ కట్టెను చేతిలోకి తీసుకొనే లోపే అది (ఆ నాగుపాము) పరారైంది.

తేనెపెట్టె లోపలికి వెళ్ళేందుకు ఆ నాగుపాము దానిలోపలికి చేరుకొనేంతగా సరైన కంత ఏమి లేదు. అది ఎలాగ, ఏవైపు నుంచి లోపలికి జొరబడిందో నాకైతే అర్థమే కాలేదు.

బైరప్ప పాము కాటునుంచి చనిపోయిన కొన్ని రోజుల తర్వాత అదే నాగు పాము మా ఇంటి వద్ద కన్పించింది. తేనెపెట్టెలో పడుకొన్న ఆ నాగుపాము కొద్దిగా నలుపురంగులో ఉన్నందున, ఇప్పుడు ఇంటి వద్ద కన్పించిన ఆ నల్లత్రాచు మునుపటి ఆ తేనెపెట్టెలో కన్పించిన పామేనని మా పనోళ్ళందరూ భావించుకోసాగారు. చనిపోయేటప్పుడు పాము తన పగను తీర్చుకొనేందుకే తనను కాటేసిందని బైరప్ప చెప్పింది మా మేస్త్రి మనసులో బలంగా నాటినందున ఇప్పటి ఈ నల్లత్రాచు ఈసారి తనను కాటేసి చంపేందుకే వచ్చిందని భావించుకొని బెదిరాడు ఎంతగానో. అతను రీకప్పతో, "ఈసారి కోబ్ర మనిద్దర్ని చంపేదాంట్లో అనుమానమే లేదు" అని దిగులుతో చెప్పాడు. ప్రతి సంవత్సరం వేసవిలో ఏదో విధంగా ఇంటి ఆవరణలో పాములు కన్పించేది సర్వసాధారణమే! అందుచేత, "దాన్ని (ఆనల్లత్రాచును) కొట్టి చంపుదాం... నువ్వేమి బెదరకు" అని ఎంతగానో ధైర్యం చెప్పినా మేస్త్రీకి మాత్రం దిగులు మరింతగా పెరుగుతూనే పోయింది.

"దొరకు ఏమి తెలుస్తది మన బతుకుల గురించి! దొరేమో ధైర్యం చెపుతాడు! యమగండం వచ్చేది నాకూ, నీకే కదా! ఆ రోజు మనం ఆ నల్లత్రాచును కొట్టేందుకు పోయిందే తప్పు" అని మేస్త్రి రీకప్పకు చెప్పాడట.

అది మేము తేనెపెట్టెనుంచి పారద్రోలిన పామే కావచ్చు! ఎందుకంటే ఎంతో చురుకుగా మమ్మల్ని చూసిన తక్షణమే ఎక్కడో ఒకచోట దాక్కొని కనుమరుగౌతుండేది. ఒకసారైతే మా ఇంట్లో మెట్లమీద ఎండవేడిని కాసుకొంటూ పడుకొని ఉందట. పైనుంచి మెట్లను దిగుతూ చివరిక్షణంలో దాన్ని చూచిన రీకప్ప దానిమీద కాలి అడుగును వేసేది తప్పించేందుకని డాబా మెట్లపైనుంచి క్రిందకు దూకి కాలు బెణికించుకొన్నాడు. మేమంతా అతని కేకల్ని విని కట్టెల్ని పట్టుకొని వచ్చేలోపే ఆ పాము కనుమరుగైంది.

ఇంకోసారి దారి పక్కన నిర్మించిన రాళ్ళ రివెట్‌మెంట్ కంతల నుంచి ఆ పాము తల బయటకు చాపి పడుకొందట. మేస్త్రి దాన్ని చూచి కోబ్ర, కోబ్ర అని అరిచి గీపెట్టేలోపే అది తలను లోపలికి లాక్కొని మాయమైంది. రాళ్ళు పీకి పామును బయటకు రప్పించి దాన్ని కొట్టి పడేద్దామని పనోళ్ళందర్నీ పిలిస్తే, వారందరూ ఒకటై నిరాకరించారు. ఈ భయానికంతటికీ మేస్త్రీనే కారణం. ఆ పాము తనను

కాటేసి చంపిన తర్వాతే అది ఈ ఎస్టేట్ నుంచి కదిలి వెళ్ళిపోతదని పనోళ్ళందరి ఎదురు ఆర్తనాదాలు పెట్టూ, వాళ్ళను భయగ్రస్తులన్నట్లుగా మార్చాడు. భీతి అనేది ఒక అంటురోగంలాంటిది. మొదట్లో రీకప్ప అంతగా ఏమి బెదరలేదు. అయితే మేస్త్రీ పిరికితనం నుంచి మరియు పాము మా చుట్టుపక్కలే తిరుగుతున్న రీతినుంచి అతనిలోనూ నిధానంగా భయం ప్రారంభమైంది. ఎన్నోసార్లు ఆ పాము ఉద్దేశపూర్వకంగానే ఎవర్నో కాటేసేందుకే కాచుకొంది అన్నట్లుగా అది మా ఇంటికి అటు ఇటు సమీపంలోనే తిరుగుతుండేది. రీకప్ప నల్లత్రాచు, కోడెత్రాచు అని అరిచేలోపే ఎటువైపుకో జారుకొని మాయమయ్యేది.

పాములు మెట్టప్రాంతాలకన్నా మా మలెనాడులోనే ఎక్కువగా ఉంటుండేవి. అయితే పాము కాట్ల నుంచి జనం చనిపోయే సందర్భాలు మెట్టప్రాంతాలతో పోల్చితే మా మలెనాడులో ఎంతో తక్కువగా ఉంటుండేవి. ఎంతగా విషసర్పాలైనా అవి ఎన్నడూ కావాలని వచ్చి ఎవర్నీ కాటేసింది చూడలేదు నేను ఇప్పటివరకూ. మనుష్యులను చూస్తే అవి అప్పటికప్పుడు తొందరతొందరగా తాము ఉండే స్థలాల్ని ఖాళి చేసి ఎక్కడైనా సురక్షిత బిలాలలో దాగేందుకు ప్రయత్నిస్తుండేవి. మా మలెనాడులో పాములు దాగికొనేందుకు పొదలు పుట్రా బిలంలు ఎన్నో ఉన్నందున అవి కాటేసే, తప్పించుకొని పోయే అనివార్యత వాటికి లేదు. పాములు పారిపోయేందుకు కుదరని అసాధ్యమైన సన్నివేశాలలో ఇరుక్కొన్నప్పుడు మాత్రమే అవి బుసగొట్టూ కాటేసేందుకు చివరి నిర్ధారంగా చేసుకొంటవి.

ఈ పాము దశనుంచి నాకు మా టామి (కుక్క) మీద దిగులు కలగసాగింది. ఇంటివద్ద తిరుగుతుండే పాముల మూలాన మేము ఇప్పటికే మూడు, నాలుగు మేలు జాతి కుక్కల్ని పోగొట్టుకొని ఉన్నాము. పాములకైతే కుక్కలమీద విశేషమైన ద్వేషం ఉండేది లేదు. కుక్కలే పాముల్ని అనవసరంగా కెలుకుతవి. బిలం లోపలికి పారిపోయి దాక్కొనే ఏ జీవినైనా చూస్తే చాలు, కుక్కలలో వాట్ని బయటకు లాగి చంపిపడేసే చపలం ఉంటది. బిలంలో ఆయా ప్రాణులు దాక్కొన్న వాసనను పసిగట్టి, ఇవి (కుక్కలు) ఆ కంత చుట్టూ గుంతను తోడేదాన్ని ప్రారంభిస్తవి. బిలంలలో దాక్కొన్న పురుగు పుట్రను బయటకు లాగేందుకు టామి తోడిన ఎన్నో పెద్ద పెద్ద

గుంతల్ని మా ఇంటికి అటు ఇటు చూడొచ్చు ఎవరైనా! ఈ చెడు చపలం దశనుంచే ఎన్నో కుక్కలు పాము కాట్లకు బలి అవుతుండేవి. చూచేందుకు పాములు దైహికంగా తమకన్నా దుర్బలంగా కనబడుతున్నందున, ఎన్నో కుక్కలు ఆ విషప్రాణికి బెదరకనే నోటిని తెరుస్తుండేవి. చెఱువులో తిరుగుతుండే విషరహిత నీటి పాములైతే ఈ కుక్కలకు అంతగా ప్రమాదకరమైనవి కావులే! అయితే కట్లపాములు, త్రాచుపాములు, మట్టిపాములు... అలాంటి విషసర్పాలు మాత్రం కుక్కల్నుంచి బలంగా కొరికించుకొన్నా, ఆ తర్వాత పోరాటంలో విషం వంటి మీదకు ప్రాకి, ఆ కుక్కలూ తర్వాత చనిపోతవి.

మా కుక్క యోగక్షేమం గురించే మేము ఈ పామును చంపేందుకు ఎంతో ఉత్సుకతను చూపించసాగాము. అప్పట్లో పాముల్ని పట్టే వెంకడి విషయం మాకు తెల్వదు. టామి కంటికి ఈ పాము ఏమైనా కనబడితే, ఇది దాన్ని కచ్చితంగా వదిలేది లేదు. ఈ పాము తప్పించుకొని పారిపోయేదాంట్లో ఎంతో తెలివిని చూపెట్టుంది కదా! ఇంతే కాకుండా మేస్త్రి దీని గురించి అందరిలోనూ (తోట పనోళ్ళందరిలోనూ) దిగులు పుట్టించినందున పాము సులభంగా తప్పించుకొనేందుకు సహాయమౌతుంది అతని మాటలు. పామును చూసిన పనోళ్ళు అరుపులు పెట్టకనే అది ఇక్కడుంది అని చెప్పి, అది ఎక్కడ దాక్కొంది అని సావధానంగా చూసే బదులు "హో కోబ్ర కోబ్ర" అని అరుస్తూ దూరంగా పారిపోతుండేవారు. మేమంతా కట్టెలు పట్టుకొని వచ్చేలోపే ఆ పాము ఎటువైపుకో ప్రాకి కనుమరుగయ్యేది. ఇక మొదలౌతది మా మేస్త్రి పురాణం. ఒక పావుగంట సేపు అది తనను చంపకుండా తోటనుంచి పోయేది లేదని నెత్తి నోరు కొట్టుకొంటూ అందరిలోనూ మరింతగా దిగులు కలిగించేవాడు.

పాము కనబడుతున్న ఒక వారంలోపే మా మేస్త్రీ ఎక్కువ తక్కువగా మానసిక రోగిలాగ అయ్యాడు. రాత్రి నిద్రలోనూ కోబ్ర కోబ్ర అని అరుస్తుండేవాడు. తను చచ్చేది గ్యారెంటి అని తీర్మానించుకొని తను చచ్చినమీదట విధి విధానాల్ని ఎలాగెలాగున చేయాలి, ఇంటి పెత్తనం ఎవరెవరు చేయాలి... మొదలైనవాట్ని చెప్పి, పాడె ఎక్కేందుకు రెడి అయ్యాడు. మానసిక రోగ పీడితుడిగా మారి దేహాన్ని

కృశింపజేసుకొని తిరుగుతుండే ఇతను పాము కరవక పోయినా, దాన్ని చూసి చూసే చస్తాడనేది నాకు కచ్చితమైంది.

ఒకరోజు మధ్యాహ్నంలో ఎండ తీక్షణనుంచి నేను ఇంట్లో పడక కుర్చీలో కూర్చొని ఉన్నప్పుడు, ఎవరో డప్పు కొట్టుతున్నట్లుగా రేకుల డబ్బా కొట్టిన సప్పుడు వినబడుతుంది. ఆ డబ్బా వెనకనే టామి రోషావేశంగా మొరుగుతుంది విన్పించింది. నాకు అప్పుడు తక్షణమే జ్ఞాపకంకు వచ్చింది మేస్త్రీ మాట్లాడే కోబ్ర. టామి భీకరంగా మొరుగుతున్నందున ఇక దాని ఆయుష్ ముగిసినట్లుగా భావన కలిగి నేను భయపడ్డాను. అంతలో "అయ్యయ్యో కోబ్ర, కోబ్ర" అని రీకప్ప కేకలు పెట్టూ, టామిని ఈ వైపుకు రమ్మని గదిరిస్తుంది విన్పించింది. డబ్బా ఎందుకు మ్రోగుతుందోనని ఆశ్చర్యపడుతూ బయటకు పరిగెత్తుకొని వచ్చాను.

స్నానం గది చెంతనుండే పొయ్యి దగ్గర టామికి, పాముకు జటాపట పోరాటం జరుగుతుందనేదానికి అక్కడున్న బూడిద కుప్పంతా చెల్లాచెదురై ధూళుతో కప్పిన మేఘంలాగ కనబడింది. దాని (పాము) వళ్ళు అక్కడ పడిన తుప్పు పట్టిన పాత కిరోసిన్ నూనె డబ్బాకు తాకినప్పుడు డప్పుగొట్టిన శబ్దం వస్తుంది. రీకప్ప మరియు మేస్త్రి... ఇద్దరూ "డబ్బా దగ్గర పాము ఎగిరెగిరి పడుతుంది. టామిని వెనక్కి పిలవండి" అని నన్ను చూసి అరుస్తున్నారు.

కొన్ని వారాల క్రితం జన్నాపురంలో మేన్ రోడ్‌కు డాంబరు వేస్తున్నారు కొత్తగా. వాళ్ళు రోడ్ పక్కన దొర్లించిన తారు (డాంబరు) డ్రమ్ములలో కొన్ని పగిలిపోయి తారు బయటకు జారి గడ్డకట్టింది. మా ఇంట్లో బెజ్జాలు పడిన ఇనుప కడవలకు కొద్దిగా డాంబరు అవసరం ఉంటదని రీకప్ప ఏడెనిమిది కేజీల బరువు ఉండే తారు ముద్ద (ఉండ)ను తెచ్చి తుక్కుపట్టి పగిలిపాడైన ఆ కిరోసిన్ డబ్బాలో పడేసి అక్కడే ఆ స్నానం గది వద్ద ఉంచాడు. తలనుంచి తోకనుంచి రపరప కొట్టున్న ఆ పాము వళ్ళు ఆ డబ్బాకు తగిలినప్పుడల్లా చప్పుడు పెద్దగా వస్తుంది.

నేను బయటకొచ్చి టామిని జోరుగా పిలుస్తుండేలోపే, నన్ను చూసి ప్రేరణ చెందిన టామి ఆ పాము శరీరంమీద నోరు నిల్పి దాన్ని డబ్బానుంచి బయటకు గుంజింది. పాము నేరుగా బయటకొచ్చి ప్రాంగణంలో నిలబడిన మా మేస్త్రీ కాళ్ళ

కింద పడింది. పాము ఉద్దేశపూర్వకంగానే తన చెంతకు ఎగిరి వచ్చిందని భావించిన మేస్త్రి భయపడి పారిపోయేందుకు శక్తిరాక కాళ్ళు చచ్చుపడినోడిలాగ స్థాణువై నిలబడిపోయాడు.

ఆ రోజు పాము విచిత్రంగా ప్రవర్తిస్తుంది. ఎప్పటిలాగనే నేలమీద ప్రాకుతూ పరారైయ్యేది చేయకనే ప్రాంగణమంతా దుమ్ము, ధూళు రేపుతూ పటపటా కొట్టుకొంటూ సినిమాలో చూపిస్తుండే నాగకన్య నృత్యంలాగ నాట్యం చేస్తుంది. ఏమి చేసినా, పిలుస్తున్నా నా మాటను వినని టామి ఆ పాములాగనే తలచెడినదానిలాగ ప్రవర్తిస్తూ బూడిద రాశినుంచి దుమ్ము, ధూళును రేపుతుంది.

తేలికగానే చిక్కిన తనను కాటేయకనే కోబ్ర ప్రాంగణమంతా తకథై అన్నట్లుగా ఎగురుతుంది చూసిన మేస్త్రీకి ధైర్యం వచ్చియుండొచ్చు. నా వైపుకు తిరిగి "తుపాకిని తీసుకురండి దొరా.... మనం ఒక చేయి దానిమీద వేసి దాన్ని పడగొట్టుదాం" అని అభ్యర్థించాడు. తీకప్ప కట్టె తెచ్చేందుకు పరిగెత్తాడు. మేస్త్రీతో "టామిని పట్టుకో" అని చెప్తూ నేను తుపాకి తెచ్చేందుకు ఇంట్లోకి పరిగెత్తాను.

టామి గలాటానుంచి పామును తుపాకితో కాల్చేందుకు కుదరట్లేదు. తీకప్ప ఎలాగెలాగో దూసుకొచ్చి బెదురు బెదురుతోనే కట్టె విసిరాడు. తీకప్ప విసిరిన కట్టె ఎగిరెగిరి పడుతున్న నల్లత్రాచు నడుంకు తగిలి, దాని నడుం విరిగింది. మేస్త్రీకి ఏమి ఆవేశం వచ్చిందో ఏమో.... అప్పటికప్పుడే వంటిమీద దెయ్యం పూనినోడిలాగ ముందుకు దూసుకొచ్చి "మరలా సగం వేటు వేసి నిన్ను అడవిలోపలికి పారిపోయేందుకు ప్రయత్నం చేస్తానా? నీ కొంప నాశనం గాను! తలమీద జుట్టుతో ఉన్న కాళింగ సర్పం నువ్వు! నీ తలమీద ఫణి ఉంది కదా" అని ఏమేమో తిట్టూ తీకప్ప నుంచి కట్టె గుంజుకొని పాముమీద రపరపా వేట్లు వేసాడు. అతనిలోని ఆవేశం చూసి టామి సైతం ఒక పక్కకు తప్పుకొని నిలబడింది. మూడు నాలుగుసార్లు కట్టెతో ఆ పామును కొట్టినందున ఆ కట్టె విరిగిపోయింది. అయితే ఆ మూడు నాలుగు వేట్లకే మారణాంతికమైన దెబ్బలుగా పడినందున పాము ప్రాణం గాలిలో కలిసింది.

పాము చనిపోయిన మీదట అదెందుకు విచిత్రంగా ఎగిరిందని చూసినప్పుడు జరిగిందేమిటో గుర్తైంది నాకు. ఎన్నో రోజుల నుంచి ఇంటి చెంతనే అటు ఇటు

తిరుగుతుండే ఈ నాగుపాము ఆ రోజు రీకప్ప డాంబరు ఉండను దాబెట్టిన ఆ పగిలిన కిరోసిన్ డబ్బాలో దాక్కొని పడుకొంది. మటమట మధ్యాహ్నంలోని వేసవి ఎండ తీక్షణకు వేడి చెంది మెత్తబడి కరిగిన తారు నిధానంగా పాముకు జ్ఞానం గానట్లుగా పగిలిన ఆ డబ్బాలోని కంతనుంచి జారి ఆ పాము ముఖంమీద పడింది. టామి వాసన పసిగట్టి ఆ డబ్బా చెంతకు వచ్చినందున అప్పటికప్పుడే ఎచ్చరికను పొందిన పాము తారు ఉండ అంటుకొన్న తలను బయటకు తేలేక రపరపగా తోకను అటు ఇటు బలంగా కొట్టుకొంటుంది. టామి దాన్ని కొరికి బయటకు గుంజగా అది బయటకు వచ్చినా దాని కళ్ళకు, నోటికి అంటిన తారు అలాగే ఉండిపోయింది. అందుచేత పాముకు దిగ్భ్రమ కలిగి ముందేమి చేయాలనేది తోచక ప్రాంగణమంతా పిచ్చిపట్టిన దానిలాగ ఎగిరెగిరి నాట్యం చేసింది. దాని నెత్తిలో ఉన్న తారు ఉండను చూసిన మేస్త్రీ దాన్ని ఫణి ఉన్న కాళింగ సర్పంగా భావించి పిలిచాడు కదా!

పాము చనిపోయిన మీదట మేస్త్రి కుదుటపడి కాళింగ సర్పం అంటే ఏమిటి దొరా అని అడిగాడు. సహ్యాద్రి కనుమలలో ఉండే దట్టారణ్యంలో తలమీద జుట్టు ఉండే కాళింగ సర్పాలు ఎన్నో ఉంటవని, అవి తోకనుంచే నిటారుగా నిలబడి మనుష్యుల తలలమీద కాటు వేస్తవని, అందుకు విరుగుడుగా అక్కడ నివసిస్తుండే జనం తమ తలపాగాలో ఒక చిన్న రాయిని చేర్చి, ఆ పాము తలమీద మొట్టినట్లుగా కాటేసే విధం నుంచి తప్పించుకొంటారని (రక్షించుకొంటారని) మేస్త్రీకి వివరంగా తెలిపాను.

★ ★ ★

కన్నడ భాషలో పూర్ణచంద్రతేజస్వి గారు రచించిన "కాళప్పన కోబ్ర" అనే కథకు యథాతథ తెలుగు అనువాదం.

అనువాదకుడు: శాఖమూరు రామగోపాల్. 27-07-2010.

# చెబువు ఒడ్డున



గురువారం గోణిబీడు సంత! మా తోటపనులకు ఆ రోజు సెలవ ఉంటది. సెలవ దొరికితే కాలం గడిపేది ఎలాగబ్బా అనే చింత నాకు గడచిన ఇరవై ఐదు సంవత్సరాలలో ఒకరోజూ కలగలేదు. సాయంకాలం నిద్ర వచ్చేవరకూ ఏదో ఒకదానిలో తల్లీనుడైయ్యేంతగా నా చుట్టుపక్కల ఏదైనా రోమాంచిక ఘటనలు నడుస్తూనే ఉంటుండేవి. నేను, టామి ఇంటి మెట్లు దిగి బయటపడితే మా మలెనాడులోని నిత్య హరితవర్ణ అడవి ఆకుపచ్చజ్వాలను రేపినట్లుగా శోభాయ

మానంగా మెరుస్తుండేది. వానరాని, రాకపోనీ... మే మాసంలో మా మలెనాడులోని పెద్ద పెద్ద వృక్షాలు తమ వేళాపట్టిక ప్రకారం చిగురించి పూలుపూసి నయనానంద కరంగా ప్రజ్వలిస్తుండేవి. బహుశః ఈ వృక్షాల వేళ్ళు నేరుగా బోర్‌వెల్‌లోని రిగ్‌లాగ రంధ్రాన్ని తోడుకొని నీళ్ళు లభించే పాతాళం అంచువరకూ వెళ్ళి ఉంటవి అన్నట్లుగా నాకు తోచుతుండేది. అందుకే ఆ వృక్షాలు వానకని ఎన్నడూ ఎదురుచూసేదే లేదు.

నాకు టైమ్‌పాస్ అయ్యేది ఎలాగబ్బా అనే చింతకన్నా కాలం వేగం వేగంగా గడిచిపోతుంది కదా అనేదే ప్రముఖ చింతగా ఉంటుండేది! నేను మాతోటకు వేసిన కంచెకు కొద్ది దూరంలోనే కుడి పక్కన ఉండే పురాతన కాలంనాటి చెఱువు వద్దకు ఒకరోజు బయల్దేరాను. వెళ్ళేటప్పుడు ఆ దారి మధ్యలో వడ్రంగిపిట్ట వడ్డెర కులస్థుడు ఒక పెద్ద బండరాయి మీద సుత్తితో కొట్టున్నట్లుగా ఎండిన చెట్టులోని కొమ్మకు డమడమ శబ్దం చేస్తూ ముక్కుతో కొట్టుంది విన్పించింది నాకు. చమత్కారంగా ఉన్న ఆ వడ్రంగిపిట్ట పనితనాన్ని కొంచంసేపు చూసేందుకని, నేను ముందస్తుగా చేసుకొన్న నా నిశ్చిత కార్యక్రమాన్ని కొద్దిగా మార్పు చేసుకోవాల్సి వచ్చింది అప్పుడు. ఆ వడ్రంగిపిట్ట ఎంత వేగంగా ఆ చెట్టుకొమ్మను కొట్టుందంటే, ముక్కుతో అది కొట్టున్నప్పుడు దాని తలగాని, గొంతుగాని నాకంటికి కనబడటలేదు. తలనే సుత్తిలాగ చేసుకొని అది ఆ చెట్టుకొమ్మను కొట్టేందుకు ఉపయోగిస్తున్న దాని విధం చూసిన నాకు భయమేసింది. మొన్న మా ఇంటి సింహద్వారం దాటేటప్పుడు, ఆ ద్వారంకున్న పై భాగం నా నుదురుకు మెల్లగానే కొట్టుకొన్నా, నా కళ్ళు బైర్లు కమ్మి పావుగంటసేపు చతికిలబడి ఆ బాధను నివారించుకొన్నాను. ఆ వడ్రంగిపిట్ట రపరపా ఆ చెట్టుకొమ్మను తలనుంచి బాదుతుంది చూసిన నాకు కళ్ళు తిరిగినట్లైంది. ఆ పక్షికుండే తలలోని మెదడు ఏవిధంగా ఆ నిరంతర బాదుడుకు సహకరిస్తదో ఏమో? దాని మెదడు చిట్లి రక్తస్రావం కాకుండా అది ఇంకా చావకనే ఎలాగున బతికే ఉంది? ఈ నా మాటను అటుండనీయండి, ఈ పక్షి ఆ చెట్టుకొమ్మల లోపలే ఉండే పురుగులు (చెదలు) ఇక్కడే, ఈ వైపునే ఉన్నవని అది ఎలాగ కనిపెట్టి రంధ్రాన్ని చేస్తుంది అనే ప్రశ్న నాకు ప్రశ్నగానే మిగిలింది కదా! ఇదంతటినీ ఆలోచన చేస్తే నా చుట్టు పక్కల ఉండే పర్యావరణం మరింత రహస్యమైందిగా నాకు

తోచుతుంది. పుకవోకా (జపాన్ దేశంకు చెందిన పర్యావరణ శాస్త్రవేత్త)గారు చెప్పినట్లుగా, ఈ పరిసర పర్యావరణంనంతా పూర్తిగా తెల్సుకొంటానని ముమ్మందుకు దూసుకెళ్ళేది మూర్ఖతనంగానే ఉంటదేమో! ఉత్తిగనే మనకు సరిపడేంత మాత్రమే తెల్సుకొని మిగిలినదాన్ని చూసి ఆశ్చర్యపడుతూ నోరెళ్ళ బెట్టేదే ఉత్తమంకదా! వడ్రంగిపిట్ట తలలోపల ఏమేమి ఉపకరణాలు (పనిముట్లు) ఉన్నవో, ఎలాగున అవి దాని శరీరంలో రచన అయినవో ఎవరికి తెలుస్తవండి?

కొంచం సేపు దాని ముక్కునుంచి సుత్తి దెబ్బలులాగ పడుతున్న వేట్లును చూస్తున్న నేను మరెంతో సమయం అక్కడే నిలిచి కాలం గడిపేది ఆపిట్ట ఏకాగ్రతకు భంగం వాటిల్లుతదని భావించి దృఢంగా మనస్సును మరొకవైపుకు మళ్ళించి ఇక ముందుకే సాగిపోయాను.

మా తోట చెంతనుండే ఆ పురాతన కాలంనాటి చెఱువును నేను ఎంతోకాలం వరకూ చూడనే లేదు. దానిచుట్టూ అడవి గులాబి మరియు గోరింటాకు చెట్లు భయంకర పొదలులాగ దట్టంగా పెరిగి ఉన్నందున అక్కడొక చెఱువు ఉందనేది ఎవరికీ తెల్సేది లేదు. ఒకసారి ఆ లోపల్నుంచి "అయ్యో" అనే ఒక ఆర్తనాదం పదే పదే వినబడుతున్నందున, అప్పుడు నేను భయంకరంగా పెనవేసుకొన్న ఆ గులాబి పొదల నడుమ నీళ్ళదాహం తీర్చుకొనేందుకని బర్రెలు దారి చేసుకొన్న ఆ సొరంగంలో  పాకుకొంటూ వెళ్ళాను. ఆ సొరంగం దారి నేరుగా నన్ను ఆ చెఱువు ఒడ్డుకు తీసుకెళ్ళింది.

నీళ్ళపాము ఒకటి పెద్ద డొంగరు కప్పను పట్టి, దాన్ని మింగేందుకు ఆపసోపాలు పడుతుంది. తననోటిబారు, వెడల్పులలోని జ్ఞానమే లేని ఆ తిక్కలపాము సుమారుగా ఒక కేజి బరువుతో ఉండే ఈ పెద్దసైజ్ కప్పను పట్టుకొంది కదా! కప్పేమో గాలిని బాగా పీల్చి పొట్టను ఫుట్‌బాల్ బంతిలాగ ఉబ్బించుకొని, నీళ్ళపాము దాన్ని మింగేది ఇక అసాధ్యమన్నట్లుగా చేసి, హహహా అనేటట్లుగా ఒక విధంగా బెక బెక అంటుంది. నన్ను చూసిన ఆ నీళ్ళపాము గలిబిలిగా ఆకప్పను ఊసేసి దూరంగా పారిపోయింది. పాము కోరల్నుంచి బయటపడిన ఆ మొద్దుకప్ప ఇక ఇప్పుడు పరారైయ్యేదాన్ని చేయకనే అక్కడే కూర్చుని పిలిపిలిగా నన్ను చూస్తుంది.

ఏదో కాలం (యుగం) నాటి పాత చెఱువని మీకు ముందే తెల్పాను కదా! దాని చుట్టూ ఒక చెఱువు ఉందనేది కనబడనట్లుగా ఆ ఒడ్డులో దట్టంగా పొదలు పెరిగినవి కదా! ఆ ఒడ్డు అంచునంతా ఆ పొదల రెమ్మలే వ్యాపించి అలుముకొని ఉన్నవి. మా ఊర్లోని బర్రెలు ఎండవేడి అతిగా అయినప్పుడు ఆ చెఱువు చెంతకు వచ్చి, ఒడ్డునున్న బురదలో "వాయ్" అని సంతోషంగా అరుస్తూ పొర్లుతుండేవి. నాకు ఖాళీ సమయం దొరికినప్పుడల్లా అక్కడే ఉన్న నేరేడు చెట్టుకొమ్మ మీద కూర్చుని నిశ్శబ్దంగా చెఱువు ఒడ్డున తిరుగుతుండే నూరారు రకాల జీవుల చలనవలనాల్ని చూస్తుండేవాడ్ని. అక్కడికి చేరిన తక్షణమే మా టామి చేసే మొదటి పని ఏమిటంటే ఆ ఒడ్డున నిలబడి చేపలకని ధ్యానం చేస్తుండే కొంగల వెంటబడి వెళ్తుండేది. టామిలోని ఈ దుందుడుకు చేష్టను ఎన్నో రోజుల్నుంచి చూసి చూసి అభ్యాసమైన ఆ కొంగలు ఏమి బెదరకనే తమ ఎదురులో ఉండే అవతల ఒడ్డు వైపుకు ఎగిరెళ్ళి కూర్చుండేవి. తన కంటికి కనబడేటట్లుగా కూర్చున్న ఆ కొంటె కొంగల్ని విడవరాదు అన్నట్లుగా దృఢ అభిప్రాయంతో టామి మొత్తం ఆ చెఱువుకున్న పొదల బెండును, దిగబడే ఆ జౌగు మట్టిని దాటి ఆ కొంగలున్న చోటుకు వెళ్ళేపొద్దుకు, అవి మళ్ళా ఎగిరి నేను నిలిచిన ఈ వైపుకు వచ్చి వాలుతుండేవి. రెండు మూడుసార్లు ఇలాగున ఆ తుంటరి కొంగలు చేస్తే చాలు, వాటి వెనకబడి అల్సిపోయిన టామి అవి (కొంగలు) ఏమైనా పాడుపడిపోనీ, ఇక అవి తనకు దొరికేది లేదని నిర్లక్షించి ఎదురు రొప్పులు పెట్టూ నేనున్న చోటుకు వచ్చి ఆ చెట్టునీడలో విశ్రమించేది.

ఇక నేను ఈ కొంగలు మీద ఆలోచిస్తే, అవి నీళ్ళలో చేపల్ని ఎలాగ పట్టుకొంటవనే ఆశ్చర్యం నాలో కలుగుతుండేది! ఎందుకంటే రెండు చేతులలో పది వేళ్ళు ఉన్న మనకు చేపల్ని నీళ్ళలో ఉత్తిగనే పట్టుకొనేందుకు సాధ్యం కాదు! ఎంతగానో నుణుపుగా, ముట్టుకొంటే జారిపోయి తప్పించుకొనే ఈ చేపల్ని పట్టేందుకు ఆ కొంగలకుండే ఆయుధ సామాన్లు ఏమిటి? మీరే యోచించండి? కేవలం చిమ్మటంలాగ ఉండే ఒక ముక్కు మాత్రమే దాని ఆయుధం కదా! మనం ఒకటి కాదు... పది చిమ్మటాల్ని తీసుకొని మన జీవితకాలమంతా ఎంత గట్టిగా ప్రయత్నించినా ఒక చేపనూ పట్టేది సాధ్యంకాదుకదా! జీవం ఉన్న చేపల్ని చెఱువులో

పట్టేది అటుండనీయండి, చచ్చి తేలిన చేపల్ని సైతం చిమ్మటం నుంచి పట్టేందుకు సాధ్యంకాదదండి! కొంగ ఒంటి కాలుమీద నిలబడి నిద్రపోతున్నట్లు నటిస్తూ, చెంతకొచ్చిన చేపల్ని గబక్కనే ముక్కునుంచి పట్టుకోగా, ఆ చేప ఆ ముక్కు చివర్న చిక్కి గిలగిలలాడుతుంటే, నాకళ్ళెదురే ఏదో మాత్ర మింగినట్లుగా గుటుక్కున వాట్ని మింగుతుండేది.

ఈ చెఱువులో కొన్ని నీళ్ళబాతులు, కౌజు పిట్టలు స్వేచ్ఛగా ఉండేవి. టామి రగడనుంచి అవి భయపడి పొదల మాటున దాగేవి. మేము నిశబ్దంగా కూర్చున్నప్పుడు మాత్రం అవి మెల్లగా ధైర్యం చేసుకొని ఆ పొదల మాటులనుంచి బయటకు తొంగి చూస్తుండేవి. నీటికోళ్ళు నీళ్ళలో మునిగి దాక్కొనేవి. అవి మెల్లగా తలెత్తి రెక్కల్ని ముక్కుతో శుభ్రం చేసుకొని కిచకిచమంటూ అరిచి ఈదేందుకు సిద్ధమైతే, వాటిరెక్కల వర్ణం కోడిపుంజులేమో అన్నట్లుగా కనబడే ఆ నీళ్ళ కోళ్ళు తమ పుల్లల లాంటి కాళ్ళను నీళ్ళమీద తేలాడుతుండే తామరాకులమీద తేలిక తేలికగా అడుగుల్ని వేస్తూ ఆ చెఱువంతా తిరుగుతుండేవి.

నేను మధ్యాహ్నంలో తిండి తినే రెండు గంటల సమయం వరకూ ఈ చెఱువు ఒడ్డునే టామితో ఉత్తిగనే కూర్చుని అక్కడ జరుగుతుండే ఘటనావళిని చూస్తుండేవాళ్ళం. ఒకొకసారి టామికి విసుగేసి నిలబడి అడవిలోపల ఉండే ఉడతలనో, తొండల మీదో వెంటబడి టైమ్‌పాస్ చేసుకొంటుండేది.

చెఱువు నడుమ ఒక చెట్టు దిమ్మె సగంవరకే మునిగి మిగిలిన సగం బయటకొచ్చి తేలి ఉండేది. దభాల్నే చూస్తే ఏదో బఱ్ఱె అక్కడ పడుకొంది అన్నట్లుగా ఆ దిమ్మె కనబడుతుండేది. నేను ఈ చెఱువు ఒడ్డుకు వచ్చినప్పుడల్లా ఒకటో రెండో తాబేళ్ళు ఆ చెట్టు మొద్దు మీద ఎక్కి సూర్యరశ్మిని పొందుతూ కూర్చుని ఉండేవి. మా తలలు వాటికి కనబడితే చాలు, అవి ఒక్కసారిగా నీట్లో దుముకి పారిపోతుండేవి. ఆ తర్వాత ఎంతో పొద్దు మేము నిశ్చలంగా కూర్చొని ఉన్నా, ఆ తాబేళ్ళు చెట్టు దిమ్మె వద్దకు వచ్చే ధైర్యం చేసేవి కావు. జలాంతర్గాములు పెరిస్కోప్ నుంచి నీటి పై భాగం చూసినట్లుగా అవి కూడా మునిగే, కళ్ళు మాత్రం నీళ్ళపైన నిల్పినట్లుగా తమ బారు మెడను చాపి మమ్మల్ని చూసి మళ్ళా మునిగి మాయమైపోతుండేవి.

చెఱువు మూలలో ఒక వైపుకు నీళ్ళ అంచు తాకేంతగా ఒరిగిన ఒక వృక్షంలోని కొమ్మ ఒకదాన్లో గీజుగ పక్షులు గూళ్ళు కట్టుకొని, వేలాడుతూ కిలకిలా రావాల్ని పెట్టుండేవి. ఆ గూళ్ళ కింద ఉన్న నీట్లో లక్షాంతర సంఖ్యలో గోంద్రు కప్పల గుడ్లు గుంపుకట్టి మేఘాలు చలించినట్లుగా అప్పుడప్పుడు నీళ్ళపైకి వచ్చి గాలి పీల్చుకొని వెళ్తుండేవి. వానాకాలం ఆరంభమయ్యే వేళకు ఈ గుడ్లు అన్నీ తమ రెండో దశలోని తోకల్ని విసర్జించుకొని పసుపు పచ్చరంగుతో నలుపు తెలుపు చారల పట్టీలతో ఉన్న గోంద్రు కప్పలుగా రూపాంతరం చెంది, ఆ చెఱువు వదిలి బయటకు వస్తవి. ఆ చెఱువు నీళ్ళలో గుంపు కట్టినట్లుగానే, అడవిలోపలా ఆ కప్పలు గుంపుకట్టి మొత్తం ఆ నేలంతా కదిలినట్లుగా చిన్న చిన్నగా ఎగురుతూ తిరుగుతవి. ఈ కప్పల్ని గాని, వాటి గుడ్లను గాని మరే ఇతర వన్యప్రాణి వాట్ని పట్టి తిన్నదాన్ని నేను చూడలేదు ఇంతవరకూ. వీటి మాంసం ఇతర వన్యప్రాణులకు విషం గావచ్చేమో అనే అభిప్రాయం నాకుంది.

ఒకొక వన్యప్రాణికి ఒకొక రకమైన విచిత్ర రక్షణా తంత్రం ఉంటది. ఈ చెఱువు ఒడ్డున నేను చూసిన రెండు మూడు తమాషైన రక్షణా తంత్రాల్ని మీకు తెలియజేస్తాను.

ఈ చెఱువు ఒడ్డున ఎప్పుడైనా పెద్ద పెద్ద గొంద్రు కప్పలు ఆ పొదల మాటున దాక్కొని కూర్చుంటుండేవి. కొన్నైతే తిని తిని తెగబలిసి ఒకొక కేజి తూకం తూగుతవి. వీటి కాళ్ళనే ఇప్పుడు బయట దేశాలకు ఎన్నో డాలర్ల విలువలో లెక్కగట్టి ఎగుమతి చేస్తున్నారు కదా! ఈ కప్పల చర్మం గడ్డిలో ఉండే ఆకుపచ్చ రంగులాగ ఉన్నందున వీటి సమీపంకు వెళ్ళేవరకూ ఇవి మన కళ్ళలో పడేదిలేదు. ఆ తర్వాత ఇవి ఒక్కసారిగా మనం బెదిరిపడేటట్లుగా దుఘుందుఘుం అన్నట్లుగా ఎగిరి చెఱువు నీళ్ళలో దూకుతుండేవి. టామి వీట్ని పట్టుకోవాలని ఎంతగా ప్రయత్నించినా ఇవి దాని నోటికి దొరికేది లేదు. ప్రతిసారి ఇవి నీళ్ళలో దూకేటప్పుడు పిచికారి కొట్టినట్లుగా తమ వెనుక భాగం నుంచి ఉచ్చపోస్తూ నీళ్ళలో దూకి పారిపోయేవి. ఇవి బెదిరిపోయి ఇలాగున ఉచ్చపోసుకొంటూ దూకి వెళ్తున్నవని అనుకొంటున్నాను తప్పితే ఇదొక విధంగా వాట్లోని రక్షణా తంత్రమని నేను భావించలేదు.

అయితే ఒకసారి టామి ఒక గోండ్రు కప్పను ఎలాగెలాగో ఒడ్డునుంచే కనుగొని, ఆ కప్పను పట్టుకొనేంత దగ్గరలో నోరు తెరిచింది. అయితే చివరి క్షణంలో ఆ కప్ప అక్కడ్నుంచి రెండు గజాల దూరానున్న చెఱువు నీటిలో చెంగునే ఒకే గెంతులో ఎగిరింది. చెంగున ఎగిరినప్పుడు టామి మూతిమీద సరిగా ఉచ్చను పిచికారి కొట్టినట్లుగా పోసింది. మొదట బహుశః టామి గమనంకు ఆ ఉచ్చ పడేది కనబడలేదు. ఎందుకంటే టామి ఆ కప్ప ఎగురుతున్నదాన్నే చూస్తూ, ఏమి తెలియని దానిలాగ ఆ కప్ప వెంటబడింది. అయితే సుమారుగా ఐదు నిమిషాల తర్వాత తలను అటు ఇటు నేలమీద రుద్దుకొంటూ జొల్లుకార్చుతూ దిగాలు ముఖం పెట్టుకొని నా దగ్గరకు పారిపోయి వచ్చింది. కుక్కలకు మనుషులలాగనే ఉమ్మి మింగేందుకు చేతకాదు కదా! అందుచేత టామి పిచ్చికుక్కలాగ నోటినుంచి జొల్లు కార్చుకొంటూ గడ్డిమీద నోరు రుద్దుకొంటూ పొర్లుతుంది. కప్ప టామి మూతిమీద ఉచ్చపోసినదాన్ని నేను చూడకున్నట్లైతే కచ్చితంగా టామీకి ఏదో రోగం వచ్చిందని శంకించేవాడ్నేమో!

కప్ప కురిపించిన ఆ ఉచ్చధార పరిణామంనుంచి మరలా యథాస్థితికి రావాలంటే టామీకి సుమారుగా ఒక గంట పట్టింది. అది కార్చుతుండే జొల్లును, గడ్డిమీద నోటిని రుద్దుకొనే దాని గోలను చూడలేక దాన్ని లాక్కొని వెళ్ళి చెఱువు నీళ్ళలో దాని మూతి కడిగాను. టామి ఆ తర్వాత కప్పల్ని వేటాడే ప్రయత్నాన్ని పూర్తిగా వదిలేసింది. అంతే కాదు, టామి మా ఇంటి మెట్లమీద కూర్చున్నప్పుడు ఎక్కడైనా పూలకుండీల చాటు నుంచి కప్పలేమైనా దాని దగ్గరకు గెంతుకొంటూ వస్తే చాలు, అక్కడ్నుంచి పారిపోయి దూరానెక్కడో దాగి కూర్చుండేది.

కప్పకార్చిన ఉచ్చ టామి జిహ్వేంద్రియాల మీద చేసిన దాడికి అది ఇక జన్మ జన్మాంతరంకు కప్పల సాహసం వద్దని తీర్మానించుకొంది. అయితే దీనికన్నా మరొక తమాషా సంగతి ఏమిటంటే తాబేలు... నాకు, ప్యారడికి, టామీకి బుద్ధి నేర్పింది మరొక ప్రహసనం లాగ ఉందిలే!.

తాబేలును నేను నిరపాయకరమైన, నిస్సహాయకమైన జీవిగా భావించు కొంటుండేవాడ్ని. భూమిమీద అది తిరిగితే, దానికి వేగంగా పారిపోయి తప్పించు కొనేది కుదరదు. చెఱువు నడుమ పడియున్న మొద్దుమీద కూర్చుండే తాబేళ్ళను చూసినప్పుడల్లా వాట్ని ఇంకా ఎంతో దగ్గరలో చూడాలని అన్పిస్తుండేది. ఒకసారి

చెఱువు ఒడ్డునున్న పచ్చిక మీద తాబేలు ఒకటి కూర్చుని ఉంది. మూతి పోగొట్టుకొని అడుగు భాగం మాత్రమే మిగిలిన కుండలాగ దాని ఆకారం కనబడుతున్నందున, దాన్ని నేను గమనించకనే చెఱువు అవతల ఒడ్డు వైపుకు వెళ్ళాను. నావెనకే ఉన్న ప్యారడు, టామి ఆ వైపుకు వచ్చే సమయంకు ఆ తాబేలు మెల్లగా కాళ్ళు చేతులు బయటకు చాపి చెఱువు వైపుకు పాకుతూ పోసాగింది. చలిస్తుండే ఈ కుండ కళ్ళలో పడిందే తడవుగా ప్యారడు "చు ఛూ టామి" అని కుక్కను ఉసిగొల్పుతూ ఆ తాబేలు వద్దకు చేరాడు. చెఱువు కొంచం దూరానే ఉన్నందున ఇక వేగంగా ప్రాకి తప్పించుకొనేది అసాధ్యమని భావించిన ఆ తాబేలు తక్షణమే తల, కాళ్ళు, చేతుల్ని లోపలికి లాక్కొని ఆగిపోయినచోటే ఆగిపోయింది. ప్యారడు, టామి తాబేలు చెంతకు వచ్చినప్పుడు అది వైశ్యుల ఇళ్ళలో ఉండే ఇనప్పెట్టెలాగ చలన రహితంగా పడి ఉంది. మెట్ట తాబేళ్ళకు అడుగు భాగంలోనూ, వెన్ను మీద ఉండే గట్టి రక్షణా కవచంలాగ ఒక కవచం ఉంటది. ఏ జంతువైనా ఆ తాబేలును ఏమి చేయలేదు.

చెఱువుకు అటు వైపున ఉండే ఒడ్డులో ఉన్న నాకు ప్యారడు, టామి తాబేలు వద్దకు పరిగెత్తింది, తాబేలు స్థబ్దుగా నిలిచింది... అంతా కనబడుతుంది. టామి ముడుచుకుపోయిన తాబేలును చూసి ఇదేమైనా బండరాయో లేకపోతే ఏదైనా వన్యప్రాణో అనేది తెల్వక ప్యారడి ముఖం చూస్తుంది. ప్యారడు కుతూహలంనుంచో లేకపోతే దాన్ని ఇంటికి మోసుకొని వెళ్ళేందుకో దాన్ని ఎత్తుతున్నాడు. నేను చూస్తుండగా ఆ తాబేలును సగం ఎత్తుకు ఎత్తినోడు, దభాల్నే దాన్ని కిందకు పడేసి అసహనం చెందుతూ ముక్కు మూసుకొన్నాడు. టామి దగ్గుతూ, తుమ్ముతూ, తల అటు ఇటు కొట్టుకొంటూ నేనున్న చోటుకు పరిగెత్తుకొని వచ్చింది. నాకప్పుడు భలేగా ఆశ్చర్యమైంది.

"ఏందిరో, ఏమైందిరో?" అని నిల్చున్న చోటునుంచే బిగ్గరగా కేకపెట్టి అడిగాను.

"దీన్ని ముట్టుకొనేందుకు వీలుకావట్లేదు... ఎంతో దుర్వాసన వస్తుంది" అని వేళ్ళనుంచి ముక్కును బలంగా మూసుకొని అరిచాడు.

"పోరా... పో! నువ్వే నీ వాసన ఏదో దాని మీద ప్రసరింపజేసి, ఏవేవో మాటల్ని పలుకుతున్నావు... అంతేకదా!"

"ఛి... ఛీ! నేనెందుకు దానిమీద నా చెడు వాసన ప్రసరింపజేస్తాను. యథావిధిగానే నేను ఉదయానే మల విసర్జన చేసాను. ఇక ఎంత ప్రయత్నించినా నానుంచి అపాన వాయువులు బయటకు విడుదలైయ్యేది లేదు. మీరే వచ్చి చూడండి ఈ తాబేలు వ్యవహారంను" అని ప్యారడు ఆవైపునుంచి అరిచి చెప్పాడు.

నేనిప్పుడు ఆ తాబేలు వద్దకు వెళ్ళగా ఏ వాసనా రావట్లేదు. ప్యారడు మూసుకొన్న ముక్కు పుటాల్ని సడలింపు చేసుకొని బలంగా గాలి పీల్చి, "అరెరే! ఎక్కడికి పోయింది ఆ పెంటవాసన!" అంటూ మళ్ళీ ఆ తాబేలు వాసన కొట్టుతదేమోనని దాన్ని పైకి ఎత్తాడు.

మరొకసారి వాసన గాఢంగా బయటకు వచ్చింది. కుళ్ళిన ఎలుకను ముక్కు పుటాల చెంతకు చేర్చినట్లుగా నా కడుపులో దేవినట్లైంది. "థూ! థూ! పడేయ్ దాన్ని కిందకు" అంటూ కేకపెట్టి ముక్కు మూసుకొని పరిగెత్తాను. ఇక ఇప్పుడు దాన్ని మరోమారు ముట్టేందుకు అసహ్యామై, అది చెఱువులోకి వెళ్ళిపడేటట్లుగా కాలినుంచి దాన్ని తన్ని ఊపిరి బిగబెట్టి అక్కడ్నుంచి పారిపోయాడు ప్యారడు.

కప్పేమో టామిలోని జిహ్వేంద్రియాలమీద దాడిచేస్తే, ఈ తాబేలేమో మా ఘ్రాణేంద్రియాల్ని అస్తవ్యస్తం చేసింది కదా!

ఇటువంటిదే అయినా మరొక తమాషా సంగతి ఏమిటంటే అది అడవి పంది పిల్లల నుంచి జరిగిన ఘటనే సుమా! ఒకసారి చెఱువునుంచి నేను, టామి ఇంకేంటి ఇంటిదారి పట్టేందుకు సిద్ధమైయ్యాము. అంతలో ఏదో దఢేల్ అనే సప్పుడు అయ్యింది. చెఱువుకు ఆ వైపున దట్టంగా పెరిగిన పొదలనుంచి ఒక అడవి పందిపిల్ల బయటకొచ్చి వాయువేగంగా అడవివైపుకు పారిపోయింది. నిన్న మా ఇంటి వెనుక ఉండే అడవిలోకి 'మకానుహళ్ళి' నుంచి వేటకని వెళ్ళినోళ్ళు పిల్లల తల్లైన ఒక ఆడపందిని చంపారట. పంది పిల్లలన్నీ తప్పించుకొన్నవని మా మేస్త్రీ చెప్పాడు. బహుశః చనిపోయిన ఆడ పందికి చెందిన పిల్లలే ఈ చెఱువు వద్దకొచ్చి దాక్కొన్నవని నేను ఆలోచిస్తుండగా దభీల్నే మరొక పందిపిల్ల ప్రత్యక్షమై వాయువేగంగా అడవి వైపుకు పారిపోయింది. దాన్నే చూస్తున్న నేను ఇంకా నా కళ్ళను తిరిగించలేదు. మరొక పందిపిల్ల ప్రత్యక్షమై చెంగునే ఎగిరి అదే దిక్కులో వెళ్ళిపోయింది.

ఎంతగానో ఆకలేస్తున్నందున ఇంటివైపుకు బయల్దేరాను. అయినా ఆ పొదల మాటున ఇకనూ దాక్కొని ఉన్న ఇవి ఏమి చేస్తున్నవో చూడాలని అన్పించింది. అడ్డుగా ఉన్న నీటి మడుగును దాటి ఆ వైపునున్న గోరింటాకు పొదల మాటుకు వెళ్ళాను. అక్కడున్న పందిపిల్లలు అంతగానేమి చిన్నవికావు. ఐదారు నెలల వయసు ఉండొచ్చు వాటికి. టామి అంత ఎత్తులోనే అవి ఉన్నవి. నేను పొదల్ని చేరుతుండగా టామీకి ఇంతక్రితమే పారిపోయిన పందుల వాసన దొరికి ఉండొచ్చు. ఆ వాసన పట్టుకొని టామి అటు ఇటు పందికని తిరిగేది చేయసాగింది. నేను పొదల్ని అటు ఇటు నెట్టి లోన మరెన్ని పంది పిల్లలు ఉన్నవేమోనని చూస్తుండగా మరొక పందిపిల్ల చెంగునే ఎగిరి పారిపోసాగింది. నా దగ్గర తుపాకి లేదు. నేనైతే వేటకని రాలేదు. అయితే అడవి పందులు నా కళ్ళెదురే చెంగుచెంగునే ఎగిరి దూసుకెళ్తుంటే ఎవరికి సహనం నుంచి నిధానించుకొనేది సాధ్యమౌతది? టామీని పిలుస్తూ ఆ పందిపిల్ల వెనకే పరిగెత్తాను.

ఆ పందిపిల్ల మిగిలిన పంది పిల్లలలాగ నేరుగా అడవిలోకి వెళ్ళుంటే నా నుంచి దాని వెంటబడేది సాధ్యమైయ్యేది లేదు. అయితే గొడవపెట్టూ నేను దాని వెంటపడింది గమనించిన ఆ పందిపిల్ల అక్కడే ఉన్న మరొక పొదమాటున దాగి కూర్చుంది. అంతలో ఎక్కడో ఉన్న టామి నా వద్దకొచ్చి ఆ పొదలోకి దూరింది. అక్కడ్నుంచి ప్రాణరక్షణకని బయటకు దూసుకొచ్చిన పందిపిల్ల వెంటబడింది టామి. అయితే సులువుగానే ఇప్పుడు ఆ పందిపిల్ల పరిగెత్తి అడవిలోకి చేరుకోవచ్చు. అయితే ఆ దార్లో దాని దురదృష్టంకు టామితో పాటుగా మరోకుక్క ఎదురైంది. ఇక ఇప్పుడు ఆ పంది పిల్లకు దిక్కుతోచక భయంగా మా తోటవైపుకు తిరిగింది. టామీతో జతగా ఆ కొత్త కుక్క జతై ఆ పందిపిల్లను వేటాడి పట్టేందుకు ప్రారంభాల్ని చేసినవి. దిక్కేకానని ఆ పందిపిల్ల మా తోటలో అడ్డదిడ్డంగా తిరిగి సుస్తైపోయింది.

అరటి చెట్ల నడుమ అరటి పిలకల్ని దాటుతున్నప్పుడు టామి పరిగెత్తి ఆ పందిపిల్ల గొంతుమీద నోరువేసింది. నాకు దాన్ని పట్టుకోవాలని ఉంది కాని దాన్ని చంపేందుకు ఇష్టంలేదు. రెండు కుక్కలూ ఒకటై కొరికి చంపి పడేస్తవని దాన్ని రక్షించేందుకని నేనూ పరిగెత్తాను.

పందిపిల్ల తిరగబడిందంటే కుక్కల మీద కుమ్మో, కొరికో బెదిరించొచ్చని నేను భావించాను. అయితే ఆ పందిపిల్ల అలా చేయకుండా "కొర్యో" అంటూ భయంకరంగా అరిచింది. చెవులలో కాచిన సీసం పోసినట్లుగా ఉన్న ఈ భీకర అరుపు నుంచి ఆ రెండు కుక్కలలో అవ్యక్తమైన భయం పుట్టింది. టామీకి నరకంలోని భీకర ఘర్జన లాగ ఉన్న ఈ సప్పుడుకు బెదిరి ఆ పందిపిల్ల గొంతును కొరికేదాన్ని వదిలేసింది. పారిపోకనే గట్టిగా తిరగబడి నిల్చేందుకు సిద్ధమైన ఆ పందిపిల్ల కుక్కల మీద ఎదురుదాడి చేయకనే మరోమారు నోరు తెరచి కుక్కల ముఖంమీద "కొర్యో" అంటూ  భీకరంగా అరిచింది. తల పగిలిపోయేంతగా వచ్చిన ఈ భీకర సప్పుడుకు భయపడిన ఆ రెండు కుక్కలూ తత్తరపోయి నాలుగు అడుగులు వెనక్కి వేసినవి. అవి అప్పటికే ఒక తీర్మానంకు వచ్చినట్లుగా నాకు కనబడుతుంది. మూడోసారి ఆ పందిపిల్ల నుంచి ఆ అరుపు వినబడగా ఆ రౌరవ నరకంలోని నినాదం వినలేక తోకలు ముడ్చుకొని పారిపోయినవి.

కుక్కలు అటు వెళ్ళిన తక్షణమే ఆ పందిపిల్ల నిర్భయంగా అడవిలోకి వెళ్ళిపోయింది. అయితే కొంచంసేపులోనే మా తోట్లో పనుల్ని చేస్తున్న జనం, వరి మళ్ళలో కలుపుల్ని తీస్తున్న జనం, పశువుల్ని మేపుతుండే రామ... పరిగెత్తుకొంటూ వచ్చారు. అందరూ ఏమైంది, ఏమైందని నన్ను అడిగారు. బహుశః వాళ్ళెవరూ ఇటువంటి కర్కశ శబ్దాన్ని వారి జీవితంలో ఇంతకు ముందెన్నడూ వినియుండలేదని నాకు కనబడుతుంది. నేను పందిపిల్ల అరిచిందని చెప్పినప్పుడు, "అవి ఇంత భీకరంగా భయంకరంగా అరుస్తవా?" అని ఆశ్చర్యపడ్డారు.

★ ★ ★

కన్నడ భాషలో పూర్ణచంద్ర తేజస్వీగారు రచించిన "కెరెయ దడదల్లి" అనే కథను యథాతథరూపంగా తెలుగులోకి అనువదించాను.

శాఖమూరు రామగోపాల్. 20-08-2010.

# గాడ్లి



నిడుగోడు, హోయసాళలు, మల్లిన మడుగు, సంగాపూరు, నస్లాపూరు మొదలైన ఐదారు గ్రామాలోళ్ళు సామూహికంగా పంచాయితీ పెట్టుకొని కోతుల బెడద గురించి చర్చిస్తారని తెల్సి నేనూ వెళ్ళాను అక్కడికి. ఆ రోజు ప్రముఖ ఎజెండాగా ఉంది కోతుల బెడదమీదే! అయితే పంచాయితీ ఆరంభమైన తక్షణమే అందరూ ముఖ్య విషయాన్ని (ఎజెండాను) వదిలి రామలక్ష్మమ్మగారి తోటకు చెందిన మ్యానేజర్ గాడ్లీని నోటికొచ్చినట్లుగా తిట్టూ కొట్టేందుకు సైతం దూసుకెళ్ళారు. రామలక్ష్మమ్మగారి తోటలో మఖాం పెట్టుకొన్న కోతుల్ని తమ ఊళ్ళ వైపుకు పారద్రోలి తమను కష్టాల

కుంపట్లోకి నెట్టాడని వాళ్ళందరిలో ఆక్రోశంగా ఉంది. నేనైతే గాడ్లి స్థానంలో ఉండుంటే, “మా తోటకు ఉపద్రవం కలుగజేస్తున్న కోతుల్ని ఏవైపుకైనా పారద్రోలుతాను. అడిగేందుకు మీరెవరు?” అని ప్రశ్నించేవాడ్ని. అయితే మృదుస్వభావంతో ఉండే గాడ్లి ఏమి ప్రతిఘటించకనే ఆ కోతుల్ని ఈ వైపుకు ఎవరో పారద్రోలారని, గ్రామ పంచాయితి వాళ్ళు బంధించి వేరెటో సాగనంపారని సూచించాడు.

కోతుల్ని పట్టి వేరేప్రాంతంకు తీసుకెళ్ళి వదిలేసేది ఇక్కడ అప్పుడప్పుడు నడిచే వ్యవహారంగా ఉంటది. గ్రామ పంచాయిత్ వాళ్ళు డబ్బు విడుదల చేస్తే బేలూరు నుంచి కోతుల్ని పట్టుకొనే వాళ్ళను పిల్చి, వాట్ని బంధించి వేరెక్కడికో తీసుకెళ్ళి వదుల్తుండేవారు. కోతులు అక్కడ కొత్తగా తమ చేష్టల్ని ఘనంగా చేసేది మొదలు పెట్టేవి. నేను మా ప్రాంతంలో తోట వేసేందుకు ముందే కోతుల్ని ఒకసారి గ్రామ ప్రజలందరూ పంచాయ్తి చేసి వాట్ని పట్టి వేరెక్కడికో దూరంకు సాగనంపారట.

కోతులు హనుమదేవుడి అవతారమని మా వాళ్ళందరూ వాట్ని చంపేందుకు భయపడుతుండేవారు. అకస్మాత్‌గా కోతి ఏదో చనిపోతే దానికి ఆవుపాలు, ఆవు నెయ్యి పోసి తిథి చేసి ఊర్లో వాళ్ళంతా సూతకం అచరిస్తుండేవారు. బహుశః మనుషుల లాగనే కోతులకూ కాళ్ళు చేతులు ముఖం ఉన్నందున మా వాళ్ళు వాట్ని  చంపేందుకు వెనుకంజ వేసేవారు. అయితే దక్షిణ కన్నడ జిల్లా, కొడగు జిల్లాలలోని ప్రజలు కోతుల్ని తినేది ఉన్నందున ఆ జిల్లాలలో వీటి ఉపద్రవం లేదని చెప్పొచ్చు. కోతులమీద ఉండే ఈ సార్వత్రిక అభిప్రాయ దశనుంచి కోతుల్ని తినేందుకు పర్మిషన్ ఉండే జాతి జనులైన బిల్లవులు, దళితులు... ఇప్పుడు తమ తమ జాతులలో వీట్ని తినేది నిషిద్ధమనే చెపుతుండేవారు. మా ఊర్లోనూ ఒకట్రెండు బిల్లవుల ఇళ్ళు ఉన్నవి. వాళ్ళను అడిగినప్పుడు ఎవరో వాళ్ళ పూర్వీకులు ఔషధంకని కోతి మాంసం తిన్నదాన్నే అదేదో పెద్ద విషయంగా చేసి ఈ విధంగా తమ కులంమీద అపఖ్యాతిని చేస్తున్నారని, ఈ విషయం నాకు తెల్పినోళ్ళమీద శాపనార్థాలు పెట్టారు.

కోతులేమో తమ మీద ఉండే పూజ్య భావంను పూర్తిగా దురుపయోగం చేసుకొని నానా విధాలుగా ఉపద్రవంలను చేస్తుండేవి. దుష్ట చేష్టల్ని చేసేదాన్లో బహుశః ఏ ఇతర జంతువూ కోతుల సరిసాటు కానేరవు. వీట్నుంచి దుఃచేష్టలు చేసేందుకు

మనకులాగనే వాటికీ రెండు చేతులూ, యోచించేందుకు బుద్ధిశక్తి ఉన్నందున వీట్ని నియంత్రించేది ఎంతో కష్టం. అవి లూటి చేసేందుకు తోటలోకి జొరబడినప్పుడు, దూరానున్న ఒక ఎత్తైన వృక్షంమీద ఒక కోతిని సెక్యూరిటి గార్డ్‌లాగ కూర్చోబెట్టి మిగిలినవి దండయాత్రకు వస్తవి. దూరాన ఎవర్నైనా చూస్తే చాలు, కాపలాకాస్తుండే కోతి కిర్రో అంటూ సూచనల్ని చేస్తది. తక్షణమే మిగిలినవన్నీ సమీపానున్న అడవిలోకి పారిపోతుండేవి. అడవిలోని ఎత్తైన వృక్షాల్ని ఎక్కి, ఆ వృక్షాల కొమ్మరెమ్మల ఆకుల మాటున దాగి కూర్చుంటే, బ్రహ్మదేవుడికీ వాట్ని కనుగొనేది అసాధ్యం కదా!

కోతుల దుశ్చేష్టల గురించి తెల్వని నాకు, ఆ కోతుల గురించి పంచాయితీలో చేరిన జనం అంతా గాడ్లీని ఎందుకు అంతగా దూషిస్తున్నారనేది మొదట గుర్తుకాలేదు. అయితే కొన్ని రోజులలోనే మా మారడు నా చెంతకొచ్చి తననుంచి కోతుల ఉపద్రవంను నియంత్రించేది సాధ్యంగావట్లేదని, చేస్తున్న పనికి రాజీనామ చేస్తానని ముందుకొచ్చినప్పుడు నాకు గాబరి అయ్యింది. అప్పుడు నేను యాలకుల పొదల వద్దకు వెళ్ళి చూస్తే సర్వనాశనం జరిగింది అక్కడ! కోతులు యాలకుల పాదుల్ని ఏ విధంగా నాశనం చేస్తవంటే, ఆ పాదుల్ని చూసినోళ్ళకు మాత్రమే అది గుర్తు అవుతది! ప్రతియొక యాలుక పాదును పీకి, ఆ మొక్కను భీముడు జరాసంధుడ్ని చీల్చినట్లుగా రెండు భాగాలుగా నిలువనా చీల్చి, తోరణంగా చేసి ఎటెటో విసిరినవి. నాకు ఒకవైపు దుఃఖం, మరోవైపు పిచ్చికోపం.... ఆ రెండూ ఒకటైవచ్చినవి.

ఈ కోతుల గుంపుమీద మనుషుల బెదిరింపు ఒక శాతమూ ప్రభావం చూపేది లేదు. మారడేమో డబ్బాను డమడమా కొట్టేది, నేలటపాకాయల్ని కొట్టేది.... మొదలైనవన్నీ చేసాడు. ఇవి ఏదానికి బెదరలేదు. చివరచివరికి కోతులు ఎంతగా తెగించినవంటే వీట్ని పారద్రోలేందుకు వెళ్ళిన మారడికి తమ పళ్ళను చూపించి గుర్‌గుర్రని బెదిరించినవట. మారడికి భయమేసింది. మొదట్లో అతనూ (ఆకోతుల్ని హనుమదేవుడి ప్రతిరూపాలన్నట్లుగా భావించి) వాట్ని చంపకూడదని చెపుతుండగా, ఇప్పుడు అవి అతడ్ని బెదిరించేది ప్రారంభం చేసిన మీదట "వీట్ని తుపాకితో కాల్చి పడేయకపోతే నాకు ప్రాణాపాయం కచ్చితం... నౌకర్ని వదిలేస్తాను" అని నాతో మొరపెట్టుకొన్నాడు.

కోతుల్ని పట్టేవాళ్ళకు ఒకొక కోతికి పదో ఇరవైయ్యో రూపాయల్ని ఇచ్చి, వాట్ని బంధించి దూరంగా ఎక్కడికో సాగనంపేంతగా నేనేమి అహింసావాదిగా లేను కదా! మారడు వాట్ని చంపిపడేయండి అని చెప్పేవేళకు నేను కూడా అదే నిర్ణయంకు వచ్చాను.

కోతులమీద నాలో కోపం రెట్టింపు అయ్యేందుకు అవి మా టామి మీద ఆక్రమణ చేసిన సంఘటన కూడా ఒక కారణంగా ఉంది. కుక్కను చూస్తే కోతులు నేలమీద తిరిగేది లేదని మారడు టామీని పిల్చుకెళ్ళి కోతులమీద ఉసిగొల్పేవాడు. కుక్కను చూసిన తక్షణమే కోతులన్నీ టర్రో అని అరుస్తూ అడవిలోకి పరారయ్యేవి. దీన్నుంచి మరింత ఆత్మవిశ్వాసం వచ్చిన టామి అడవి లోపలా ఒకసారి వాటి వెంటబడి వెళ్ళింది. మనుషులనుంచి దూరమైన టామి ఆ ఘోరారాణ్యంలో ఏకాకైనప్పుడు ఏడెనిమిది పెద్దకోతులు ఒక్కసారిగా మా టామిమీద దూకి రెండు మూడు చోట్ల చర్మం ఊడేంతగా కరిచినవి. మారడు సకాలంలో పరిగెత్తి బడిత కర్రను చూపించి ఆ కోతుల్ని పారద్రోలకుంటే అవి మా టామీని చంపేయాలనే ఉపాయం చేసుకొన్నవి కదా! ఈ సంఘటన అయిన తర్వాత ఒంటరిగా కోతుల్ని పారద్రోలేందుకు మారడు భయపడసాగాడు. నేను టామీని పశువుల ఆస్పత్రికి తీసుకెళ్ళి దాని గాయాలన్నిటిమీద కుట్లు వేయించిందే గాకుండా, ముందు జాగ్రత్తగా దానికి యాంటిరేబిస్ ఇంజెక్షన్ చేయించేది ఉంటదని డాక్టరుగారు చెప్పినందున పద్నాలుగు రోజులూ దాన్ని ఆస్పత్రికి తీసుకెళ్ళి టీకాలు వేయించాను.

ఇక నా సహనం నానుంచి తొలగిపోయింది. వన్యమృగ సంరక్షణ, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ చట్టం, అహింస... మొదలైన వాట్ని గమనించే స్థితిలో లేను నేను ఇప్పుడు. కోతుల్ని అటుండనీయండి, సాక్షాత్ మనుషులేమైనా నా తోటకు హాని చేస్తే చంపి పడేయాలనేంతగా కోపం నాకు వచ్చింది.

పంచాయ్తిలో కోతుల సమస్యనుంచి ఎందుకు అందరూ గాడ్లీని కొట్టేందుకు వెళ్ళారనేది ఈ రోజు మాత్రమే నాకు తెల్సి వచ్చింది.

తుపాకీలో గుళ్ళు నింపుకొని వెళ్ళినప్పుడు నా జతగా ఉన్న టామీని చూసిన తక్షణమే గుర్ గుర్ అంటూ ఒక పెద్ద కోతి తన దంతాల పంక్తిని చూపెట్టి,

కొమ్మనుంచి మరో కొమ్మకు జారి కిందకు చేరింది. దాని ముఖం యూరోపియన్ దొరల ముఖమన్నట్లుగా ఎరుపుగా ఉంది. దాని కళ్ళలో కోపం ఉగ్రరూపంగా ఉంది. "దాన్ని కొట్టి పడేయండి, అదే ఈ గుంపుకు లీడర్" అని మారడు నన్ను ఆజ్ఞాపించాడు. నేను తుపాకినుంచి దాన్ని కాల్చగా అది ఆ పెద్ద చెట్టునుంచి దభీల్‌మంటూ కిందపడి చనిపోయింది.

నేను మరికొన్ని కోతుల్ని చంపాలనే సకల సిద్ధతలతో వెళ్ళాను. అయితే ఆ కోతుల నాయకుడు ఎంతో ఎత్తులో ఉన్న చెట్టు కొమ్మనుంచి నా తుపాకి కాల్పువలన దభీల్నే కిందపడిందాన్ని చూసిన ఆ గుంపుమీదంతా తీవ్ర ప్రభావం భీకరంగా పడింది. కోతులన్నీ కొర్రో మర్రో అని అరుస్తూ దిక్కులే తెల్వనట్లుగా వెర్రివెర్రిగా కొమ్మల్నుంచి కొమ్మలమీదకు దూకుతూ పారిపోయినవి. విజయోన్మాదం నుంచి "కాల్చండి, మరి రెండిట్ని" అంటూ మారడు హుషారు పెడ్తున్నాడు నన్ను. అయితే వాట్ని కాల్చేందుకు అవకాశమే దొరకలేదు. ఇక ఆ కోతులన్నీ వరి మడుల్ని, తోటను దాటి మరలా గాడ్లి పని చేస్తుండే రామలక్ష్మమ్మగారి తోట దిక్కుకు పారిపోయినవి.

కోతిని చంపినందుకు ఊరోళ్ళందరూ నన్ను ఆక్షేపించొచ్చని భావించాను. కొంతమంది అలాగే మాట్లాడారట! అయితే ఎక్కువ మంది ఆ కోతుల్ని చావగొట్టి గాడ్లితోటవైపుకు పారద్రోలిందానికి నా తరుపున బలాన్ని చూపెట్టారు. శికారి మంజప్ప, "ఇంకొకసారి కోతుల్ని మావైపుకు పారద్రోలితే ఈసారి కోతుల్ని చంపే పాపం మూటను మేము కట్టుకొనేది లేదు, నిన్నే కాల్చుతాము" అని గాడ్లీని తిట్టి బెదిరించాడట!

★ ★ ★

గోణిబీడుకు చెందిన ఈ గాడ్లి విషయం చెప్పాలంటే ఎంతో చెప్పుకోవచ్చు. అయితే అతనెవరు, ఎక్కడ్నుంచి వచ్చాడు, అతని అమ్మ-నాయన ఎవరు... అనేవి క్రమబద్ధంగా అతని చరిత్రను చెప్పాలంటే మాత్రం మనకు కష్టం ప్రారంభమౌతది. ఎందుకంటే ఇవన్నీ అతనికీ సరిగా తెల్వని విషయాలేకదా! అతని అసలు పేరు జాకబ్ అని కొందరూ, కాదు కాదని యాకూబ్ అని కొందరూ చెపుతారు. అయితే

అతను క్రిస్టియన్‌లాగ చర్చికి వెళ్ళింది చూడలేదు ఎవరూ. మహమ్మదీయ మతస్తుడిలాగ మసీదుకు వెళ్ళిందాన్ని చూడలేదు ఎవరూ. ఇక్కడ మా ప్రాంతంలో అనేకుల జన్మ ఎంతో ప్రశ్నార్థరీతిగా ఉంటది. ఒకర్ని వదిలి మరొకర్ని అప్పటికప్పుడే గాంధర్వ రీతిగా వివాహమాడే మగమహారాజులు, ఘనమైన మహిళలూ ఇక్కడ కావాల్సినంత జనంగా ఉన్నందున తాము ఎవరికి పుట్టాం అనేది పసికూనలలో ఎంతో గందరగోళం ఉండేది. గాడ్లీని ఈ ప్రశ్న అడిగితే, ఆ సందర్భంలో ఎలాగ అతనికి అన్పిస్తుండేదో అలాగే చెపుతుండేవాడు. ఇంతకీ అతను ఎవడ్నుంచి ఎవతికి పుట్టాడో, మాకేంటి? మేమేమైనా అతనికి యువతిని కట్టబెట్టేందుకు సిద్ధమైయ్యామా? అతని జన్మకుండలి (జాతకం) తెల్సుకొంటే దాన్నుంచి అతను మంచివాడూ అయ్యేది లేదు, చెడ్డోడిగా మారేది లేదు కదా!

మొదట్లో ఎంతోకాలం క్రితం గాడ్లి క్షౌరిక వృత్తిలో ఉండేవాడట. క్షౌరిక వృత్తికి మాత్రం అతని కులగోత్రాల విషయం ఉండాల్సే ఉందికదా! ఎందుకంటే ఆ వృత్తిలోని ధర్మం జనం శరీరాల్ని ముట్టుకొని చేసే పనితనం కదా! హిందువులలో ఎవడు ఎవడి శరీరంను ముట్టుకోవచ్చు, ముట్టుకోకూడదు అనే కట్టుబాట్లు ఉన్నందున జనం అతని పూర్వపరాల్ని తెల్సుకొనేదాంట్లో ఆసక్తి కలిగి ఉండొచ్చు. అయితే గాడ్లి తన క్షౌరిక వృత్తికి వీడ్కోలు చెప్పాల్సివచ్చింది దానికని కాదు. మా ఊర్లో క్షురకుల నుదుటిరాతను చెప్పాలంటే ఆ వృత్తి ఎవరికీ వద్దని అన్పిస్తది. సంవత్సరంకు ఒకే ఒకసారి ఆదాయం చేతికి దొరికే గ్రామ ఆర్థిక వ్యవస్థలో వారాని కొకసారి షేవింగ్, నెలకొకసారి హేర్ కటింగ్ చేసి డబ్బు తీసుకోవాల్సి ఉండే క్షురకుడి పరిస్థితి శోచనీయస్థితిలో ఉండేది. వరికోతలు ముగిసి, కుప్పనూర్పిళ్ళు అయ్యే సమయంలో తప్పితే మరలా ఏ సమయంలోనూ ఎవరి వద్దా ఒక దమ్మిడి ఉండేదిలేదు. అందుచేత ఊరోళ్ళంతా క్షురకుడికి సంవత్సరానికింతగా వరిధాన్యమని నిర్ణయం చేసుకొన్నా, వచ్చేపోయేవేళలో విరామం దొరికినప్పుడల్లా వాళ్ళు, వాళ్ళ వారసులు తలను గీకించుకొనేవారు. ఒకరి ఇంట్లో ఎంతమంది ఉన్నారు, వారంతా సంవత్సరానికి ఎన్నిసార్లు షేవింగ్, హేర్‌కట్ మొదలైనవాట్ని చేయించుకొంటారు... ఇవన్నీ గ్రామసీమలో ఉండే క్షురకుడు లెక్కబెట్టుకొని లాభనష్టాల బేరీజును చేసుకొనేది

సాధ్యపడుతదా! మొత్తానికి క్షురకుడికి సూర్యోదయంనుంచి సూర్యాస్తమయం వరకూ పనేపని! గీకిందే గీకేదిగా ఉంటుండేది.

వరి నూర్పిళ్ళ సమయంలో గాడ్లి బండి కట్టించుకొని వడ్ల వసూలుకని వృత్తిని నిల్పి గిరాకిదార్ల ఇంటి అడ్రెస్‌లను పట్టుకొని ఆ కొండ గుట్టలలో తిరుగుతుండేవాడు. ఈ రోజురా; రేపురా... అని సతాయించేది, వరికుప్పను ఇంకా నూర్చలేదని అంటూ కొంతమంది ఖాళి గోనెసంచుల్ని చూపించేవారు. "ఇక్కడికి వచ్చే ముందు కత్తెర చాకు తెచ్చియుంటే ఇక్కడే ఆ కేశఖండనంను నిర్విఘ్నంగా చేసుకొని వెళ్ళేవాడివికదా" అని ఆ గిరాకీదార్లు అతని తల తినేసేవారు. ఈ గోలలో ఏగి ఏగి తల రోసిపోయినందున గాడ్లి తన క్షౌరిక వృత్తికి సంపూర్ణంగా తిలాంజలి ఇచ్చి, 'హులిహందలు' యూరోపియన్ దొర వద్ద బట్లరు (వంట) పనికి చేరుకొన్నాడు.

గాడ్లి అనే విచిత్ర పేరుతో ఇతడ్నెందుకు పిలుస్తారని ఇతని పేరు మూలం వెతుకుతూ వెళ్ళినప్పుడు నాకు ఒక విషయం తెల్సివచ్చింది. గట్టిగా మాట్లాడి తనకు చెందాల్సిన ధాన్యంను వసూలు చేసుకోలేని ఇతని సౌమ్యగుణం నుంచే ఇతను తన క్షౌరిక వృత్తిని వదిలేసాడు కదా! ఇతనిలోని ఈ సౌమ్యగుణాన్ని చూసిన 'హులిహందలు' దొర ఇతడ్ని గాడ్లీ మ్యాన్ (godly man) అని అన్నాడట. ఆ దొర పిలిచిన ఈ నామధేయమే పర్మనెంట్‌గా నిల్చి, పాతవైన వివాదాస్పద యాకూబ్, జాకబ్ పేర్లను జనం మరిచిపోయారు. గాడ్లీమ్యాన్ అనేది క్రియాపదమో, నామపదమో, గుణవాచకమో.... ఏమి తెల్వని మా పల్లెజనం ఆ పదాన్నే నామపదంగా చేసి వాడసాగారు. దాని సంక్షిప్త రూపమే గాడ్లి!

గాడ్లి 'హులిహందలు' దొర దగ్గర బట్లరు నౌకరీలో చేరిన కొన్ని మాసాలకే, అతని దురదృష్టం అన్నట్లుగా భారతదేశం స్వాతంత్రమై బ్రిటీషోళ్ళ పాలన అంతమైంది. 'హులిహందలు' దొర తోట అమ్మి తన స్వదేశంకు వెళ్ళిపోయాడు. గాడ్లి నిరుద్యోగి అయ్యాడు. ఆ తర్వాత గాడ్లి కాఫి ఎస్టేట్లకు లేబర్‌ను సప్లై చేసే సప్లైర్ పని చేపట్టాడు. తోటలకు కూలీల్ని సప్లై చేసేవాళ్ళకు, వాళ్ళు సప్లై చేసిన కూలీలు కూలిపనులు చేసిన ప్రతి ఒక రోజుకు ఒక అణాలాగ సప్లైర్‌కు కమీషన్ ఇచ్చేదుంది. సామాన్యంగా గుండాలగుంపు కట్టుకొన్న దాదాలు ఈ సప్లైర్ డ్యూటీ చేస్తుండేవాళ్ళు. కూలీల వద్ద వీళ్ళు డబ్బు దోచుతుండేవాళ్ళు. జతగా సరిగా కూలి

పనులకురాని కూలీల్ని అమానుషంగా శిక్షించేది, కూలి పనుల్ని వదిలి పారిపోయినోళ్ళను లాక్కొచ్చి చితక బాదేది... ఈ అన్ని క్రూర కృత్యాల్ని ఆ దాదాలు చేస్తుండేవాళ్ళు. నేను ఎస్టేట్ ప్రారంభించే వేళకు దివంగత కర్నాటక ముఖ్యమంత్రైన దేవరాజ్ అరసు పుణ్యంగా ఈ చేష్టలు నీతి బాహ్యామైన మరియు చట్టవ్యతిరేకమైనవిగా గవర్నమెంటు నుంచి ఫర్మానా (జి.వో) వచ్చినందున ఈ పీడ వృత్తి తొలగిపోయింది.

గాడ్లి తన మంచితనం నుంచి ఈ లేబర్ సప్లై వృత్తిలోనూ రాణించలేదు. కూలీలందరూ తోటల యజమానులనుంచి ముందస్తుగా అప్పు తీసుకొని రాత్రికి రాత్రే పరారై వెళ్ళగా, ఆ కూలీలు చేసిన అప్పూ గాడ్లి తలమీద పడుతుండేది. ఉన్న మూడు కాసుల్ని పోగొట్టుకొన్న గాడ్లి ఆ లేబర్ సప్లైయర్ పనిని వదిలేసాడు. ఆ తర్వాత కొన్ని రోజులు కళ్ళలో పడిన ఏవేవో చిల్లర పనుల్ని చేసుకొంటూ తిరిగేవాడు. టిల్లర్ డ్రైవర్‌గా మారి టిల్లర్ తిప్పుతుండేవాడు. కాంట్ర్యాక్టర్‌గా మారి రహదారి మీద మట్టి పోసే కాంట్ర్యాక్ట్ పని చేస్తుండేవాడు. ఇటుకల్ని చేసే నేర్పరి పనోళ్ళను దూర దూరానుండే జిల్లాలనుంచి పిల్చుకొచ్చి ఇటుకబట్టి నడిపేవాడు. కాఫి ఎస్టేట్లకు సేంద్రీయ ఎరువుల్ని సప్లై చేస్తుండేవాడు. ఈ అన్ని పనులలో గాడ్లి కాలాన్ని నెట్టుకొన్నాడు తప్పితే డబ్బు సంపాదన చేయలేదు. జీవితంలో పైకి ఎగబ్రాకేందుకు కావాల్సిన చలాకితనం, మాటలగారడి, కుయుక్తులు... ఇవేవి అతనిలో లేనందుకే ఇందుకు కారణంగా ఉంది కదా!

★ ★ ★

గాడ్లి మ్యానేజర్‌గా నౌకరి చేస్తున్న రామలక్ష్మమ్మగారి తోట యజమాని పేరు షరావ్‌సాబ్! వారి పిల్లలు బొంబాయిలో పనులు చేస్తున్నందున షరావ్‌సాబ్ ఇక్కడ గడిపేదో ఎంతో తక్కువగా ఉంటుండేది. సరిగా గమనం నిల్పకనే ఉన్నందున ఆ తోట పాడుపడింది. చెట్లను సరిగా కత్తిరించకనే వాటి పాటికి అవి పెరిగేందుకు వదిలినందున సూర్యరశ్మి అన్ని కొమ్మరెమ్మలకు తాకనట్లుగా ఆ చెట్లు పెరిగి అక్కడుండే కోతుల్ని పారద్రోలేది అసాధ్యంగా ఉండేది. షరావ్‌సాబ్ తన తోటకు డబ్బు ఖర్చు పెట్టట్లేదు. వారు తన కింద పని చేస్తుండే మేనేజర్ గాడ్లీని సరిగా తిట్టే చాలు తోట అభివృద్ధి చెందుతదని భావించేవారు. నెలకొకసారి వచ్చి తోటను పాడుచేసావు కదా అని గాడ్లీ మీద ఉమ్మేసి వెళ్ళిపోయేవాడు. కోతులెన్నో ఆ తోటలో స్థిరనివాసం చేసుకొన్న పిమ్మట ఈ ఉమ్మించుకొనేది జోరైంది గాడ్లీకి!

గాడ్లి కోతుల బెడదను నివారించేందుకు తనకు చేతనైనంతగా ఏవేవో చేసాడు. ఆ తోటలో ప్రవహిస్తుండే చిన్న వాగుకు అడ్డుకట్టవేసి, దాని నీటిధార గిరగిరా డైనమోలాగ తిరిగే ఒక చక్రం మీద పడేటట్లుగా చేసి అప్పుడు ఆ చక్రం తిరుగుతుంటే ఒక కర్రను దానిలో దూర్చి డమడమ డబ్బాను కొట్టుతున్నట్లుగా సప్పుడ్ను కలగజేసాడు. అయితే నిరంతరంగా వస్తున్న ఆ కర్ర సప్పుడు చివర చివరికి ఆ కోతులకు లాలిపాట, జోలపాటలాగ అభ్యాసమై ఆ శబ్దాన్ని అవి లెక్కలోకి తీసుకోవట్లేదు కదా!

కోతుల బెడదను నివారించేందుకని అతను చేసిన మరొక తమాషా ప్రయోగం ఏమిటంటే ఒక సారాయి బానను, ఐదారు గట్టి బడితకర్రల్ని తోటలో పెట్టాడు. ఈ అద్భుత ఉపాయాన్ని అతని తలలో ఎవడు పడేసారో నాకైతే తెల్వదు. కోతులు సారాయి త్రాగి మత్తెక్కి బడితకర్రల్ని పుచ్చుకొని తమలో తామే కొట్టుకొంటవనేది అతని ఆలోచనగా ఉంది. అతను చేసిన ఈ విధానంను నేను ఐదారుగురు ఊరి జనంకు చెప్పి వినోదపడినప్పుడు, వాళ్ళు గాడ్లి చేసిన విధానంకు నవ్వకనే ఇది ఈ ప్రాంతంలో వాడుకగా ఉన్న విధానమే అని చెప్పారు. వాళ్ళు ఆ విధానంను గంభీరంగానే పరిగణించినదాన్ని చూసి నేను కుతూహలంగా గాడ్లీని కల్సి ఈ ప్రయోగం ఫలప్రదమైందా? అని ఐదారుసార్లు అడిగాను. ఒకసారి అడిగినప్పుడు ఎవడో తుంటరోడు ఇతను పెట్టిన సారాయి బానలోని మద్యాన్ని ఆశెబోతుగా సగానికి సగం త్రాగి, నీళ్ళు నింపిపెట్టాడని, కోతులేమో ఆ నీళ్ళ సారాకు ఇష్టపడలేదని చెప్పాడు. మరో మారు అడిగినప్పుడు సారాయి బాన పగిలిందని, ఇతను పెట్టిన బడితకర్రల్ని తీసుకొని తమలో తాము బాదుకోకుండా, ఎలాగెలాగో జగడం చేసుకొని సారాయి బానను పగలగొట్టియుండొచ్చని చెప్పాడు.

ఒకసారి గాడ్లి నావద్దకు వచ్చాడు. సారాయి బాన ప్రయోగం ఫలప్రదం కాలేదు. కోతులు తమ తలల్ని పగులగొట్టుకొనేది వదిలి అతని సారాయి బానను పగలగొట్టేది చేయసాగినవి. గాడ్లి యజమాని వచ్చి కోతుల బెడదను నివారించకుంటే ఉద్యోగంనుంచి తీసేస్తానని చెప్పాడట. ఆ దిగులునుంచే గాడ్లి నన్ను తుపాకి నుంచి కోతుల్ని కాల్చి పడేస్తారా అని అడిగాడు.

“నేనెందుకు నీ తోటకొచ్చి కోతుల్ని కాల్చాలి? నీకు తుపాకి పేల్చేది రాదా?” అని అడిగాను.

“తుపాకి పేల్చడి వస్తది సార్! అయితే నేను కోతుల్ని కాల్చేది లేదు సార్”

“ఎందుకు కాల్చవు?”

“కోతులు దేవుడి రూపాలు కదా సార్! ఇప్పటిదాకా వాట్ని కొట్టింది లేదు సార్! మరిక ఇప్పుడు వాట్ని ఎలా కొట్టగలను సార్?”

“ఇప్పటిదాకా కాల్చలేదంటే ఏమిటి? ఇప్పుడు కాల్చు వాట్ని”

“ఏదో నా నమ్మకం అలాగుంది సార్. నాకెందుకు సార్ ఆ కోతుల్ని చంపి పాపం మూటకట్టుకొనేది ఉంటది. రేపేమైనా ఎక్కువ తక్కువ అయితే?”

“నీ అభిప్రాయం మంచిదే గాడ్లి. కోతి దేవుడి ప్రతిరూపం అని నీకంతగా నమ్మకం ఉంటే నువ్వు నాతో కోతుల్ని చంపకండి అని చెప్పాలి తప్పితే మీరొచ్చి వాట్ని చంపండి అని ఎలాగున చెపుతావ్? వాట్ని చంపి రేపేమైనా నాకు ఎక్కువ తక్కువ అయితే?” అని ప్రశ్నించాను.

గాడ్లీకి నా వాదం అర్థమై ఉండొచ్చు. “మీరు చెప్పేది సరేనండి! నేనెందుకు కోతిని చంపిన పాపం మీ తలకు కట్టబెట్తాను?” అంటూ నా వాదంను ఒప్పుకొన్నాడు. నేను తన తోటకు వెళ్ళి కోతుల్ని కాల్చేందుకు ఒప్పుకోనందుకు ఒక ముఖ్య కారణం ఏమిటంటే అవి అక్కడ్నుంచి పారిపోయి మరోచోటుకు చేరుకొనేది మావైపుకే కదా! మొన్న పంచాయ్తిలో అందరి ఆక్రోశం చూసిన నేను మరో పంచాయ్తి ఏర్పాటు చేసేందుకు సిద్ధమైలేను.

ఇక ఇప్పుడు గాడ్లి బేలూరులో కోతుల్ని పట్టేవాళ్ళను వెతికేందుకని వెళ్ళాడు అక్కడికి. అయితే కోతుల్ని పట్టేందుకు వాళ్ళు ఒకొక కోతికి ఇరవై ఐదు రూపాయలని అడిగినందున అంత పెద్ద మొత్తంలో డబ్బు ఇచ్చేందుకు సాధ్యంగాని గాడ్లి ఇరకాటంలో పడ్డాడు. చివరికి కోతుల్ని పట్టేందుకు వారి వద్ద కాళ్ళావేళ్ళా పడి కోతుల పంజరం ఒకదాన్ని బాడుగకని తీసుకొని బస్‌మీద వేయించుకొని వచ్చాడు.

★ ★ ★

కోతుల్ని పట్టే గాడ్లి యోచనలు తమాషాగా ఉన్నవి తప్పితే ప్రయోజనకారిగా కాలేదు. అందుచేత అతను బోనును పెంట్యా ఒంటెద్దు బండిమీద బస్స్టాండ్ నుంచి తోటకు సాగిస్తుంటే చూసాను తప్పితే అది ఫలప్రదం అయ్యిందా అని నేను అడిగేందుకు వెళ్ళనేలేదు.

సర్కస్ కంపెనీలు ఊరినుంచి మరో ఊరుకు పులులు, సింహాల్ని రవాణా చేసేందుకు ఉపయోగిస్తుండే పంజరాన్నే కోతుల్ని బంధించే బోనులాగ మార్పు చేసారు. ఆ బోనులో రెండు గదులు ఉన్నవి. రెండు గదులకూ పైకే ఎత్తాల్సిన ద్వారాలు ఉన్నవి. బయట ఉండే ద్వారంను పైకెత్తి దాని కీలు లాగితే ఆ ద్వారం పైనే నిలబడుతది. బోనులోపల అడ్డంగా ఉన్న సలాకీ కీలికి ఒక తీగ కట్టి ఉంచారు. కోతులు అడ్డ సలాకీలలో ఏదాన్నైనా అటు ఇటు ఊపితే చాలు, దాని కీలు వెనక్కి జరిగి ద్వారం దభీల్నే పడి, కీలు గొళ్ళం వేసినట్లుగా ఆ ద్వారంను పట్టుకొని ఉంటది. కోతులు లోపలినుంచి చేయి వేసి ఆ కీలును తేలిక చేయటంగాని, ద్వారంను పైకి ఎత్తటంగాని సాధ్యపడదు. బయట్నుంచి మాత్రం ద్వారంను మరలా పైకి ఎత్తవచ్చు. కోతులు లోపల చిక్కుకుపోయినప్పుడు మళ్ళా రెండోగది ద్వారంను పైకెత్తి మొదటి గదిలో చిక్కుకొన్న కోతిని ఆ రెండో గదిలోకి పంపి ఆ ద్వారంను భద్రంగా వేసిన తదుపరి, మరలా బయటుండే ద్వారంను పైకి ఎత్తి కీలు ఇరికించి మరొక కోతిని పట్టుకొనేందుకు సిద్ధతల్ని చేసుకోవచ్చు. ఎన్నో కోతుల్ని ఒకటొకటిగా పట్టుకొని ఆ తర్వాత వాటన్నిట్నీ కల్పి బోను సమేతంగా ఎక్కడికో సాగనంపొచ్చు. అయితే పెద్దదిగా జైలు గదిలాగ కనబడుతున్న ఆ బోనులోపల కుశాగ్రబుద్ధిగల కోతులు తమంతట తామే వెళ్ళి దొరికిపోయేది ఎంతో అసంభవంగా ఉందని నాకు అన్పిస్తుంది. అకస్మాత్‌గా ఒకటో రెండో బోనులో పడినా, దాన్నుంచి బెదిరిన మిగిలిన కోతులు ఏవీ ఆ బోను దరిదాపుల తిరిగాడేది లేదని నేను అనుకోసాగాను.

కొన్నిరోజుల తర్వాత పశువుల్ని కాసే రామ కన్పించి ఒకట్రెండు కోతుల్ని గాడ్లి బోనులో పట్టుకొన్నాడని తెల్పాడు. గాడ్లి నాకు మాట్లాడేందుకు దొరకలేదు. నేను అతని తోటకు వెళ్ళి ఎలాగున పట్టుకొన్నాడోనని చూద్దామనుకొన్నా తోట పనుల ఒత్తిడి నుంచి వెళ్ళనేలేదు.

మరలా రెండు మూడు రోజులు గడిచిన మీదట రామ కన్పించి, “గాడ్లి ఎన్నో కోతుల్ని పట్టుకొన్నాడని, అతని బోనంతా కోతుల్నుంచి నిండిపోయింది” అని చెప్పాడు. ఇప్పుడు నాలో కుతూహలం ఎక్కువైంది. తోటకు వెళ్ళి గాడ్లీకని అడగగా, గాడ్లి ఉదయంలోనే పెంట్యాబండిలో బోను ఎక్కించుకొని అడవిలో కోతుల్ని వదిలిపెట్టేందుకు వెళ్ళాడని కూలిపని చేస్తున్నోడు చెప్పాడు.

ఆ తర్వాత కొన్ని రోజులవరకూ గాడ్లి నాకు కనబడలేదు. అయితే అతని గురించి ఊరోళ్ళు ఇద్దరు మాట్లాడుకొంటూ వస్తున్నారు. గాడ్లి కోతుల్ని అడవిలో వదిలిపెట్టేందుకు బోనుతో వెళ్ళినప్పుడు, బోనునుంచి బయటకు వచ్చిన కోతులు గాడ్లీనే బోను లోపలికి నెట్టి కీలు లాగినవట! గాడ్లి బోనులోపల రెండురోజులు ఉపవాసం చేయగా, అడవి ప్రక్కనుండే పల్లెజనం అతడ్ని చూసి విడిపించినప్పుడు నీళ్ళదాహం నుంచి సగం మనిషిలాగ అయ్యాడని నాకు చెప్పారు. నేను ఈ ఘోరారణ్యం చెంత తోట వేద్దామని వచ్చిన పిమ్మట ఎంతెంతవో ఊహించేందుకు అసాధ్యమైన చిత్ర విచిత్రాలన్నిట్నీ చూసాను. అయితే గాడ్లీనే కోతులు బోనులోపలికి నెట్టి బంధించినవి అనేదాన్ని మాత్రం నాకు నమ్మేందుకు సాధ్యంగావట్లేదు. నాలోని అపనమ్మకంను చూసి, “మీకు మా మాటలలో నమ్మకం లేకపోతే గాడ్లీనే అడిగి చూడండి” అని చెప్పి ఆ ఇద్దరూ వెళ్ళిపోయారు.

బహుశః గాడ్లి కోతుల్ని పట్టుకెళ్ళి ఇంకెవరిదో అయిన తోట వద్ద వాట్ని విడిచినందుకు, వాళ్ళు గాడ్లీని కొట్టి బోనులో వేసి ద్వారం వేసియుండొచ్చని నేను యోచించాను. గాడ్లి విషయంలో పల్లెజనం తప్పు కల్పనల్ని ముగుతాడు లేనట్లుగా వదిలేసి ఒకటికి రెండు చేర్చి మాట్లాడేది సర్వసాధారణంగా అయ్యింది.

గాడ్లి నాకు దొరికినప్పుడు, “కోతులు బోనులో నిన్ను బంధించింది నిజమేనా?” అని అడిగాను. అతను బోనులోపల చిక్కుకుపోయింది నిజమే. అయితే అతడ్ని బోనుకు నెట్టింది కోతులు కాదు, మనుషులూ కాదు! కొన్ని అసాధారణ ఆకస్మిక ఘటన నుంచి గాడ్లి బోనులో పడ్డాడు. కోతులమీద అతనిలో ఉన్న పూజ్యభావమే ఇందుకు కారణమని చెప్పొచ్చు.

బోనులో కోతులు పడినప్పుడల్లా రెండోగదికి వాట్ని పంపి ద్వారం వేసిన గాడ్లి, అవి అక్కడ ఆకలితో నకనక లాడకూడదని పనసతొనల్ని, అన్నం, నీళ్ళు

పెట్టి చక్కగా చూసుకొనేవాడు. బోను నిండితే ఆ బోనును పెంట్యాగాడి ఒంటెద్దు బండిలో వేసుకొని జన్నాపురంనుంచి పదైదు మైళ్ళ దూరాన ఉండే 'మనాలి జంగ్లీ'లో వాట్ని విడిచివచ్చేందుకు బయల్దేరాడు. పెంట్యా సహాయంనుంచి అడవిలో బోను దింపి బోనులోని తలుపు తెరిస్తే కొన్ని కోతులు బయటకు వెళ్ళిపోయినవి. అయితే ఎన్నో రోజుల్నుంచి వేళకు సరిగా పుష్కళమైన భోజనం తిన్న ఎన్నో కోతులు బోనులోపలే ఉండేందుకు నిశ్చయించుకొని బయటకు వెళ్ళేందుకు నిరాకరించినవి. పెంట్యా, గాడ్లి బడిత కర్రల్ని తీసుకొని బెదిరించి కొన్నిట్ని బయటకు పంపేదాన్లో విజయులైనా, రెండోగదిలో ఉన్న కోతుల్ని బయటకు పంపేందుకని దాని తలుపును పైకి లేపిన తక్షణమే అక్కడే చెట్ల మాటున దొంగలన్నట్లుగా పొంచి కూర్చున్న కోతులు మరలా పరిగెత్తుకొని వచ్చి బోనులో జొరబడుతున్నవి. పెంట్యాలో కోతులమీద భక్తి భావం లేదు. వాట్ని బెదిరించేందుకని బడితె కర్రనుంచి కోతులమీద కుమ్మినప్పుడు ఒక కోతి చేయి విరిగింది. గాడ్లీకి కోపం వచ్చి పెంట్యాను తిట్టి, "కొద్దిసేపు ఆగరాదూ... బోనులోపల అవి ఉపవాసం చేస్తే ఆ తర్వాత వాటి మానాన అవి ఆహారం వెతుక్కొనేందుకు బయటకే వెళ్ళిపోతవి" అని చెప్పాడు.

పెంట్యాకు ఈ కోతుల చేష్టల నుంచి మనస్సు రోసిపోయింది. కోతులకు ఉపవాసం కలిగేందుకు కూర్చుంటే మనమూ ఉపవాసంలో పడ్తాం అనే దాన్ని అనుకొన్న అతను గాడ్లీతో "నువ్వు బోను ఖాళి అయినప్పుడు చెప్పు... బండి తెస్తాను మరలా; నాకు ఇక వేచియుండేందుకు సాధ్యంకాదు" అని చెప్పి తన ఇంటికి వాపస్సై వచ్చాడు.

చీకట్లు ముసిరేలోపే అన్ని కోతులూ ఒకటొకటిగా ఆ బోను జాగాను ఖాళీ చేసినా ఒక చిన్న కోతిమాత్రం గాడ్లి రోజూ తినబెట్తున్న తిండిని నిరీక్షిస్తూ బోనులోపలే కూర్చుని ఉంది. ఆకలి, దాహంనుంచి సహనం కోల్పోయిన గాడ్లి కోపంగా బోనులోపలికి దూసుకెళ్ళి ఒక మూలలో దాక్కొని పళ్ళను బయటకు చూపి బెదిరిస్తున్న ఆ కోతి తోకను లాగిపట్టి బోను అవతలకు గుంజాడు. అప్పటి వరకూ ఎంతో జాగ్రత్తలో ఉన్న గాడ్లి కోతినుంచి వస్తున్న రంపాటలోని గజిబిజిలో బోను నడుమ ఉన్న అడ్డ సలాకిని పొరపాటుగా కదిలించాడు. కోతేమో బయటకు వెళ్ళిపోయింది. అయితే బోనులోని ద్వారం దభీల్నే జారిపడి బయట్నుంచి తలుపు గొళ్ళెం వేసినట్లుగా ఆ కీలుగట్టిగా ఇరుక్కొంది. ద్వారంను ఎలాగైనా చేసి పైకి ఎత్తేందుకని గాడ్లి ఎంతగా

ప్రయత్నించినా బోను లోపల్నుంచి అది అతనికి సాధ్యపడనేలేదు కదా!

కోతులు మరలా తోటల వద్దకు వెనుదిరిగి రానట్లుగా వాట్ని వదిలేందుకని బోనును అడవి మధ్యకు తెచ్చారు. బోనులోపల ఇరుక్కొన్న గాడ్లి కేకల్ని వినేందుకు అక్కడ ఎవరూ లేరు. ఐదారు ఇళ్ళతో ఉండే 'మనాలిజంగ్లి హళ్ళి' ఉన్నా ఆ బోను నుంచి రెండు మైళ్ళ దూరాన ఉంది. రెండు రోజులుగా ఆకలి దప్పికలతో తల్లడిల్లిన గాడ్లీని వంటకట్టెలకని అడవిలోకి వచ్చిన ఇద్దరు మహిళలు చూసి కనుగొన్నప్పుడు గాడ్లి అరిచేందుకు సైతం ఊపిరి లేక పిలిపిలిగా కంటిరెప్పల్ని కొట్టున్నాడట. బోనులోపలున్న ఈ దుర్భల మానవుడ్ని చూసి భయపడిన ఆ మహిళలు కట్టెల మోపును అటెటో పడేసి తమ గ్రామం వైపుకు పరుగుబెట్టారు. వీళ్ళు ముట్టించిన సుద్దినుంచి 'మనాలిజంగ్లి హళ్ళి'లోని మొగోళ్ళు వచ్చి గాడ్లీని బోనునుంచి బయటకు విడిపించినప్పుడు నీళ్ళకని గాడ్లి నోటిని తెరిచాడట.

గాడ్లి నా ఎదురు పెంట్యాగాడిని నోటికి వచ్చినట్లుగా తిట్టూ అడవిలో తనను కష్టాల కడలిలో పడేసింది, అతనే గనుక కొద్దిగా ఓర్పుతో తనతో ఉండి ఉన్నట్లైతే ఇలాగున జరిగేది కాదని చెప్పుకొన్నాడు. అయితే పెంట్యాకు ఇతను బోనులోపల ఇరుక్కుపోతాడనే కల్పనే లేనందున ఇతను రెండురోజులు గడిచినా మరలా గాడ్లి వద్దకు చేరే చింత, అనుమానం చేసుకోలేదు. పెంట్యాతో నేను మాట్లాడినప్పుడు "నాలుగు అడుగులు బిరబిరగా నడిస్తే ఆ అడవి చెంతన కావాల్సినన్ని ఇళ్ళు ఉన్నవి. అన్నం, నీళ్ళు లేకుండా చనిపోయే సందర్భం గాడ్లీకి ఎదురౌతదని నేను ఎందుకు అనుమానం చేసుకొనేది ఉంటదో మీరే చెప్పండి సార్?" అని నన్నే ప్రశ్నించాడు.

★ ★ ★

కన్నడ భాషలో దివంగత పూర్ణచంద్ర తేజస్విగారు రచించిన "గాడ్లి" అనే కథను యథాతథరూపంగా తెలుగులోకి అనువదించాను.

శాఖమూరు రామగోపాల్. 14-08-2010.

# ఔషధ తీగ



ఇదొక విచిత్రమైన మూలికతీగ కథ! దీని గురించి ఉండే అబద్ధాలు, నిజాలు, కల్పనలలోని కథలు... వీటన్నిట్నీ మీరి ఈ తీగ గురించి సత్యాంశంలోని కొన్ని విషయాల్ని తెల్సుకొనేందుకు నాకు ఇరవైసంవత్సరాలు పట్టిందని చెప్తే మీకు ఆశ్చర్యం కావచ్చునండి! అయితే నేను చెప్పేది ముమ్మాటికి నిజమేనండి!

ఒకసారి మాతోటలో కాఫి మొలకల్ని పాతే పాదులకు పందిరి వేస్తున్నాం. పందిరికి పాదులకు మధ్య పాతిన చిన్న కర్రల్ని కల్పి కట్టేందుకు అడవిలో ఉండే తీగలు కావాల్సి ఉంది. అడవికి వెళ్ళి పట్టుకురా అని సణ్ణయ్యకు చెప్పాను. సణ్ణయ్య

అడవిలోపలికి వెళ్ళి ఎన్నో తీగల్ని, లతల్ని పీకి వాట్ని ఒక పెద్ద మోపుగా మోసుకొని తెచ్చాడు. ఆ మోపును విప్పి, ఆ తీగల, లతల ఆకుల్ని దూసి, పాదులకు కట్టేందుకు తాడులన్నట్లుగా వాట్ని సిద్ధం చేస్తున్న మారడు, వాటిలో ఉన్న ఒక తీగను చూసి "అయ్యయ్యో నీ కొంప పాడుగాను... దీన్నెందుకు పీకి తెచ్చావురో?" అంటూ సణ్ణయ్యను తిట్టాడు. అప్పుడు అక్కడకు నేను వెళ్ళి ఎందిరో లొల్లి (గొడవ) అని విచారించినప్పుడు అది "ఔషధతీగ" అని మారడు చెప్పాడు. సణ్ణయ్యేమో ఆ తీగలు అడవిలోపల కావాల్సినంతగా ఇంకా మరెన్నో ఉన్నవని చెపుతుంటే మారడు తక్షణమే "ఎక్కడున్నవి ఆ తీగలు... చూపించు" అని సణ్ణయ్యను అడవిలోపలికి మళ్ళీ వెంటేసుకొని వెళ్ళాడు. కుతూహలం కనే కేవలం నేను కూడా బయల్దేరాను వారితోపాటుగా. ఈ ఔషధ తీగలోని మొదటి పరిచయం నాకు అయ్యింది అలాగుననే!

సణ్ణయ్య మారడికి ఆ తీగను చూపించిన తక్షణమే మారడు దాన్ని తీసుకొని శీఘ్రంగా పక్కనున్న ఒక పెద్ద చెట్టుకు మనం నడుంకు వేసుకొనే తోలు బెల్టులాగ దాన్ని చుట్టి కట్టి పడేసాడు భద్రంగా. మారడి వ్యవహారం చూసిన నాకు ఆశ్చర్యమైంది.

"ఎందుకు మార, ఆ తీగను చెట్టు నడుంకు అంటగట్టావు?" అని ప్రశ్నించాను.

"సార్... అది దొంగ ముండ! అది అక్కడే ఆ చెట్టుకే అంటుకొని పడియుండనీ అని కట్టి పడేసాను!" అన్నాడతను.

"ఎందుకు మారా, అదెక్కడికి పారిపోతది?"

"అయ్యో... ఈ తీగలోని విచారం మీకు పూర్తిగా తెల్వదు సార్! ఇది అవసరపడినప్పుడు ఎంతగా కావాలని వెతికినా, అది దొరకకనే తప్పించుకొని దాగుంటది సార్. ప్రాణం పోయినా అది దొరికేది లేదు. అందుకే అది ఎక్కడైనా మన కళ్ళలో పడినప్పుడు దాన్ని పట్టుకొని ఏదైనా పెద్ద చెట్టు నడుంకు కట్టిపడేయాలి; ఉండిపో శాశ్వతంగా అక్కడే అని" అంటూ మారడు వివరణ ఇచ్చాడు.

తమలపాకు తీగకు ఉన్నట్లుగా చిన్న చిన్న ఆకులతో, ద్రాక్ష తీగకు ఉన్నట్లుగా గుత్తులగుత్తులుగా కాయలతో ఉండే తీగ ఇది. వానలు పడిన తక్షణమే పుడమినుంచి పైకి లేచి తొందరగానే పూలు పూసి కాయలు కాసి చనిపోతది. ఆ తర్వాత మరలా

జీవం పొందేది ముందొచ్చే వానాకాలంకే. అందుకే దీన్ని ఎలాగైనా జ్ఞాపకంలో పెట్టుకొనేందుకని దీని మీద ఒక జానపద కథను కట్టి, దాన్ని చెట్టుకు కట్టేస్తారనేది కనబడుతుంది. మారడు చెపుతున్న ఈ జానపద కథ దశ నుంచి అతను చెపుతున్నదాన్లో ఏది సత్యమో ఏది అసత్యమో నాకైతే తెల్వదు. ఈ పరిస్థితి, ఈ రోజు మారడినుంచి వచ్చిన జనపదుల మాటలకు మాత్రమే కాదు, మొత్తం భారతదేశంలోని సాంప్రదాయక (నాటు) వైద్య పద్ధతికి నిరూపణ చేయలేని దుస్థితి దాపురించి ఉంది కదా!.

మాస్తి, బైర, అప్పణ్ణ, సణ్ణయ్య, మార... మొదలైనోళ్ళతో ఈ సహ్యాద్రి అడవి అంతా తిరిగి నేను తెల్సుకొన్న అనేక విషయాలలో గిడ మూలికల విషయాలు కొన్ని ఉన్నవి కదా! ఇప్పుడు అడవులు నశించి పోతున్నవి. ఈ మూలికల విషయాలు తెల్సిన నిష్ణాతులు (పల్లెజనం) ఒకరొకరుగా నిష్క్రమిస్తున్నారు ఈ లోకం నుంచి. అడవి ఉనికి మరియు దాని లోతుపాతులు, మహిమలు తెల్సిన నిష్ణాతులు.... ఈ రెండిటిలో ఏ ఒకటి లేకపోతే మరొకటి నిరుపయుక్తమవుతది. ఈ విషయాలన్ని ఎవరికైనా ముందు తరాలోళ్ళకు తెల్పితే మంచిదిగా ఉంటదని నాలో తహతహగా ఉంటుండేది. అయితే నేను పామరుల నుంచి తెల్సుకొన్న ఈ మూలికల అసాధారణ గుణాల గురించి నా వైద్య మిత్రులతో ప్రస్తావించినప్పుడు వారు కోపించి నన్ను అజ్ఞాని అని తిట్టూ తగాదా పడుతుండేవారు. నాటువైద్యులు కూడా ఈ ఆలోపతి వైద్య శిఖామణుల మీద అంతే తిరస్కార భావంతో మాట్లాడుతుండేవారు. ఈ నాటు వైద్యాన్ని చేయించుకొనే మారడిలాగ తాము చేయించుకొనే ఈ వైద్యంకు అనేక గుడ్డి నమ్మకాల్ని, ధార్మిక మనోభావాలను కలగలిపినందున అలోపతి వైద్యులు వీళ్ళను ఎగతాళి చేసేది, తిరస్కారంగా చూసేది సులభంగా ఉంటుండేది అన్ని చోట్లా. దాంతోపాటుగా నాటు మందులలోని గుణం తెల్సిన మారడిలాంటోళ్ళకు తమ మాటల్ని ఇతర వర్గం వాళ్ళు గంభీరంగా పరిగణించి గణనలోకి తీసుకోవాలనే అగత్యం వీరిలో వీసమెత్తైనా లేదు. తాము తెల్సుకొన్న పరిసరాలలో దొరికే వైద్య విజ్ఞానంను తమతోపాటుగా గోరీకి (బొందలగడ్డకు) తీసుకెళ్ళేందుకు వాళ్ళు ఎప్పుడూ తయారయ్యే ఉండేవాళ్ళు. అనేకులకు పెరటి వైద్యంలోని అద్భుత ఔషాధాల గుణం తెల్సియున్నా కావాలనే వాట్ని ఎవరికీ చెప్పకనే ఇహలోకం త్యజించేవారు. ఇప్పటికే

మనుకులాన్ని పట్టి పీడిస్తున్న అనేక మారణాంతిక రోగాలకు ఎక్కడో కొన్ని చోట్లే దొరుకుతుండే మూలికలు ఇలాగున కనుమరుగై మానవాళికి అపారనష్టం అయ్యిందని నేను దృఢంగా నమ్ముతుండేవాడ్ని. మానవుడు చంద్రమండలంకు వెళ్ళివచ్చినా మూఢ నమ్మకాల్ని, క్షుద్ర బుద్ధిని దాటేందుకు సాధ్యంగావట్లేదు.

ఆ రోజు మారడు ఆ ఔషధ తీగను చెట్టుకు కట్టేసి, అది కాలినుంచి తలవరకూ (అడినుంచి ముడివరకూ) ప్రతి యొక మానవ శరీర భాగంకు ఔషధమని పొగిడాడు తప్పితే అది నిర్ధిష్టంగా శరీరంలోని ఏ భాగంకు ఔషధని కచ్చితంగా తెల్పలేదు. ఆ జ్ఞానంను కావాలనే నాకు తెల్పలేదో లేకపోతే అతనికీ దానిగురించి సవిస్తారంగా గుర్తులేదో చెప్పేందుకు నాకైతే తెల్వదు. నేనైతే బలవంతం చేయలేదు అతడ్ని. పొద్దు పొడిస్తే చాలు... రోమాంచకమైన ఎన్నో కట్టుకతల్ని అతను చెపుతున్నందున ఔషధ తీగను చెట్టుకు కట్టేది అటుండనీయండి, దాన్ని (ఆతీగను) గొంతుకు ఉచ్చుగా వేసుకొన్నా అతడ్నెవరూ గంభీరంగా పరిగణించే స్థితిలో లేరు.

అయితే మా మారడి కథలు కట్టుకథలైనా ఎంతో గొప్పగా ఉంటుండేవి.

ఒకసారి మారడు గడ్డి తెచ్చేందుకు అడవిలోకి వెళ్ళాడట. వెదురు పొద సందులలో చేయి వేసి గడ్డి కోస్తున్నప్పుడు చేతికి కత్తి తగిలి బలమైన గాయం అయ్యింది. రక్తనాళమే తెగిపోయి రక్తం చిమ్మింది. పక్కన ఉన్నోళ్ళు భయపడి రక్తం బయటకు కారనట్లుగా ఆపేందుకని ఏదో చెట్టు ఆకు తెచ్చి గాయం మీద పెట్టి, కట్టుకొన్న ధోవతి చించి బ్యాండేజ్ కట్టారు. మారడు తన చేతికి అయిన గాయంను కదిలించకుండా జాగ్రత్తగా చేతిని పట్టుకొని సరిజేయించుకొనేందుకని వైద్యం తెల్సిన 'హులిహందలు' దొర వద్దకు వెళ్ళాడు. దొర ఔషధి బాటిల్, దూది, గాయంమీద వేసే పొడి... అన్నిట్ని రెడి చేసుకొని, మారడి గాయంకు చుట్టిన బ్యాండేజ్ గుడ్డను విప్పి, గాయంమీద మూసి పెట్టిన ఆకును తీసాడట. ఆశ్చర్యం!లోనెక్కడా గాయంలేదు! గాయం అయిన జాడాలేదు. దొరకు మారడు మీద కోపం వచ్చి, "ఏమిరా భాడకోవ్! నాతో తమాషా చేస్తున్నావా?" అంటూ రేగిపడ్డాడట! మారడు తన వంటికి, చేతికి అంటిన రక్తంను, కత్తికి అంటుకొన్న రక్తం చారికల్ని చూపించి తాను కచ్చితంగా నాటకం ఆడట్లేదని మొర పెట్టాడు. దొరకు ఆ రుజువులన్నీ చూసిన పిమ్మట నమ్మకం కలిగింది. మారడి గాయంమీద

ఉంచిన ఆకును పట్టుకొని, "ఈ ఆకు ఉండే చెట్టు ఎక్కడుందో చూపించు. నాతోట మొత్తం నీకు రాసిస్తాను సంతోషంగా అని అడిగాడు. మారడు దొరను వెంట బెట్టుకొని అడవిలోపలికి వెళ్ళాడు. పొద్దుట్నుంచి సాయంకాలం వరకూ ఆ అడవినంతా గాలించినా, ఆ ఆకును పోలే ఆకులతో ఉండే చెట్టు జాడ దొరకలేదు.

దొరకేమో మారడు కావాలనే ఆ ఔషధి చెట్టును చూపించకనే ఈ విధంగా అడవిలో తిప్పుతున్నాడని, మొత్తం తన తోటనంతా ధారాదత్తం చేస్తానని చెప్పినా మారడికి తృప్తి కావట్లేదని కోపం చేసుకొన్నాడు. తుపాకి తెచ్చి, "చూపిస్తావా లేకపోతే నిన్ను దీనితో కాల్చి చంపనా?" అని రోషంగా అన్నాడట. అప్పుడు మారడిలో జంఘాబలమే ఉడిగిపోయి భోరునే ఏడుస్తూ దొర కాళ్ళ మీదపడి తనకు కచ్చితంగా ఆ చెట్టు జాడ తెల్వదని చెప్పినదానికి కుపితుడైన దొర 'గెటౌట్' అని తిట్టి మారడ్ని పారద్రోలాడట.

"నీది భలే కట్టుకథ మారా... నీ చేతికి గాయం చేసుకొన్న ఆ వెదురు పొద చెంతనున్న అన్ని చెట్లనూ వెతికి ఉంటే, ఆ ఔషధి ఆకు చెట్టు కనబడకుండా ఉండేది సాధ్యమా?" అని అతను చెప్పిన కథను విని నేనూ తిట్టాను అతడ్ని. ఆ గిడ మూలిక ఏమిటనేది ముంగీసకూ, కెంబూత పక్షికి మాత్రమే గుర్తని, పాముల్ని అవి వేటాడేందుకు వెళ్ళినప్పుడు, ఒకవేళ పాము కాటేస్తే అవి తక్షణమే ఈ ఔషధి చెట్టు ఉండే చోటుకు వచ్చి, ఆ మహత్తరమైన ఆకును తీసుకొని ఔషధంగా వాడుకొంటవని మరొక వింతైన కథను కలగల్పి చెప్పాడు.

మారడికి కుడివైపు దవడలో దంతాలు లేవు. అన్నం, రొట్టెల్ని ఎడం వైపున ఉండే దవడలోని దంతాల్నుంచే నమిలి, మింగేదుంది. వయసైన అతనికి దంతాలు పోయింది సహజమైనా ఎందుకు ఒక వైపునుంచే దంతాలు ఊడిపోయినవనేది నాకు కుతుహలంగా ఉంటుండేది. ఒకరోజు మారడ్ని "ఎందుకు నీకు ఒకవైపునే దంతాలు ఊడినవి" అని అడిగాను. నానుంచి ప్రశ్న విన్న తక్షణమే ఒక సారస్యమైన కథ చెప్పాడు.

ఆ దంతాలు ఊడిపోయింది వయస్సైనందున కాదని, ఎన్నో సంవత్సరాల క్రితమే అవి ఊడిపోయినవని చెప్పాడు.

కుందేళ్ళకని ఒకసారి మారడు అడవి లోపల వల వేసాడు. ఆ వలలో రాత్రివేళ కుందేళ్ళు చిక్కుకోగా ఇతనికన్నా ముందే ఎవరైనా వాట్ని చూస్తే వలనుంచి విడిపించుకొని దొంగతనంగా వాట్ని తీసుకెళ్తారేమోనని మారడు ప్రభాత కాలంలోనే మేల్కొని అడవిలోకి వెళ్ళాడు. వలలో ఏ ఒక్క కుందేలు పడలేదు. అక్కడ చిన్న వాగు ఒకటి పారుతుంది. వాగువద్దే మారడు ముఖం కడుక్కొని ఇంటికి రిక్తహస్తాలతో తిరిగి వెళ్దాం అని వాగు ఒడ్డునున్న చెట్టునుంచి చిన్న ముఖం పుల్ల ఒకదాన్ని విరిచి, దాన్ని నమిలి బ్రష్‌లాగ చేసుకొని కుడివైపు నుంచి పళ్ళు రుద్దేందుకు మొదలు పెట్టాడు. రెండుసార్లు రుద్దుకొనేటప్పటికి నోరంతా ఒకరీతిగా అయ్యిందట. ఈ పుల్ల ఎందుకో సరిగా లేదని భావించుకొంటూ దాన్ని అటెటో విసిరి, మరొక పుల్లను తీసుకొందామనే ముందు నోరు పుక్కలిద్దామని వాగు నీళ్ళలో నోరును కడుక్కొని పుక్కళించాడంతే! ఆ మొదటి పుల్ల నుంచి ఒకవైపు రుద్దుకొన్న దంతాలు ఒకటొకటిగా జారి ఊడినవట!

"దేవుడి దయనుంచి అప్పుడు ఆ చెడు పుల్లతో రెండో దవడలో ఉన్న పళ్ళను రుద్దుకోలేదు సార్! అందుచేతే బతికిపోయాను! లేకపోతే అన్నం తినేందుకూ నా నోట్లో ఒక దంతమూ ఉండేది లేదు సార్" అన్నాడు మారడు.

"ఓయ్ మారా, అబద్దాలు చెప్పినా నమ్మేంతగా అబద్దాలు ఉండాలికదయ్యా" అని అతను చెప్పిన కథను విన్న మీదట గదిరాను నేను.

"అబద్దాల్ని ఎందుకు చెప్పేది ఉంటదయ్యా నాకు? అంతగా పళ్ళు ఒకవైపునే ఊడినవి మీకు కనబడట్లేదా?"

"అలాగైతే ఆ చెట్టు ఏదో చూపిస్తావా?"

"మన సహ్యాద్రి కనుమలలోని ఈ ఘోరారణ్యంలో ఎన్నో రకాల చెట్లు ఉన్నవి కదా సార్! వాట్లో ఏ చెట్టు అది అని మీకు చూపించగలను అయ్యా? ఒక పని చేయండి. ఈ అడవిలో ఉన్న అన్ని చెట్ల పుల్లల్ని విరిచి పరీక్షకని రుద్దుకొని చూడండి. ఆ చెట్టు ఏదని అప్పుడు కనుక్కోవచ్చు" అని అన్నాడతను.

"నేనెందుకు నువ్వు చెప్పినట్లు కనుగొనేది ఉంటది? ఇప్పుడు కట్టుకథను అల్లినోడివి నువ్వే కదా! నువ్వే మరోమారు రుద్దుకొని దాన్ని కనుక్కో"

"అయ్యయ్యో... పెద్ద పరీక్షే పెట్టున్నారు మీరు! ఇక్కడ ఈ దట్టడవిలో ఎన్నో రకాల చెట్లు ఉన్నవికదా! వాటి పుల్లల్ని దంతాలమీద రుద్దుకొని, ఆ చెట్టేదో కనుక్కొనే ఆయుష్య నాలో ఉందా?"

"ఔను మారా, అదేదో మరోజాతి పుల్లను రుద్దుకొని దంతావధానం ముగిస్తే అకస్మాత్‌గా నీ అదృష్టంకు దంతాలు మళ్ళా కొత్తవి పుట్టేలాగ చేసే వనమూలిక ఏదైనా దొరకొచ్చేమో చూడు"

"ఏ మంచి చెట్టుపుల్ల చేతికి దొరికిందని ఎలా చెప్పగలను సార్? ఒకవేళ అకస్మాత్ నా గ్రహచారం చెడి ప్రాణం తీసే చెట్టు పుల్ల చేతికి చిక్కితే అప్పుడు నా గతేంటి?"

"అలాగైతే నాకెందుకు చెప్పావు... నన్నే కనుక్కోమని?"

"మీరేకదాసార్... నేను చెప్పిందంతా అబద్ధమేనని అన్నారు కదా? నేను చెప్పినదాంట్లో మీకు నమ్మకమే లేదు"

"ఓయ్ మారా అకస్మాత్‌గా నిన్ను యువకుడిగా మార్చే ఔషధ మూలిక దొరికితే ఏమి చేస్తావు?"

"అది దొరికినా నాకు వద్దుసార్! యువకుడిగా మారితే మరోసారి వివాహం చేసుకొనేదుంటది. అది అటుండనీయండి. అటువంటి మహిమాన్వితమైన మూలిక మన సహ్యాద్రి అడవిలో లేదని అనుకోండి" అని నూతనంగా మరొక కట్టుకథను తన అంబులపొదినుంచి బయటకు తీసాడు.

వెనకెప్పుడో మారడు మరియు అతని దోస్త్ చేరి అడవి గొర్రెకని వలవేసి పట్టుకొన్నారట. దాన్ని ఇద్దరూ చెరి సగం చేసుకొనేదుంది. వాగు వద్దకు వెళ్ళి, అక్కడదాని చర్మం వల్చి మాంసంను ముక్కలు ముక్కలుగా చేసుకొని పంచుకొన్నారట. ఆ ఇద్దరూ తమ తమ పాలును ఒక పెద్ద ఆకులో చుట్టుకొని ఇళ్ళకు చేరారట.

ఇంట్లో మసాలా నూరి, పాత్ర రెడి చేసి, నీళ్ళు సలసల కాగేందుకు పొయ్యిమీద పెట్టి, మాంసంను పాత్రలో వేసేందుకు ఆకు విప్పారట. ఆశ్చర్యం! ఆ ఆకులో ఒక

సజీవమైన గొ(్రెపిల్ల పడుకొని ఉందట. మారడ్ని చూసిన ఆ గొ(్రె పిల్ల తక్షణమే చెంగునేలేచి తలుపు సందునుంచి దూకి పారిపోయిందట! మారడేమో ఆ గొ(్రె పిల్లను పట్టుకొనే ఆత్రంలో ఉండగా మారడి పెళ్ళాం ఆ ఆకును తీసుకొని కాలుతున్న పొయ్యిలో పడేసిందట.

ఇప్పుడు ఇక మారడు చెప్పిన ఈ కథకు మాత్రం నేను వివరణను గాని, ప్రశ్నల్ని గాని అడిగేందుకు వెళ్ళలేదు. ఎందుకంటే ఇది ఈ కథ మారడి కల్పనలోని అతిరేకంలోని పరమావధిగా ఉంది. ఇంతటి ప్రచండ మూలికకని తన ఆస్తి అంతా రాసిస్తానని 'హులిహందలు' దొర అడిగేది ఉంటే అందులో ఆశ్చర్య పోయేదేమి ఉండదుకదా!.

ఇప్పుడు నేను 'హుయిసోళలు'లో ఉండే ఆ తోట (ఎస్టేట్) అమ్మింది, మారడు చనిపోయింది ఎన్నో సంవత్సరాలు అయినవి కదా! మారడి మాటల్ని కట్టుకథలగా కొట్టి పడేద్దామనుకొంటే కుదిరేది లేదు. చివరికి ఏదో ఒక శాతం మా అంతః కరణంను పెనవేసుకొనేందుకు ఆ కథలు మాలో ఉండిపోతవి. అబద్దం చెప్పనీ, నిజం చెప్పనీ, మమ్మల్ని నమ్మించనీ, నమ్మించకపోనీ... మాలోని తర్క బుద్ధిని మరింతగా పెంపొంధించుకొనేందుకైనా మారడి కట్టుకథలు మా మస్తిష్కంలో నిలబడిపోవాల్సే ఉందిలే.

ఎన్నో సంవత్సరాల తర్వాత మారడు చెప్పిన ఔషధ తీగ సంగతి మరలా పైకి లేచి వచ్చి మా ముందు నిల్చింది. ఈ సారి అప్పణ్ణ ఆ తీగను అడవిలో చెట్టుకు కట్టున్నాడు. ఇది ఏరోగ నివారణకు ఔషధంగా ఉపయోగపడుతదని అడిగాను. దాని మహిమ చనిపోయిన మారడిలాగ అతనికి సరిగా తెల్వదు. దీని ఆకుల్ని పాలలో పిండితే ఆ పాలు పెరుగులాగ తక్షణమే గట్టిపడుతదని చెప్పాడు. బహుశః ఈ ఆకులో పులుపు పదార్థం ఉండొచ్చు. దీని పసరును పిండినప్పుడు పాలు పెరుగుగా తక్షణం రూపాంతరం చెందుతున్నందున దీన్ని ఔషధ తీగగా భావించుకొంటున్నారేమోనని భావించి, "దీన్ని పిండినప్పుడు చూసావా నువ్వు?" అని అడిగాను. "అలాగని చెప్పుకొంటారండి. ఆ ప్రయోగం చేసి చూచేందుకు పాలను నేనెక్కడ్నుంచి తెచ్చేది సార్?" అని బదులిచ్చాడు అప్పణ్ణ.

ఈ ఔషధ తీగ చుట్టూ అలుముకొన్న కట్టుకథకు ఏదైనా ఆధారాలు ఉన్నవా? అలాగైతే ఈ ఔషధ తీగ ఆకుల పసరును పాలలో పిండి చూద్దాం అని ఆలోచించాను. వాళ్ళను వీళ్ళను అనవసరంగా మూర్ఖులన్నట్లుగా విమర్శించే బదులు నేనే ప్రయోగం ద్వారా దాని పసరును ఎందుకు పరీక్షించి చూడరాదు అని భావించుకొన్నాను.

ఈ ఔషధ తీగలోని కొన్ని ఆకుల్ని పీకి, స్నేహితుడైన పెథాలజిస్ట్ చంద్రు వద్దకు ఆ ఆకుల్ని తీసుకెళ్ళి, ఆ ఆకులోని పురాణమంతా చెప్పాను. దీని మీద ఇప్పుడు ఒక ప్రయోగం చేసి చూద్దామని నిర్ణయం చేసి, ఒక లీటర్ పాలు పాడైపోయినా పర్వాలేదని పాలు తెప్పించుకొన్నాం. మిగిలిన సైంటిఫిక్ మిత్రులు కట్టుకథల్ని నమ్మి పాలను పాడు చేస్తున్నారని మామీద నవ్వుకొంటున్నారు. మేము మూర్ఖులుగా అయ్యేందుకు తయారైనప్పుడు ఎవరు ఏ విధంగా నవ్వితే మాకేంటి? ఆకుల్ని పాలను మిక్సిలో వేసి తిప్పి నీళ్ళు పోసాం. ఆతర్వాత ఆ మిశ్రమంను ఒక పాత్రలోపోసి పాలు విరుగుతవో లేకపోతే గట్టిగా గడ్డ పెరుగుగా అవుతదోనని చూస్తూ కూర్చున్నాం. ఒకట్రెండు నిమిషాలు గడిచినవి. పాలు విరగనూ లేదు, గట్టిగా పెరుగుగానూ మారలేదు. మిక్సినుంచి పాత్రలో పోసినప్పుడు ఎలాగుందో అలాగే ఉంది. సరేలే ఒక లీటరు పాలు వ్యర్థమైనవని తీర్మానించుకొని చేతినుంచి ఆ మిశ్రమాన్ని ముట్టిచూసాను. పాలు రబ్బర్‌లాగ గట్టిగా ఉంది! పాత్రను బోర్లించగా పాత్ర ఆకారంలో ఉన్న ఒక గట్టి ముద్ద బయటకు వచ్చింది.

ఓహో! ఈ ఔషధ తీగకు నిజంగానే ఏదో మహత్వమైన ఔషధ గుణం ఉండొచ్చనే అనుమానం నాలో ప్రారంభమైంది.

ఇదంతా ఈ ప్రయోగం మానుంచి జరిగినా ఇది దేనికి ఔషధంగా ఉపయోగపడుతదనేది మాత్రం నాకు తెల్వలేదు. తెల్సేది, తెల్వకపోయేది అటుండనీయండి... దీన్ని చూసినోళ్ళందరూ మారడిలాగనే 'పడుండు అక్కడ' అని ఆ తీగను సమీపాన ఉన్న ఏదో చెట్టుకు బిగువుగా కట్టేస్తున్నారు తప్పితే ఇటువంటి జబ్బుకు ఇది నివారణ ఔషధంగా భావించి దాని ముడి విప్పి వాడేందుకు తీసుకెళ్ళే వాళ్ళను నేను చూడలేదు ఇప్పటివరకూ.

ఇలాగున కాలం గడుస్తుండగా, మారడు చెప్పిన ఆ ఔషధ తీగ నా జ్ఞాపకం నుంచి కనుమరుగైంది.

పూర్వం నా వద్ద నౌకరి చేసిన కృష్ణ మొన్న నా వద్దకు వచ్చాడు. ఆరోగ్యంగా గట్టిపిండంగా ఉండే ఇతను ఇప్పుడు ఎదురు రొప్పులు పెట్టూ ముడుచుకొని నీరసంగా నిలబడియున్నాడు. కాఫి ఎస్టేట్‌లో పని చేసేదాన్ని వదిలి, ఎక్కడో దూరానున్న జిల్లా కేంద్రంలో రిక్షా తొక్కేదాన్ని చేస్తున్నాడట. అప్పట్నుంచి అతనికి మలవిసర్జనతో పాటుగా గుదం నుంచి రక్తం కారేది మొదలైందట. ఇప్పుడు దాని పీడ విపరీతమై ఆయాసం, దగ్గు, ఉబ్బసం... అన్నీ ఒకదానికొకటి పెనవేసుకొని ప్రారంభమైనవని చెప్పాడు. అతని వివరణ నుంచి అతని జబ్బు మూల వ్యాధి కావొచ్చని అన్పించింది నాకు. నాకు తెల్సినట్లుగా అలోపతిలో శస్త్ర చికిత్సే దానికి పరిహారం. కూలినాలి చేసి బతుకుతున్న కృష్ణలోని కష్టంచూసిన నాకు దుఃఖమైంది. ఇంట్లో భార్య, చిన్న చిన్న పసిపిల్లలు, ఎన్నో రోజులు ఆసుపత్రిలో చేరి శస్త్ర చికిత్స చేయించుకొనేది అతనికి ఎలాగబ్బా అని యోచించాను.

కృష్ణ నాదగ్గర కొద్దిగా డబ్బు చేబదులుగా తీసుకొని ఆస్పత్రికి వెళ్ళాడు. అక్కడుండే ప్రభుత్వ డాక్టరు నేను అనుకొన్నట్లే శస్త్ర చికిత్సే మార్గమని తెల్పారు. కృష్ణ భయపడ్డాడు.

కృష్ణకు ఒక మళెయాళ స్వామి తెల్సు. వెనకెప్పుడో కృష్ణకు వంటిమీద పొక్కులు పొక్కులుగా చిన చిన్న కురుపులు వళ్ళంతా వ్యాపించినప్పుడు, ఏదో చెట్టు బెరడు ఇచ్చి, దాన్ని మెత్తగా నూరి బాతుగుడ్డు సొనతో మిశ్రమంగా చేసి పదిరోజులు తినమని ఆ మళయాళస్వామి చెప్పాడు. ఆ స్వామి బోధపరిచినట్లుగానే కృష్ణ ఆ మందు తిన్నమీదట ఒకే ఒక కురుపూ మచ్చుకైనా వంటిమీద లేకుండా మాయమైనవి. కృష్ణ ఈసారి కూడా ఆ స్వామి దగ్గరకు వెళ్ళాడు. ఆ స్వామి ఇప్పుడు ఎంతో వయస్సైనోడిగా కాలధర్మం నుంచి మారి ఉన్నాడు. "నీకు ఔషధ తీగను వెతికి ఇచ్చేందుకు ఇప్పుడు నాలో శక్తి లేదు. నేను ఆ తీగకుండే లక్షణాల్ని వివరిస్తాను. ఆ తీగను వెతికి, దాన్ని గడ్డను నూరి, ముద్దగా చేసుకొని, విరిగిన పాలలో కల్పి ఐదు రోజులు త్రాగు" అని చెప్పాడట.

నేను కృష్ణను మళ్ళా చూసినప్పుడు అడవిలోపల ఆ తీగ మూలంకని వెతుకుతున్నాడు. దాని వివరణ విన్నప్పుడు అది మారడు మరియు అప్పణ్ణ ఆ ఔషధి తీగను తమ నుంచి పారిపోరాదన్నట్లుగా చెట్టుకు కట్టిన మూలిక తీగే అదని నాకు స్పష్టమైంది. కృష్ణకు ఆ ఔషధి తీగను చూపించి దాని మొదల్ని తవ్వాము. ఎంతో లోతులో దాని గడ్డ ఉంది.

దాన్ని నూరి, దాని రసాన్ని బాతుగుడ్డు సొనతో కలగల్పి విరిగిన పాలలో కల్పి తాగగా ఒకే ఒక రాత్రికి కృష్ణలోని మూల వ్యాధి నయమైంది. ఐదు రోజులు దాన్ని స్వామి చెప్పినట్లు తాగగా పూర్తిగా నయమైంది మూలవ్యాధి! కృష్ణ రిక్షా తొక్కేపని మానుకొన్నాడు.

దీనికన్నా మరొక తమాషా సంగతి ఏమిటంటే కృష్ణ ఆ ఔషధతీగలోని గడ్డను తవ్వితీసినప్పుడు, ఆగడ్డలోని ఒక ముక్క విరిగిపడగా ఏమి రుచి ఆ గడ్డలో ఉందని తెల్సుకొనేందుకు ఆ ముక్క భాగంను నేను నోట్లో వేసుకొని నమిలి తిన్నాను. కొంచం చిరు చేదుగా ఉంది అంతే!

నా కుడి కాలులోని పాదం ఎన్నో నెలలనుంచి బాధపెట్టుంది. ఎక్కువ దూరంకు నడిస్తే చాలు, కుంటుతూ నడవాల్సి వచ్చేది. దీనితో పాటుగా ఇప్పుడు నా కాలిపిక్కకున్న ఎముక పక్క నిమ్మకాయ పరిమాణంలో ఒక గడ్డ పుట్టింది. డాక్టరేమో దాన్ని శస్త్ర చికిత్స చేసి తీయాల్సి ఉంటదని చెప్పారు. కృష్ణ దగ్గర ఆ ఔషధ తీగ గడ్డలోని ఒక చిన్న ముక్క తిన్న మీదట రెండు రోజులకే చూడగా నా కాలి వెనుక పుట్టిన గడ్డ ఇంతకు మునుపు ఎక్కడుండేదో తెల్వనట్లుగా మటుమాయమైంది కదా!

ఇది ఔషధ తీగలోని ప్రభావం అని నేను ఎలాగున సైంటిఫిక్‌గా కచ్చితంగా చెప్పగలను? కేవలం ఆకస్మికంగా ఉన్నా ఉండొచ్చు. లేకపోతే మూలికలోని ఔషధ గుణ ప్రభావమనే అనుకొన్నా మనుషుల దేహంలో పుట్టే గడ్డలలో అనేక రకాలు ఉంటవి. వీట్లో కొన్ని గడ్డలమీద మాత్రం ఈ ఔషధ తీగ ప్రభావం పడిందేమో! వీటన్నిటిన్నీ ఎవరు సంశోధిస్తారు? మారడు లాంటోడు సంశోధించి ఫలితం కనుగొంటే అతనికి వచ్చేది ఏమి లేదు సమాజం తరుపున. మళయాళ స్వామి సైతం తన వృద్ధాప్యంలోని నిత్రాణ స్థితినుంచి కృష్ణకు ఆ తీగ గురించి వివరించి చెప్పి దాని

వేరు మూలంలో ఉండే గడ్డను తవ్వి తీసుకో అని చెప్పాడు తప్పితే, ఒకవేళ ఆరోగ్యం బాగుంటే ఆ స్వామే గోప్యంగా వెళ్ళి ఆ గడ్డను తవ్వి తెచ్చి ఇచ్చేవాడు కదా! ఈ నాటు వైద్యులలోని బలమైన ఒక నమ్మకం ఏమిటంటే ఔషధి ఏమిటనేది తెల్పితే ఔషధంలోని గుణం బలహీనమై నష్టపడుతదనే భావన వాళ్ళలో బలంగా పాతుకుపోయి ఉంటది. ఈ పిచ్చి నమ్మకం దశనుంచే ఇప్పుడు భారతదేశంలోని నాటు వైద్య పద్దతిలోని మహిమంతా నష్టపడిపోతుంది కదా!

★ ★ ★

కన్నడ భాషలో దివంగత పూర్ణచంద్ర తేజస్విగారు రచించిన "మూలికె బళ్ళియ సుత్తు" అనే కథను యథాతథరూపంగా తెలుగులోకి అనువదించాను.

శాఖమూరు రామగోపాల్. 16-08-2010.

# సైతాన్ నుంచి ప్యారడికైన కష్టం



తొండను చూస్తే ప్యారడికి సహించదు. మేము అడవిలో తిరుగుతుంటే చెట్లమీదో బండలు రాళ్ళమీదో అది తలను పైకో క్రిందకో చేస్తూ కూర్చొనేదాన్ని చూస్తే చాలు, "నస్లీ హరాం... దొంగలంజాకొడుకా" అని తిట్టూ రాయి పట్టుకొని దాని వెంటపడేవాడు. దాగేందుకు చెట్లపొదలు, పెద్ద పెద్ద వృక్షాలు సమృద్ధిగా ఉన్న ఈ సహ్యాద్రి అడవిలో చురుకైన ఈ తొండలు అతని చేతికి దొరికిందాన్ని నేను ఒక్కసారైనా చూడలేదు. ప్యారడు ఎంత చురుకుగా ప్రయత్నించినా అవి సందుగొందులలోకి దూసుకెళ్ళి చివరికి ఎత్తైన చెట్టును ఎక్కో లేకపోతే బండల నడుమ ఉండే నెర్రెల లోనో దాక్కొని తప్పించుకు పోయేవి.

ప్యారడుతో కల్సి మా టామి కూడా ఈ తొండల్ని బుద్ధ శత్రువులన్నట్లుగా భావించి వాటి వెంటపడి తరుముతుండేది.

విషప్రాణి సైతం కాని, కరిచేందుకు పళ్ళు సైతంలేని దీనిమీద ఎందుకు ఇతనిలో ఇంత పెద్దగా కోపం ఉందనేది యోచించిన నేను అతడ్నే, "ఎందుకు ప్యార... నీకు వాటి మీద అంత పెద్దగా అసహ్యం?" అని అడిగాను. అతను దాని మీద ఒక పురాణంనే చెప్పాడు. అది జరిగింది ఇక్కడ కాదు. ఎంతోకాలం వెనక అరేబియా దేశంలో.

మహమ్మదీయులకు ఆరాధ్య పురుషుడైన మహమ్మద్ ప్రవక్త శత్రు సైనికుల దాడి నుంచి తప్పించుకొని పవిత్ర మక్కా నగరం నుంచి మదీనాకో లేకపోతే మదీనానుంచి మక్కా నగరంకో పారిపోతున్నాడట. అప్పుడు శత్రు సైనికులు వారి వెంట పడ్డారు. మహమ్మద్ ప్రవక్త ఆ దుష్టులనుంచి తప్పించుకొనేందుకని అరేబియా పర్వతంలో ఉన్న ఏదో ఒక గుహలోపల దాగి కొంచంసేపు సేద తీరారట. శత్రు సైనికులు ప్రవక్త జాడ కనిపెట్టి ఆ గుహ వద్దకు చేరారు. అప్పుడు ఆ గుహ ముఖ ద్వారంలో ఉన్న ఒక పెద్దరాయి మీద కూర్చున్న తొండ, శత్రు సైనికుల వైపు చూసి తల పైకి కిందకూ ఆడిస్తూ మహమ్మద్ ప్రవక్త ఇక్కడే దాగియున్నాడని ఆ దుష్టులకు సూచించిందట. అప్పుడు ఆ శత్రు సైనికులు కత్తులు ఝుళిపిస్తూ ప్రవక్తను చంపేందుకు వెతకసాగారు. అప్పుడు ఒక సాలెపురుగు తొందరతొందరగా ప్రవక్త దాగియున్న గుహకు నోటినుంచి అడ్డంగా సాలెగూడును నేసింది. సైనికులు గుహ ముఖద్వారంకు చేరి చూసినప్పుడు ఆ ద్వారంకు అడ్డంగా సాలెగూడు భద్రంగా ఉన్నందున అక్కడెవరూ గుహలోకి వెళ్ళలేదని భావించి వెనుదిరిగి వెళ్ళారట. అలాగున సాలెపురుగు సకాలంలో చేసిన సహాయం నుంచి ప్రవక్త జీవం నిలిచింది. అందుచేత ప్యారడు సాలెపురుగుల్ని పూజిస్తూ, తొండల్ని "నస్లీ హరాం" అని దూషిస్తుండేవాడు. తనధర్మంలోని ఏ కట్టుబాట్లును సరిగా ఆచరించే పద్ధతులు తెల్వని ప్యారడు ఇదొక విషయంలో మాత్రం కచ్చితంగా మతావలంభియై తొండల్ని వేటాడేవాడు.

ఇటువంటివి కేవలం మహమ్మదీయ మతస్తులలో మాత్రమే ఉండేది లేదు. భారతదేశంలోని అన్ని ధర్మాల పురాణ సాహిత్యాలలో ఇవి విపులంగానే ఉన్నవి.

కైలాసంలో శివుడు గణపతికి ఏనుగు తలను జోడించాడని, ఆ ఏనుగు తలతో ఉండే గజానుడికి మూషిక వాహనం ఉందనే కథ ఉంది కదా! ఈ కథలు మనుషుల కదలికల్ని నియంత్రిస్తుంటవి. ఇంట్లో తిరుగాడుతుండే ఎలుకల్ని చంపాలనుకొనే వాళ్ళు వాట్ని బయటకు మాత్రం పారద్రోలుతారు తప్పితే చంపేది లేదు. ఎందుకంటే అవి విఘ్నేశుడికి వాహనమైనందున దానిమీద కూర్చుని సవారి చేసే విఘ్నేశ్వరుడికి హాని అవుతదని భావిస్తారు. శివుడు పాముల్ని మఫ్లర్ రీతిగా మెడకు చుట్టుకొంటున్నందున ఇప్పుడూ ఎంతో మంది నాగుపాముల్ని చంపేది లేదు.

"ఉడతాభక్తి" అనే మాటను మనం వినియుండలేదా? శ్రీరాముడు లంకకు వారధి నిర్మించేటప్పుడు ఉడత సహాయ పడిందట. తన తోక కుచ్చును అడుసుమట్టిలో ముంచి, దాన్ని తీసుకొచ్చి వానరులు కట్టున్న వారధిమీద దాన్ని పులిమి బ్రష్‌లాగ, నాజూకుగా రుద్దేదట. అది పూసిన ఆ అడుసుమట్టినుంచి ఆ వారధికి ఎంతగా ఉపయోగమైంది అనేది వేరే విషయం. అయితే ఆ చిన్న ప్రాణి చేసిన భక్తి సేవకు మెచ్చిన శ్రీరాముడు ఆ ఉడతను చేతిలో తీసుకొని ప్రీతిగా దాని వెన్ను నిమిరాడు. శ్రీరాముడు చేతివేళ్ళు సవరిన గురుతునుంచే ఉడతలలో వెన్నుమీద ఉండే మూడు పట్టీలుగా ఉన్నవట. ఈ కథ ఎంతగా జనప్రియమైందంటే ఏదైనా గొప్ప పనికి మనం సహాయ హస్తం చాపి చేసే చిన్నా చితకా సేవను ఉడతాభక్తిగా చెప్పుకొంటాం కదా! శ్రీరాముడి కథ పూర్తిగా తెల్వనోళ్ళు సైతం తమతమ దైనందిన కార్యక్రమాలలో ఉడతాభక్తి అనే వ్యవహారిక మాటను యథేచ్ఛంగా ఉపయోగిస్తుంటారు.

ఇదే రీతిగా మరొక వ్యవహారిక మాటైన శివపూజలో కరడి (ఎలుగుబంటు) వదిలారు అనేది వాడుకలో ఉందికదా! నేనైతే శివపూజ జరిగేటప్పుడు కరడి (ఎలుగుబంటు)ని ఎవరు ఎందుకు తీసుకొచ్చి వదిలారు అనేది తెల్వక ఈ వ్యవహారిక మాటకు మూలం ఏదో పౌరాణిక కథ ఒకటి ఉండొచ్చేమోనని భావించి ఎంతోమంది వీరశైవుల్ని ఆ మాట (కథ) మీద అడిగేవాడ్ని. అయితే నేనడిగిన ఈ వ్యవహారిక మాట ఎందుకు జనం మధ్యలో ఉందనేది వారెవరికీ తెల్వదు కదా! పూజ చేస్తున్నప్పుడు ఏదో కరడి (ఎలుగుబంటు) దూసుకొచ్చి చేస్తున్న శివపూజను పాడు చేసియుండొచ్చు. అదే కాలక్రమేణా వ్యవహారిక మాటగా చలామణి అయ్యుండొచ్చు అని కొంతమంది చెప్పారు. అయితే కరడే (ఎలుగుబంటే) ఎందుకు వచ్చేదుంటది?

పులి, చిరత, కోతి... ఇవేవైనా దూసుకొని వచ్చినా శివపూజ పాడైపోతది కదా! నేను ఎం.ఎ. డిగ్రి ముగించేవరకూ శివపూజకు అడవి జంతువైన కరడికి (ఎలుగుబంటుకు) ఏ రీతిలోని సంబంధం అనేది గుర్తుకాలేదు. ఆ తర్వాత ఒక రోజు మా నాయనకు (కు. వెం. పుకు) ప్రియ శిష్యుడు మరియు నాకు సాహిత్య సంస్కారంలో మార్గదర్శకుడైన శ్రీ శివరుద్రప్పగార్ని (శివరుద్రప్పగారు కర్నాటక రాష్ట్రంకు ఆస్థానకవిగా ఉన్నారిప్పుడు) అడిగినప్పుడు ఈ వ్యవహారిక మాటలోని నిజ స్వరూపం తెల్సి వచ్చింది. శివపూజ సమయంలో వదిలేసింది కరడి (ఎలుగుబంటు) కాదు కరడిగ (డమరుకం) అని వివరించారు.

శివపూజకు కావాల్సిన ఒక ముఖ్య పరికరం ఏదంటే అది కరడిగ (ఢమరుకం) కదా! దాన్నే మరిచిపోయి వదిలేసి వస్తే శివపూజ జరిగేది ఎలా? అయితే శివపూజలోని ఈ తాంత్రిక జ్ఞానం తెల్వని జనం ఈ వ్యవహారిక మాటకు కొద్దిగా అపభ్రంశం చేసి కరడిగ (డమరుకం)ను కరడి (ఎలుగబంటు)గా చేసారు. కరడిగను (ఢమరుకంను) మరచివచ్చినా ఎలాగోలా శివపూజను నెరవేర్చవచ్చేమో! అయితే అడవిలో తిరుగుతుండే కరడి (ఎలుగుబంటును)ని పూజ నడుమ ఉంచుకొంటే భక్తులు, పూజారులు ఆ వేదిక వద్ద ఉండగలరా? సాక్షాత్ పరమేశ్వరుడే పూజ చేయించుకొనేందుకు అక్కడున్నా, ఎలుగుబంటును చూస్తే భక్తులతో కల్సి పారిపోయే దాన్లో అనుమానమే ఉండదు.

ఈ వ్యవహారిక మాటలోని మూల ఉద్దేశాన్ని ఈ అపభ్రంశ మాట వలన ఇంకా ఎంతో యశస్విగా అది వాడుకలో ఉన్నందున శివపూజ సమయంలో కరడి (ఎలుగుబంటు) తల మీద శివపూజను పాడుచేసిన అపకీర్తి మూట గట్టుకొని ఉండిపోయింది. ఎంతోమంది లింగాయితులు (కర్నాటకలో ప్రబలమైన కులం) ఈ రోజుకూ కరడి (ఎలుగుబంటు)ని కోపం నుంచే చూస్తుంటారు.

ఈ విధంగా అనేక సందర్భాలలో ప్రాణులు మరియు వృక్షాలకు సంబంధించిన ఎన్నో కథలు నిధానంగా జనం మనస్సులనుంచి కనుమరుగై వెళ్ళిపోయినా, అప్పుడప్పుడు వాటిమీద ప్రీతినుంచో కోపంనుంచో నిష్కారణంగా జనం మనసులలో ఉండే ఉండిపోతవి. గుడ్లగూబను యూరోపియన్ సాహిత్యంలో అడవి జీవులన్నిట్లో

జ్ఞానవృద్ధుడన్నట్లుగా వర్ణిస్తుంటే మన భారతీయులు దాన్ని అపశకునంగా చావుకు సంకేతమని చెప్పుకొంటారు. గుడ్లగూబ ఎవరి ఇంటిపైన కూర్చుని కూతబెట్టే, ఆ దుఃశకున పరిహారంకని ఆ ఇంటి యజమాని ఎన్నో హోమాల్ని, హవనాల్ని, సత్యనారాయణస్వామి పూజను దోష నివారణకని చేయాల్సి వస్తదని మన పంచాంగ పండితులు చెపుతారు కదా!

ఇదే రీతిలో పిల్లి సైతం ఉంటదండి. పిల్లి ముఖం చూస్తే అపశకునమని, నక్క ముఖం చూస్తే అదృష్ట లక్ష్మిదేవత వరిస్తదని జనం నమ్ముకొంటారు. ఏదైనా శుభకార్యంకు వెళ్ళేటప్పుడు పిల్లి ఎదురైతే ఇక ముగిసేపోతది! ఆ శుభకార్యాలు ఆగిపోతవి. ఈ రీతిగా అపకీర్తి పిల్లికి తగులుకొంది అనే దానికి మనకు సరైన కారణాలు తెల్వవు! ఆ పిల్లి ఎప్పుడు ఎక్కడ మన పురాణ పురుషులకు ద్రోహం చేసిందో మనకు తెల్వదు కదా! ఇప్పుడు జనం మనస్సులలో ఈ కథ పూర్తిగా మాసిపోయినా పిల్లి తలకు కట్టిన ఈ కళంకం మాత్రం శాశ్వతంగా నిలబడి పోయిందిలే!

కొన్నిసార్లు ఏదో కథలోని దృష్టాంతం (మూలం) నిరూపణగా లేకపోయినా కొన్ని జంతువుల నడవడిక దశనుంచి వాటిమీద దురభిప్రాయం ఉండేదాన్ని మనం గమనించొచ్చు.

గుడ్లగూబలు మరియు ఉడుంలు సాధారణంగా పాడుబడ్డ దేవాలయాలలోనో, శిథిలమైన కోటలలోనో నివసిస్తుంటవి. ఆ ప్రాణులు రాత్రివేళ ఆహారాన్వేషణ చేసే నిశాచర జీవులుగా ఉంటవి. వేడి రక్తం కలిగిన ప్రాణులనుంచి బయటపడే ఇన్‌ఫ్రా రెడ్ వికిరణాల్ని తమ కళ్ళనుంచి గ్రహించుకొనే సూక్ష్మ బుద్ధి వీటిలో ఉంటవి. అందుచేత ఇవి రాత్రివేళలలో చక్కగా చూడగలవు మరియు వేటాడగలవు. రాత్రంతా మేల్కొని తమ కడుపును నింపుకోవాల్సి ఉన్న ఇవి పగటి వేళలో ఏకాంతంగా కూర్చుని నిద్రపోతవి. గలాటా, గందరగోళం, సప్పుళ్ళు లేని ఏకాంత స్థలాలంటే పాడుపడ్డ దేవాలయాలు, పడిపోయే శిథిలకట్టడాలే వీటికి ఆవాసంగా ఉంటవి. అందుచేతనే గుడ్లగూబలు, ఉడుంలు, గబ్బిలాలు సాధారణంగా అక్కడికి వెళ్ళి చేరుకొంటవి.

ఈ ప్రాణులలోని ఈ అభ్యాసం వలన జనం హృదయాలలో ఇవి చెడుకు, నాశనంకు సంకేతాలుగా మారినవి. ఇవేమైనా జనవసతి ఉన్నచోటుకు వస్తే అపశకునమని తిట్తారు. తమ ఇల్లు మరియు ఊరు మున్ముందు నాశనమై పాడుబడి పోతదని సూచించేదానికి ఇవి ఇక్కడికి వచ్చినవని భావించుకొంటారు. వాస్తవంగా పాడుబడ్డ తర్వాతే ఈ ప్రాణులు ఆ కట్టడాలకు వెళ్ళి చేరుకొంటవి తప్పితే అవి అక్కడకు వచ్చి చేరినందున ఏ దేవాలయంగాని, కోటగాని పాడుబడేదిలేదు.

నాకైతే ఈ శకునాలలో నమ్మకం లేదని ప్రత్యేకంగా స్పష్టం చేసే అవసరం ఏమీ లేదు. ఎందుకంటే ప్రాణులకూ, వృక్షాలకూ మనుషులమీద ద్వేషమూ ఉండదు, ప్రీతి కూడా ఉండేది లేదు అనేది వైజ్ఞానిక సత్యంగా ఉంది. అయినా ఈ విధంగా గుడ్డి నమ్మకాల్ని పడిశం జలుబు రీతిలాగ అంటు జాడ్యం అన్నట్లుగా ఉంటది. నా ముందు నుంచి పిల్లి కనబడని, గుడ్లగూబ అరవనీ... దాన్ని విశేషంగా నేను గమనించేది లేదు. అయితే పిల్లి ఎదురైతే చాలు, "అయ్యయ్యో ఎంత పాడు అయ్యింది" అని చుట్టుపక్కనున్నోళ్ళు తమ తలల్ని కొట్టుకొనేది చూసిచూసిన నాకు ఇప్పుడేమైనా అకస్మాత్‌గా పిల్లి అడ్డుపడితే "ధూత్... దీని యమ్మ" అని అంటున్నాను. దీనికి ఏ ప్రాముఖ్యతా లేదని, దాన్ని ఉపేక్షించి నాపాటికినేను పోవాలనుకొన్నా, దీని గొడవే లేని నాకు ఒక క్షణం "ధూత్... దీనియమ్మ" అని అంటుంది... ఆ గుడ్డి నమ్మకాలు ఎంతగా అంటురోగం అనేదాన్ని చూపెట్టది నా ప్రవర్తన మూలంగా. నాకే ఇలాగైతే ఇక నిరక్షరకుక్షియైన (అక్షర జ్ఞానంలేని) ప్యారడు తొండలమీద ద్వేషసాధన చేసేదాన్లో ఆశ్చర్యపడేదేమీ లేదు.

ప్యారడు తొండల వెంట పడుతుండే దానికి నేనేమి ఆక్షేపించేవాడ్ని కాదు. తొండ నాకేమి ప్రియమైన ప్రాణి కాదుకదా! అవి పారిపోయి తమ ప్రాణ రక్షణ తామే చేసుకొంటున్నందున వాటికేమి నా రక్షణలోని అగత్యం ఉండేది లేదు. ఇంటి దగ్గర తిరుగాడుతుండే తొండల్ని టామి వెంటపడి తరుముతున్నప్పుడు, అవి పూలకుండీల మాటున దాక్కోగా, వాటిమీద దూకే టామి దశనుంచి ఆ పూలకుండీలు పడి పగిలిపోతుండేవి. ప్యారడి గుడ్డి నమ్మకం దశనుంచి తొండ ద్వారా నాకు కలుగుతున్న పెద్ద హాని ఏమిటంటే ఇదొకటే (పూలకుండీలు పగలటం) ఇప్పటివరకూ కదా!

అయితే ప్యారడు ఈ మూఢ నమ్మకాల దశనుంచి ఒకసారి ఎంతో పెద్ద ఆపదలో పడ్డాడు. అప్పటివరకూ తొండలు కనబడితే "నమక్‌హరాం" అని భావించుకొన్న అతనికి అవి నిజంగా సైతాన్‌లే అనే భావం కలిగి వాటి చెంత మసలుకొనేదాన్ని వదులుకొన్నాడు పూర్తిగా.

జన్నాపురంనుంచి మా ఊరుకు వస్తుంటే మధ్యలో కనబడే 'నిడుగోడు' ఊరిచెంత ఒక విస్తారమైన మైదానం ఉంది. ఆ మైదానంలో ఏ కురచపొదలుగాని, చెట్లుగాని లేవు. ఆ మైదానంలో వెళ్తున్నప్పుడల్లా అక్కడుండే ఒక చెదల పుట్ట శిఖరాన ఎరుపు మూతి తొండ ఒకటి తలను పైకి కిందకూ ఆడిస్తూ టామీని, ప్యారడ్ని రేగించేది. వీళ్ళు ఆ తొండ వెనుక ఎప్పుడు వెంటబడి వెళ్ళినా అది వేగంగా పారిపోయి పుట్టలోపలకు దూరి కూర్చుండేది.

ఒకసారి మేము ఆ మైదానంలో వెళ్తున్నప్పుడు శికారి మంజప్ప ఆ పుట్టను తవ్వుతున్నాడు. నేను బహుశః వంటపొయ్యిని కట్టేందుకు ఆ పుట్టలోని మట్టిని తవ్వుకొంటున్నాడేమోనని భావించి ముందుకు సాగాను. అయితే మంజప్ప మమ్మల్ని కేక పెట్టి పిల్చాడు. దగ్గరకు వెళ్ళి చూస్తే మంజప్ప బుట్ట నిండా కోడిగుడ్ల సైజ్‌లో పుట్టగొడుగులు (మష్రూమ్స్) నిండియున్నవి. మా మలెనాడులో వానాకాలం ఆరంభమైతే తక్షణం కొన్ని పుట్టలలో కోడిగుడ్ల సైజులో ఉండే పుట్టగొడుగులు మొలుస్తవి. తినేందుకు ఎంతో రుచిగా ఉండే వీట్ని అందరూ తవ్వుకొంటారు కుల మత భేదం లేకుండా. ఇంకా బయటకు రాకుండా పుట్టలోపలున్న పుట్టగొడుగులకని మంజప్ప పలుగునుంచి ఆ పుట్టనంతా తవ్వి నేలమట్టం చేసాడు. మేము అతని వద్దకు వెళ్ళినప్పుడు దానకర్ణుడిలాగ ఆ పుట్టగొడుగుల్ని మాకు ఇచ్చాడు. అతని వద్ద పుట్టగొడుగుల్ని తీసుకొనే ఆత్రంలో మాకు ఆ పుట్టలోపల దాక్కొన్న తొండ విషయం మరిచిపోయాం అంతే. అక్కడే గడ్డి చాటున దాక్కొన్న తొండ బయట కొచ్చి పారిపోసాగింది. అది బయటే ఎందుకుందంటే దాని నివాస స్థానమైన పుట్టను మంజప్ప పూర్తిగా నేలమట్టం చేసాడు కదా! తొండ బయటకు పరిగెత్తుతున్నదాన్ని చూసిన తక్షణమే ప్యారడు "అరెరే నమ్మక్ హరాం" అంటూ దాన్ని కొట్టేందుకని ఆ మైదానంలో రాయికని వెతకసాగాడు. బట్టతలగా ఉన్న ఆ బోడి మైదానంలో ప్యారడికి

తొండను కొట్టేందుకు ఏమి దొరకలేదు. కొంచం దూరానున్న టామీని కేక పెట్టి పిల్చి "ఛుఛూ... ఇస్కో ఇస్కో" అంటూ ఉసిగొల్పుతూ ఆ తొండ వెనుక పరిగెత్తాడు.

ఈసారి తొండ నిజంగానే ప్రమాదంలో ఇరుక్కొంది. దానికి ఆ మైదానంలో దాగేందుకు చెట్ల పొదలు గాని, పుట్టలుగాని లేవు. పుట్టలో దాగేందుకు సాధ్యంగానట్లుగా శికారి మంజప్ప ఆ పుట్టను నేలమట్టం చేసి చదును చేసాడుకదా! ప్యారడికి ఆ తొండలాగ వేగంగా ఉరికేందుకు సాధ్యంగాకపోయినా, టామీలో వేగంగా ఉరికే సామర్థ్యం ఉంది. ప్యారడు అరుపుల్ని విని వేగంగా వచ్చిన టామి తొండను చూసి దాని వెంటపడిన తక్షణమే ప్యారడు అలుపు నివారించుకొనేందుకు ఆగాడు. తొండ ఎంతో వేగంగానే పరిగెత్తుతుంది. టామి దాన్ని సమీపించే సమయంకు అది చెంగునే దిక్కు మార్చుకొని పరిగెడ్తూ టామీని ఎంతగానో అలిసేటట్లుగా చేస్తుంది. అయితే శాశ్వతంగా తప్పించుకొని పోయేందుకు తొండకు ఆ మైదానంలో ఏదీ లేనిదాన్ని గమనించుకొని, టామి నోట్నుంచి తప్పించుకొనే చివరి ప్రయత్నంగా పారిపోతూ, టామీని ఉసిగొల్పుతూ నించొన్న ప్యారడి కాళ్ళనే చెట్టులాగ భావించుకొని చకచకాపైకి ఎగబ్రాకి అతని చడ్డీలోపలికి చేరుకొంది! తొండ హఠాత్తుగా మాయమైనదాన్ని చూసి గలిబిలిగా ముందేమి చేయాలనేది తోచక టామి అటు ఇటు వెతుకుతుంది.

తొండ ప్యారడి చడ్డీలోపల దాక్కొన్న పరిణామం మాత్రం భీకరంగా ఉంది. బహుశః తొండ అతని చడ్డి లోపలికి దూసుకొచ్చి దాక్కొనేందుకు ప్రశస్తమైన స్థలంగా భావించిందో ఏమో! ప్యారడు అది ఇక తన మర్మ అవయవాన్ని కొరుకుతదేమోనని భావించి చేతిలో ఉన్న పుట్టగొడుగుల్ని విసిరేసి "అయ్యయ్యో" అంటూ ఆర్తనాదాలు పెట్తూ దెయ్యం పట్టినోడిలాగ వెర్రివెర్రిగా ఎగరసాగాడు. టామి అయితే ప్యారడి ఆర్తనాదాలకు, గెంతులకూ బెదిరి కొద్దిదూరంకు వెళ్ళి చూస్తుంది దృశ్యాన్నంతా. తొండ అపాయకరమైన జీవి కాదని నాకు బాగా గుర్తున్నందున నేనేమి అంతగా భయాందోళనకు గురికాలేదు. అయితే ప్యారడి చడ్డిలోపల అదేదో ఫైవ్ స్టార్ హోటెల్ అని భావించి భద్రంగా దాక్కొంది కదా అనే గలిబిలి నాలో ఉంది. "చడ్డి విప్పుకో" అని అరిచాను. ప్యారడికి పిచ్చి ఎక్కినట్లుంది. ఎవరి సూచనల్ని చెవిలోకి వేసుగోకనే

అతను అరుపులు పెట్టున్నాడు. మాన మర్యాదలకు గమనం నిల్వనంతగా అతనిలో భయం ఉల్బణించి చిందులు పెడ్తూనే చడ్డి ముడి విప్పాడు.

చడ్డి ముడిని ప్యారడు ఎప్పుడు వదులు చేసుకున్నాడో... ఆ తొండకు మరింతగా పైకి ఎగబ్రాకే అవకాశం లభించింది. అప్పుడది అతని నడుం ఎక్కి చొక్కాలోపలికి చేరుకొని అక్కడంతా అతనికి చక్కిలిగిలి పెట్టింది. ఈ పీడ ఇకనూ వంటిమీదకూ దూసుకొచ్చింది చూసిన ప్యారడు మరింతగా భయంలో కూరుకుపోయాడు. చడ్డీ ముడిని కట్టుకొనేందుకు వ్యవధానం లేక దాన్ని వదిలేసాడు. అది ఇక ఇప్పుడు కిందపడింది. అయ్యయ్యో అంటూ మరింత బిగ్గరగా అరుస్తూ చొక్కానూ విప్పుకోసాగాడు.

తారాస్థాయిలో సూచనల్ని కేకల రూపంలో ఇస్తున్న నన్నూ, అరుస్తూ చిందులేస్తున్న ప్యారడ్ని చూసి బుట్ట మోసుకొంటూ ఇంటివైపుకు వెళ్తున్న మంజప్ప బుట్టను కిందపెట్టి ఏదో భయంకరమైన విపత్తు మాకు కలిగిందని భావించి మా వద్దకు పరిగెత్తుకొని వచ్చాడు. అతను మా వద్దకు చేరే టైమ్‌కు ప్యారడు చొక్కా విప్పి దిగంబరుడిగా నిలబడ్డాడు. ఇక తొండ ప్యారడి తలమీద ఎక్కి ఇదేదో కొమ్మ రెమ్మలు లేని చెట్టుగా అనుకొందో ఏమో, అక్కడ్నుంచి కిందకు దూకి పరిగెత్తింది. మంజప్ప నా వద్దకు వచ్చి “ఏమిటి? ఏమైంది?” అని అడగగా, “తొండ ప్యారడి వంటిమీద దాక్కొంది” అని నవ్వుతూ చెప్పాను. మంజప్ప పగలబడి నవ్వసాగాడు. అయితే మేము ఎంతోసేపు నవ్వేందుకు కుదరలేదు.

ప్యారడి తల మీదనుంచి దూకిన తొండ పరిగెత్తుతూ కొంచం దూరం సాగేలోపే మరలా టామి కళ్ళలో పడింది. “ఓసి దొంగముండా, చిక్కావు కదా” అని భావించుకొంటూ టామి దాని వెంటపడింది. తొండ అటు ఇటు పరిగెత్తి చివరికి టామి నోటినుంచి తప్పించుకొనేందుకు అన్యమార్గం కనబడక ఆ మైదానంలో నిలబడిన నా కాళ్ళవైపుకు పరిగెత్తుకొంటూ వచ్చింది.

“అయ్యయ్యో... మరలా వచ్చింది సైతాన్” అని అరుస్తూ కిందపడ్డ చడ్డీని, చొక్కాను ఎత్తుకొని ప్యారడు మొండి మొలనే పరిగెత్తసాగాడు. నా ప్యాంట్‌లోపలికి అది వచ్చి దూరితే నా గతేంటి అని నాలో భయమైంది. ప్యారడి వెనకే నేనూ, నా

వెనకే శికారి మంజప్ప పరిగెత్తసాగాం. ఉదయంలోనే లేచి బాగా గంజి పెట్టి ఇస్త్రీ చేసిన ఖద్దరు పంచె తొడుక్కొని జిల్లా కేంద్రంకు వెళ్ళేందుకని బస్ కొరకు ఎదురుచూస్తున్న అణ్ణేగౌడుగారు నేను, శికారి మంజప్ప మొండి మొలనే పరిగెత్తుతున్న బాలుడొకడి వెంటపడి పరిగెత్తుతున్న దాన్ని చూసి దిగ్భ్రాంతుడై నిలబడిపోయారు. వారికీ తనూ పరిగెత్తాలో లేకపోతే ఆ మొండిమొలనే ఉన్న పోరడ్ని పట్టుకోవాలో ఏమి తెల్వలేదు. వారి వద్దకు చేరేటప్పటికి మా వెనక తొండలేదు. అదెక్కడో మధ్యలోనే ఏదో అడ్డదారి పట్టుకొని పారిపోయి ఉండొచ్చు. ఒకట్రెండు నిమిషాల తర్వాత టామి కూడా మా వద్దకు వచ్చి చేరింది.

దిగ్భూఢుడిలాగ నిలబడి చోద్యంగా చూస్తున్న అణ్ణేగౌడగారికి జరిగిందేమిటో నేను వివరించినప్పుడు వారు పడిపడీ నవ్వారు. ఇకనూ మొండిమొలనే నిలబడి సహజ స్థితిలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న ప్యారడిమీద “చీఛీ, చడ్డి వేసుకోరా వెధవా... ఉదయమే లేచి బాహుబలిని చూసినట్లుగా దిగంబర దర్శనం నీనుంచి అయ్యింది! మరింకేమి గ్రహచారం ఎదురౌతదో మాకు” అంటూ మంజప్ప తిట్టసాగాడు ప్యారడ్ని.

★ ★ ★

కన్నడ భాషలో దివంగత పూర్ణచంద్ర తేజస్విగారు రచించిన “ప్యారనిగె సైతాన్ కాట” అనే కథను యథాతథరూపంగా తెలుగులోకి అనువదించాను.

శాఖమూరు రామగోపాల్. 17-08-2010.

# అవాంతరాల సీనప్ప



"మేస్త్రీ సీనప్పడి తిరుపతి క్షౌరం" అనే మాట వింటున్నప్పుడు, సీనప్పకూ తిరుపతి క్షౌరంకూ ఏమి సంబంధం అని ఆలోచించిన నేను, బహుశః సీనప్ప తనకు మేస్త్రి పని ఇచ్చినోళ్ళకు ఎంతెంతో బిల్ చేసి తల గొరుగుతాడని, అందుకే అతని మేస్త్రి పనిని తిరుపతి క్షౌరంగా అనుకొంటున్నారని భావించాను. అయితే 'నిడుగోడు' గ్రామంకు చెందిన మోతుబరి రైతైన అణ్ణేగౌడగారు ఒకసారి నాతో పిచ్చాపాటి మాట్లాడుతూ తల గొరిగేదాన్ని తిరుపతి క్షౌరంగా అనరని, సగం సగం గొరిగేదాన్నే అలాగున పిలుస్తారని, వెనకటి కాలంలో తిరుపతిలో గుండు గొరిగే క్రమంను వివరించారు. తిరుపతిలో ఇప్పుడూ ఇలాగే జరుగుతుందో ఏమో నాకైతే తెల్వదు. ఎందుకంటే నేనెన్నడూ మొక్కు తీర్చుకొనేందుకు తిరుపతికి వెళ్ళలేదు.

అణ్ణేగౌడ గారి మాట ప్రకారం తిరుపతిలో బోడిగుండు గీకించుకొనేందుకు జనం నుంచి ఎంతో రద్దీ ఉంటే, ఆ జనం అందరికీ ఒక్కసారిగా గుండు గొరిగేది సాధ్యంగాని క్షురకులు తమ వద్దకు వచ్చిన గిరాకీదారులందరికీ నెత్తిలోని ఏదోభాగంలో తమదే అయిన విశిష్ట కౌశల్యంతో పట్టి చేసినట్లుగా త్రికోణాకారంగా గుండుమీద అక్కడక్కడ గీకి, తమతమ గిరాకీదారులను బుక్ చేసుకొంటారట. ఆ తర్వాత కొద్ది కొద్దిగా గొరిగించుకొన్నోళ్ళు వేరే క్షురకుల వద్దకు వెళ్ళేది కుదరదు. తలలో ఒక వైపు అసహ్యంగా గొరిగినందున వాళ్ళు వాపస్సై వెళ్ళేది లేదు. ఈ తరహాగా తల నీలాల్ని సమర్పించుకొనేందుకు తిరుపతి వెళ్ళినోళ్ళకు క్షురకులు ఈవిధంగా హాస్యకరంగా బాధ కల్గిస్తారని చెప్పారు అణ్ణేగౌడగారు

అయితే ఈ అర్థంలోని విశ్లేషణ మేస్త్రి సీనప్పకు ఎలాగ అన్వయించబడిందనేది అతనికి తాపిపని అప్పగించే వరకూ నాకు తెల్వలేదు కదా!

'గోణిబీడు'లోని తాపి మేస్త్రి సీనప్ప వయస్సైన వృద్ధుడు. భార్యాపిల్లలు ఎవరూ లేరు అతనికి. మా మండలంలో తాపిపని చేసేవాళ్ళు వేరెవరూ ఉన్నట్లు లేదు. ఇళ్ళు, భవనాలు మొదలైన పెద్ద పెద్ద కట్టడాల్ని కట్టించుకోవాలంటే మాత్రం కాంట్రాక్టర్లు బయట్నుంచి తాపి పనోళ్ళను పిల్చుకొచ్చి పనుల్ని చేయించుకొంటుండేవారు. సీనప్పనుంచి ఏమున్నా చిన్న షెడ్ కట్టేదో, పశువుల కొట్టం కట్టేదో, రిపేరికని అక్కడక్కడ ఇంటిసూరుకు కళాయి పూసేదో మొదలైన చిల్లర పనులు మాత్రమే అతనినుంచి జరిగేవి. అయినా జనం అతడ్ని చూస్తే చాలు కోపం చెందేటోళ్ళు. "ఈ దొంగ ముండాకొడుక్కి పని అప్పగిస్తే, దార్లో పోతున్న దెయ్యాన్ని ఇంటిలోపలికి ఆహ్వానించినట్లే" అని అతని గురించి తిట్టుండేవాళ్ళు.

మా ఇంటి వెనుక నీళ్ళను సేకరించుకొనేందుకని ఒక పెద్ద సిమెంట్ ట్యాంక్ కట్టించాను. అది ఇప్పుడు ఎన్నోచోట్ల చిన్నచిన్నగా క్రాక్స్ (పగుళ్ళు) కలిగి, నీళ్ళు చిన్నగా లీక్ అవుతుంది. దాని సరిజేయాలని భావించి ఒకసారి మేస్త్రి సీనప్పకు చెప్పాను. ఇక్కడ ఇతను తప్పితే వేరెవరూ లేరుకదా! ట్యాంక్‌లో సిమెంట్ కళాయి పూయించేందుకు హాసన్ పట్టణంనుంచో, చిక్కమగళూరు టౌన్‌నుంచో తాపీవాళ్ళను

పిల్చుకొని వచ్చేది సాధ్యమా? నేను ఇప్పుడు పిల్చుకొచ్చింది ఆ నీళ్ళట్యాంక్‌లోని పగుళ్ళలో సిమెంట్ నింపి, వాట్ని మూసి, నీళ్ళు కారేది ఆపేందుకనే కదా! అయితే సీనప్ప మా ఇంటికి వచ్చి తాపి బద్ద, సుత్తి తెచ్చి ఆ పగుళ్ళమీద మెల్లమెల్లగా దెబ్బల్ని బాది దాన్లో ఉన్న పాత ప్లాస్టర్‌నంతా తుప్పు వదలగొట్టినట్లుగా తుంపులు తుంపులుగా రాలగొట్టాడు. ప్లాస్టరంతా నుచ్చునూరైంది. "ఉత్తిగనే పగుళ్ళలో సిమెంట్ నింపితే నీళ్ళు లీక్ అయ్యేది ఆగదు. మొత్తం నీళ్ళ ట్యాంక్‌కంతా కొత్తగా సిమెంట్ ప్లాస్టరింగ్ చేయాల్సిందే" అని చెప్పాడు. ఆ పనికంతా కనిష్టమంటే ఇంకా మూడు బస్తాల సిమెంట్ కావాలని చెప్పాడు. నేను కేవలం ఆ క్రాక్స్ మూయించాలని రెండు మూడు కేజీల సిమెంట్ మాత్రమే తెచ్చాను. ఇంకా మూడు మూటలు కావాలని సీనప్ప చెప్పిందాన్ని విని ఆందోళన చెందాను. అయితే తొట్టిలోని పగుళ్ళన్నిట్నీ సరి చేసే క్రమంలోనే సీనప్ప పాత ప్లాస్టర్‌నంతా రాలగొట్టాడేమో! ఇప్పుడిక నోర్మూసుకొని సీనప్ప చెప్పినట్లుగా వినేది తప్పితే మరింకేమి చేసేది లేదు. "అలాగే... నువ్వు చెప్పినట్లుగానే మూడు మూటల సిమెంట్ తెస్తాను. పని ఎంతో తొందరగా జరగాలి మహాశయా... ఎందుకంటే నీళ్ళు సేకరించుకోవటానికి నాకు కొన్ని బకెట్లు తప్పితే మరేవి లేవు" అని దిగులుతో చెప్పాను.

నేను 'మూడిగెరె'కు వెళ్ళి సిమెంట్ తెచ్చినప్పుడు సీనప్ప మరింతగా నన్ను దిగులులో పడేసాడు. నీళ్ళ ట్యాంక్‌లోని పగుళ్ళ మూలాన ఆ ట్యాంక్ అడుగు భాగం ఒక వైపున కుంగిందని చెప్తూ మొత్తం ట్యాంక్‌నంతా పీకేసి కొత్తగా కట్టాలని చెప్పాడు. వెళ్ళి నిశితంగా చూసినప్పుడు ట్యాంక్ కున్న గోడల ఇటుకల్ని గుంజేసాడు. కేవలం మేస్త్రి పనిని ఎక్కువగా చేసుకొని లాభపడేందుకు ఈ తంత్రం చేసావా అని అతడ్ని తిట్టాను. ఇటుకల్ని తాను పీకలేదని ప్లాస్టర్‌ను తొలగిస్తుంటే ఆ ఇటుకలు వాటంతటవే ఊడి పడ్డాయని చెప్పి అడుగు భాగం ఒక వైపుకు కుంగింది చూపించాడు. అతను చెప్పేదాంట్లో సత్యాంశం ఉంది. అయితే ఈ బేలదారు మేస్త్రీలు ఉన్న పరిస్థితిని, మా అజ్ఞానంను తమకు అనుకూలంగా మార్చుకొనేదాన్లో నిపుణులుగా ఉంటారట! ఏ బేల్దారు మేస్త్రీ మేము చెప్పినదాన్ని చేసి మంచిగా డబ్బు పుచ్చుకొని వెళ్ళిన దాన్ని నేను వేరెక్కడా చూడలేదు ఇంతవరకూ! సున్నం కొట్టేందుకో, రంగులు వేసేందుకో పిలిస్తే అక్కడ ఇక్కడ ఏదేదో గీకి, కొట్టి, ప్లాస్టర్

రాలగొట్టి, పైన ఉండే సూరులో కమ్మి బద్దల్ని కదిల్చి వాటిమీద చెదలు పట్టి తిన్నదాన్ని చూపించి తమ పనిని విస్తరించుకొంటూ వెళ్తుండేవారు. "చెప్పినంతకే చేసి పెట్టు మహాశయా" అని మేము చెప్తే, "మేము చెప్పినట్లుగా మీరు వినక పోతే రేపేమైనా ఇల్లు కూలిపోయేది శతః సిద్ధమని చెప్పి, వాళ్ళు మమ్మల్ని దిగులులో ఇరికించి, మొదట్లో ఈ ఇంటి పనిని చేసినోడు అసమర్ధుడని, బాగానే టోపి వేసాడని ముందు పనిని చేసినోడ్ని తిట్టుండేవారు".

అయితే తాపిమేస్త్రి సీనప్పడి తిరుపతి క్షౌరం మహత్యం గుర్తైంది ఇందుచేత కాదు.

సీనప్ప మా నీళ్ళ ట్యాంక్‌ను పగలగొట్టి తాపి పనిముట్టు, మూల మట్టం, గుండు దారం, సొట్టలు పడిన ఒక రేకు గంప మొదలైన వాట్ని మా షెడ్‌లో పెట్టి, ఏభై రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకొని 'గోణిబీడు'కు వెళ్ళి పోయినోడు మరలా నా వద్దకు పనికి రానేలేదు. మరలా నేను అతని ముఖాన్ని చూసింది ఒక వారం తర్వాతనే. అదీ అతను పనికని మా ఇంటికి రానేలేదు. మూడిగెరె (తాలూకా కేంద్ర పట్టణం; చిక్‌మగళూరు జిల్లాలో ఉంటది)కు నేను వెళ్తుండగా, ఎవరో ఇద్దరు వ్యక్తుల జతగా బీడి తాగుతూ మాట్లాడుతుండగా చూసాను అతడ్ని. అతనికి పని చేసేందుకు ఖాళి దొరకక పోతే, మా నీళ్ళ తొట్టి పనిని ఇకనూ ఒక నెల తర్వాత చేసి పెట్టినా నాకేమి నష్టం లేదు. అయితే మా ఇంటికి వచ్చి ట్యాంక్ అంతా పగలగొట్టి ఇంట్లో ఉన్న పాత్రలన్నిట్లోనూ నీళ్ళు నింపి పెట్టుకొనేటట్లుగా చేసి విపరీతమైన కష్టాలకు నన్ను ఇరికించాడనే కోపం నాలో ఉందికదా!

"సీనప్పా, ఏభైరూపాయల్ని అడ్వాన్స్‌గా తీసుకొని వెళ్ళినోడివి ఇవ్వాళా నువ్వు కనబడేది? ఇంట్లో నీళ్ళకని ఇబ్బందిగా ఉంది. తొందరగా వచ్చి పని ముగించు అంటే నీకేమి అర్థం గావట్లేదా?" అని గదిరాను.

"మీ డబ్బు తిని ఈ సీమను విడిచి పారిపోతానా సార్? నా ప్రాణం ఒకటుంటే మీరు అప్పగించిన పనిని చేస్తానో లేదో చూడండి! నా తాపి పనిముట్లు అన్నిట్ని మీ షెడ్‌లోనే అట్టిపెట్టాను కదా!" అని అన్నాడు. నేను అప్పగించిన పని చేసేందుకు సీనప్ప చెపుతున్న కాలావధి చూసిన నాకు దిగులైంది. ప్రాణం ఒకటుంటే చేసి

పెట్టాను పనిని అంటే ఏమిటి దాని అర్థం? చచ్చేలోపు చేస్తాననే చెపుతున్నట్లుగా ఉందికదా అతని మాటలోని మర్మం.

నేను అతని మీద జోరు చేసిన తక్షణం అతనితో ఉన్న ఇద్దరిలో ఒకడు, "అయ్యయ్యో... మీరు ప్రస్తుతం ఎలాగైనా సుధారించుకోవచ్చు సార్! మా ఇంట్లో స్నానం గదిని ఒక నెల క్రితం పీకి పడేసి, దాన్ని రిపేరు చేసేందుకు సతాయిస్తున్నాడు సార్! మేము ఇప్పుడు ఇరుగుపొరుగు ఇళ్ళకు స్నానంకని వెళ్తున్నాం. ఆ స్నానం గదిని ఎలాగైనా సరిజేయించుకోవాలి ఇతడ్నుంచి. అప్పటివరకూ కొంచం అర్జెంట్ చేయకండి సార్" అని వేడుకొన్నాడు అతను. ఇంకొక పెద్దాయన కోపంగా, "మా ఇంటి సూరు పీకేసినందున మేము ఇప్పుడు పగలు, రాత్రి ఆరుబయలే కాలం గడుపుతున్నాం సార్. ఎప్పుడైనా ఒక అకాల వర్షం పడితే ఇంటిలోనే గొడుగు పట్టుకొని కాలం గడపాలి. శని ముండాకొడుకు... మా ఇద్దరి ఇళ్ళలోనూ ఒకొక రేకు గంపను, తాపి పనిముట్లను దాబెట్టి వెళ్ళాడు" అని అరిచాడు.

"చూసారా సార్ భాగోతం! అందరూ అర్జెంట్ పెట్టారు! ఏమి చేయాలి? అందర్నీ ఉద్ధరించాలి కదా! వీరి స్నానం గది, వారి ఇంటి చూరు (పైకప్పు) సగంకే వదిలి మీ వద్దకు వచ్చేందుకు కుదురుతదా చెప్పండి?" అంటూ తన అవివేకంను సమర్థించుకొనేందుకు సీనప్ప ప్రయత్నిస్తున్నాడు.

"ఔను సీనప్పా... నువ్వు వీళ్ళ పనుల్ని ముగించిన మీదే నా నీళ్ళ ట్యాంక్ పని చేపట్తే ఎవరు ఆక్షేపించేది ఉంటది? నా వద్దకు వచ్చినోడివి దాన్నెందుకు తుపుతుపుగా పగలగొట్టావు?" అని ఘాటుగా అడిగాను నేను.

"మీ వద్దకు వచ్చినందుకు ఏదైనా ఒక శాతం నా పనితనం చూపించి చేస్తేనే అడ్వాన్స్‌గా డబ్బు అడిగేదుంటది. లేకపోతే ఎలాగ అడ్వాన్స్ అడిగేది మీరే చెప్పండి?" అంటూ తన బిజినెస్ సూత్రం నుంచి నన్నే ప్రశ్నించాడు.

ఏభై రూపాయల్ని అడ్వాన్స్‌గా గుంజేందుకు నా నీళ్ళ ట్యాంక్‌ను పగలగొట్టి, నాతో మూడు మూటల సిమెంట్ తెప్పించి, డబ్బు చేతిలో పడిన తక్షణమే అప్పగించిన పనిని మరిచి నిబ్బరంగా తిరుగుతున్నాడు కదా ఈ సీనప్ప! అయితే నాకన్నా

ఎక్కువగా కష్టాలలో ఇరుక్కొన్న మరిద్దరు మూర్ఖులు అక్కడే గొణుగుతూ నిలబడినందున, నా పనిని తక్షణమే చేయమని హుకుం చేసేందుకు నాకు మనస్సు ఒప్పలేదు.

ఈ ట్యాంక్ వ్యవహారంలో నా చెవిలో పడిన మరో సంగతి నుంచి తెల్సిందేమిటంటే ఎన్నో ఇళ్ళలో ఇంకా ఆరు నెలలు పనికి సరిపడేంతగా సగం సగం చేయాల్సిన పనుల్ని పాడుచేసి అక్కడంతా ఒకొక తాపి పనిముట్టును, పగిలి సొట్టలు పడిన ఇనుప గంపను ఉంచి తాపీ పనిని బుక్ చేసుకొన్నాడట. ఇతనిలోని, ఈ బతుకు విధానంలోని రహస్యం బయటపడి "సీనప్పడి తిరుపతి క్షౌరం" అనే ఊతమాట మా మండలంలో చలామణి అయ్యింది. నాకు ఆ రోజు దార్లోనే ఈ వృద్ధుడి మీద నాల్గు వేట్లు వేసి కపాలం పగలగొట్టేంతగా కోపం వచ్చింది. అయితే ఇంట్లో పగిలి పోయిన నీళ్ళ ట్యాంక్ జ్ఞాపకంకు వచ్చి ఎలాగైనా సరే ఒకసారి పని జరిగితే చాలు, తొందర పెట్తే మరెన్ని కష్టాలు చుట్టుకొంటవో అనే బెదురు భావం కలిగి బలవంతంగా కోపాన్ని అణుచుకొన్నాను. అతని చేతికి అడ్వాన్స్ సమర్పించుకొని ఇంటిని గుల్ల చేసుకొన్న ఆ ఇద్దరూ పలు రకాలుగా సీనప్పను వేడుకొంటున్నారు. అయితే సీనప్ప రోగుల కష్టాల్ని వింటున్న డాక్టరు తరహాగా నిర్భావంలోని ముఖ భంగిమనుంచి ఆ చెప్పేదాన్నంతా వింటున్నాడు. భార్యాపిల్లలు ఎవరూలేని ఈ ఘోటక బ్రహ్మచారి ముండాకొడుక్కి సంసారస్థుల కష్టం ఒక పాలూ అర్థమైయ్యే తరహాగా కనబడలేదు. "మీ ఇద్దరి పనులలో ఎవరి పనిని ముందు చేయాలో చెప్పండి? మీరే తీర్మానించండి" అని చెప్పి వాళ్ళిద్దరిలో వాగ్వాదం కల్గించి శత్రుత్వం పుట్టించాడు.

"అడ్వాన్స్ అడిగితే, ఇంకా పనే చేపట్టలేదు? డబ్బు అడుగుతావా? అని తిట్టారు. పని చేపట్టానంటే ఈ రీతిగా నాది ముందు, కాదు కాదు నాదే ముందు అని గోల పెట్టారు. అందరి పనులూ ఒకేసారి చేసేందుకు నాకేంటి పది చేతులున్నవా?" అంటూ సీనప్ప ఆ ఇద్దరి మీద జోరు చేసాడు.

విచారంగా ఇంటి సూరును పీకించుకొన్నోడు అటు వెళ్ళిపోయిన తక్షణమే, "వారి ఇంటి చూరు (పైకప్పు) చెదలు పట్టి జంతి (అడ్డకట్టెలు) అంతా తల మీద

పడేటట్లుగా ఉంది. నేను ఎలాగోలా ధైర్యం చేసి ఆ ఇంటి కప్పు పైకి ఎక్కి పెంకుల్ని ఊడదీసి పెట్టాను. ఇప్పుడు చూస్తే పగలు రాత్రి ఆరుబయలే కాలం గడుపుతున్నామని అంటున్నాడు. నేనే గనక ఆ సూరు దించకుంటే, ఆ కుటుంబంమీద ఆ సూరు (కప్పు) కూలిపోయి భార్యాపిల్లల సమేతంగా వారూ చనిపోయే వారు కదా! సూరు దించి ఉపకారం చేయి మహానుభావా అని మొదట్లో మొక్కిన ఈ ఆసామి, ఇప్పుడు నాదే తప్పు అని అంటున్నాడు. మనుషులలో ఎటువంటెటువంటోళ్ళు ఉన్నారో మీరే గమనించండి" అని ఆ పోయినోడి వీపు వెనకాలే పని అప్పగించి ఉదరపోషణకు అవకాశం కల్పించినోడ్ని తిట్టున్నాడు హీనంగా.

కొన్ని రోజుల తర్వాత సీనప్ప పని చేసేందుకు మా ఇంటికి వచ్చాడు. స్నానం గదిని నిర్మాణం చేయించుకొన్నోడి కథ, ఇంటి సూరును ఊడదీయించుకొన్నోడి కథ ఏమైందని నేను అడగలేదు. మా మారడ్ని అసిస్టెంట్‌గా తీసుకొన్న సీనప్ప ఇంటి వెనక నీళ్ళ ట్యాంక్‌కని కొత్తగా పునాది తోడసాగాడు. సీనప్ప ఇనపగంపలో నింపిన మట్టిని మారడు ఒక ప్రక్క రాశిగా పోస్తున్నాడు. ఆ పునాది తవ్వే పనికి ఇద్దరి అగత్యం లేదు. సీనప్పే పారనుంచి మట్టిలాగి ఆ మట్టిని దూరంగా విసిరితే సరిపోతది. అయితే సీనప్పకు మాట్లాడేందుకు, కబుర్లు చెప్పుకొనేందుకు ఎవరూ తోడుగా లేకపోతే చేసే పనిని నిల్పేసి సొల్లు కబుర్లను చెప్పుకొనేందుకు, వినేందుకు ఎవర్నైనా వెతికేందుకని తోట మధ్యలోకి వస్తున్నాడు. ఇరవై నాలుగు గంటలూ అతను కప్పలాగ బెకబెకగా ఏవేవో మాటల్ని చెపుతుంటాడు. మౌనంగా పని చేసేది అతని జన్మ సంస్కారంలో లేదు. మా మారడ్ని కబుర్ల కోసమే తోడు మనిషిగా పిల్చుకొన్నాడు. సీనప్పకు కొద్దిగా చెముడు ఉంది. అందుచేత మారడు కొంచం గట్టిగా మాట్లాడితేనే మాత్రం సీనప్పకు వినబడేది. అయితే సీనప్ప ప్రపంచంలోని మొత్తం జనానికందరికీ చెముడని భావించుకొన్నాడో ఏమో... ఎంతబిగ్గరగా మాట్లాడుతున్నాడనేది అతనికి అందాజుగా తెల్వట్లేదో ఏమో! అతనూ మారడి జతగా బిగ్గరగా మాట్లాడుతున్నాడు. సీనప్పకు సుమారుగా అరవై ఐదు సంవత్సరాలు ఉండొచ్చు. నక్క లాంటి చూపు మూతి ఉన్న ఈ బ్రహ్మచారి 'గోణిబీడు'కు ఎప్పుడొచ్చి చేరుకొన్నాడో ఎవరికీ తెల్వదు. అయితే అతని తాపీపనుల అవాంతరాల నుంచి అతని అస్తిత్వం (ఉనికి) మా మండలంలోని జనం అందరి అనుభవంలలోకి వచ్చింది.

మా మారడు ఇంత వయస్సైనోడని చెప్పేందుకు సాధ్యం కాదు. సిపాయిల తిరుగుబాటు (1857) కాలంలోని అతని జ్ఞాపకాల ప్రకారం అందాజు చేసుకొంటే అతనికి రెండొందల ఏళ్ళు పైబడే ఉండొచ్చు. అతని వయస్సును అలాగని కొలిచి చెప్తే, “కావచ్చు... నేనైతే జాంబవంతుడిలాగ రెండు యుగాల్నుంచి బతికియున్నాను. నా కళ్ళముందే జన్మించిన ఎన్నో తలెమార్లు చనిపోయి మన్ను పాలైయ్యారు. విక్టోరియా మహారాణినే కాదు... ఆమె ముత్తాతనూ చూసాను” అని అంటుండేవాడు. మనుష్య ప్రాణి రెండు శతాబ్దాలు బతికేది అసాధ్యమనే జ్ఞానం అతనిలో లేదుకదా!

ఆ ఇద్దరూ తమలాంటి అల్పజీవుల మాటల్ని ఎవరూ వినటంలేదనే ధైర్యంనుంచి బిగ్గరగా మాట్లాడుకొంటూ పని చేస్తున్నారు. ప్రచలిత సమస్యైన కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స గురించి మాట్లాడుకొంటున్నారు. మారడేమో మొగుడు - పెళ్ళాం నడుమ ఎవరు శస్త్ర చికిత్స చేయించుకొంటే బాగుంటదని తన అమూల్యమైన అభిప్రాయంను వ్యక్తపరుస్తున్నాడు విజ్ఞాని అన్నట్లుగా!

మా మారడి దృష్టిలో మగ మహారాజులు శస్త్ర చికిత్స చేయించుకొంటే మంచిదని, ఎందుకంటే గర్భిణిగా అయ్యేదిలేదని కచ్చితమైతే మహిళలు ఏమి చేస్తారో చెప్పేందుకు సాధ్యంగాదని చెపుతున్నాడు. మహిళలను కంట్రోలులో ఉంచేది కష్టమని చెపుతున్నాడు. సీనప్పకైతే ఈ నైతిక సమస్య అదంతగా ప్రాముఖ్యంగా లేదు. ఇద్దరూ చేయించుకొంటే మంచిదని, ఎందుకంటే ఆ ఇద్దరికీ సహాయధనం ప్రభుత్వంనుంచి నూరు రూపాయలు దొరికేది ఉన్నందున అదెంతో లాభదాయకంగా ఉంటదని చెపుతున్నాడు. రూపాయల ప్రశ్న రాగా మారడు తనకూ చేస్తారా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సను అని అడిగినదానికి ముసలోళ్ళకు ఆ సంతాన హరణ శస్త్ర చికిత్సను చేసేది లేదని సీనప్ప కచ్చితంగా తేల్చి చెప్పాడు.

ఆ ఇద్దరు గొడ్డుబోతోళ్ళు (బంజరు పురుషులు) తమకు సంబంధంలేని సమస్య ఒకదాని గురించి యోచించుకొంటూ తీర్మానాల్ని చేసుకొంటుంది విన్న నాకు నవ్వు వచ్చింది. కొంచం సేపైన తర్వాత ఆ ఇద్దరూ మాటల పురాణంలోనే కాలం గడుపుకొంటున్నారేమోనని, పని ఏమైనా జరుగుతుందా అని చూసేందుకు కిటికి

నుంచి తొంగి చూడగా, అప్పుడు ఆ ఇద్దరూ నా వైపు తిరిగి "ఇటు రండి సార్" అంటూ పిలిచారు.

పునాదిని సరిగా లోతుగా చేసేందుకని తవ్వుతున్నప్పుడు సీనప్ప పారకు ఒక ప్రమిద, ఒక ఖడ్గం దొరికినవి. ఆ ప్రమిద బలపం రాతితో చేసినట్లుగా ఉంది. దాని నిర్మాణం హోయ్సళల కాలం నాటిదై ఉండొచ్చు. మా ఊరిపేరే "హోయిసోళలు". రాజ్యం స్థాపించే ముందు మా ఊర్లో హోయ్సళ వంశస్తులు వ్యవసాయం చేస్తుండేవారని, తర్వాత పాళెగార్లుగా మారి 'అంగడి' గ్రామంకు వెళ్ళి అక్కడ్నుంచి బేలూరుకు చేరి రాజ్య నిర్మాణం చేసారని పురావస్తు శాఖ చెపుతుంది. బలపం రాళ్ళను విగ్రహాలకు మరియు ఇతర వస్తువులకు నాగరికతలో ప్రధానంగా వాడినోళ్ళు హోయ్సళలే కదా చరిత్రలో! ఖడ్గం మాత్రం తుప్పుపట్టి ఆకారం పోగొట్టుకొని పాడై ఉంది. దాని పిడిమాత్రం ఇది వెనకటి కాలంలో సిపాయిలు ఉపయోగిస్తుండే ఖడ్గమని చెప్పుకోవచ్చు మనం. ఆ రెండిట్ని చూసిన నాకు సంతోషమైంది. నాయన (కు. వెం. పు) నుంచి దూరంగా జరిగి నా పాటికి నేను ఏదో ఘోరారణ్యం చెంత ఒక కొంపలో ఉంటున్నానని భావించుకొనే నాకు, వెనకటి చరిత్ర కాలంలో రాజులు, సైనికులు ఘనంగా బతికి తిరిగిన స్థలం ఇదే అనేది తెల్సివచ్చి ఒకింతగా గర్వం కల్గింది! ఆ రెండిట్ని కడిగి వాటిమీద పేరుకుపోయిన దుమ్ము, ధూళును తీసేసి శుభ్రం చేద్దామని ఇంట్లోకి తెచ్చాను. కడుగుతుండగా తుప్పుతో పాటుగా ఖడ్గం సగానికి సగం కరిగి నీరైపోయింది. ప్రమిదమాత్రం భద్రంగా నా వద్ద ఇంకా ఉంది.

మరలా వాళ్ళు చేస్తున్న పని వద్దకు వెళ్ళి చూసిప్పుడు సీనప్ప పునాదికని గుర్తు పెట్టిన స్థలం వదిలి మరెక్కడో తవ్వుతున్నాడు. ఇంకా మరేవైనా ఇక్కడ దొరకొచ్చని మారడు సలహా ఇచ్చినందున అతను మరో చోట తవ్వుతున్నాడు. నాకైతే ఒకసారి ఈ నీళ్ళట్యాంక్ రెడి అయ్యి, ఈ సీనప్ప తొలిగిపోతే చాలు అన్నట్లుగా మనస్సులో ఉంది. ఆ ఇద్దర్నీ మరోమారు గదిరించి యథాస్థలంలోనే పనికి పురమాయించి ఇంట్లోకి తిరిగి వచ్చాను.

మధ్యాహ్నం వేళకు ప్యారడు కూడా అక్కడికి చేరుకొని ఉండొచ్చు. సీనప్ప ప్రమిద గురించి ప్యారడితో ఏమేమో వివరిస్తుంది వినబడుతుంది నాకు. ఆ ప్రమిద

పూర్వకాలంలో శవాల తలల ప్రక్కన వెలిగించి ఉంచేవారని, ఆ ప్రమిదను ఇంట్లో పెట్టుకొని మరలా దాన్నుంచి దీపారాధన చేస్తే చనిపోయినోడి ప్రేతం అక్కడికి వచ్చి పీడిస్తదని చెపుతున్నాడు.

నాకు నిజంగా ఇప్పుడు పీడిస్తున్న ప్రేతం ఏదంటే అది ఈ సీనప్పే కదా! అతని మీద కోపం వచ్చింది. ఇంటి ముందుకు సీనప్పను పిల్చి, "లేనిపోని కట్టుకథల్ని కట్టి చెప్పి ఆ పోరడ్ని భయపెడ్తున్నావు కదా" అంటూ జోరు చేసాను. సీనప్ప వెనకనుంచి తొంగి చూస్తున్న ప్యారడు, "సాయెబ్బుల జోలికి దెయ్యాలు రావని చెప్పాడు సార్" అంటూ నాకు తెల్పాడు.

సాయెబ్బులు గొడ్డు మాంసం తింటున్నందున దెయ్యం వాళ్ళను ముట్టుకొంటే మైల అవుతదని వాళ్ళనుంచి దూరంగా మసలుకొంటదట! దెయ్యాల పీడ ఉండే ఇళ్ళను సాయెబ్బులకు బాడుగకని ఇస్తే ఆ మైలపడిన ఇళ్ళలో ఉండేందుకు ఒప్పని దెయ్యాలు వేగంవేగంగా పారిపోతవని సీనప్ప చెప్పాడట ప్యారడికి. గోమాంసం తింటున్నందున ముసల్మానులు అత్యంత శ్వపచరులట. వాళ్ళను దెయ్యాలు సైతం ముట్టుకోవని సీనప్పనుంచి వస్తున్న మాటలలోని సూక్ష్మపదం అది. ప్యారడికి సీనప్ప చెపుతున్న ధార్మిక తర్కసూక్ష్మం అర్థంగాక, దెయ్యాలు ఒకవేళ తనను చూస్తే దిగులు పడుతవని గర్వపడుతూ నించొని ఉన్నాడు.

"అలాగున చూస్తే మా జనమూ గొడ్డుకూర తింటారు కదా" అంటూ దళితుడైన మారడు ప్రశ్నె ఒకదాన్ని వదిలాడు సీనప్పమీద. నేను కోపం చెందింది మరియు గొడ్డుకూర తినే ఆ ఇద్దరూ మెజారిటిగా ఉన్నదాన్ని గమనించిన సీనప్ప మెల్లగా ప్రచలితమైన ఆ విషయం నుంచి జారుకొనేందుకని, "గొడ్డుకూర తిన్నా దళితులందరూ హిందువులే కదా" అంటూ పనిని వేగవంతంగా చేసే హడావుడిలో ఆ విషయాన్ని మరో మూలకు నెట్టాడు.

వాళ్ళ వీళ్ళ నడుమ తగాదా పెట్టేది, ఒకరు వెళ్ళిపోయిన పిమ్మట వాళ్ళమీద హీనంగా మాట్లాడేది, ఎన్నో మైళ్ళు నడుచుకొని వెళ్ళి దొరల ముందు ఇతరులపై చాడీలు చెప్పివచ్చేది... మొదలైన నీచ పనులలో సీనప్ప పారంగతుడిగా ఉన్నాడు. జనం మనస్సులను, ఇళ్ళను కలగల్పి పాడు చేస్తున్నాడు. అయితే అతని దృష్టిలో

మాత్రం అతను సర్వసద్గుణ సంపన్నుడు కదా! ఎంతో ప్రామాణిక వ్యక్తి అట! ఇతరుల క్షేమంకని నవ చైతన్య పొంది రాత్రింబవళ్ళూ తాపీ పనుల్ని చేస్తుండే మహానుభావుడట!

ఈ శని పీడను ఎందుకు పనికని పెట్టుకొన్నానో అన్నట్లుగా సీనప్ప పనిని చేస్తున్నాడు. ఇతను ఇటువంటోడని ముందే తెల్సుంటే నేనే ఎలాగోలా సిమెంట్‌ను మెత్తి ఇంకొక సంవత్సరం హాయిగా ఆ నీళ్ళ ట్యాంక్ నుంచి కాలం గడిపేవాడ్ని.

ఈ సమయంకు సరిగ్గా మా ఇంట్లో ఒక దెయ్యం పీడ ప్రారంభమైంది. మారడు, ప్యారడు ఆ దెయ్యం పీడ గురించి చెప్తే నేను తిట్టానని బెదిరి నాకు ఈ పీడ విషయం తెల్పనే లేదు. మా స్టోర్ కుండే కిటికి తలుపుల మీదంతా ఎవరో 'రేపురా' అని కట్టెబొగ్గు నుంచి రాసినదాన్ని చూసినప్పుడు నాకు ఆశ్చర్యమైంది. మారడ్ని, ప్యారడ్ని పిల్చి "ఎవర్ని రమ్మని చెపుతున్నారు మీరు?" అని గదిరాను. వాళ్ళిద్దరికీ ఏమి అర్థంగాక "మేమెందుకు రేపురా అని చెపుతాము" అని అన్నారు. "అలాగైతే మరెవరు స్టోర్ మీద అలా రాసారు?" అని అడిగాను. రాసిందేమో సూక్తి ముక్తావళి అని భావించుకొన్న ప్యారడు దాన్ని రాసాడట. "ఓ అదా! అది సీనప్పగారు రాయించుకొచ్చిన సూక్తి ముక్తావళి" అని చెప్పాడు ప్యారడు.

మారడేమో దెయ్యం స్టోర్ గదిలోని తలుపును కొట్టుందని చెప్పాడట. సీనప్ప, మారడు ఎంతో గాఢంగా పర్యాలోచన చేసి ప్రమిదను ఇంట్లోనే సార్ ఉంచుకొన్న కారణంగా ఇప్పుడు దెయ్యంలోని పీడ మొదలైందని తీర్మానించుకొన్నారు. గోణిబీడులో ఉండే భూత వైద్యుడి దగ్గరకు వెళ్ళి మంత్రం రాయించుకొస్తానని చెప్పి, ఒక మందపాటి కాగితంలో రాయించుకొని తెచ్చాడు సీనప్ప. ప్యారడితో కాగితంలో రాసింది ఎలాగుందో తద్రూపంగా అలాగే తలుపు పైన రాయమని చెప్పి రాయించాడట. నేను దాన్ని 'రేపు రా' అని చదివిన తక్షణమే చదువు సంధ్యలులేని ప్యారడిలో తను కష్టపడి రాసిన సూక్తి ముక్తావళి "ఇంతేనా ఇది" అన్నట్లుగా అన్పించి ఉసూరుమన్నాడు. ఆ రాతను తుడిచేయమని చెప్పాను. అతను తడిబట్ట తెచ్చి తుడిచేసాడు ఆ మంత్రం రాతను.

అయితే తలుపు కొట్టున్న సప్పుడు ఆగలేదు. "దొరకు చెప్తే వారికి అర్థమైయ్యేది లేదు. ఆ పాత ప్రమిదను ఇంట్లో పెట్టుకొన్నాడు. ఇప్పుడేమో ప్రస్తుతానికి సాయెబ్బుల

పోరడు ఇంట్లో తిరుగాడుతున్నందున పర్వాలేదు. అతను గనుక వెళ్ళిపోతే, దెయ్యం వచ్చి ఇంటి ద్వారం తట్టుతది" అని సీనప్ప చెపుతున్నాడు. మారడేమో ఆ మాటల్ని నమ్మి ఆ ప్రమిదను మరలా ఆ మట్టిలోనే వేసి మూసేందుకు నన్ను అడిగి, నా నుంచి ఉమ్మించుకొని వెళ్ళాడు.

దెయ్యం రాత్రివేళ తలుపు తట్టట్లేదు. పట్టపగలే డబడబ తలుపు కొట్టుంది. ఒకసారి ప్యారడు స్టోర్ నుంచి బయటకొచ్చి, "సీనప్ప చెపుతుంది కరెక్టే సార్! నేను (సాయెబ్బుల పోరడ్ని) లోనికి వెళ్తే దెయ్యం పారిపోతుంది సార్" అంటూ తన జన్మమీద గర్వపడుతూ చెప్పాడు.

నెలకు రెండు మూడు దెయ్యాల వృత్తాంతాల్ని, ఘటనల్ని మారడి నోట్నుంచి వినేది ఉన్నందున నాకైతే దెయ్యం తలుపు కొట్టుంది నిజమో అబద్ధమో అని పరీక్షించేదాన్లో కుతూహలం లేదు ఇప్పుడు. నేను కష్టపడి ఎలుకో పందికొక్కో అక్కడెక్కడో దాగి గొడవ చేస్తుందని సంశోధించితే ఏ ప్రయోజనం, విలువా ఉండట్లేదు. దెయ్యమే ఎలుక రూపంలో వచ్చిందని మారడు వాదించి, నేను సైంటిఫిక్‌గా ఒదిగించే సాక్ష్యాల్నే తన మూఢ నమ్మకాలకు అనుకూలంగా మార్చుకొని ఉపయోగించుకొనేవాడు. అందుచేత నాకూ ఎన్నోసార్లు ఆ దెయ్యం తలుపు తట్టుతున్న డుబ్ డుబ్ శబ్దం విన్పించినా, ఉత్తిగనే పనిపాట లేకనే తలుపును కొట్టే దెయ్యం అయితే దానిపాటికది తలుపుకొట్టూనే చావని అని మిన్నకుండిపోయాను.

సీనప్పలో తను చేయాల్సిన పని ఒకదాన్ని వదిలి మిగిలిన వాటి మీదంతా ఎంతో శ్రద్ధాసక్తి ఉంటది కదా! నీళ్ళ ట్యాంక్ కని పునాది తీసేదాన్ని సగంలోనే నిల్పేసి భూతోచ్చాటనకు సిద్ధమైయ్యాడు. తలుపుకొట్టే శబ్దాన్ని విన్న తక్షణమే చేసే పనిని ఆపి మారడూ, సీనప్ప ఆ స్టోర్ గది వద్దకు పరిగెత్తేవారు. వీళ్ళు అక్కడికి చేరిన తక్షణం తలుపు కొట్టేది ఆగిపోతుండేది. ఇక మొదలౌతది... మారడు, సీనప్ప అక్కడే నిలబడిపోయి భూతంను పారద్రోలే విధానం మీద ఆలోచిస్తుండేవారు. ఒకరోజు సీనప్ప మంత్రించిన నిమ్మకాయల్ని స్టోర్ గది తలుపుకు కట్టేందుకని తెచ్చాడు. సీనప్ప దెయ్యం మీద చూపించే ఆసక్తిలో కొద్దిగానైనా తాపి పనిమీద మరలించి ఉంటే ఈ వేళకు మా నీళ్ళ ట్యాంక్ పని అయిపోయేది కదా!

ఈ మధ్యలో సీనప్పడి తిరుపతి క్షౌరంకు బలైన గిరాకీలు మా ఇంటికి అతనికని వెతికేందుకు వచ్చి మా ఇంట్లో జరుగతున్న ఈ దెయ్యం భాగోతం తెల్సుకొని నానారకాల సలహాల్ని, సూచనల్ని ఇస్తుండటమే గాకుండా మా ఊరంతా ఈ దెయ్యం పీడ గురించి కథల్ని వ్యాపింపజేసారు. మొత్తానికి దెయ్యం తలుపు కొట్టేదాన్ని నిల్పేసేవరకూ మా సిమెంట్ ట్యాంక్ పని సాగేది లేదని నాకు కచ్చితమైంది. ఈ అవివేకి ముసలోళ్ళ రాద్ధాంతంకు అడ్డుకట్ట వేసేందుకు నేను ప్రవేశించాల్సిన అవసర పరిస్థితి ఉంది ఇప్పుడు.

దెయ్యం సంశోధనలో నేను చేసిన మొదటి పని ఏమిటంటే ఆ ఇద్దరు ముసలోళ్ళను ఆ స్టోర్ గదినుంచి బయటకు పారద్రోలి ఆ తొట్టిపనికి పురమాయించాను. నేను క్రమబద్ధంగా సైంటిఫిక్‌గా ముందుకెళ్ళేందుకు నిర్ధారించుకొన్నాను. దెయ్యం ఉత్తిగనే డోర్ కొట్టే సప్పుడ్ను చేసేందుకు సాధ్యమే లేదు. అందుచేత అదేదో ఒక వస్తువును మరొక వస్తువునుంచి దంచుతుండొచ్చేమో? దెయ్యం ఏ వస్తువునుంచి మరోదాన్ని దంచుతుంది తర్వాత చూద్దాంలే, ఇప్పుడు ప్రస్తుతం ఏ వస్తువును కొట్టుంది అని పరిశీలించేందుకు నిశ్చయించాను. ఒక కర్ర తీసుకొని స్టోర్‌లో దాబెట్టిన అన్ని వస్తువులమీద మొట్టుతూ వచ్చాను. ఖాళీగా పడి ఉన్న తేనెపెట్టెలు, కిరోసిన్ డబ్బా, గ్యామాక్సిన్ డ్రమ్ము, వ్యవసాయ పనిముట్ల భోషాణం, పెంకులు, తలుపు, కిటికి... వీటన్నిట్ని కర్ర నుంచి మొట్టుతూ స్టోర్ వెనక వేసిన గాజు కిటికీని మొట్టినప్పుడు మాత్రం దెయ్యం తలుపును కొట్టే సప్పుడు వచ్చింది. ఆ సప్పుడు ఎంత యథాతథంగా ఉందంటే మారడూ, సీనప్పా దెయ్యమే మరలా తలుపు తట్టుంది అని మాట్లాడుకోసాగారు. దెయ్యం తలుపు కొట్టేసప్పుడు ఎల్లప్పుడూ ఒకే రీతిగా ఉంది. అంటే దెయ్యం కిటికి తలుపుకున్న గాజునే ఎల్లప్పుడూ తట్టుంది అనేది తెల్సివచ్చింది నాకు. అయితే దేన్నుంచి మొట్టుంది అనేది తెల్వలేదు.

"ప్యారడ్ని స్టోర్‌లోపల్నుంచే వెనకాల ఉండే కిటికీని చూడు... ఎలుకో పందికొక్కో అక్కడ గొడవ చేస్తుండొచ్చు" అని చెప్పి అతడ్ని నిశ్శబ్దంగా కూర్చోబెట్టి తలుపు మూసి బయటకు వచ్చాను. నేను అతడ్ని కూర్చోబెట్టి ఒకట్రెండు నిమిషాలు కాలేదు. ప్యారడు తలుపును దడదడ గుద్ది బయటకు పరిగెత్తుకొని వచ్చాడు. దెయ్యాన్ని

కనుక్కోరో అని చిలక్కి చెప్పినట్లు చెప్తే, ఎలుకల రూపంలో స్టోర్‌లోపల దెయ్యం తిరుగుతున్నదని, అందుచేత భయం కలిగి పరిగెత్తికొని వచ్చానని చెప్పాడు.

"సాయెబ్బులకు దెయ్యం భయపడతుదని చెప్పావు కదా?" అని అన్నాను.

"అది సరేసార్! అయితే నేను ఇంతవరకూ ఎన్నడూ గొడ్డు కూరను తినలేదు కదా సార్!"

ప్యారడు స్టోర్‌లోపల ఒకడిగానే కూర్చుని దెయ్యంకని ఆలోచిస్తున్నప్పుడు అతనికి గొడ్డు మాంసంను ఇప్పటివరకూ తిన్నానో లేదో అనే అనుమానం మొదలైందట. తను అసలు సిసలైన సాయెబ్బుల పోరడ్ని కాదని (ఖాన్ వంశస్తుడ్ని కాదని) దెయ్యంకు గుర్తైతే మరేమి కష్టం కలుగుతదో అని బెదురు పుట్టి పరిగెత్తుకొని బయటకు వచ్చాడట! "దెయ్యాలు లేవని భావించితే మీరే కూర్చోండి... ఆ పోరడ్ని ఎందుకు కూర్చోబెట్టారు? అని సీనప్ప వ్యంగ్యంగా కొంకు మాటల్ని మాట్లాడాడు. నేను ప్యారడ్ని కూర్చోమని చెప్పింది, అతనికది (ప్యారడుకు) నక్కి కూర్చుండేది సులభతరంగా ఉంటదని భావించి చెప్పానంతే! సీనప్పడి వంకర మాటలకు నాలో కోపం వచ్చింది.

చివరికి నేనే దొంగలాగ నక్కి కూర్చొని దెయ్యాన్ని కనుగొన్నాను. అదొక మడివాళ పిట్ట (Magpie Robin) వచ్చి నిరంతరంగా కిటికికున్న గాజును ముక్కునుంచి మొట్టుతూ ఎగిరి వెళ్ళిపోతుండేది. మేము చూద్దామని వెళ్ళిన తక్షణమే మా అడుగల సప్పుడ్నుంచి ఆ పిట్ట ఆ గాజును మొట్టేది ఆగిపోతుండేందుకు అదే కారణం కదా!

మా ఇంట్లోని గాజు దర్పణంకు అప్పుడప్పుడు పిట్టలు వచ్చి ఢీకొట్టి చనిపోతుండేవి. నా స్కూటర్ అద్దంలో పిచ్చుకలు వచ్చి కూర్చొని ఎల్లప్పుడూ ఆ అద్దాన్ని మొట్టుతుండేవి. గాజులోపల కనబడే ప్రతిబింబాన్ని వేరొక పిట్టగా భావించేవో లేకపోతే ఆ గాజులోని పారదర్శక తెరవెనుక మరేమి ఉందో అని చూసే కుతూహలంనుంచో, ఆ మడివాళ పిట్ట వచ్చి కిటికి గాజును మొట్టుతుండేది. పిట్ట గాజును మొట్టేది ప్రారంభం చేస్తే ఒకసారి ఆ మొట్టేదాన్ని ఆపేది లేదు. ఎంత

బెదిరించి పారద్రోలినా మరలా ఎలాగోలా వీలు చూసుకొని వచ్చి మొట్టుతూ కూర్చుంటది.

కిటికి తలుపు కొట్టుంది ఈ మడివాళ పిట్ట పని అని తెల్సిన మీదట ప్యారడు దాన్ని పారద్రోలేందుకు ఎంతగానో ప్రయత్నిస్తుండేవాడు. అది ప్యారడు కిటికి దగ్గరకు వచ్చిన తక్షణమే అడవిలోకి వెళ్ళి తర్వాత మరలా వచ్చి కూర్చుని అలుపు సొలుపు లేకుండా మొట్టుతుండేది. "అడవిలో ఉండే పక్షి ఎందుకు స్టోర్ కిటికి తలుపు తట్టుంది? దెయ్యమే పక్షి రూపంలో వచ్చి ఈ పనిని చేస్తుంది. ప్రమిదను మరలా వాపస్సుగా పాతిపెట్తే తప్పితే అది వెళ్ళేది లేదు" అని సీనప్ప అంటున్నాడు.

ఒక వారం లోపే ఆ పక్షి మొట్టినందున కిటికీకి ఉండే గాజు పగిలి, పైనుంచి కిందదాకా రెండు భాగాలన్నట్లుగా చీలింది. అది ఇకనూ లోపలికి వచ్చేందుకు ప్రయత్నిస్తుందని భావించుకొన్న ప్యారడు ఆ కిటికీని తెరిచే ఉంచాడు. పక్షి లోపలికి వచ్చినా అక్కడే కూర్చుని తెరిచి ఉంచిన కిటికీ గాజును మొట్టుతూ కాలం గడిపేది. ప్యారడు ఒకసారి లోపలికి వచ్చి అది మొట్టుతుండగా బయట్నుంచి తలుపు మూసి దాన్ని స్టోర్‌లోపలే వెంటాడాడు. భయపడిన పక్షి స్టోర్ గదికి తాపించిన మంగళూరు పెంకుల సందునుంచి దూరి ఎలాగో చేసి తప్పించుకొంది. తర్వాత స్టోర్‌లోపలికి వచ్చి మొట్టుండే అపాయంను గ్రహించుకొన్న పక్షి అడవిలోపలికి పారిపోయింది మరలా వెనుదిరిగి రానేలేదు. "సాయెబ్బుల పోరడ్ని చూసి బెదరిన దెయ్యం పారిపోయింది శాశ్వతంగా" అని సీనప్ప చెపుతూనే ఉన్నాడు ఇప్పుడు కూడా!

★ ★ ★

కన్నడ భాషలో దివంగత పూర్ణచంద్ర తేజస్విగారు రచించిన "అవాంతరద సీనప్ప" అనే కథను యథాతథరూపంగా తెలుగులోకి అనువదించాను.

శాఖమూరు రామగోపాల్.

18-08-2010.

# మాయామృగం



"ఔనండి! దెయ్యంకు ఒక రూపం ఉండాలి కదా" అంటూ షా నన్ను ప్రశ్నించాడు.

"రూపం ఎందుకు?"

"మరిక నరమనుషుల కళ్ళకు కనబడేది ఎలా?"

ఆ ప్రశ్నకు నేను అప్పుడు యోచించాను. "ఔను కదా!" అన్పించింది. మనిషికి బయట లోకంలో ఏదైనా వాస్తవం తెల్పాలంటే పంచేంద్రియాల మూలంగానే కదా! రూపమో, వాసనో, శబ్దమో... ఎలాగో ఒకటి భౌతిక రూపంగా వస్తేనే మాత్రం అది దెయ్యం కావొచ్చుని మనకు గుర్తొతది.

"మీరు చెపుతుంది సరేనండి! దెయ్యం మన కళ్ళకు కనబడాలంటే దానికొక ఆకారం తప్పని సరిగా కావాల్సే ఉంటది" అని చెప్పాను షాతో.

"అది సరే! ఇప్పుడు ఇక్కడున్న కళేబరంకు ఏదో ఒక రూపం ఉందని చెప్పుకొన్నా, ఏదో ఒక రూపం ధరించి వచ్చిందని అనుకొన్నా, దెయ్యం ఫలానా ఈ రూపంలోనే వస్తదని అప్పుడు మనం తెల్సుకొనేది ఎలాగ?" అంటూ షా మరు ప్రశ్న వేసాడు.

"అది చాలా తేలికండి. ఇప్పుడు దెయ్యం ఒక యువతి రూపంలో వచ్చిందని భావించుకోండి. ఈ నడిరాత్రి అమావాస్య వేళలో ఈ స్మశానంలో మన వద్దకు ఈ యువతి వచ్చింది ఎందుకయ్యా అనే అనుమానం కలిగేది మనలో ఉండదా? తక్షణమే మనకు తెలుస్తది ఇది దెయ్యం చేష్టే అని".

"అదేనండి నేనూ యోచిస్తుంది. దెయ్యం యువకుల్ని చూస్తే యువతిరూపంలో, యువతుల్ని చూస్తే యువకుడి రూపంలో వస్తదనేదంతా మన ఊహే కదండి! ఇదేంటి కలాశాల విషయమా? ఇది స్మశానం కదండి! ఒక బర్రె రూపంలోనో, ఒక గాడిద రూపంలోనో వస్తే?"

"అప్పుడు కూడా మనకు అనుమానం వస్తది కదా... ఇదేందయ్యా వారసులు లేని బర్రెగా స్మశానంలో ఎందుకు తిరుగుతుంది అని?"

"ఔనండి... ఈ ప్రశ్న అంత సులువుగా లేదని తెల్సుకోండి! మీ వేషాన్ని వేసుకొని నా ఎదురులో వస్తే? నా వేషంలో మీ ఎదురు నిలబడితే అప్పుడు ఏమి చేయాలి?"

"అయ్యో రానీయండి చూద్దాం! వచ్చినప్పుడు కదా ఈ సమస్యంతా" అని నేను ఉదాసీనంగా చెప్తూ నా చేతిలో ఉన్న కట్టెనుంచి చితి మీదున్న బూడిద కుప్పను కెలకసాగాను.

"ఛు...! ఛూ...!! దాన్నెందుకు కెలుకుతారు" అన్నాడు షా.

"ఏదైనా ఒక మహిళ శవాన్ని దహించితే, ఆ శవంకు ఉండే ముక్కుపుడక లోని ముత్యం, వజ్రాల చెవికమ్మలు దొరుకుతవేమో అని కెలుకుతున్నానండి" అని అన్నాను.

"వాటన్నిట్ని విప్పి, ఆ తర్వాతే చితికి నిప్పు పెట్టారు కదా!" అని నాకు జ్ఞాన బోధ చేసాడు షా.

బూడిద కుప్ప నుంచి కొన్ని మూలిగెలు బయట పడినవి. ఎవరిదో కళేబరాన్ని సరిగా తగలబెట్టనే లేదు కదా అని అనుకొంటూ, నా చేతిలో ఉన్న కట్టెనుంచి మూలిగెల మీద రెండు వేట్లు వేసా! నిప్పు సెగకు ముదుచుకుపోయిన ఆ మూలిగెలు పుళక్కనే విరిగి బూడిదైనవి.

ఆకాశమంతా దట్టంగా మేఘాలనుంచి కప్పబడి ఉంది. దూరానున్న వీధి దీపాల వెలుగుల నుంచి ఊరు అస్పష్టంగా కనబడుతుంది. నేను మరియు షా... ఇద్దరం స్మశానంలో దెయ్యాలు కనబడుతవేమో అని పరీక్షించేందుకు ఈ అమావాస్యలోని అపరాత్రిలో ఇక్కడికి చేరుకొన్నాం. మా సంగీత మేష్టారైన దాసప్పగారు అమావాస్య నడిరేయిలో స్మశానంకు వెళ్తే దెయ్యం తప్పకుండా కనబడుతదని, ధైర్యం మాలో ఉంటే తప్పని సరిగా వెళ్ళండని సవాలు చేసాడు.

ఎంతసేపు వేచి ఉన్నా మాకేమి కనబడలేదు. దెయ్యాన్ని పిచ్చిపిచ్చిగా రేగించితే, అప్పుడు అది కోపించుకొని మాకు కనబడొచ్చని ఊహించి నోటికొచ్చినట్లుగా అశ్లీల తిట్లనుంచి తిట్టాడు షా. ఎలాగెలాగున బూతు పురాణం విప్పినా అవేవి దెయ్యానికున్న మర్మస్థానంకు తాకినట్లుగా కనబడలేదు. నేను షా గారి బూతు మాటల పంచాంగంకు కలాత్మకంగా తల ఊపుతూ కూర్చున్నాను. చివరికి షా గారి తిట్ల పురాణంలోని అంబుల పొది ఖాళి అయ్యింది. నోరు నొప్పి పెట్టినందున షా ఇప్పుడు మిన్నకుండిపోయారు.

ఆ స్మశానంలో శవ దహనం కని మూడు వేదికల్ని బండరాళ్ళనుంచి కట్టారు. బహుశః మూడు వర్ణాలోళ్ళకు అనువుగా మూడు వేదికలు ఉండాలని కట్టారో ఏమో! ఆ మూడు వేదికల మీదా బూడిదరాశి ఉంది. కొంచం దూరాన పూడ్చిపెట్టి శవ సంస్కారం చేసిన సమాధులున్నవి. వాన రభసనుంచో లేకపోతే కొత్తగా వచ్చిన శవాల్ని పూడ్చేటప్పుడు బయటపడిన ఎన్నో మూలిగెలు, పగిలిన కపాలంలు అక్కడంతా చెల్లాచెదురై పడియున్నవి. కొంచంసేపు నేను ఏమి మాట్లాడకనే ఉత్తిగనే

అక్కడంతా చెల్లాచెదురై పడియున్న వాట్ని అవలోకిస్తూ కూర్చున్నాను. పుట్టినోళ్ళందరూ చిట్టచివరికి రావాల్సి ఉన్న ఈ స్థలం గురించి నాలో ఏవేవో విచిత్ర భావాలు విజృంభించి రాసాగినవి. అప్పుడే ఆ సమయానే ఆరంభమైంది షాలో ఒక భావన. దెయ్యం ఏదైనా ఒక రూపంలో వస్తే దాన్ని గుర్తించేది ఎలాగున అనే సంశయం? కొంచం సేపు గడిచిన తర్వాత షా గారి అనుమానాలు నా మనస్సునూ ఆక్రమించుకోసాగినవి.

"దెయ్యాలు మన మానవుల రూపంలోనే వచ్చి మనకి కష్టాలు ఇచ్చేందుకు ప్రారంభాల్ని చేసే మొదలే, మనం ఈ స్మశానం నుంచి వెళ్ళిపోయేది మంచిదేమో కదా షా?" అన్నాను నేను.

"నేనూ దాని గురించి యోచిస్తూ ఉంటే, ఇప్పుడొక ఉపాయం నాలో మెరుస్తుంది. దాని ప్రకారం మన రూపాల్నే ధరించి వచ్చే తుంటరి దెయ్యాలు మనల్ని మోసగించనట్లుగా వాట్ని నిలపొచ్చు... చూడండి నిశితంగా నా యోచనను" అన్నాడు షా.

"ఏమిటండి మీ యోచన?"

"చూ బిట్సిం: కుంట్సుపు" అన్నాడు షా.

అలాగున పలుకగా అది ఏమిటనేది తెల్వక ఎంతగానో గలిబిలి అయ్యి, వారి ముఖాన్నే చూడసాగాను.

"అది ఏ మంత్రం అండి? మేడ్ ఇన్ జపాన్ మంత్రంలా ఉంది కదా! జపాన్ భాషలోని మంత్రమా అది?"

"ఇది మేడ్ ఇన్ చైనా మంత్రం అండి! ఈ మంత్రం మన ఇద్దరికీ సంకేత పదాలుగా ఉపయోగపడుతవి. నేను మిమ్మల్ని పిల్చిన తక్షణం "చుం బిట్సిం" అంటూ ఆ తర్వాతే మీరు మిగిలిన మాటల్ని ప్రారంభించాలి. మీరు నన్ను పిలిస్తే "కుంట్సుపు" అని నేను అంటాను. ఈ మంత్ర సంకేతంను మనం ఉచ్ఛరించక పోతే అది దెయ్యమే; నేను కాదు అనే అర్థం కలుగుతది" అన్నాడు షా.

"ఇదెందుకు చైనా పదాల్నే పలకాలి? మరేదైనా కన్నడమందో, సంస్కృతంలోని పదాల్నో ఉచ్ఛరించేది మంచిదేమో కదా!" అన్నాను నేను.

"వద్దు; వద్దు! దీన్ని మొన్న భాషాశాస్త్రం మీద పాఠం చెప్తూ మన మాష్టారు చెప్పారు కదా! మన వాడుక భాషలో ఉన్న పదాలైతే దెయ్యాలు సైతం తెల్సుకొని దురుపయోగం చెయొచ్చు" అన్నాడు షా.

అప్పటికి మా కెదురైన సమస్యకు ఒక ఉపాయం చూపించారు షా. అయితే షా గారు చైనా భాషలోనిదని చెపుతున్న ఈ సంకేత పదాలమీద నాకంతగా రుచించలేదు. చుం బిట్సిం మరియు కుంట్సు ఫు పదాల్ని మరవకనే ఉండేందుకని నేను వాట్ని పదే పదే మననం చేసుకొంటూ బట్టి పెట్టసాగాను.

షా ఒంటేలు పోసుకొని వచ్చేందుకు లేచాడు. ఇక ఇప్పుడు నాకేమో నా సంకేత పదం జ్ఞాపకంకు వస్తే వారికుండే సంకేత పదంను మరిచిపోయినట్లుగా ఉంది. ఒకసారి వారి సంకేత పదం జ్ఞాపకంకు వస్తే, నాది మరిచినట్లుగా ఉంది. ఇద్దరి సంకేతపదాలు జ్ఞాపకంలోకి వస్తే ఎవరివి ఏఏ సంకేత పదాలు అనేదాన్ని మరిచిపోతున్నాను. భగవన్నామ స్మరణ చేస్తూ జపం చేసినోడిలాగ జపించసాగాను ఆ పదాల్ని. పరిచితమైన పదాల్నేమైనా సంకేత పదాలుగా చెప్పియున్నట్లైతే నాకు బాగుండేది. ఇప్పుడు ఇక్కడ ఈ స్మశానంలో దెయ్యాన్ని అన్వేషించేందుకు వచ్చినోడ్ని, దాన్ని వదిలి ఈ మేడ్ ఇన్ చైనా పదాల్ని పఠిస్తూ కూర్చున్నాను కదా!

అంతలో నా వెనక సప్పుడైంది. షా వెనుదిరిగి వచ్చియుండొచ్చని తల తిప్పి చూసాను. షా నిలబడి ఉన్నాడు. "ఏమిటండి?" అన్నాను. 'కుంట్సుఫు' అని ఉచ్ఛరిస్తూ నా సంకేత పదం పేరు పెట్టి పిలిచారు. బహుశః దెయ్యం వచ్చినప్పుడు పలకాల్సిన విధంలో రిహార్సల్ చేస్తున్నట్లుగా షా నుంచి కనబడింది నాకు.

షా కొన్ని నిమిషాల క్రితమే చెప్పిన సంకేత పదంను అదెంతగానో బట్టి పెట్టినా పూర్తిగా ఆ క్షణాన మర్చిపోయాను దాన్ని. మొత్తం ఆ సంకేత పదంను అటుండనీయండి, దాన్లోని మొదటి అక్షరం సైతం ఇప్పుడు నా జ్ఞాపకంకు రావట్లేదు. నేను ఉక్కిరి బిక్కిరై ఆ సంకేత పదాన్ని తలలోపల వెతుకుతూ షా వైపుకు పిలిపిలిగా

కంటి రెప్పల్ని కొట్టాను. షా నా వైపుకు విచిత్రంగా కఠోరంగా చూస్తున్నట్లుగా కనబడింది. సరైన సమయానికి షా అప్పగించిన ఈ దరిద్ర చైనా సంకేత మంత్రం నా మెదడు నుంచి తప్పించుకొంది కదా!

షా చేతిలో కట్టె పట్టుకొని, దాన్ని ఝుళిపిస్తూ నా వైపుకు తిరిగి దెయ్యాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్నోడిలాగ "ఓయ్, ఓయ్... నీ మాయ నా దగ్గర నడ్వేది లేదు. నీ వేషంగీషం అంతా కట్టేసుకో. చెప్పు నువ్వెవరో" కర్కశ స్వరం నుంచి అడిగారు. ఇప్పుడు ఈ కథను చదువుతుంటే మీ కందరికీ నవ్వు వచ్చినా, ఆ స్మశానంలో నడిరాత్రిలో బడిత కర్ర పట్టుకొని షా అలాగున అంటుంటే నాకు నిజంగానే దిగులైంది. ఊర్లలో భూత వైద్యులు దెయ్యాలు పట్టినోళ్ళను దెయ్యం వదిలేందుకని బడితకర్రతో బాదేదాన్ని ఎంతోమంది మానసిక రోగుల్నుంచి చూసి ఉన్న నా కిప్పుడు  దిగులైందాన్లో అస్వాభావికం ఏమి లేదండి!.

అయితే ఎంతోసేపు మననం చేసుకొన్నా ఆ దరిద్ర సంకేత పదంను, నేనెన్నడూ దాన్ని వినలేదన్నట్లుగా ఇప్పుడంతా పూర్తిగా మరిచేపోయాను కదా దాన్ని! షా ఇంకేంటి బడితకర్ర నుంచి బాదుతాడేమో అనుకొంటుండగా ఆ సంకేత పదం నా తల లోపలున్న జ్ఞాపక శక్తిని హరించి అది బయటకు రానట్లుగా నశించిపోయింది. జ్ఞాపకం చేసుకొనేవరకూ కొంచం నిధానించండి అని చెప్పేందుకు సంజ్ఞె చేయాలని చేతిని ఎత్తాను.

"హుం చెప్పు నువ్వెవరివో" అంటూ షా మరొకసారి ఘర్జించి ఒక అడుగు ముందుకు వేసాడు.

"ఓహో! పరిస్థితి ఎందుకో చేజారుతుంది; ఇద్దరి మీదా దెయ్యాలు ప్రభావం చూపెట్టున్నవి. మేమిద్దరం అకస్మాత్‌గా ఇక్కడేమైనా కొట్లాడుకొని తలలు పగులగొట్టుకొని చస్తే రేపు ఉదయంలో మా ఇద్దరి కళేబరాల్ని చూసిన జనం ఎలాగెలాగో భావించుకొనేది ఇక కచ్చితమేనని తలపోస్తూ తొందరగా ఏదైనా చేయాల్సి ఉంది" అని యోచిస్తుండగా షా మరొక అడుగు ముందుకే వేసాడు మరలా.

"ఒక నిమిషం ఆగండి. మీరు చెప్పిన ఆ దరిద్ర చైనా మంత్రం ఎందుకో నా తలలో మెరవట్లేదు ఇప్పుడు" అని భయంతో నిండిన స్వరం నుంచి అరిచాను. నా ఈ చివరి వాక్యంను విన్న షా "అయ్యయ్యో మీరేనా! థూత్" అని తాత్సారంగా పలికాడు. నేను దెయ్యం కాదు, ఒరిజినల్ మనిషినే అని తెల్సుకొన్న షా గారికి ఇప్పుడు ఆశాభంగమై ఉండొచ్చు!

షా మరలా వారి దరిద్ర చైనా సంకేత మంత్ర పదాల్ని నాకు చెప్తుండగా మూడో వేదిక వద్ద పటపట సప్పుడై ఒక చిన్న పొగలోని మేఘం పైకొచ్చి ఆకారం పొందసాగింది. పిల్ల చేష్టలన్నట్లుగా ఆరంభమైన మా దెయ్యాల సంశోధన మెల్లగా బిగుసుకు పోతున్నప్పుడు ఈ సంగతి జరిగింది. ఆ పొగే ఇప్పుడు దెయ్యంగా రూపాంతరం చెందుతుందనేది ఊహించి భయపడ్తూ చూడసాగాం. అయితే ఆ పొగ ఏ రూపం చేసుగోకనే మరలా చితిమీదున్న బూడిదరాశి మీదే దిగి అంతర్ధానమైంది. ఇంకా నిప్పులున్న ఏదో కట్టెనో, నిప్పు కణికో చటపటగా పగిలి పొగను రేపిందని ఊహించాము. అయినా దాన్ని సరిగా పరీక్షించకనే ఉండేది సరికాదని అక్కడికి వెళ్ళి చూసాం. గజ్జి పట్టిన ఒక నాటు కుక్కపిల్ల అక్కడ ఆ చితిలో ఉన్న బూడిద కుప్ప మీద పడుకొని నిద్రపోతుంది. వెచ్చగా ఉన్న ఆ బూడిద కుప్ప దానికెంతగా అప్యాయమానంగా ఉందంటే మా వైపుకు అది ఒకసారైనా తిరిగి చూడకనే ముడుచుకొని చచ్చిన శవంలాగ నిద్రపోతుంది. ఇది ఇలాగే పడుకొంటే ఎవరైనా శవాన్ని కాల్చేవారు దీన్ని చితాగ్నికి సమర్పిస్తారేమో అని నాకు అన్పించింది.

"ఇది ఎటువంటి స్మశానం అండి! ఒక పెద్ద దెయ్యం కూడా ఇక్కడ స్థిర నివాసం చేసుకొన్నట్లుగా లేదు. నడవండి వెళ్ళిపోదాం. ఆ సంగీత మేష్టారు విప్పసారా తాగి ఏదాన్ని దెయ్యంగా భ్రమించారో ఏమో!" అంటూ షా వెనుదిరిగి వెళ్ళే నిర్ధారంను ఘోషించాడు.

నాకూ షా తీర్మానం సరేనని అన్పించింది. దెయ్యాలు ఉండేదాని గురించి, అవి మనుషులకు కనబడుతవనే దాని గురించి మాకు సుతరాం నమ్మకంలేదు. అయితే దెయ్యాల్ని నమ్మేది లేనందుకూ, భయంకూ ఏ సంబంధమూ లేదని

కనబడుతుంది మాకు. మేము ఆలోచిస్తుండగా నాస్తికులుగా, విచారవాదులుగా అవుతూ ఆ కారు చీకట్లలోని ఒంటరితనంలో హృదయంలో దాగిన సుషుప్త భావనల్ని గుర్తుకు తెచ్చుకొంటున్నప్పుడు మరో పార్శ్వంలో దెయ్యాలు ఉంటవేమో అనే అనుమాన పక్షులుగా మారుతున్నాం కదా!

మా సంగీత మేష్టారు వీణలోని ప్రభేదాల్ని చెప్తూ సరస్వతివీణ, రుద్రవీణ, గోటువాద్యం, విచిత్రవీణ మొదలైనవాట్ని ప్రస్తావించి చివరిగా కిన్నెరవీణ అనేది ఒకటి ఉంటదని, గద్దలకు ఉండే ఎముకల్నుంచి తయారు చేసిన దీన్ని మ్రోగించితే 'మోహిని దెయ్యం' ఎక్కడున్నా శీఘ్రమే వచ్చి నర్తిస్తదని చెప్పారు. అప్పట్నుంచి మొదలైంది మాకు వారికీ దెయ్యం గురించి వివాదం. భారతీయ సంగీతంకూ... దైవభక్తి, మూఢ నమ్మకం, దెయ్యం, భూతం... వీటి నడుమ ఏదైనా నికట సంబంధం ఉందో ఏమో! ఎందుకంటే నేను చూచిన ఎంతోమంది సంగీత మాష్టార్లు ఈ విధంలోని సంగీతం గురించి నమ్మలేని కట్టు కథల్ని చెప్పి రోమాంచనం కల్గించేదాన్లో నిపుణులు కదా! బర్కతుల్లాఖాన్ సితార నుంచి దీపక రాగంలోని ఆలాపన ఆరంభించిన తక్షణమే ఆస్థానంలోని కుర్చీకి నిప్పు అంటుకొందని, కరీంఖాన్‌సాబ్ మల్హార్ రాగం పాడుతుండగా వాన వచ్చి జల ప్రళయమే అయ్యిందని, అల్లాదియాఖాన్ సాబ్ సరోద్ వాద్యం నుంచి ఆడాణ రాగం ఆరంభించిన తక్షణమే వారి సరోద్ వాద్య పరికరం విస్ఫోటనమైందని.... ఇలాగున ఒకటొకటి కట్టుకథలు చెలామణిలో ఉన్నవి కదా! చివర చివరికి వీట్నుంచి మాకు సంగీతం మీద ఆసక్తి రేకెత్తేది బదులుగా దెయ్యం, పిశాచాలగురించే ఆసక్తి కల్గి మా విద్యాభ్యాసంకు ఏ సంబంధమూ లేని దెయ్యాల అన్వేషణకని రాత్రివేళ ఊరి బయట ఉండే స్మశానంలో వామాచారులన్నట్లుగా కాలం గడపాల్సి వచ్చింది కదా.

★ ★ ★

మేము ఊర్లోకి తిరిగి వచ్చినప్పుడు గూర్ఖా కర్రనుంచి కరెంట్ స్థంభాన్ని మొట్టుతున్నాడు. మమ్మల్ని చూసి "కౌన్ హై" అంటూ ఏవేవో మాటల్ని హింది భాషలో గొణుగుతూ గదిరించాడు. ఊర్లోకి మేము చేరుతుండగా మా భావనలలోని యోచనాలలో మార్పులు కలగసాగినవి. స్మశానంలోని మృత కళేబరాల గంభీర

జగత్తునుంచి మరలా గలిబిలిగా ఉండే పరిచితమైన జీవన్మయ జగత్తుకు వచ్చినట్లుగా అన్పించి మా విచార శక్తిలోని చైతన్యాలు జాగృతం కాసాగినవి. స్మశానంలో మాకు కొద్దిగానైనా భయం కాలేదని చూపించేందుకు దెయ్యం మీద తాత్సారంగా మాట్లాడు కోసాగాం. ఒక అర్థంలో దెయ్యం ఉందని, అయితే దాన్ని మేము కేర్ చేసేదే లేదన్నట్లుగా మా మాటల ధోరణి ఉంది కదా!

"చూడండి... దెయ్యమైతే ఉందిలే! అయితే స్మశానంలో కాదు" అన్నాడు షా.

"అలాగైతే ఊర్లో ఉంటవని అంటారా?"

"అక్కడా కాదు"

"అలాగంటే"

"మన తలలలోనే అండి"

"మన తలలలో ఉండేది మెదడు కదా..."

"కరెక్ట్! దాన్లోపలే దెయ్యం ఉంటది. మొన్న తనంతతనుగానే ఈ విషయం నాకు తెల్సి వచ్చింది. రాత్రి ఒక్కడ్నే సైకిల్ తొక్కుతూ వస్తున్నా! రాత్రి సుమారు పదిగంటలు! సుయ్యో అన్నట్లుగా ఈత వనాల్నుంచి గాలి వీస్తుంది.

అప్పటికప్పుడే అలాగే ఒక ఆలోచన వచ్చింది. ఇప్పుడొక దెయ్యం నా సైకిల్ క్యారేజ్ మీద కూర్చుంటే అని. నేను ఎంతగా ఆ కల్పనను విరోధించినా దాన్నుంచి తప్పించుకొనేందుకు సాధ్యం కాలేదు. ఆ దెయ్యం తలకు వేసుకొన్న ముసుగు తీసేసి బయటకు రానే వచ్చింది. నిధానంగా నా క్యారేజ్ మీద ఎవరో కూర్చున్న తూకం పడసాగింది. అది అటు ఇటు కదుల్తూ నా సైకిల్ బ్యాలెన్స్ ఏరుపేరైనట్లుగా చేయసాగింది. నాలో వెనుదిరిగి చూసేందుకు భయం ఉంది. చూసినప్పుడు అది కూర్చొని ఉంటే ఏమి చేయగలం? వెనక్కి సైతం తిరగకనే మణుగుమణుగుల బరువుతో ఉన్న ఆ దరిద్ర దెయ్యాన్ని కూర్చోబెట్టుకొని చెమట కార్చుతూ ఎత్తులో సైకిల్ తొక్కుతున్నోడిలాగ తొక్కానండి! నేను దాని బరువుకూ, అటు ఇటు అది కదిలే దాన్కి బెదరనిది చూసిన ఆ దెయ్యం అప్పుడేమి చేసిందో చెప్పనా! చెమట

కార్చుతూ పళ్ళ బిగువున సైకిల్ తొక్కుతుంటే నా చంక వెనుక చక్కిలిగిలి చేసేది మొదలు పెట్టింది. చూడండి ఎలాగుందో ఆ దెయ్యం పీడ! ఇక మాత్రం సాధ్యంకాదు దాని చేష్ట భరించేది అని అన్పించింది. క్యారేజ్ మీద కూర్చుని ఏదో మన సినిమాలలో చూపిస్తుండే సన్నివేశంలాగ ప్రియురాలు ప్రియరమణుడికి చక్కిలిగిలి పెట్టున్నట్లుగా ఉంటే ఎలాగున నేను సైకిల్ తొక్కేది? బ్రేక్ వేసి సైకిల్ నుంచి ఎగిరి కిందకు దూకాను” అంటూ షా తనకైన దుఃస్వప్నం లాంటి అనుభవం ఒక దాన్ని చెప్పారు.

“దెయ్యం అప్పుడేమి చేసింది?”

“ఎక్కడ దెయ్యం? దెయ్యం మరిక నా తలలోపలకు వెళ్ళి మాయమైంది. ఆ తర్వాత ఈ గొడవే వద్దనుకొని సైకిల్ నెట్టుకొంటూ బయల్దేరాను. సైకిల్ ఎక్కితే మరలా అది గ్యారంటీగా క్యారేజ్ మీదకు వచ్చేదుంది.”

మనిషిలోని మనః శక్తి మీద అపారమైన సాధ్యతల్ని నాకు వివరించి భయాన్ని కల్గించాడు షా. నేను ఒకరోజు రాత్రి ఒక్కడ్నే అద్దంలో చూస్తూ నిలబడ్డాను. అప్పటికప్పుడు నేను నవ్వకనే ఉన్నా అద్దంలో నా ప్రతిబింబం నవ్వితే అనేది అన్పించగా భయం కలగసాగింది. అద్దంలో ఉన్న నా ప్రతిబింబం ఇంకేంటి నవ్వే తీరుతది అని అన్పించి దిగులై అద్దంనుంచి దూరంగా జరిగాను. షా చెపుతుంది ఒక విధంలో నిజమేనని అన్పించింది.

ఊర్లోని వీధిలో నడుస్తున్నాం. ఇదెంతటి అక్షయ రోడ్! దారి సాగేదే లేదు మానుంచి అని అనుకొంటున్నాను. తెల్లారేది లేదన్నట్లుగా ఆ చీకటికి అంతమే లేనట్లుగా కనబడుతుంది. వీధి దీపాల మంద వెలుగు ఒకటే కొంచెం ధైర్యాన్ని ఇస్తున్న సంకేతంగా ఉంది. చుట్టుపక్కల ఉన్న ఇళ్ళు సప్పుళ్ళు లేనట్లుగా స్తబ్దుగా పడి యున్నవి. బహుశః అందరూ కలలను కంటుండొచ్చు.! లేకపోతే నేనే కలకంటున్నానా? ఖాళీ రోడ్, సప్పుళ్ళే లేని ఇళ్ళు, తల భాగంను అస్తవ్యస్తంగా వాల్చిన వృక్షాలు? ఏది ఉండొచ్చు కలగా నాలో?

వీధి దీపం వెలుగుకు గోడ మీద పడుతున్న మా నీడ ఆ దారిమీద పడుతూ, గోడమీద మరలా పడిలేస్తూ చెట్టుమీద చెంగు చెంగునే ఎక్కుతూ దిగుతూ, మేము

నడుస్తుంటే ఆ నీడ వికటనృత్యం చేస్తుంది. అలాగే మా నీడను మేము చూడాలని అనుకొంటుండగా మరొక చిన్న నీడ మా నీడ వెనకే వస్తుంది కనబడింది.

"అరే! ఇదేంటిది?" అనుకొంటూ మేమిద్దరం వెనుదిరిగి చూసాం. గజ్జిపట్టిన చిన్న కుక్కపిల్ల అది!.

మమ్మల్ని చూసి స్నేహంతో ఉంటానన్నట్లుగా తోక ఆడిస్తూ పటపటగా ఒకసారి వళ్ళు విరుచుకొంది. దానివంటినుంచి ఒక చిన్న బూడిదరాశి పొగ బయటపడి గాలిలో లీనమైంది.

"స్మశానంలో నిద్రపోతుంది ఈ కుక్కే అది కదా!" అన్నాడు షా.

"ఛి ఛీ నడవండి వేగంగా" అంటూ నేను జోరుచేసి రాయి తీసుకొనేవాడిలాగ వంగాను. కుక్కపిల్ల పారిపోయి చీకటిలో మాయమైంది.

"ఇదెప్పుడు మనల్ని అనుసరించి వచ్చింది?" అంటూ షా ఆశ్చర్యపడ్డాడు. అది మా ఇద్దరికీ కనబడినందున అది మాలో ఎవరో ఒకరి మనస్సులోని భ్రాంతి కాదని మాకు కచ్చితమైంది.

"పాడు ముండాకొడుకులు! చిన్న పోరలు చేస్తుండే పని ఇది. కుక్కపిల్లలు నెలల వయస్సులో ముద్దు ముద్దుగా ఉంటవి. మోజుపడి ఇళ్ళకు తీసుకెళ్ళి కొన్నిరోజులు సాకి ఆ తర్వాత గజ్జి గిజ్జి తగిలితే ఇంటినుంచి బయటకు పారద్రోలుతారు. అప్పుడవి కంత్రి కుక్కలుగా మారి ఊరి వీధులలో తిరుగుతూ ఉంటవి" అంటూ ఆ కుక్కపిల్ల మాజి యజమానికి శాపం పెట్టాడు షా.

మేము మాట్లాడుకొంటూ ముందుకే నడుస్తున్నాం. అయినా మాలో అనుమానం ఒకటుంది! మేము ఎవర్నుంచి వెంబడించ బడుతున్నాం అనేది మాలో ఉంది. ఒక మలుపులో వెనక్కి తిరిగి చూడగా మా కాళ్ళక్రిందే నిలబడింది ఆ కుక్కపిల్ల.

"టామీనో, టైగరో... అనేవి దీనికి పేర్లై ఉండొచ్చు కదండి! దాని పేరు పెట్టి పారద్రోలండి... పారిపోతది" అని నేను షాకు చెప్పాను.

"టామి కాదు టైగర్ కాదు! దాని పేరు డెత్; సావు; మృత్యువు కదా! అందుకే అది స్మశానంలో రాజ్యమేలుతుంది. దాన్ని ఇప్పుడు ఊరి లోపలికి తీసుకొచ్చి తప్పు చేసాం" అన్నాడు షా.

"మీరు చెప్పేది అటుండనీయండి. ఈ కుక్క పిల్ల ఇప్పుడు మనల్ని అనుసరిస్తూ వస్తుంది కదా"

"ధర్మరాజు పరలోకంకు వెళ్తుండగా అతని వెనుక ఒక గజ్జికుక్క వెంబడించి వెళ్ళిందట. దాని సంతానమే కదా ఇది" అన్నాడు షా.

ఇంతటి అమావాస్య రాత్రిలో నిర్జీవమైన దారిలో నడుస్తూ షా అపశకునమైన జోకుల్ని వేస్తుంది నాకు మంచిగా కానరాలేదు. ఈ దరిద్ర కుక్కపిల్ల సాహసమే వద్దని నిర్ధరించుకొని అక్కడే లైటు స్థంభం పక్కనున్న డస్ట్‌బిన్ (కసువుతొట్టి) లోపలికి దాన్ని విసిరాను. వేగం వేగంగా దూరంకు సాగి, అది ఆ డస్ట్‌బిన్ నుంచి బయటపడి మరలా ఏమైనా మమ్మల్ని వెంబడిస్తుందేమోనని చూసాం. కుక్కపిల్ల కుంయ్ కుంయ్ అంటూ కసువు తొట్టిని ఎక్కాలని ప్రయత్నిస్తుంది. అది బయటకు వచ్చేలోపే మేము మరింత దూరంకు వెళ్ళిపోదామని పోస్టాఫీసు వరకూ పరిగెత్తాం. అలుపు వచ్చింది. విశ్రాంతి చేసుకొంటూ వెనక్కి చూసాం! మానుంచి ఐదో వీధి లైటు వెలుతురులో కుక్కపిల్ల పరిగెత్తుకొంటూ వస్తుంది కనబడింది. దాన్ని భయపెట్టి పారద్రోలో లేకపోతే మేమే పారిపోయి దాన్నుంచి తప్పించుకొనేది సాధ్యంకాదని మాకు అన్పించింది.

"మనం స్మశానంకు వెళ్ళకుండా ఉండాల్సింది. ఈ కుక్కపిల్ల పీడనుంచి ఒకసారి తప్పించుకొనేది వీలుకానట్లుంది" అని నేను గొణిగాను.

"దెయ్యమే గజ్జి కుక్కపిల్లగా వేషం చేసుకొని అక్కడ ఆ స్మశానంలో పడుకొందని అనుకొంటున్నానండి" అన్నాడు షా.

"మీరు చెప్పేదంతా నవీన కాలంలోని సాహిత్య రచన అన్నట్లుగా ఉంటదండి. సరిగా తార్కికంగా వైజ్ఞానికంగా ఆలోచించండి. దీని పేరు డెత్ కాదూ చావూ కాదు. కేవలం ఇదొక చిన్న కుక్కపిల్ల మాత్రమే! దానికి తిండి పెట్టి పోషించే యజమాని అవసరం ఉంది. అందుకే అది మన వెనకబడింది. దీన్ని ఎలాగైనా

వదిలించుకొనే ఉపాయం చేయండి. ఒకసారి దీని మూతి చూడండి! కుక్క పిల్లే అని చెప్పేందుకు కుదురుతదా? ఒక మంచి గుంటనక్క తరహాలో ఉంది. చిత్తకార్తెలో స్వజాతి ప్రాణి దొరకనందున కుక్కకూ నక్కకూ మైథున క్రీడ జరిగి పుట్టియుండొచ్చు ఇది" అంటూ నాలో ఉద్భవించిన అసహనం నుంచి గొణిగాను.

"ఒక నిమిషం ఆగండి. నా కొక ఉపాయం తట్టింది" అంటూ షా కుక్క పిల్లను పట్టేందుకు దూసుకెళ్ళాడు. అదేమో మరలా తనను కసువు తొట్టిలో విసిరి పడేస్తారేమో అని భావించి దూరంగా పారిపోయింది. అయితే మేము ముందు కెళ్తున్న తక్షణమే మమ్మల్ని అనుసరిస్తూ వస్తుంది. మరలా దాన్ని పట్టుకొనేందుకు షా వెళ్ళగా అది దూరంగా పారిపోతుంది.

దాన్ని పట్టేందుకని ప్రయత్నించి విఫలుడైన షాకు అలుపొచ్చి, "చూడండి దీన్ని. ఇది గ్యారెంటీగా దెత్తే కదండి! స్మశానంలో ఉండే పిశాచమే ఇది. రాతమూలంగా రాసిస్తాను అది ఏంటోనని కావాలంటే! యువతి వేషం ధరించి మన వద్దకు వస్తే డేంజర్‌గా భావించి గజ్జి కుక్కపిల్ల వేషం ధరించి మన వద్దకు వచ్చింది" అని తిట్టసాగాడు షా.

ఆ తర్వాత ఆ కుక్కపిల్లను పట్టుకొని పారద్రోలే ప్రయత్నాన్ని విరమించుకొన్న షా, చేతివేళ్ళ నుంచి చిటికెలేస్తూ, ప్రేమగా అభినయిస్తూ దాన్ని పిల్చాడు మాయల పకీర్‌లాగ. అప్పుడు మాత్రం షా లోని విశ్వాసపూరితమైన నాటక అభినయంకు మోసపోయి దగ్గరకు వచ్చింది ఆ కుక్కపిల్ల. షా దభాల్నే దాని గొంతు దగ్గర ఉన్న చర్మం పట్టుకొని దాన్ని ఎత్తి పక్కనున్న ఇంటి వద్దకు తీసుకెళ్ళారు. కాంపౌండ్ ఉన్న ఇల్లు అక్కడ అది ఒకటే ఉంది. ఆ కాంపౌండ్ లోపలకు సప్పుడు కానట్లుగా దాన్ని వదిలి పెట్టి చేతుల్ని దులుపుకొన్నారు. అప్పటికి ఇక మాకు విసిరిన కట్టెనుంచి తప్పించుకొన్నాం అనేంతగా సమాధానమైంది. మాకు పట్టిన శని వేరెవరికో దాటించినట్లుగా సంతోషమైంది.

మేము అక్కడ్నుంచి నాలుగంటే నాలుగు అడుగులు నడవలేదు. కుక్కపిల్ల కాంపౌండ్ లోపల్నుంచి కుంయ్ కుంయ్ అంటూ లయబద్ధంగా అరుస్తుంది. "ఎవరది" అంటూ ఇంట్లోంచి ఎవరో గడుసు కంఠంనుంచి అరిచాడు. మేము

కొంచం దూరం జరిగి చీకటిమాటున నిలబడి ముందేమౌతదో అని చూసాం. కుక్కపిల్ల కుంయ్ కుంయ్ అంటూ భజనను ముందుకే సాగించింది. ఇంటిలోపలి దీపాలు వెలిగినవి. ఎలుగుబంటులాగ వళ్ళంతా రోమాలమయమైన నల్లటి వ్యక్తి ఒకరు నిద్రాదేవి జోరుకు తూలుకొంటూ బయటకొచ్చి వాకిలి వద్ద లొల్లి పెడ్తున్న కుక్కపిల్లను కసువు పోగు అన్నట్లుగా ఎత్తి బయటకు విసిరి సరసరా లోపలికి నడిచి వెళ్ళాడు.

దీపం ఆరింది. కుక్కపిల్ల పరిగెత్తుకొని మరలా మా వద్దకు వచ్చి తోక ఊపింది. అప్పుడు మేమిద్దరం పరస్పరంగా ముఖాల్ని చూసుకొన్నాం.

“ఎవరండి అతను?” అడిగాను నేను.

“ఎవడో యమధూతై ఉండొచ్చేమో కదండి! కొద్దిగా నిధానించండి... ఒక తమాషా చేస్తాను” అంటూ షా మరలా కుక్కపిల్లను ఎత్తికెళ్ళి ఆ ఇంటి కాంపౌండ్ లోపల వదిలి వేగం వేగంగా వచ్చి చేరాడు నేను నిల్చిన చోటుకు.

మరలా అదే గడుసుధ్వనిలోని అదే ఘర్జన వినబడింది. కుక్క పిల్లను గేట్ బయటకు విసిరి లోపలికి వెళ్తున్నోడు బయటకొచ్చి గేటును తెరిచే వెళ్ళాడు. బహుశః చుట్టూ ఉన్న ఇళ్ళలాగనే తనకూ కాంపౌండ్ లేకుంటే బాగుండేదేమో అని అతనికి అన్పించి ఉండొచ్చు.

కుక్కపిల్ల పరిగెత్తుకొని వచ్చి మా చెంత నిలిచింది.

“ఇది మరణ శునకం కదండి! పిశాచమే ఇది! ఇప్పుడైనా తెల్సిందా మీకు” అంటూ షా మరలా దాన్ని పట్టుకొని అతని ఇంటివైపుకే నడిచాడు. కుక్కపిల్లను మరలా లోనే పడేసి ఆ ఇంటి యజమాని తెరిచి ఉంచిన గేటును మూసేసి పరిగెత్తుకొని వచ్చి నా చాటుకు చేరాడు.

ఈసారి నాకు నిజంగా భయమేసింది. ఎప్పుడూ మృదు హృదయంతో వినోద ప్రియుడిగా ఉండే షా ఇప్పుడెందుకు ఇంత క్రూర వినోదంలో నిమగ్నమైయ్యాడు? అనేది నా మదిని తొలుస్తుంది. అయితే ఇకముందు జరగబోయే దాన్ని చూడాలనే కుతూహలం నన్ను మంత్రం మంత్రించినట్లుగా అక్కడే నిల్పింది.

మరలా కుక్కపిల్ల నుంచి సప్పుడు ఆరంభమైంది. ఈ సారి ఆ ఎలుగు గొడ్డు లాంటి ఆ మనిషిలో సహనం పూర్తిగా నాశనమైందని నాకు కనబడసాగింది. ధడార్ ధడార్ అన్నట్లుగా ఇంట్లో తలుపులన్నిట్నీ తెరిచి బయటకు వస్తున్న అతడ్ని చూసాం. అతను బడిత కర్రతోపాటుగా బయటకొచ్చిన తక్షణమే మాలో ఉన్న ఝుంగాబలమే నశించి వణుకు ఆరంభమైంది. మూసిన గేటును చూసి ధడాల్నే దాన్ని తెరిచాడు. అతని చేతిలో ఉన్న బడితకర్రను చూసి ఎక్కడో ఒక మూలలో దాక్కొన్న కుక్కపిల్ల, అతను అటు ఇటు భాధ్యతగా చూపుల్ని విసురుతుండగా గోడసందు నుంచి దూరి చీకట్లో చీకటిగా మారి మా వద్దకు చేరి నిలిచింది. ఆ ఇంటి యజమాని బడితకర్ర ఊపుతూ తన ఇంటి జాగాన్నంతా పరీక్షగా చూసాడు. నాకైతే ఇతను ఈ ఒకసారి ఇంటిలోపలికి వెళ్తే చాలయ్యా అన్నట్లుగా అన్పించింది. అయితే ఆ ఇంటి యజమాని గేట్‌వద్దే నిలబడి ఆలోచించసాగాడు. అతనికీ ఇది పిశాచం పనే అన్నట్లుగా అనుమానం వచ్చిందేమో కదా!

అయితే అతనికేదో మరో అనుమానం ఉన్నట్లుంది. దెయ్యం చేష్టే ఇది అని నమ్మేందుకు సంశయం ఉంది అతనిలో. ఈ పని వెనుక ఏదో బుద్ధివంతిక ఉందనే అనుమానం! గేట్ వేసిన అతను లోపలికి వెళ్ళకనే గేట్‌మీదే తల వాల్చుకొని వేచి చూడసాగాడు.

డెత్ మా ఎదురు కారుచీకటిలో చీకటిగా మారి తోక ఊపుతూ నిలబడింది. మేము అటు ఇటు కదిలాడేది లేదు. ఆ ఎలుగుబంటు మనిషికి కొద్దిగా జాడ దొరికినా చాలు మా తల పగలకొట్టాడు. సమాధుల లోపల పూడ్చిన శవాల తరహాగా ఆ అమావాస్య చీకటిలో కదలక మెదలకనే నిలబడ్డాం. అయితే ఎంతసేపు నిలబడగలం. ఆ ఎలుగుబంటు మనిషి సూర్యోదయం వరకూ నిలబడి ఉండేందుకు తయారై ఉంటే, ఓరి నాయనో మా గతేంటి?

“ఇదంతా మీ నుంచే అయ్యిందదండి... చూడండి ఎంత కష్టాన్ని తెచ్చిపెట్టారో” అంటూ మెల్లగా షాను శపించాను.

“నానుంచే ఎలాగండి, ఈ పిశాచి ముండ (కుక్కపిల్ల) ఉందని, దీన్ని మీరే ఎలాగైనా పారద్రోలమని చెప్పారు కదా నాతో! నిధానించి చూద్దాం... ఎంతవరకు నిలబడుతాడో... అతనికీ నిద్రరాదా?” అన్నాడు షా.

పంచె ధరించిన ఆ ఎలుగుబంటు మనిషి లోపలికి వెళ్తాడేమోనని ఎదురుచూస్తూ నిలబడ్డాం. ఎంతోసేపైనా ఆ మానవుడు కదలకనే స్థాణువై నిలబడి ఉన్నాడు. అతను ఉన్నప్పుడే ఇక్కడ్నుంచి తప్పించుకొని పారిపోయేది ఎలాగని ఒకసారి యోచించాను. అయితే ఆ ఎలుగుబంటు మనిషి మాకన్నా వేగంగా పరిగెత్తే వాడైతే? అతను విసిరే బడితకర్రలోని ఒక వేటు చాలు... మేము వదిలివచ్చిన స్మశానంకు వాపస్సైయ్యేందుకు!

అతను ఎంతసేపైనా కదలక మెదలకనే గేటుకు ఒరిగికొని నిలబడినదాన్ని చూసిన షాకు అనుమానం ఆరంభమైంది.

"అతను అక్కడే నిద్రపోయేందుకు ప్రయత్నించినట్లుంది. లేకపోతే నర మానవులకు ఇంతసేపు ఆ భంగిమలోనే నిలబడేందుకు ఎలాగున సాధ్యపడుతదండి?" అన్నాడు షా.

ఏమి చేయాలనేది నాకు తోచలేదు. నిలబడి నిలబడి నా కాళ్ళు నెప్పట్టుతున్నవి. కుక్కపిల్లకూ నిలబడి నిలబడి విసుగేసినట్లుగా కనబడుతుందో లేకపోతే మాకన్నా ఆ ఎలుగుబంటు మనిషే మంచివాడేమో అని దానికి అన్పించిందో లేకపోతే మేము ఇక్కడ దొంగలలాగ నిలబడ్డామని ఆ ఎలుగు బంటు మనిషికి మా జాడ తెల్పాలనుకుందో ఏమో... మెల్లగా అతనున్న వైపుకు తిరిగి అతని వద్దకు అడుగుల్ని వేయసాగింది. మాకు ఇక పరిగెత్తాలో నిలబడాలో ఏమి తెల్వనట్లుగా భయం కలిగింది. ఆ ఎలుగుబంటు బడితకర్ర నుంచి ఒకే దెబ్బకు ఆ కుక్కపిల్లను యమలోకంకు పంపేదాన్ని ఊహిస్తూ నిలబడ్డాం. కుక్కపిల్ల అతని ముందుకు వెళ్ళి ఆగింది. నిద్రకు శరణమైనట్లుగా ఉన్న అతని దేహంలో ఏ కదలిక కనబడనే లేదు. అతని చేతిలో ఉన్న బడితకర్ర కిందున్న బండమీద పడిన సప్పుడైంది. అప్పటికప్పుడే అతని దేహం ఆ గేటుకున్న తలుపు ముందు వేసిన నాపరాయి మీద బారుగా దభీల్నే పడింది. డెత్ (కుక్కపిల్ల) అతడ్ని దాటుకొని నిర్భయంగా అతని ఇంటిలోపలికి వెళ్ళింది.

అతనేమైనా నిద్రకు జారాడో! మూర్ఛపోయాడో!! లేకపోతే చనిపోయాడో!!!

ఇంటిలోపలినుంచి ఆ కుక్కపిల్లను పారద్రోలుతూ ఇంటి పరివారం బయటకొచ్చి అతడ్ని చూసేలోపే, ఆ స్మశానంలోని పిశాచి (కుక్కపిల్ల) వెనుదిరిగి మా

చెంతకొచ్చేలోపే, సూర్యోదయం అయ్యే ముందే మేము అక్కడ్నుంచి పారిపోయే అవసరం ఉంది.

ఆ కారుచీకట్లో సావు భయం నుంచి పారిపోతున్నోళ్ళలాగ మేమిద్దరం గోడదూకి పారిపోయాం.

★ ★ ★

కన్నడ భాషలో దివంగత పూర్ణచంద్ర తేజస్విగారు రచించిన “మాయామృగ” అనే కథను యథాతథరూపంగా తెలుగులోకి అనువదించాను.

శాఖమూరు రామగోపాల్. 24-08-2010.